# UTTARĀNDHRA JĀNAPADA KAḶĀRŪPĀLU PARIŚĪLANĀMŚĀLU

A Dissertation submitted to the University of Hyderabad in Partial fulfillment of the requirements for the award of Master of Philosophy in Telugu

**Research**

**KODI JAGADHEESWARA RAO**

(REG.NO: 20HTHL06)

**Supervisor**

**PROF. G. ARUNA KUMARI**

**DEPARTMENT OF TELUGU**

**SCHOOL OF HUMANITIES**

**UNIVERSITY OF HYDERABAD**

**HYDERABAD - 500046**

**TELANGANA, INDIA**

**NOVEMBER – 2022**

# ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు - పరిశీలనాంశాలు

ఎం. ఫిల్. పట్టాకోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన వ్యాసం


పరిశోధన

**కోడి జగదీశ్వరరావు**

(REG.NO: 20HTHL06)

పర్యవేక్షణ

**ఆచార్య జి అరుణ కుమారి**

**తెలుగు శాఖ**

**మానవీయ శాస్త్రాల విభాగం**

**హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం**

**హైదరాబాదు - 500046**

**తెలంగాణ రాష్ట్రం**


**నవంబర్ – 2022**

# DECLARATION

I hereby declare that the work embodied in the Dissertation entitled '**UTTARĀNDHRA JĀNAPADA KAḶĀRŪPĀLU PARIŚĪLANĀMŚĀLU**' carried out by me under the supervision of Prof. G. Aruna Kumari, Department of Telugu, University of Hyderabad, is original and has not been submitted to any other university or published at any time earlier. I hereby agree that my Dissertation can be deposited in shodhganga /INFLIBNET.

KODI JAGADHEESWARA RAO

(REG.NO: 20HTHL06)

Date:

Hyderabad

# CERTIFICATE

This is to certify that the dissertation entitled 'UTTARĀNDHRA JĀNAPADA KAḶĀRŪPĀLU PARIŚĪLANĀMŚĀLU' submitted by KODI JAGADHEESWARA RAO bearing Reg. No. 20HTHL06 in partial fulfilment of the requirements for the award of Master of Philosophy in Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The Dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

Further the student has passed the following courses towards fulfilment of course work required for M. Phil. (recommended by Doctorial Committee) on the basis of the following courses passed during his M. Phil. Program.

| Course code | Title of the course | Course credits | Pass/Fail |
|---|---|---|---|
| HT600 | Research methodology | 4 | Pass |
| HT601 | History of Telugu Research | 4 | Pass |
| HT602 | Research and Publication Ethics | 4 | Pass |
| HT603 | Broad Field and Specialized Area | 4 | Pass |

Signature of the Supervisor

Head, Department of Telugu

Dean, School of Humanities

# కృతజ్ఞతలు

అక్షరం అంటే ఏమిటో తెలియకపోయినా, ఎన్ని బాధలు పడినా, ఆర్థిక ఇబ్బందులెన్ని ఎదురైనా, వాటిని అధిగమించి నన్ను ప్రాథమిక విద్య నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఎంతో శ్రద్ధతో చదివిస్తూ, ఎప్పుడు నా మంచికై కష్టపడుతూ నేను ఈరోజు ఈ స్థానంలో ఉండడానికి కారణమైన అమ్మా, నాన్నలకీ...

పరిశోధనకు అవకాశం కల్పించిన తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికీ...

"ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – పరిశీలనాంశాలు" పరిశోధనకు సంబంధించి అనేక విషయాలను సలహాలు సూచనలు ఇస్తూ ఎన్ని పనుల ఒత్తిడిలో ఉన్నా, సాదరాభిమానంతో విషయ నిర్ణయంలోనూ, విషయ వివరణలోనూ, సామగ్రి సేకరణలోను అడుగడుగునా అండగా నిల్చి సూచనలు, సలహాలు ఇస్తూ పరిశోధన కొనసాగేలా చేసిన నా పరిశోధన పర్యవేక్షకులు మరియు తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు అయిన ఆచార్య. జి.అరుణ కుమారి మేడమ్ గారికి...

నాకు పాఠాలు బోధించిన గురువులు, తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య. దార్ల. వెంకటేశ్వరరావు గారికి, ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి, ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆచార్య తుమ్మల రామకృష్ణ, ఆచార్య ఆర్.వి. రామకృష్ణశాస్త్రి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్, ఆచార్య గోనా నాయక్, ఆచార్య పమ్మి పవన్ కుమార్, ఆచార్య డి. విజయలక్ష్మి, డా॥ భుజంగరెడ్డి, డా॥ విజయ కుమారి గార్లకు...

నా భవిష్యత్తుకు సంబంధించి విలువైన సలహాలు సూచనలను విద్యాసంబంధిత అంశాలను ఎప్పుడూ చర్చిస్తూ ఉన్నత చదువులవైపు నా దృష్టిని మళ్ళించి విశ్వవిద్యాలయ స్థాయి చదువుల వరకు నన్ను ప్రోత్సహించిన నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల కూకట్పల్లి తెలుగు అధ్యాపకులు డా॥ సత్యన్నారాయణ సార్ గారికి, ఉత్తరాంధ్ర కళారూపాలకు సంబందించిన ఎన్నో విషయాలను గురించి విశ్లేషించి వివరించిన అధ్యాపకులు డా॥ బద్రి కూర్మారావు సార్ గారికి, పోటీ పరీక్షల గురించి ఎన్నో విలువైన సలహాలను సూచనలను అందించిన నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల కూకట్పల్లి అర్థశాస్త్ర అధ్యాపకులు శ్రీమన్నారాయణ సార్ గారికి అదేవిధంగా కామర్స్ అధ్యాపకురాలు సరస్వతి మేడం గారికి మరియు ఇతర అధ్యాపకులు మల్లేశ్వరరావు గార్లకు...

తెలుగు భాషా సాహిత్య అభ్యున్నతి కోసం పాటుపడుతూ మంచి పుస్తకాలను మా కోసం భద్రపరచి అందిస్తున్న మా విశ్వవిద్యాలయ ఇందిరాగాంధీ మెమోరియల్ గ్రంథాలయం, పి.జి.కాలేజ్ సికింద్రాబాద్ లైబ్రరీ, ఉస్మానియా విశ్వవిద్యాలయ లైబ్రరీ , తెలుగు విశ్వవిద్యాలయ లైబ్రరీ సిబ్బందికి, శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండల గ్రంథాలయం వారికీ...

పరిశోధనకు  సంబంధిత విషయాలను గురించి చర్చించడమే కాకుండా  ఏదైనా సమస్య వచ్చేటప్పుడు దానికి తగిన విధంగా స్పందించి సమస్య పరిష్కార మార్గాలను సూచించే నా ఆత్మీయ మిత్రుడు  గడ్డం నాగేందర్, మరియు నా సహవిద్యార్థులు, కాటబత్తిన శ్రీనివాస్, కమలాకర్, గురవయ్య, శివ, అలిశెట్టి మధు, మహేష్,  విజయ్, నాగరాజు, మనీషా, వినోద్, యోగేశ్వరరావు లకూ...

నాకు తెలిసి కొందరు, తెలియకుండా మరికొందరు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ... ఇంకా నన్ను ప్రోత్సహించి, చేయూతనిచ్చిన ప్రతి ఒక్కరికి పేరు పేరున హృదయపూర్వక నమస్కారాలు తెలియజేసుకుంటూ...

కృతజ్ఞతలు

**జగదీశ్వరరావు**

# విషయ సూచిక

ప్రస్తావన

అధ్యాయం 1

1. ఉత్తరాంధ్ర జిల్లాలు భౌగోళిక స్వరూపం 1 – 12

1.1. ఉత్తరాంధ్ర జిల్లాల చారిత్రక నేపథ్యం

1.2. ఉత్తరాంధ్ర జిల్లాల భౌగోళిక స్వరూపం

1.2.1. శ్రీకాకుళం జిల్లా

1.2.2. విజయనగరం జిల్లా

1.2.3. విశాఖపట్నం జిల్లా

1.3. ఉత్తరాంధ్ర జిల్లాల పండుగలు జాతరలు

1.3.1. సిరిమాను ఉత్సవం

1.4. ఉత్తరాంధ్ర జిల్లాల గిరిజన తెగలు

1.5. ఉత్తరాంధ్ర జిల్లాల నదులు ప్రాజెక్టులు

1.6. ఉత్తరాంధ్ర జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాలు

1.6.1. అరసవల్లి

1.6.2. శ్రీకూర్మము

1.6.3. శ్రీముఖలింగం

1.6.4. గోవిందపురం ఆలయం

1.6.5. పున్యగిరి ఆలయం

1.6.6. పైడితల్లి అమ్మవారి ఆలయం

1.6.7. రామతీర్థం

1.6.8. సింహాచలం

1.7. ఉత్తరాంధ్ర పర్యాటక స్థలాలు

1.7.1. తేనెనీలాపురం

1.7.2. అరకులోయ అందాలు

1.7.3. విజయనగరం కోట

1.7.4. కైలాసగిరి

1.8. ఉత్తరాంధ్ర జిల్లాల సంస్కృతి సంప్రదాయాలు

1.9. ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల సామాజిక పరిస్థితులు

**అధ్యాయం 2**

**2. ఉత్తరాంధ్ర జానపద గేయాలు – పరిశీలనాంశాలు** 13 – 48

2.1. పరిచయం

2.2. గ్రామదేవతల గేయాలు

2.3. హరికథ గేయాలు

2.4. బుర్రకథ గేయాలు

2.5. భజన పాటలు

2.6. తప్పెటగుళ్ళు గేయాలు

2.7. జముకుల పాటలు (బోనెల పాటలు)

2.8. చెంచు నాటకం గేయాలు

2.9. రోకటి పాటలు

2.10. ఉడుపులు, నాట్లు పాటలు

2.11. వినోద పాటలు

2.12. ఇతర జానపద గేయాలు

2.13. అంతరించిపోతున్న కళారూపాలపై గేయాలు

**అధ్యాయం 3**

**3. జానపద కళారూపాల పుట్టుపూర్వోత్తరాలు – వికాసం** 49 – 55

3.1. పరిచయం

3.2. జానపద కళలు – వికాసం

3.3. ఉత్తరాంధ్ర జిల్లాలలో జానపద కళారూపాల ఆవశ్యకత

3.4. ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – వర్గీకరణ

3.5. అంతరించిపోతున్న జానపద కళారూపాలు

3.6. జానపద కళాకారులు దుస్థితి

**అధ్యాయం 4**

**4. ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – పరిశీలనాంశాలు** 56 – 121

4.1. బుట్టబొమ్మలు

4.2. తోలు బొమ్మలాటలు

4.3. తూర్పుభాగవతం (భామాకలాపం)

4.4. పిట్టలదొర

4.5. దొమ్మరాట(దొమ్మరులు)

4.6. పాములాటలు (మోడీలు)

4.7. పగటి వేషాలు

4.8. ఎరుకల వాళ్ళు

4.9. బోనేల పాట (జముకుల కథ)

4.10. వాలకం

4.11. గంగిరెద్దుల వాళ్ళు

4.12. రుంజ వాయిద్యం

4.13. తప్పెటగుళ్ళు

4.14. పొడపోతలవారు

4.15. మాలమాస్టీలు

4.16. బుడబుక్కలవారు

4.17. హరిదాసులు

4.18. ఫకీరు సాయిబు వేషం

4.19. బుర్రకథ

4.20. హరికథ

4.21. కాశీకావడి

4.22. గంట సాయిబులు

4.23. సాతాని వైష్ణవులు

4.24. జంగాల కథలు

4.25. దాసరులు

4.26. చెంచులు

**గిరిజన జానపద కళారూపాలు**

4.27. తోంగ్సేన్ నృత్యం

4.28. థింసా నృత్యం (జట్టునృత్యం)

4.29. కొమ్ము నృత్యం

4.30. మయూర నృత్యం

4.31. సవర నృత్యం

**ఇతర జానపద కళారూపాలు**

4.32. కత్తిసాము, కర్రసాము, గరిడీలు

4.33. పులి వేషాలు

4.34. డప్పు నృత్యాలు

**అధ్యాయం 5**

5. **ఉత్తరాంధ్రలో అంతరించిపోతున్న కళారూపాలు** 122 – 132

5.1. పరిచయం

5.2. ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – నాడు

5.3. ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – నేడు

5.4. సాంకేతిక రంగం అభివృద్ధి

5.5. ఆధునిక జీవనం వైపు మొగ్గు చూపుతున్న యువత

5.6. కనుమరుగవుతున్న జానపద కళారూపాలు

**5.7.** క్రమంగా అంతరిస్తున్న ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు

**5.8.** పరిష్కార మార్గాలు

**5.9.** సింహావలోకనం

| | |
|---|---|
| **ముగింపు** | **133 - 134** |
| **ఉపయుక్త గ్రంథ సూచిక** | **135 – 136** |
| **అనుబంధం** | 137 – 143 |
| పేకేటి అప్పారావు గారితో ముఖాముఖి | |

# ప్రస్తావన

జానపద విజ్ఞానం జానపదులకు ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది. జానపద కళారూపాలు గేయాలు, కథాగేయాలు, కథలు మొదలైన సాహిత్య ప్రక్రియలు మనకెంతగా హాయిని కలిగిస్తాయో వేరుగా చెప్పనక్కరలేదు. పనిపాటలు పనిలోని శ్రమను తగ్గించి వుల్లాసాన్ని కలిగిసాయన్నది అనుభవంలో వున్నదే. కథాగేయాల చెప్పేవారికి, వినేవారికి కూడా ఇంపుగా వుంటాయి. వీర గాథలు వంటివి (Heroic ballads) వినేవారికి సంతోషాన్ని, ఉద్రేకాన్ని, ఊపును ఇస్తాయి. పండుగలు, ఉత్సవాలు జనుల జీవితాన్ని సుఖమయం చేస్తాయి. చిత్రకళ , శిల్పం , ప్రదర్శన కళలు మొదలైనవన్నీ కంటికి, చెవికి ఇంపుగా వుంటాయి. 'ఆటపాటలు పిల్లలకు ఉత్సాహాన్ని ఆనందాన్ని ఇస్తాయి. వినోదాలు మానవ జీవితాలలో అనివార్యమైన భాగాలుగా వుండి వారి జీవితం ఉల్లాసంగా నడవడానికి దోహదం చేస్తాయి.

ఆధునిక విద్వాంసుల అభిప్రాయం ప్రకారం జానపదులంటే గ్రామీణులని మాత్రమే అర్థం కాదు. ఏ ఒక్క విషయంలోనైనా భావసామ్యం గలిగిన జనసముదాయమంతా జానపదులు. వీరు ఒక భాషకు సంబంధించినవారు కావచ్చు. ఒక భౌగోళిక ప్రాంతంలో నివసిస్తున్న వారు కావచ్చు. ఒక జాతికి, మతానికి లేక వృత్తికి సంబంధించినవారు కావచ్చు. అయితే ఈ జనుల గుంపుకు తమవి అని చెప్పుకోగలిగిన సంప్రదాయాలుండాలి. ఈ విధంగా ఇటువంటి పరిమితులను అధిగమించి ఉన్నతమైన సమాజ అభ్యున్నతి కోసం సాహిత్య పరిశోధన లక్ష్యాలను సాధించాల్సి ఉంటుంది.

జానపద సాహిత్యంలో ప్రజల శ్రమ, ఆనందం, దు:ఖం, బాధ అన్ని కలగలిపి ఉంటాయి. జానపదులు సంస్కృతిని, ఆచార–వ్యవహారాలను కాపాడుకుంటారు. జానపదుల నైపుణ్యాన్ని వారి పాటలలో కనబరుస్తారు. తమ ఆనందం కోసమే అయినా ఆ పాటలు ఛందోబద్ధంగా నడుస్తాయి. ఇందులో అనేక కళలుంటాయి. అవి ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారేటప్పుడు పాఠాంతరాలు ఎదురవుతాయి. వాటిని నా పరిశోధన సమస్యగా తీసుకున్నాను. జానపద కళారూపాల పై ఇప్పుడు వరకు వచ్చిన పరిశోధనలు ఉన్నప్పటికీ ఉత్తరాంధ్రకు సంబంధించిన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబింపజేసే కళారూపాలు వెలుగులోకి అంతగా రాలేదు. కాబట్టి నేను ఈ ప్రాంత విశిష్టతను, కళా సంపదను, సంస్కృతి సాంప్రదాయాలను, భోగోళిక విశిష్టతను వెలుగులోకి తీసుకొని రావాలనే నేపథ్యంతో "ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – పరిశీలనాంశాలు" అనే పరిశోధన అంశాన్ని తీసుకున్నాను. మా కుటుంబంలో మా నాన్న గారికి, చిన్నాన్న గారికి ఈ కళారూపాలలో ప్రవేశం ఉంది. గ్రామ దేవతల పండగల్లో వాలకం ప్రదర్శన, గరిడి నృత్యము, కర్ర సాము, కత్తి సాము ప్రదర్శన చేస్తారు. అందువల్ల ఈ కళారూపాలపై ఉన్నటువంటి ఆసక్తి నా పరిశోధనకు నాంది పలికింది.

పరిశోధన సౌలభ్యం కోసం ఈ పరిశోధనా అంశాన్ని ఊహా ప్రతిపాదన మేరకు పర్యవేక్షకుల సూచనలు సలహాల మేరకు ఐదు అధ్యాయాలుగా విభజించాను. అందులో మొదటి అధ్యాయం 'ఉత్తరాంధ్ర జిల్లాలు భౌగోళిక స్వరూపం' ఇందులో ఉత్తరాంధ్రకు సంబంధించి ప్రధానంగా మూడు జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నం జిల్లాల చారిత్రక నేపథ్యాన్ని పేర్కొన్నాను. ఇందులో ఉత్తరాంధ్ర సంబంధించిన భౌగోళిక స్వరూప స్వభావాలను స్థితిగతులను ఈ ప్రాంత వైశిష్ట్యాన్ని ప్రతిబింబించే విధంగా ప్రసిద్ధమైన పర్యాటక స్థలాలను దేవాలయాలను వాటి విశిష్టతను పేర్కొనడం జరిగింది.

రెండవ అధ్యాయంగా 'ఉత్తరాంధ్ర జానపద గేయాలు – పరిశీలనాంశాలు' అనే విభాగాన్ని చేశాను. ఇందులో ఉత్తరాంధ్రకు సంబంధించిన జానపద కళారూపాల గేయాలు, వీరగాథ గేయాలు, వినోద పాటలు, ఉడుపులు, నాట్లు పాటలు, రోకటి పాటలు, ఇతర జానపద గేయాలు, అంతరించిపోతున్న కళారూపాలపై గేయాలు మొదలైనవి పేర్కొన్నాను.

మూడవ అధ్యాయంగా 'జానపద కళారూపాల పుట్టుపూర్వోత్తరాలు – వికాసం' అనే విభజన చేశాను. ఇందులో నా పరిశోధన అంశంగా తీసుకున్న కళారూపాల పుట్టుపూర్వోత్తరాలు వాటి వికాసం ఉత్తరాంధ్రలో ఉన్నటువంటి కళారూపాలు వాటి స్థితిగతులు మొదలైన వాటిని గురించి ప్రస్తావించాను.

నాలుగవ అధ్యాయంగా 'ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – పరిశీలనాంశాలు' అనే విభాగం చేశాను. ఇందులో ఉత్తరాంధ్ర అస్తిత్వాన్ని సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబింప చేసే కళారూపాల స్థితిగతులను ప్రస్తావించాను. ఉత్తరాంధ్రలో ప్రధానంగా ఉన్నటువంటి కళారూపాలను గురించి అందులోని సాహిత్యాన్ని గురించి సవివరంగా వివరించాను.

ఐదవ అధ్యాయంగా 'ఉత్తరాంధ్రలో అంతరించిపోతున్న కళారూపాలు' అనే అంశాన్ని తీసుకున్నాను. ఇందులో ప్రధానంగా ఉత్తరాంధ్రలో ఉన్నటువంటి జానపద కళారూపాలు ఏవైతే ఉన్నాయో వాటి స్థితిగతులను జానపద కళారూపాలు అంతరించిపోవడానికి గల కారణాలను పరిష్కార మార్గాలను వివరించాను. కొన్ని జానపద కళారూపాలలోని సాహిత్యాంశాలను పరిశీలించాను.

## అధ్యాయం 1

# ఉత్తరాంధ్ర జిల్లాలు భౌగోళిక స్వరూపం

# అధ్యాయం 1

# ఉత్తరాంధ్ర జిల్లాలు భౌగోళిక స్వరూపం

## 1.1. ఉత్తరాంధ్ర జిల్లాల చారిత్రక నేపథ్యం:

ఆధునిక ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్రగానూ, తెలుగు భాషా దేశంలో ఉత్తర కోస్తాలో భాగంగానూ, సాహితీ వ్యవహారికపరంగా ప్రత్యేక మాండలిక వ్యావహారికప్రాంతంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలు నేడు ప్రాచుర్యంలో ఉన్నాయి. అవి ఒకనాటి కళింగాంధ్ర ప్రాంత వారసత్వం, ఉత్కళాంధ్ర సోదరత్వం అన్నది చరిత్ర చెబుతున్న వాస్తవం. కళింగాంధ్ర భాష, సాహిత్యం, సామాజిక అంశాల్లో భాగమై వచ్చిన ఈ ప్రాంతం ఎందరో రాజులు, జమీందార్లు పాలనలో వనరుల దోపిడీకి, నిరంతర యుద్ధాలకు సాక్షిగా నిలిచింది.

క్రీ.పూ. 262–261లో అశోక చక్రవర్తి కళింగ రాజ్యంపై జరిపిన దాడితో ఈ ప్రాంతం చిన్నాభిన్నం అయింది. ఆ తర్వాత శుంగ వంశం, కణ్వ వంశీయులు, ఛేది వంశం, గుప్తులు, గాంగులు, చోళులు, గజపతులు, గోల్కొండ నవాబులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. యుద్ధాలు, ఘర్షణలతో ఇక్కడి సంపదను విచ్ఛిన్నం చేశారు. శ్రీకృష్ణ దేవరాయలు మూడు సార్లు కళింగాంధ్రపై దండయాత్ర చేశారు. ఫ్రెంచివారు, ఆంగ్లేయులు ప్రత్యేక యుద్ధాలకు, నవాబుల దండయాత్రలకు నిరంతరం ఈ ప్రాంతం రణస్థలంగా మారి విలువైన వనరులు నిర్వీర్యమయిపోయాయి.

1766 లో శ్రీకాకుళం సర్కార్‌ను నిజాం పాలకులు ఆంగ్లేయులకు ఇనాంగా ఇచ్చేశారు. దీంతో 1769 నుంచి 'వైజాగ్‌పటం' పేరుతో బ్రిటీష్ వారు విశాఖ కేంద్రంగా తమ పాలనను మొదలుపెట్టారు. 'వైజాగ్ పటం' ప్రాంతం కింద నేటి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిస్సాలోని గంజాం జిల్లా ఉండేది. ఆ తర్వాత 1902లో వైజాగ్ జిల్లా నుంచి శ్రీకాకుళాన్ని వేరుచేసి, ప్రత్యేక డివిజన్‌గా మార్చి గంజాం జిల్లాలో కలిపారు. తర్వాత ఈ ప్రాంతమంతా పాలనాపరంగా ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో భాగమైంది. చరిత్రలో ఎక్కడా ప్రస్తావన లేకపోయినా ఆంధ్రప్రదేశ్‌లో చిట్టచివర, కోస్తాకు ఉత్తరాన ఉండటంతో కళింగాంధ్ర కాస్తా ఉత్తరాంధ్రగా నేడు పిలవబడుతున్నది.

## 1.2. ఉత్తరాంధ్ర జిల్లాల భౌగోళిక స్వరూపం:

ఉత్తరాంధ్ర లేదా కళింగాంధ్ర భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మూడు జిల్లాలు తీరప్రాంత జిల్లాలను కలిగి ఉన్నవి. ఉత్తరాంధ్ర ప్రాంతం శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం జిల్లాలు. ఈ జిల్లాలు ఒకసారి కళింగ రాజవంశంలో ఉన్నాయి. వాటి భౌగోళిక స్థితిగతులు క్రింది విధంగా పేర్కొనబడ్డాయి.

### 1.2.1. శ్రీకాకుళం జిల్లా:

శ్రీకాకుళం జిల్లా భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈశాన్య సరిహద్దులో ఉంది. జిల్లా ముఖ్యపట్టణమైన శ్రీకాకుళం. శ్రీకాకుళంజిల్లా మొత్తం వైశాల్యం 5837 చ.కి.మీ. జిల్లాకు 193 కి.మీ. సముద్ర తీరం ఉంది. నాగావళి నది ఒడ్డున ఉంది. నాగావళి, వంశధార, సువర్ణముఖి, వేగావతి, మహేంద్రతనయ, గోముఖి, చంపావతి, బాహుదా మరియు కుంబికోట గెడ్డలు జిల్లాలోని ముఖ్యమైన నదులు. ఇవి తూర్పు కనుమలలో పుట్టి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. విశాఖపట్నం జిల్లా నుంచి 1950 ఆగష్టు 15 న శ్రీకాకుళం జిల్లా ఏర్పడింది. తూర్పు కనుమలు ఈశాన్యం నుండి కొంతభాగం విస్తరించి ఉన్నాయి. ఉత్తరాన ఒడిషా రాష్ట్రం, దక్షిణ-పశ్చిమాల్లో విజయనగరం జిల్లా, ఒడిషా గజపతి జిల్లా, తూర్పున బంగాళాఖాతం ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభా 26,99,471 ,మరియు సాంద్రత 462/కి.మీ$^2$ (1,200/చ. మై.).

ఒకప్పుడు ఇది బౌద్ధమతానికి ముఖ్యస్థానంగా వర్ధిల్లింది. శాలిహుండం, దంతపురి, జగతిమెట్ వంటి బౌద్ధారామాలు ఇక్కడ కనుగొన్నారు. తరువాత ఇది కళింగ సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. గాంగేయులు ఈ ప్రాంతాన్ని 6 నుండి 14వ శతాబ్దం వరకు, 800 సంవత్సరాలు పాలించారు. వజ్రహస్తుడు కాలంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ముఖలింగం ఆలయాన్ని నిర్మించారు. మహమ్మదీయుల పాలన కాలంలో షేర్ మహమ్మద్ ఖాన్ శ్రీకాకుళంలో జామియా మసీదు నిర్మించాడు.

### 1.2.2. విజయనగరం జిల్లా:

విజయనగరం పట్టణం భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈశాన్యాన ఉంది. ఇది విజయనగరం జిల్లాకు ముఖ్యపట్టణం. రాష్ట్రంలోని జిల్లాలన్నిటి కంటే విజయనగరం జిల్లా అత్యంత కొత్తది. 1979 జూన్ 1 న ఈ జిల్లా ఏర్పడింది. దీనితో అప్పటి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలోని మొత్తం జిల్లాల సంఖ్య 23 కు చేరింది. విజయనగరం బంగాళాఖాతము నుండి 18 కి.మీ.ల దూరములో, విశాఖపట్నానికి 40 కి.మీ.లు ఈశాన్యాన ఉంది. విస్తీర్ణం మొత్తం 6,539 కి.మీ$^2$ (2,525 చ. మై), 2011 జనాభా లెక్కల ప్రకారం విజయనగరం జనాభా 23,42,868, సాంద్రత 358/కి.మీ$^2$(930/చ. మై.).

### 1.2.3. విశాఖపట్నం జిల్లా:

విశాఖపట్నం బంగాళాఖాతానికి అనుకోని సముద్రపు ఒడ్డున ఉంది. ఈ నగరపు అక్షాంశ రేఖాంశాలు 17.6883° ఉత్తర అక్షాంశం, 83.2186° తూర్పు రేఖాంశం కలిగి ఉంది. ఈ నగరం మైదాన ప్రాంతం తీరప్రాంతాలతో ఉంది. దీని వైశాల్యం 11,161 km$^2$ (4,309 sq mi). 2001 లో నగర జనాభా 13.5 లక్షలు. ఇంతవరకూ సేకరించిన జనాభా లెక్కల ఆధారంగా 17.5 లక్షలవరకు నగర జనాభా పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది ప్రాథమిక అంచనా. పూర్తిగా జనాభా

లెక్కలు సేకరించిన తరువాత ఈ లెక్కలు మరింత పెరగవచ్చును. గ్రామీణ ప్రాంతంలో పెరుగుదల 11 శాతం అంటే 2.5 లక్షల నుంచి 3 లక్షల వరకు ఉండవచ్చును. 2001 జనాభా లెక్కల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో 24.50 లక్షల మంది ఉండగా, ఆ అంకె 27.50 లక్షలకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. విశాఖ నగరంతో కలిపి విశాఖపట్నం జిల్లా జనాభా 2001లో 38 లక్షలు. అదే 2011 నాటికి ఈ అంకెలు 45 లక్షలకు చేరవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

సుందరమైన సముద్ర తీరం, అహ్లాదకరమైన కొండలతో అలరారే విశాఖపట్నం నగరానికి చుట్టుపక్కల అద్భుతమైన అరకు లోయ సౌందర్యం, మన్యం అడవుల సౌందర్యం, ప్రాచీన బౌద్ధ స్థలాలు మొదలైన ఎన్నో ప్రసిద్ధ యాత్రా స్థలాలు ఉన్నాయి. విశాఖపట్నం రేవు సహజ సిద్ధమైన నౌకాశ్రయం. ఆంధ్రప్రదేశ్ లో పెద్ద నగరం, అదే పేరుగల జిల్లా కేంద్రం. బంగాళాఖాతం ఒడ్డున గల ఈ నగరంలో భారతదేశపు నాలుగో పెద్ద ఓడరేవు. దేశంలోనే అతి పురాతన నౌకా నిర్మాణ కేంద్రం ఉన్నది. ఇది మెట్రోపాలిటన్ ప్రాంతం. స్వతంత్ర భారత దేశపు మొట్ట మొదటి ఓడ అయిన "జలఉష" ఇక్కడే తయారయి, అప్పటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా జలప్రవేశం చేసింది.

## 1.3. ఉత్తరాంధ్ర జిల్లాల పండుగలు జాతరలు:

కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగు వాళ్ళతో కలిసి ఆనందముగా జరుపుకునే సాంప్రదాయాలు, ఆచారాలు, శాంతి సహృద్భావాల మేలుకలయిక రోజే పండుగ (Festival). సాధారణముగా జాతరలు ఉత్సవాలు పండుగలన్నీ ఏదైనా దేవుడు లేదా దేవతకు సంబంధించి, జాతి మత పరంగా జరుపుకుంటారు. సంవత్సరం పొడవునా వచ్చే పండుగల్లో దేని ప్రాముఖ్యత, విశిష్టత దానికే వుంది. భాష లేదా ప్రాంతాన్ని బట్టి పండుగలు జరుపుకొనే విధానములో స్వల్ప తేడాలు వున్నప్పటికీ వాటిలోని ఏకసూత్రత మాత్రము చెడిపోదు. సంవత్సరం పొడవునా చైత్ర మాసముతో మొదలిడి ఎన్నో పండుగలు వున్నాయి. ఉత్తరాంధ్రలో ఎన్నో మతాలు, జాతులు, రకరకాల భాషలు వారు నివసిస్తున్నారు . ముఖ్యముగా పండగలు మతపరంగాను, భాషా పరంగాను జరుపుకుంటారు.

### 1.3.1. సిరిమాను ఉత్సవం

కోరినవారికి కొంగుబంగారంగా, సిరులు కురిపించే చల్లని తల్లిగా, ఆపన్నులను అభయహస్తంతో ఆదుకొనే అమ్మగా, ఉత్తరాంధ్ర ఇలవేల్పుగా పైడితల్లి అమ్మవారిని కొలుస్తారు. ప్రతి సంవత్సరం విజయదసమి తరువాత వచ్చే మొదటి మంగళవారంను సిరిమానుఉత్సవం జరుపుకుంటారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న రెండు చిన్న చిన్న రాజ్యాలు బొబ్బిలి, విజయనగరం. బొబ్బిలి రాజు రంగారావు, విజయనగరం రాజు విజయరామరాజు. వీరి మధ్య 1757 జనవరి 24న జరిగిన యుద్ధమే బొబ్బిలి

యుద్ధంగా చరిత్ర ప్రసిద్ధి గాంచినది. ఈ యుద్ధంలో ఇరువర్గాల రాజులు మరణిస్తారు. విజయ రామరాజు చెల్లెలు పైడితల్లి భక్తురాలైన పైడమ్మ అన్న మరణానికి తట్టుకోలేక మహాశక్తిలో లీనమైనదంటారు. అప్పటి నుండి పైడమ్మనే పైడితల్లిగా కొలుస్తారు. ప్రతి సంవత్సరం అక్టోబరులో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమై నెలరోజు పాటు జరుగుతాయి. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం రోజున నేరేడుమాను శాఖను స్థంభంలా చేసి ఆలయం వద్ద పాతుతారు. దానితో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. విజయదశమి తరువాత వచ్చే మంగళవారం సిరిమాను ఉత్సవం జరుగుతుంది. సిరిమానోత్సవానికి 15 రోజుల ముందు ఊరంతా చాటింపు ఉంటుంది.

## సిరిమాను విశేషాలు:

సిరిమానుగా తయారు చేయడానికి అనువైన చింతచెట్టును నెలరోజు ముందుగానే పూజారి ఎన్నిక చేస్తాడు. ఆ చెట్టుకు పూజ చేసి కుంభం పోసి అన్నదానం చేస్తారు. తరువాత ఆ చెట్టును ఖండించి ఎడ్లబండి మీద ఊరేగింపుగా పూజారి ఇంటికి తీసుకు వస్తారు. చిలకపూడి వంశస్థుడైన వడ్రంగి చింతచెట్టు మొదలు భాగాన్ని తల ఆకారంగా, చివరి భాగాన్ని కూర్చోవడాని అనువుగా మార్చి అమ్మవారిని ప్రతిష్టిస్తారు. ఈ సిరిమానును ఎడ్లబండిపై ఇరుసు సాయంతో పైకిలేపి వేలాడదీసి గుడికి తీసుకు వస్తారు. సిరిమానును ఎక్కే ప్రధాన పూజారినే పైడితల్లిగా కొలుస్తారు. ఈ సిరిమాను రథానికి ముందు మూడు రథాల్లో అమ్మవారి పరివారం కూడా నడుస్తుంది. వాటిల్లో తెల్లఏనుగు రథం, బెస్తవారివల(పాలధార), అంజలి రథం ప్రధానమైనవి. సిరిమానోత్సం తరువాత వచ్చే మంగళవారం ఉయ్యాల ఉత్సవం నిర్వహిస్తారు. దీనితో ఉత్సవాలు పూర్తవుతాయి. ఉత్సవాలు నెల రోజులు చదురుగుడి, వనంగుడి ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో అత్యంత శోభాయమానంగా అంకరిస్తారు. ఉత్సవాలలో భాగంగా నాగినీ నృత్యాలు, పులివేషాలు, కత్తిసాము, కర్రసాము మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. రెండున్నర శతాబ్దాలకు పైగా ప్రతి సంవత్సరం జరుగుతున్న సిరిమాను ఉత్సవానికి ఉత్తరాంధ్ర ప్రజలే కాదు. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి సైతం అసంఖ్యాకంగా భక్తులు విచ్చేస్తారు. పైడితల్లికి ప్రతిరూపమైన సిరిమానును దర్శించుకుంటారు.

## 1.4. ఉత్తరాంధ్ర జిల్లాల గిరిజన తెగలు:

ఉత్తరాంధ్రలో ఏయే జిల్లాల్లో ఏయే గిరిజన తెగలు వున్నాయో ఈ క్రింది విధంగా తెలుసుకోవచ్చు.

1. విశాఖపట్నం జిల్లా – గదబ, దులియ, భగత గౌడు, కొండదొర కోండులు, కొండ కమ్మర, కొటియ, కూలియా, ముఖాదొర (mookha dora).
2. శ్రీకాకుళం జిల్లా– భగత, గదబ, గౌడు, జాతాపు, కొండదొర, ముఖదొర, వాల్మీకి, కోండులు, మాలి, పోర్జ, సవర.

3. విజయనగరం జిల్లా– భగత, గదబ, దులియ, గౌదు, జాతాపు, కొండదొర కోందులు, కొటియ, మాలి, సవర, పుటియా, పైకో.

## 1.5. ఉత్తరాంధ్ర జిల్లాల నదులు ప్రాజెక్టులు:

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఈ మూడు జిల్లాలతో కూడిన ఉత్తరాంధ్రలో సుమారు 94 లక్షల మంది జనాభా జీవిస్తోంది. 16 నదులు ఉన్నాయి. ఈ నదులు నుంచి 207 టి.ఎం.సి.ల నీరు అందుబాటులో ఉంది. సంవృద్ధిగా నీరు ఉన్నప్పటికీ నిల్వ చేసే అవకాశం లేకపోవడంతో 100 టి.ఎం.సి.ల నీరు వృధాగా సముద్రంలో కలసిపోతోంది. సగానికి సగం నీరు సముద్రం పాలవుతున్నా పాలకుల్లో చలనం లేకపోవడం ఉత్తరాంధ్ర ప్రజల పాలిట శాపమని చెప్పవచ్చు. నదులు ఉన్నాయి... నీళ్లూ ఉన్నాయి... కానీ లక్ష్యమే లేదు... ప్రణాళిక అంతకన్నా లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 37 వేల చెరువులు ఉంటే అందులో ఉత్తరాంధ్రలోనే 22,500 చెరువులు ఉన్నాయంటే ఈ నేల ఎంత పుణ్యం చేసుకుందో అర్థమవుతోంది. శ్రీకాకుళంలో తొమ్మిదివేలు, విజయనగరంలో పదివేలు, విశాఖపట్నంలో 3,500 చెరువులు ఉన్నాయి. రాష్ట్రంలో ఉన్న మొత్తం చెరువుల్లో 60 శాతం ఇక్కడే ఉన్నప్పటికి ఫలితం మాత్రం శూన్యం.

నాగావళి, వంశధార, సువర్ణముఖి, గోస్తని, జంఝావతి, వేగావతి, మహేంద్రతానయ, గోముఖి, చంపావతి, బహుదా మరియు కుంబికోట గెడ్డలు జిల్లాలోని ముఖ్యమైన నదులు. వంశధార నది ఒరిస్సా రాష్ట్రంలోని తూర్పు కనుమలలో పెరిగి భామిని మండలంలోని శ్రీకాకుళం జిల్లాలోకి ప్రవేశించి చివరకు కళింగపట్నం సమీపంలోని బెంగాల్ బేలో కలుస్తుంది. నాగావళి మరియు సువర్ణముఖి నదులు కూడా తూర్పు కనుమలలో ఉద్భవించగా, వంగర మండలంలోని నాగవళి మరియు సంగమం బెంగాల్ బేలో శ్రీకాకుళం సమీపంలో కల్లేపల్లి వద్ద కలుస్తుంది. పచిపెంట కొండలలో రైజింగ్ వేగావతి నది పడమటి నుండి తూర్పుకు ప్రవహిస్తుంది, చివరికి సువర్ణముఖి నదిలో కలుస్తుంది, సువర్ణముఖి నది విజయనగరం జిల్లాలోని సిర్లాం గ్రామంలో మరియు వంశదార అట్రిబ్యూటరీ అయిన మహేంద్రతనయ తరువాత హిరమండలంలోని కోమనపల్లి గ్రామంలో కలుస్తుంది. అదే తూర్పు కనుమల యొక్క మరొక నది మందసా మరియు సోంపేట మండలాల గుండా ప్రవహిస్తుంది మరియు బారువా వద్ద బెంగాల్ బేలో కలుస్తుంది. తూర్పు కనుమలలో కూడా బహుదా నది పైకి లేచి ఇచ్చాపురం మండలంలోని బొడ్డపాడు గ్రామంలోని శ్రీకాకుళం జిల్లాలోకి ప్రవేశించి ఇచ్చాపురం, కవిటి మరియు మందసాల గుండా ప్రవహిస్తుంది మరియు డోంకురు వద్ద బెంగాల్ బేలోకి ప్రవేశిస్తుంది. జిల్లాలో 193 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది.

## 1.6. ఉత్తరాన జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాలు:

భారతదేశం విభిన్న విశ్వాసాలు, సంస్కృతులు, సంప్రదాయాలు మరియు భాషలతో కూడిన దేశం. మన దేశం దాని నిర్మాణ వారసత్వం మరియు పురాతన కట్టడాలకు ప్రసిద్ధి చెందింది. వీటిలో చాలా దేవాలయాలు వివిధ దేవుళ్లకు అంకితం చేయబడ్డాయి. ఉత్తరాంధ్రలో వివిధ ప్రాంతాల్లో దేవాలయాలు కూడా ఉన్నాయి. ప్రతి దేవాలయం నేపథ్యంలో ఎన్నో రకాల ఆసక్తికరమైన కథనాలున్నాయి.

## 1.6.1. అరసవల్లి:

ప్రభాతవేళలో ప్రత్యక్షమై ప్రపంచానికి మేలుకొలిపే ప్రత్యక్ష దైవం. సకల లోకాలకు తన వెలుగుల ద్వారా వెలుగులు ప్రసాదించే దేవ దేవుడు. అరసవల్లి శ్రీ సూర్యనారాయణుడు. అలాంటి ప్రత్యక్ష దైవం కొలువైన ప్రదేశం శ్రీకాకుళం జిల్లా అరసవల్లి. ఇక్కడ కొలువైన శ్రీ సూర్యనారాయణ స్వామి మనుషులు చేసే పాపాలతో పాటు చర్మ, శుక్ల, శోక రోగాలను సైతం తన కిరణ స్పర్శతో హరిస్తాడని ప్రతీతి. నిత్య పూజలందుకుంటున్న శ్రీ సూర్యనారాయణ స్వామి అరసవల్లి దేవస్థానంలో కొలువై ఉండడం విశేషం. రాష్ట్రంలోనే కాకుండా యావత్ దేశంలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది.

అరసవిల్లి గ్రామంలో ఉన్న శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం సుమారు 2.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆంధ్రప్రదేశ్లోని తీరప్రాంత జిల్లాలోని శ్రీకాకుళం పట్టణానికి తూర్పున ఉంది. ఇది మన దేశంలో రెండు సూర్య దేవాలయాలలో పురాతనమైనది. పద్మ పురాణం ప్రకారం, మానవజాతి యొక్క సంక్షేమం కొరకు కశ్యపముని అరసవల్లిలో సూర్య విగ్రహంను స్థాపించారు. సూర్యడు కశ్యప గోత్రం అందువలన, అతను గ్రహ రాజుగా కూడా పిలువబడ్డాడు. దేవాలయం యొక్క 'స్థలపురాణం' ప్రకారం దేవేంద్రుడు ఈ దేవాలయాన్ని కనుగొని, సూర్యుని యొక్క విగ్రహాన్ని ఏర్పాటు చేసాడు.

## 1.6.2. శ్రీకూర్మము:

విష్ణుమూర్తికి అంకితం చేయబడిన పురాతన మరియు ప్రసిద్ధ దేవాలయాలలో శ్రీకూర్మము ఒకటి. శ్రీకూర్మము విష్ణువు యొక్క రెండవ రూపం, అతను ఒక తాబేలు అవతారంలో ఇక్కడ "శ్రీ కుర్మానాథ" రూపంలో శ్రీకూర్మం అనే గ్రామంలో వెలిసాడు. విష్ణువు "కుర్మావతారం" లో చూడబడిన ఆలయం మొత్తం దేశంలో ఇది ఒక్కటి మాత్రమే. కొన్ని శిలాశాసనాలు ప్రకారం ఈ ఆలయం శివునికి ప్రధాన ఆలయం మరియు శైవులచే (శివభక్తులు) పూజింపబడినవి. ఇది తరువాత శ్రీ రామనుజాచార్యులుచే వైష్ణవానికి మార్చబడింది. ఆలయం ఏకముఖి శిల నుండి నిర్మించబడి ఉంటుంది. దేవాలయ స్తంభాలపై అనేక శాసనాలు ఉన్నాయి, వాటిలో ఎక్కువ భాగం దేవనాగరి (స్క్రిప్టింగ్ లాంగ్వేజ్) లిపిలో క్రీ.శ 11 వ

నుండి క్రీ.శ 19 వ శతాబ్దం వరకు ఉండేవి. ఈ ఆలయ నిర్మాణ శైలి అందమైన శిల్పాలతో అద్భుతంగా నిర్మించబడింది.

## 1.6.3. శ్రీముఖలింగం:

శ్రీముఖలింగం దేవాలయం వంశధార నది ఎడమ ఒడ్డున ఉన్న శివునికి అంకితం చేయబడింది. అందంగా చెక్కబడిన ఈ దేవాలయం శివుని మూడు రూపాలకి చెందిన ముఖలింగేశ్వర, భీమేశ్వర మరియు సోమేశ్వర మూడు దేవాలయాల సమూహం. ఈ ఆలయం ఇండో– ఆర్యన్ శైలిలో నిర్మించబడింది. అద్భుతమైన శిల్పాలు, అతి క్లిష్టమైన శిల్ప శైలి చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ దేవాలయ నిర్మాణ శైలి చాలా సొగసైనది. పెద్ద ఆలయ ప్రవేశ ద్వారం, మెట్ల మార్గం మరియు రెండువైపుల రెండు సింహాలు నిర్మించారు.

## 1.6.4. గోవిందపురం ఆలయం:

ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం జిల్లాలోని పుసపతిరేగ మండలంలో గోవిందపురం ఒక గ్రామం ఉంది. ఇక్కడ అద్భుతమైన ఆలయం శిల్ప సౌందర్యానికి ప్రసిద్ధి చెందింది మరియు భగవద్గీత యొక్క సారాంశం మీద ఆధారపడి ఉంది. రథంపై కృష్ణ పరమాత్మ గంగారథం సందర్శకులను ఆకర్షిస్తుంది. ఇది శ్రీకాకుళం జిల్లాలోని చింతపల్లికి దగ్గరలో ఉంది. కార్తీక మాసం సమయంలో ఇక్కడ వనభోజనాలు జరుగుతూ ఉండడం సాధారణం.

## 1.6.5. పుణ్యగిరి ఆలయం:

శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయం విజయనగరం జిల్లాలో ఉన్న శైవ క్షేత్రం. ఈ ఆలయం S. కోటా దగ్గర ఉన్న పున్యగిరి కొండలలో ఉంది. ఈ కొండ యొక్క పురాతన పేరు విరాట పర్వతం. కొండకు ప్రవహించే అనేక నిరంతర నదీ ప్రవాహాలు ఉన్నాయి. ఈ దేవాలయం యొక్క శివలింగం సహజ నీటి ప్రవాహం నుండి నీటిని చుట్టుముడుతుంది. మహాశివరాత్రి మరియు కార్తీక మాసం సమయంలో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు.

## 1.6.6. పైడితల్లి అమ్మవారి ఆలయం:

రాష్ట్రములో మరే దేవాలయంలో జరగని రీతిలో అమ్మవారి "సిరిమాను" ఉత్సవం ఈ దేవాలయంలో జరుగుతుంది. దేశ చరిత్రలోనే ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ సిరిమాను ఉత్సవానికి లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారు. విజయనగర సామ్రాజ్యాధిపతులు శ్రీ విజయరామ గజపతులు వారు రాజ్యమేలుతున్న రోజులలో పొరుగు వారితో పోరు వచ్చింది. ఆ పోరు విజయనగర

సామ్రాజ్యానికి సుఖశాంతులు కోరదని, లోక శ్రేయస్సుకే హానికరమని, యుద్ధము చేయవలదని గజపతుల చిన్నారి శ్రీ పైడితల్లమ్మ శతవిధాల పోరి చెప్తుంది. ఆమె మాటలను శ్రీ విజయరామరాజు లక్ష్య పెట్టలేదు. ఆ పోరులో గజపతి సోదరుడు దక్కలేదు. ప్రజలు సుఖపడలేదు. అంతటనా చిన్నారి పైడితల్లి ఆవేదన చెంది తనువు చాలిస్తుంది. ఆ రోజే గజపతులకు అత్యంత సన్నిహితుడైన శ్రీపతివాడ అప్పలస్వామి నాయుడు కలలో కనబడి విజయనగరానికి పశ్చిమ దిక్కున గల పెద్ద చెరువులో ఉన్న విగ్రహాన్ని వెలికితీసి పూజా పునస్కారాలు చేయమని చెప్పినట్లు ఆమె శ్రీ పైడితల్లి అమ్మవారుగా అవతరించినట్లు విశేష పూజలు అందుకుంటోంది. ఈ సిరిమాను ఉత్సవం అశ్వయుజ శుద్ధ దశమి అంటే విజయదశమి వెళ్లిన మొదటి మంగళవారం జరుగుతుంది.

## 1.6.7. రామతీర్థం:

విజయనగరం జిల్లాలో గల ఈ క్షేత్రం శ్రీరామచంద్రుడికి సంబంధించిన మహిమాన్వితమైన క్షేత్రాల్లో ఒకటిగా చెప్పబడుతోంది. విజయనగరానికి 12 కి మీ దూరం లో చంపావతి నది సమీపంలో రామతీర్థం గ్రామం లో నీలాచలం కొండను అనుకోని వెలసిన శ్రీ కోదండ రామస్వామి దేవాలయం చాల పురాతనమైనది . సుమారు 1000 సంవత్సరాల చరిత్ర గల ఈ దేవాలయం పశుపతి రాజుల కాలంలో నిర్మించబడిందని చెబుతారు . ఆలయం మొత్తం ఒక పెద్ద రాతి పైన నిర్మించబడింది. సీతారామలక్ష్మణులు ఈ ప్రాంతంలో ఒక భక్తుని కోరికను తీర్చడానికి స్వయంగా వచ్చారని కూడా స్థల పురాణం చెబుతుంది . ఆలయంలో ఉన్న కోదండ రామస్వామి విగ్రహాలు నీటిలో దొరకడం వలన ఈ క్షేత్రానికి శ్రీరామతీర్థం అని పేరు వచ్చింది అని చెబుతారు. అక్కడ ఉన్న కోనేరుకి భాస్కర పుష్కరిణి అని పిలుస్తారు. ఆలయంలో ఉన్న ధ్వజ స్థంబాన్ని తాకితే సర్వ పాపాలు తొలిగిపోతాయని భక్తుల విశ్వాసం. రామతీర్థం బౌద్ధ స్థలాలకు కూడా ప్రసిద్ధి చెందింది.

## 1.6.8. సింహాచలం:

సింహాచలము విశాఖపట్టణములో తూర్పుకనుమలలో పర్వతం పైన ఉన్న ప్రముఖమైన హిందూ పుణ్యక్షేత్రము. ఈ క్షేత్రమున విశాఖ పరిసర ప్రాంతాల్లో ప్రజలు సింహాద్రి అప్పన్నగా పిలిచే వరాహ లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్నాడు. ఈ క్షేత్రము ఎత్తైన సింహగిరి పర్వతంపై ఉన్నది. విశాఖకు సుమారు 20 కి.మీ. దూరంలో కొండమీద వెలసిన లక్ష్మీనరసింహస్వామి శ్రీమహావిష్ణువు యొక్క అవతారమైన వరాహ నృసింహస్వామి క్షేత్రం. విశాఖజిల్లాలోని వారంతా ఈ స్వామిని భక్తితో, ఆప్యాయంగా సింహాద్రి అప్పన్నగా పిలుచుకుంటూరు. సింహాద్రి అప్పన్న దేవాలయం 11వ శతాబ్దపుకాలం నాటిది అంటున్నా ఆలయం ఇంకా పురాతన కాలానికి చెందినదిగా భావించబడుతుంది. హిరణ్యకశిపుని వధానంతరం భక్తశ్రేష్టుడైన ప్రహ్లాదునిచేత ప్రతిష్ఠితమైనదిగా చెప్పుకుంటారు. స్వామి

ఉగ్రత్వమును శాంతింపజేయటానికి విగ్రహానికి ప్రతి నిత్యమూ చందనపు పూత పూస్తుంటారు. చాళుక్యరీతి శిల్ప వైభవం ఆలయమంతా కొట్టొచ్చినట్లు కనబడుతూ ఉంటుంది. శ్రీ కృష్ణదేవరాయలు సైతం ఈ క్షేత్రాన్ని దర్శించి పునీతుడై కొన్ని గ్రామాలు స్వామివారి భోగముల నిమిత్తం భక్తితో సమర్పించారు. మరెన్నో సువర్ణాభరణాలు భక్తిమేర చేయించారు.

తిరుమలలో అన్నమయ్య వలె, సింహాచలంలో శ్రీ కృష్ణమాచార్యులు వారు పేరొందిన కవి. ఇతను స్వామిని కీర్తించుటవల్ల, స్వామి కృపచే ఇతనికి చతుర్వేద, అష్టాదశ పురాణాది, సమస్త శాస్త్రసంబంధ రహస్యాలు తెలుసుకుని, ఆ స్వామిని తన సంకీర్తనలతో అర్చించారు. రాగిరేకులపై గ్రంధాలు రాసే పద్ధతి, ఈయన నుండే తాళ్ళపాక వారికి వచ్చిందని అంటారు. ఈయన ప్రథమ వచన, సంకీర్తన, కవితాచార్యునిగా ప్రసిద్ధి.

## 1.7. ఉత్తరాంధ్ర పర్యాటక స్థలాలు:

ఉత్తరాంధ్రలో ప్రధాన పర్యాటక ఆకర్షణ కలిగిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. దీనికి కారణం ఇక్కడ ఉండే పర్యాటక ప్రదేశాలే అని చెప్పడంలో ఎంత మాత్రం సందేహం లేదు. ఇక్కడ సందర్శించే అనేక ప్రదేశాలు టూరిస్టులకు ఎన్నో మరపురాని జ్ఞాపకాలను అందిస్తాయి.

### 1.7.1. తేనెనీలాపురం:

శ్రీకాకుళం నుండి 65 కిలోమీటర్లు మరియు టెక్కలి మండలంలో టెక్కలి నుండి 7 కిలోమీటర్ల దూరంలో తేనెనీలాపురం గ్రామం ఉంది. ప్రతి సంవత్సరం సెప్టెంబరులో సైబీరియా నుండి 3,000 పైగా ఫెలికాన్, మరియు పెంటైడ్ స్టార్క్స్ జాతికి చెందిన పక్షులు ఇక్కడ వచ్చి సందర్శిస్తాయి. ఇవి సెప్టెంబరు నుండి మార్చి నెల వరకు ఇచట నివసిస్తాయి. ఇది పక్షి పరిశీలకులకు ఎంతో అనుభూతిని కలిగిస్తుంది. సుమారు 4,500 కిలోమీటర్ల దూరం ఇవి ప్రయాణం చేస్తాయి. ఏటా వేలాది పక్షులు ఇక్కడకు వచ్చి స్థానికంగా ఉన్న చింత చెట్లపై నివాసం ఏర్పరుచుకుని కన్నుల పండుగగా కనువిందు చేస్తుంటాయి. ఆరు నెలలపాటు సంతానోత్పత్తి గావించుకునే ఈ పక్షులు ఎటువంటి వీసా, పాస్‌పోర్టులు లేకుండానే సైబీరియా దేశం నుంచి ఈ ప్రాంతానికి వస్తుంటాయి. శ్రీకాకుళం జిల్లాలో తెనేనీలాపురం, నౌపద, టెక్కలి మరియు పరిసర ప్రాంతాలలోని గ్రామాలుకు రష్యా, మలేషియా, హంగేరీ, సింగపూర్ మరియు జర్మనీ, సైబీరియాకు చెందిన 113 వివిధ జాతుల పక్షులు సందర్శిస్తాయి.

### 1.7.2. అరకులోయ అందాలు:

విశాఖపట్నం అనగానే ప్రధానంగా వినిపించే పేరు "అరకు లోయ". దీన్ని ఆంధ్ర ఊటీగా పిలుస్తుంటారు. అరుకు అందాలను చూసిన వారు దీన్ని భూలోక స్వర్గంగా వర్ణిస్తుంటారు. కాగా అరకు

ప్రాంతం విశాఖపట్నం జిల్లా, డుంబ్రిగుడ మండలానికి చెందిన గ్రామము. ఈ ప్రాంతం సముద్రమట్టానికి సుమారు 600 మీటర్ల నుండి 900 మీటర్ల ఎత్తులో ఉంది. విశాఖపట్నానికి 115 కి.మీ.ల దూరంలో ఉన్న అరకు ఆహ్లాదకరమైన వాతావరణం, కొండలు, లోయలతో జనాలను బాగా ఆకర్షిస్తోంది. సహజ సౌందర్యము కలిగిన అరకు సంపన్న భౌగోళిక స్వరూపము కలిగి సజీవముగా నిలుస్తుంది. అరకు వెళ్ళే ఇరువైపులా దట్టమైన అడవులు ఉండే ఘాట్ రోడ్, ఆసక్తికరముగా ఆహ్లాదకరముగా ఉంటుంది. దారిలో అనంతగిరి కొండలలో కాఫీ తోటలు ఉన్నాయి. 29 కి.మీ. దూరములో ఉన్న బొర్రా గుహలు ఒక పర్యాటక ఆకర్షణ. తూర్పు కనుమలులో ఉన్న ట్రైబల్ మ్యూజియమ్ ఇంకొక ఆకర్షణ.

## 1.7.3. విజయనగరం కోట:

విజయనగరం పట్టణం గంభీరమైన కోట చుట్టూ నిర్మింపబడింది. చతురస్రాకార రాయి కోట పాలకులు గత కీర్తి వర్ణించే ఆ రోజుల్లో బిల్డర్ల మరియు వాస్తుశిల్పుల జ్ఞానం మరియు నైపుణ్యం యొక్క సాక్ష్యం. విజయనగరం కోటను కొండరాళ్లతో నిర్మించారు. ఇది 26 ఎకరాల విస్తీర్ణంలో నాలుగు కోణాల్లో నలుగు పెద్ద బురుజులతో నిర్మితమైనది. కోట చుట్టూ 19,653 చదరపు అడుగుల కందకం తవ్వించారు. నాడు కందకం నిండా నీరు ఉండేది. ఇది సుమారు రెండు ఏనుగులు మునిగేటంత లోతు ఉంటుంది. గోడలు సుమారు 30 అడుగుల ఎత్తు కలిగివున్నాయి. విజయనగర రాజులు మొదట్లో కుమిలిలోని మట్టి కోటలో నివసించేవారు. ఆనంద గజపతి రాజు విజయనగరం కోట నిర్మాణాన్ని క్రీ.శ. 1712-1714 ల మధ్య ప్రారంభించారు. అయిదు విజయాలకు చిహ్నంగా అనగా విజయ నామ సంవత్సరంలో, విజయదశమి, మంగళవారం ఈ కోట నిర్మాణం మొదలైంది. తన కుమారుడు విజయరామ రాజు పేరిట దీనికి 'విజయనగరం' అని పేరు వచ్చింది. అయితే 1717 సంవత్సరంలో ఆనందరాజు పరమపదించడం వల్ల విజయరామరాజు కోట నిర్మాణాన్ని పూర్తి చేశారు.

## 1.7.4. కైలాసగిరి:

విశాఖపట్నములో చెప్పుకోదగ్గ ప్రదేశాల్లో 'కైలాసగిరి' ఒకటి. పేరుకు తగినట్లే భువిపై ఉన్న కైలాసంలా ఈ ప్రాంతం అనిపిస్తుంది. విశాఖ నగరానికి ప్రధాన ఆకర్షణగా ఏ మూల నుంచి చూసినా కనిపించే విధంగా ఈ పర్వత ప్రాంతం ఉంటుంది. విశాఖ కైలాసగిరికి దేశ విదేశీ పర్యాటకుల తాకిడి ఎప్పుడూ అధికంగా ఉంటుంది. దేశవ్యాప్తంగా ఈ ప్రాంతం పేరుగాంచింది. కైలాసగిరి ప్రకృతి అందాలు ఎంతటి వారినైనా ముగ్ధులను చేస్తాయనడానికి ఇది ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

కైలాసగిరిపై పర్యాటకులను ఆకర్షించే ప్రదేశాల్లో తెలుగు మ్యూజియం ఒకటి. తెలుగు జాతి చరిత్ర, సంస్కృతి సాంప్రదాయాల గురించి ఇక్కడ ప్రదర్శిస్తారు. కొండపై 6 ఎకరాల స్థలంలో ప్రపంచ తెలుగు

సమాఖ్య వారు విశాఖ నగర అభివృద్ధి సంస్థ సహకారంతో 2016 నవంబర్ 19న తెలుగు సాంస్కృతిక నికేతనం (తెలుగు మ్యూజియం)ను ఏర్పాటు చేశారు. తెలుగు వైభవాన్ని కళ్లకు కట్టే ఓ అద్భుత ప్రదేశంగా తెలుగు మ్యూజియం పర్యాటకులను ఆకట్టుకుంటుంది. కైలాసగిరిలో పిల్లల కోసం ప్రత్యేక పార్కులు, ఆట పరికరాలు అందుబాటులో ఉంటాయి.

## మరికొన్ని దర్శనీయ ప్రదేశాలు:

భీమునిపట్నం, బొర్రాగుహలు, అనంతగిరి, ఆర్.కె. బీచ్, ఋషికొండ బీచ్, కైలాసగిరి. యారాడ సముద్ర తీరం(బీచ్), నక్కపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు,, బొజ్జన్నకొండ (బౌద్ధ క్షేత్రం), భీమిలిలోని ఎర్రమట్టిదిబ్బలు, నది సముద్రంలో కలిసే నదీ సంగమం (అంతర్వేది) మొదలైనవి చూడటానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి.

## 1. 8 ఉత్తరాంధ్ర జిల్లాల సంస్కృతి సంప్రదాయాలు:

మన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అన్నీ ప్రకృతిలో ముడిపడి ఉంటాయి. ప్రజలు ప్రకృతిని పవిత్రంగా భావిస్తూ సత్సంబంధాలు కలిగి ఉంటారు. ఈ సంప్రదాయం ఒక తరం నుండి మరొక తరానికి వారసత్వంగా అందజేయబడుతూ వస్తుంది. దేశ నైసర్గిక స్వరూపంలో వైవిధ్యం వల్ల భిన్న ప్రాంతాల్లోని ప్రజల ప్రతిచర్యలు ప్రకృతి, పరిసరాలతో కూడా భిన్నవిధాలుగా ఉంటాయి. తిరిగి వాటి ప్రభావం సంస్కృతి మరియు సంప్రదాయాలమీద వుంటుంది. జాతరలు, ఉత్సవాలు, తిరునాళ్ళ వంటి సంబరాలు అందరం కలిసిమెలిసి జీవించడానికి ఎంతగానో తోడ్పడతాయి. ఉత్తరాంధ్ర ప్రజల కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు. పూసపాటిరాజవంశీయుల ఆడపడుచుగా ఖ్యాతిగాంచిన పైడితల్ల అమ్మవారి సిరిమానోత్సవం ఏటా ఆశ్వయుజ శుద్ధ దశమి తర్వాత వచ్చే మంగళవారం నిర్వహిస్తారు. సిరిమాను ముందుగా పాలధార, తెల్లఏనుగు, అంజలిరథం, బెస్తలవలస ఊరేగింపులో పాల్గొనడం ఆనవాయితీగా వస్తుంది.

అమ్మ కాని అమ్మ ... మిత్తమ్మ! అయ్య కాని అయ్య మిత్తయ్య! ... చుట్టరికం కాని చుట్టరికం మిత్తరికం. రక్తసంబంధం కంటే ఎక్కవగా 'నేస్తరికానికి' వాళ్లు ఎంత విలువనిస్తున్నారో అన్నవిషయం తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. రక్తసంబంధీకులు కాదు మిత్తరికం చేసిన కుటుంబ సభ్యులంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఆ మాటకొస్తే వాళ్లది ఒక్క కులం కాదు.. ఒక్క ప్రాంతం కాదు. భిన్నమైన జీవనశైలి నుంచి వచ్చిన ఆ కుటుంబాలు ఎలా ఒక్క కుటుంబంలా కలిసి ఉంటారంటే ఆశ్చర్యంగా ఉంటుంది. 'మా మిత్తమ్మ', 'మిత్త బావ', 'మిత్త అక్క' వంటి బంధుత్వాలు అక్కడే మనకి పరిచయం అవుతాయి. వాస్తవానికి వాళ్ళు ఎవరూ రక్తసంబంధీకులు కాదు కానీ అంతకంటే ఎక్కువే. స్థానికంగా ఈ

సంప్రదాయాన్ని మిత్తరికం లేదా నేస్తరికం అనీ అంటారు. వందల సంవత్సరాలుగా ఉత్తరాంధ్రలో ఈ మిత్తరికం సంప్రదాయం కొనసాగుతోంది.

## 1.9. ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల సామాజిక పరిస్థితులు:

ఉత్తరాంధ్ర సుదీర్ఘమైన తీరప్రాంతంగల మత్స్యకారుల పల్లెల జీవన స్థితిగతులుగాని, రాష్ట్రంలోనే అత్యధిక ఏజెన్సీ ప్రాంతమున్న ఉత్తరాంధ్ర గిరిజన బతుకులు, వారి దోపిడీ ఒకసారి చూస్తే ఈ ప్రాంత అభివృద్ధి అర్థమవుతుంది. పొగబారిన జీడి పరిశ్రమ, మూతబడిన ఆముదాలవలస చక్కెర పరిశ్రమ, మరమ్మత్తుకు గురైన బుడితి ఇత్తడి పరిశ్రమ, చిరిగిన పొందూరు ఖాదీ పరిశ్రమ, చిట్టివలస జనప నార పరిశ్రమ, ఉద్దానం కొబ్బరి పరిశ్రమలు ఇందుకు నిదర్శనాలు. థర్మల్ ప్లాంట్లు, అణు విద్యుత్ ప్లాంట్లు, జిందాల్ పరిశ్రమలు పెట్రో కారిడార్‌లు వద్దని ఉత్తరాంధ్ర జనం గగ్గోలు పెడుతున్నారు. కేన్సర్, కిడ్నీ, డయాలసిస్, ఆస్తమా, శిశు మరణాలు అధికమయ్యాయి. తాగునీరు, సాగునీటి కొరత ఉత్తరాంధ్రను పట్టి పీడుస్తోంది. రాష్ట్రంలో బీసీ జనాభా అధికంగానూ, ఆదివాసీ, ఇతర నిమ్న జాతి వర్గాల ప్రభావితంగానూ ఉత్తరాంధ్రలోనే ఉన్నప్పటికీ వారి ఆర్థిక, సామాజిక బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు, పథకాలు అమలు చేయాలన్న ఆలోచనే నేటి వరకూ ఏ పాలకులకూ రాలేదు. అందుకే మానవాభివృద్ధి సూచికలో రాష్ట్రంలో చివరి స్థానంలో ఉన్న శ్రీకాకుళం విజయనగరం, వలసల్లో ప్రథమ స్థానంలో ఉన్నా ఉత్తరాంధ్ర ప్రాంత ప్రయోజనాలు కాపాడే వారు లేరని కళింగాంధ్రలోని నేటి తరం ప్రశ్నిస్తున్నది. విశాఖ రైల్వే జోన్ చేయమని, విశాఖలో హైకోర్టు బెంచ్ నెలకొల్పాలని, మన్యం ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించమని, విశాఖ కాలుష్యాన్ని నిర్మూలించాలని, ఒడిషాతో జల వివాదాలు పరిష్కరించాలని, ఉత్తరాంధ్ర విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత కల్పించాలని దశాబ్దాలుగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ఆ ఉద్యమాలకు కొన్ని కార్పొరేట్ మీడియా సంస్థలు ప్రాధాన్యమివ్వక పోవడం విచారకరం. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఉత్తరాంధ్ర నిరంతరాయంగా నిర్లక్ష్యానికి గురవుతోంది. నాడు, నేడు జరుగుతున్న అన్యాయం, వివక్ష పట్ల ఈ ప్రాంతీయుల్లో తాజాగా ఆందోళన, భవిష్యత్ పట్ల అభద్రత భావం వ్యక్తమవుతోంది.

సమైక్య రాష్ట్రంలో గానీ, విడిపోయిన కొత్త రాష్ట్రంలో గానీ ఉత్తరాంధ్ర భవిష్యత్, భద్రత, ప్రగతిపై పాలకులు ఇప్పటికీ సమగ్రమైన ప్రకటనగానీ, అంకిత భావంతో కూడిన ప్రణాళికగాని ఎందుకు ప్రకటించలేకపోతున్నారని ఉత్తరాంధ్రులు ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర జిల్లాల సమగ్ర అభివృద్ధికి పార్లమెంట్ సాక్షిగా కేంద్రం ప్రకటించిన భారీ ఆర్థిక ప్యాకేజీ ఏమైంది?. దీనిపై ప్రభుత్వాలు ఎందుకు మౌనంగా ఉన్నాయి?. ఉత్తరాంధ్రుల చేతుల్లో ఆయా పార్టీల నాయకత్వాలు లేకపోవడమే కారణమా?. ఇప్పటికీ ప్రభుత్వాలు రాజకీయ పార్టీలు ఉత్తరాంధ్రను వివక్షకు గురిచేసే ఆలోచనలు, కార్యక్రమాల్లోనే నిమగ్నమై ఉంటే ఇక్కడ ఉద్యమాలు మళ్లీ మొలకెత్తక మానవు.

# అధ్యాయం 2

# ఉత్తరాంధ్ర జానపద గేయాలు - పరిశీలనాంశాలు

# అధ్యాయం 2

# ఉత్తరాంధ్ర జానపద గేయాలు – పరిశీలనాంశాలు

## 2.1. పరిచయం:

జానపద సాహిత్యమనగానే గుర్తుకొచ్చేవి మరియు ప్రధాన పాత్ర వహించేవి జానపద గేయలు. తెలుగు భాషా సంస్కృతుల చరిత్ర ఎంత ప్రాచీనమైనదో తెలుగు జానపద గేయ చరిత్ర కూడా అంత ప్రాచీనమైనట్టిది. పల్లె వాతావరణానికి అంకిత మయిన పల్లె ప్రజలు తమ ప్రాంతంలో అప్రయత్నంగా ఉపయోగించే పదాలని, పాటలని జానపదులు పర్యాయ పదాలుగా పిలుచుకునే లయాత్మకమైనటువంటి ఆశువుగా చెప్పే కవిత్వాలు లేదా వచన రచనలను జానపద గేయాలుగా చెప్పవచ్చు. ఈ గేయలలో ఆయా ప్రాంత ప్రజల మాండలిక భాష, చరిత్రక విషయాలు, సాంస్కృతిక విశేషాలు, భావోద్వేగాలు, సాంఘిక విశ్వాసాలు, దైనందిన జీవితాలు మొదలైనవి ప్రతిబింబింపజేస్తాయి. అజ్ఞాత కర్తృత్వం వాక్సంప్రదాయం, సామూహిక ప్రచారం, సరళ భావం, జనప్రియత్వం మొదలైనవి జానపద గేయాలకుండే లక్షణాలు. జానపద గేయాలలో పౌరాణిక గేయాలు, చారిత్రక గేయాలు, స్త్రీల పాటలు, శ్రామిక గేయాలు, పారమార్థిక గేయాలు, వీరరస గేయాలు, వీరగాథాగేయాలు, కరుణ రస గేయాలు, అద్భుత రస గేయాలు, పిల్లల పాటలు మొదలైనటువంటి విభాగాలు ఎన్నో ఉన్నాయి. ఆయా విభాగాల్లో వాటికి ఉండే ప్రాధాన్యత విశిష్టమైనది.

తెలుగు జానపద కవిత ఎంత సంపన్నమైనదో ఎంత వైవిధ్యం కలదో జానపద గేయాలలో కన్పిస్తుంది. స్త్రీ పురుషులు కాయకష్టం చేస్తున్నప్పుడు శ్రమ కనపడకుండా ఉండేందుకు అలసట చెందకుండా ఉండేందుకు అప్రయ్నతంగా వారి నోట నుండి కూనిరాగాలు మాటలు వెలువతాయి. పంట చేలో పడుచులు పాడుకునే గీతాలు, కుల వృత్తుల శ్రామికులు శ్రమను మర్చిపోవడానికి పేర్చుకునే అక్షరాల అల్లికలు, బావా మరదళ్ళ ప్రేమ వ్యవహారాలు, ప్రేయసీ ప్రియుల సరసాలు, ఈ జానపద గేయాలు పుట్టడానికి ప్రేరణలు. నాగలిదున్నుతున్నప్పుడు, విత్తనాలు జల్లుతున్నప్పుడు, నాట్లు వేస్తున్నప్పుడు, పంట నూరుస్తున్నప్పుడు, ధాన్యం దంచుతున్నప్పుడు, బరువులు మోస్తున్నప్పుడు, జానపదుల నోటినుండి అప్రయత్నంగా వెలువడిన మాటలు, కూనిరాగాలు వెల్లువిరుస్తాయి. ఇటువంటి రాగాలు మాటలు సామూహిక కర్తృత్వంలో జానపద గేయాలుగా పరిణమించి క్రమంగా వ్యాప్తి చెందుతాయి. జానపద గేయాలలో చక్కటి శిల్ప సౌందర్యం కన్పిస్తుంది. ఈ గేయ సంపదను భద్రపరచి విశ్లేషించి, పరిశీలించడం ఎంతైనా అవసరం. ఉత్తరాంధ్రలో పల్లె గొంతుల్లో, జానపద కళాకారుల గుండెల్లో పల్లవించిన గేయాలు ఎన్నో మారు మూల గ్రామాల్లో వినిపిస్తున్నాయి. వాస్తవానికి జానపదదేయాలు శక్తిని, చైతన్య స్ఫూర్తిని జన జీవన స్రవంతిలో జాగృతిని కల్గిస్తాయి. ఇందలి కవితను ఆస్వాదించేందుకు కేవలం మేధస్సు కంటే మృదువైనటువంటి సహృదయం అవసరం.

## 2.2. గ్రామదేవతల గేయాలు:

గ్రామాన్ని భూత ప్రేతాల నుండి రక్షిస్తూ గ్రామ పొలిమేరలలో సదా కాపు కాస్తూ ఉండే దేవతలు. అంటువ్యాధుల నుండి రక్షిస్తూ, పంటలను పచ్చగా ఉండేలా చేస్తూ, గ్రామస్థులను చల్లగా చూసే దేవతలు. దేవీనవరాత్రుల కాలములో ఎక్కడోవున్న మధుర మీనాక్షమ్మ వద్దకో, కంచి కామాక్షమ్మ దగ్గరికో, బెజవాడ కనకదుర్గమ్మ చెంతకో వెళ్ళాలంటే కుదరకపోవచ్చు. అలాంటప్పుడు అమ్మ దర్శనానికి వెళ్ళలేక పోయామే అని నిరాశ పొందకుండా వుండేందుకు ఎక్కడో వున్న తల్లిని ఇక్కడే దర్శించుకొన్నామనే తృప్తిని పొందేందుకు గ్రామదేవత వ్యవస్థని ఏర్పాటు చేసారు పెద్దలు. ఈ గ్రామదేవతల గుళ్ళు ఊరిపొలిమేరల్లో, పంటపొలాలమధ్య, చెరువు గట్లలో, వేపచెట్ల క్రింద ఉంటాయి. గ్రామాల్లో ప్రజలు గ్రామ దేవతగా పూజించే అమ్మవారిని భక్తిశ్రద్ధలతో మొక్కుబడులు చెల్లిస్తారు. ఉత్తరాంధ్రలో ఈ క్రింది విధంగా అమ్మవారిని పాటలు పాడుతూ అమ్మను వేడుకుంటారు. ప్రతి సంవత్సరం గ్రామ దేవత ఉత్సవాలు జాతరలు నిర్వహిస్తారు. ఉత్తరాంధ్రలో అమ్మని తలుచుకుంటూ భక్తి ప్రపత్తులతో పాటలు పాడుతూ ఉంటారు. ఈ విధంగా పాటలు పాడే ముందు అమ్మవారిని గ్రామదేవతలను వేడుకొంటారు.

దండాలు దండాలు అమ్మవారు తల్లీ
నీకు పదివేలు దండాలు అమ్మవారు తల్లీ
వెయ్యి పీఠములందు వెలసేటి తల్లీ
లక్ష పీఠములందు వెలసేటి తల్లీ
కోటి పీఠములందు వెలసేటి తల్లీ
ముత్యాల పోలమ్మ – రావమ్మ తల్లీ
నాలుగు వేదములు – నీ చేతనమ్మా
అష్టదిక్పాలకులు నీ ఆధీనమమ్మా
అమ్మలగన్న అమ్మ చాలా పెద్దమ్మ తల్లీ
మహాదేవ శంభు శివరాణివమ్మా
ఏ పేరున నిన్ను పిలవగలను తల్లీ
విజయవాడలుందేటి కనక దుర్గమ్మా
కనక దుర్గమ్మవై కాపాడు తల్లీ
విశాఖలుండేటి కనకామాహాలక్ష్మీ
కనకామాహాలక్ష్మీ కరుణించవమ్మా తల్లీ
విజయనగరములుండేటి పైడి తల్లమ్మా

పైడి తల్లమ్మ పాలించు తల్లీ
కాశీలుండేటి అన్నపూర్ణమ్మా
కాశీ అన్నపూర్ణమ్మ కరుణించు తల్లీ
కంచిలో ఉండేటి కామాక్షి తల్లీ
కామాక్షి మాత కాపాడవమ్మా
మధురలో ఉండేటి మీనాక్షి తల్లీ
మధుర మీనాక్షమ్మ రక్షించు తల్లీ
శ్రీశైలంలో ఉండేటి భ్రమరాంబ తల్లీ
భ్రమరాంబ తల్లీ  రక్షించ రావా
కాశీలో ఉండేటి విశాలాక్షి తల్లీ
విశాలాక్షమ్మ చల్లంగా చూడు
చాపరలో ఉండేటి ముత్యాల పోలమ్మ
ముత్యాల పోలమ్మ తల్లీ
మమ్మల్ని  చల్లగా  కాపాడు
పాతపట్నంలో ఉండేటి నీలమణి దుర్గమ్మ
నీలమణి దుర్గమ్మ  తల్లీ  మమ్మల్ని చల్లగా చూడు
పాలవలసలో ఉండేటి రౌతు పోలమ్మా
రావమ్మ కరుణించు రౌతు పోలమ్మా
దండాలు దండాలు అమ్మవారు తల్లీ
నీకు శతకోటి దండాలు అమ్మవారు తల్లీ

ఈ విధంగా గ్రామాల్లో ఉన్నటువంటి గ్రామదేవతలను పూజించడం, భక్తితో పాటలు పాడడంతోపాటు ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల అమ్మవారిని కూడా స్మరించుకోవడం అనేది ఈ పాటలో వ్యక్తమవుతున్నది.

ప్రతి గ్రామంలో వెలిసిన గ్రామ దేవతలు శక్తి స్వరూపిణీలు. ప్రజలు ప్రతీ సంవత్సరం పండుగలు ఉత్సవాలు నిర్వహిస్తూ, భక్తితో ఆ అమ్మను శరణు వేడితే, తప్పకుండా వరాలిచ్చే దేవతగా భావిస్తారు. ఆ గ్రామాలకు ఎటువంటి కీడు జరగకుండా ఉండేందుకు తల్లిని ప్రార్థిస్తూ వేడుకుంటారు. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం పాతపట్నం గ్రామంలో వెలసినటువంటి నీలమణి దుర్గమ్మ ఎంతో మహిమ కలిగినటువంటి అమ్మవారు. అమ్మవారిని ఈ విధంగా ప్రార్థిస్తూ శరణు వేడుకుంటారు..

నీలమణి దుర్గ ... నీకు జేజేలు

నీ చూపులే చాలు మాకు పదివేలు

భక్తజన హృదయం మా పాతపట్నం ... 2

కొలువైతివమ్మ ... కోటి దండాలు "నీలమణి దుర్గ"

ఆది శక్తీ ... ... ఆ ... ... ఆ ... ...

ఆదిశక్తి మమ్ము ఆదుకోవమ్మ

అంబ జగదంబ మమ్మేలు మాయమ్మ

మొక్కుబడి తెచ్చాము మోమెత్తి చూడు

దిక్కు మొక్కు లేని మమ్ముల కాపాడు "నీలమణి దుర్గ"

కళింగ రాజ్యంలో భాగంగా ఉన్న ఈ ఉత్తరాంధ్ర ఈశాన్య భాగంగా వెలసినటువంటి నీలమణి దుర్గమ్మ మహిమాన్వితమైన శక్తి స్వరూపిణి. ఆమె కరుణను వంశధార నదితో ఇక్కడ కవి వర్ణించడం ఈ ప్రాంతం సంబంధించిన నదుల స్థితిగతులను తెలియజేస్తున్నది.

ఈ ఆంధ్రదేశ ఈశాన్య భాగమునా ...

ఇలవేల్పువై వెలసితివమ్మా

నీ కరుణ యేరులై సిరి వంశదారలై

ఒప్పొంగే తల్లీ కల్పవల్లీ ... "నీలమణి దుర్గ"

జగన్మాత ఒక్కరే అయినా ప్రతీ గ్రామంలోనూ వారికి తోచిన పేరుతో పిలుచుకుంటారు భక్తులు. సహస్రకోటి నామాలు కలిగిన ఆ తల్లి ఏ పేరుతో పిలిచినా పలుకుతుంది. విజయవాడలో వెలిసిన జగన్మాత ముగ్గురమ్మల మూలపుటమ్మ భక్తుల కొంగు బంగారంగా పిలుచుకునే అమ్మవారు. ఇంద్రకీలాద్రిపై కొలువై భక్తులను కాపాడుతున్న కనకదుర్గమ్మ అమ్మవారి తలచుకుంటూ ఉత్తరాంధ్రలో ప్రతీ సంవత్సరం భవాని మాలలు వేసుకుంటూ ఎరుపు దుస్తులను వేసుకుంటూ భక్తితో భజనలు చేస్తారు. గ్రామ దేవతలకు పూజలు చేస్తూ ఈ పాటలు పాడుతారు.

దుర్గమాంభవే బెజవాడ కనక దుర్గమాంభవే

దుర్గమాంభవే బెజవాడ కనక దుర్గమాంభవే

కృష్ణానది పక్కన వెలసిన ఎత్తైన కొండపైనున్న మహిమాన్వితమైన బెజవాడ కనకదుర్గమ్మను భక్తులు భక్తితో పూజిస్తూ అక్కడ ఉండే ప్రకృతిని వర్ణిస్తూ, నదిని వర్ణిస్తూ, ప్రవహించే నది శబ్దం ఒక తుమ్మెద గానముగా ఉన్నట్లు ఇక్కడ అద్భుతమైన వర్ణనలను ఈ గేయంలో పేర్కొన్నారు.

అమ్మా ఎత్తైనా శిఖరము పైన

సుందరమైన ఆలయమందున

అందమైన కడు ప్రకృతిలోన

విరబూసే విరజాజులలోన
అమ్మ కృష్ణా నది గలగల నాధం
కోకిల తుమ్మెద కమ్మని గానము "దుర్గమాంభవే"
అమ్మ నిను వర్ణింపగ నా తరమౌనా
నిజముగాను నీ సుతుడను గాన
నిరతము నీ పద సేవ చేసినా
అమ్మ అని నోరార పిలిచినా
అమ్మ తనయులు కోర్కెలు తీర్చే తల్లి
అండగా నిలిచిన వరాలు తల్లి "దుర్గమాంభవే"
అమ్మా ఎనలేని ఆభరణాలు
ముచ్చట గలిగే ఉంగరాలు
పాపిట బిందెలు పలు రకాంబులు
చెవులకు రింగులు మంచి ముత్యములు
అమ్మ కాళ్ళకు గజ్జలు వేళ్ళకు పట్టలు
అమ్మని అడిగిన గల్లున మోగెను "దుర్గమాంభవే"
అమ్మ ఓంకారమున జన్మించావట
సృష్టికి నీవే మూలధనమట
జరుగును నీకు పలు సంబ్రాలట
కోళ్లు గొర్రెలు కోట్లు కోట్లట
అమ్మ కుంకుమ పూజలు సాంబ్రాణి పొగలు
అమ్మకి ఇంపుగ నిండియుండెనట "దుర్గమాంభవే"
అమ్మ ధరణిలోన శ్రీ నౌపడ పురమట
కృష్ణ దాసునకు కన్నతల్లివట
కోపములంతా బాపినావట
చింతలు తీర్చే కనక దుర్గవట
అమ్మ కరుణామయివని పేరుగాంచి
బెజవాడ పురములో స్థావరమైతివి "దుర్గమాంభవే"

ఈ విధంగా గ్రామాల్లో ప్రజలు గ్రామ దేవతలను పూజిస్తూ పాటలు పాడుతూ మొక్కులు చెల్లించుకుంటూ ఘటాలను ప్రసాద నైవేద్యాలను సమర్పించుకుంటారు.

## 2.3. హరికథ గేయాలు:

### సుందరాకాండ

సీత అన్వేషణలో ఆంజనేయుడు లంకను చేరుకొని వెతుకుతున్నప్పుడు రామ కార్యార్థం బయలుదేరాను కనుక తనకు సీత జాడ కనిపించలేదని నేను లంకను విడిచి తిరిగి వెళ్ళనా?. వెళితే నా మంత్రి సుగ్రీవుడు ఉండడు. సుగ్రీవుడు లేని రామలక్ష్మణులు ఉండరు. రాముడు లక్ష్మణుడు లేని భరత శత్రుఘ్నులు కౌసల్య సుమిత్ర కైకేయి కూడా బతకరే..!. ఇంతమంది చావుకు కారణమైనటువంటి నా ఈ ప్రయాణాన్ని ఇక్కడే నిలిపేస్తే బాగుంటుందేమో అని ఒక సమయంలో ఆంజనేయునికి ఆలోచన కలిగింది. అయినా ఇంత జ్ఞానం నాకు ఎలా కలుగుతుంది. నా ఇష్ట దైవమైనటువంటి నా రామయ్యను ఒక్కసారి స్మరణ చేయకుండా వాళ్లు వీళ్లు పొగిడితే నేను అంత అయ్యాను గాని, ఉబ్బిపోయి ఆనందంతో సముద్రాన్ని లంకించాను గాని, నేను నా రామచంద్ర మూర్తిని స్మరణ చేయలేదు అని ఆంజనేయుడు తన ఆరాధ్య దైవమైనటువంటి శ్రీ రామచంద్రునికి నమస్కారం చేస్తూ ప్రార్థించాడు.

రామ నీ చరణములే నమ్మితి
నీ దివ్య చరణములే నమ్మితి
వారధి కట్టిన వరభద్రాచల
వరదా వరదా వరదా
నీ దివ్య చరణములే నమ్మితి
వనమున రాతిని వనితగ చేసిన ... 2
అయ్యా ... అయ్యా ... అయ్యా ---
నీ దివ్య చరణములే నమ్మితి ... 2

### శ్రీకృష్ణరాయబారం

శ్రీ కృష్ణుడు రాయబారానికి వెళ్తున్నప్పుడు అర్జునుని పిలిచి అతని అభిప్రాయం అడుగగా అర్జునుడు ముందుకు వచ్చి ఆ కృష్ణపరమాత్ముని తన్మయత్వంతో చూస్తూ మహాత్మా పాండవ అభ్యుదయం కోసం అవతరించిన పరమపురుషుడు కదా! ... నీకు నా అభిప్రాయం తెలియదా బావా!... అని చెప్పి అయినా అడుగుతున్నావు కనుకనే చెబుతున్నాను అంటూ అర్జునుడు ఆ శ్రీకృష్ణ పరమాత్ముని ప్రార్థిస్తున్నాడు. ఈ విధంగా శ్రీమహావిష్ణువుకు సంబంధించిన దశావతారాలు, ఆ అవతారానికి సంబంధించిన విశిష్టతలను కథలను పాటలను రాగయుక్తంగా పాడుతూ ఉత్తరాంధ్రలో హరికథకులు ఎంతో వైభవంగా అలంకరణ చేసుకొని ప్రదర్శన చేస్తారు.

గోవింద గోవిందయని కొలువరే

గోవిందాయని కొలువరే
హరియచ్యుతాయని పాడరే
పురుషోత్తమాయని పొగడరే...2
పరమపురుషాయని పలుకరే
సిరివరయనుచును చలగరే జనులు...2 "గోవిందా"
శ్రీనివాస గోవిందా శ్రీ వేంకటేశ గోవిందా
భక్తవత్సలా గోవిందా భాగవతప్రియ గోవిందా
నిత్య నిర్మలా గోవిందా నీల మేఘశ్యామ గోవిందా
పురాణపురుష గోవిందా పుండరీకాక్ష గోవిందా
నంద నందనా గోవిందా నవనీత చోరా గోవిందా
పశుబాలక శ్రీ గోవిందా పాప విమోచన గోవిందా
దుష్ట సంహార గోవిందా దురిత నివారణ గోవిందా
గోవిందా హరి గోవిందా గోకులనందన గోవిందా

## 2.4. బుర్రకథ గేయాలు:

### విజయనగర సంస్థానానికి సంబందించిన గేయం

18వ శతాబ్దం మధ్యలో విజయనగర సంస్థానం రాజు పూసపాటి పెదవిజయరామరాజుకు బొబ్బిలి జమీందారు రాజా గోపాలకృష్ణ రంగారావుకు, మధ్య వైరం ఉండేది. ఫ్రెంచి కమాండర్ ఇన్ చీఫ్ బుస్సీ సాయంతో బొబ్బిలి సైన్యాన్ని విజయనగర సైన్యం ఢీ కొట్టింది. అదే బొబ్బిలి యుద్ధం చరిత్రలో ఎన్నో యుద్ధాలు జరిగినా బొబ్బిలి యుద్ధం ప్రత్యేకమైంది. విజయనగరం చరిత్రలొ 24 జనవరి 1757లో విజయనగరం మరియు బొబ్బిలి రాజ్యాల మద్య జరిగిన బొబ్బిలి యుద్దం అతి ప్రధానమయినది. ఈ గేయంలో విజయరామరాజు వ్యక్తిత్వాన్ని అతని పరాక్రమాన్ని తెలియజేస్తూ అతను తన రాజ్యంలో ప్రజలను ఏ విధంగా చూసుకున్నాడో, కళలను కళాకారులను ఏ విధంగా ఆదరించాడో అనేది బుర్రకథ కళాకారులు తమ కథలు గేయాల ద్వారా తెలియజేస్తూ బొబ్బిలి యుద్ధానికి విశిష్టతను చేకూర్చారు.

వినరయ్య ఘనులారా విజ్ఞానులారా
కనరయ్య మన జాతి ఘనమైన కీర్తి
నీ జాతి రతనము ... విజయనగరమూ ...

ఆ విజయనగరమునేలు వీరులేవరన్నా ....

ఆ ... అన్నా ... వీరులేవరన్నా ...

ఆ విజయనగరము యుక్తిగనేలినది విజయరామరాజూ ... బలాబలి

వినరా ఆంధ్ర కుమారవీర వీరగాధ వినరా బలాబలి

కళాకారుడు కళాపోషకుడు కళారాదకుండూ ... బలాబలి

వినరా ఆంధ్ర కుమారవీర వీరగాధ వినరా బలాబలి

వేదసాధలను మోదముతోడ ఆదరించువాడూ ... బలాబలి

వినరా ఆంధ్ర కుమారవీర వీరగాధ వినరా బలాబలి

రాజుల మధ్య అసాధ్యుడు కుర్ర ఉ చ్చల్లా  ఉన్నాడా..!. బలాబలి

వినరా ఆంధ్ర కుమారవీర వీరగాధ వినరా బలాబలి

తా... తయ్య ... తరికిట ... తరికిట ... తా ...

నాణ్యత మించిన లక్షణంబు నాకున్నది అన్నాడ...

వినరా ఆంధ్ర కుమారవీర వీరగాధ వినరా బలాబలి

ఏక చత్రంబు తెలుగుదేశమును ఏలుదునన్నాడ

వినరా ఆంధ్ర కుమారవీర వీరగాధ వినరా బలాబలి

అక్కడ నుంచి తెలుగు నాడు నాకెదురేమన్నాడ

తా... తయ్య ... తరికిట ... తరికిట ... తా..

## బొబ్బిలి సంస్థానానికి సంబందించిన గేయం

బొబ్బిలి పేరు చెబితే వెంటనే గుర్తొచ్చేది తాండ్ర పాపారాయుడి శౌర్యం, పరాక్రమం. తెలుగు చరిత్రలో ఓ విశిష్ట స్థానం సంపాదించుకున్న బొబ్బిలి యుద్ధం గురించి ఎంత చెప్పినా తక్కువే. బొబ్బిలి ఒకప్పటి చారిత్రాత్మతక సంస్థానం. ఫ్రెంచి పాలనలో ఒక సంస్థానంగా వెలుగొందిన బొబ్బిలికి పొరుగు రాజ్యం విజయనగరంతో నిత్య శత్రుత్వం ఉండేది. ఈ శత్రుత్వం ముదిరి బొబ్బిలికీ,  ఫ్రెంచి, విజయనగర సంయుక్త సైన్యానికీ మధ్య మహా యుద్ధానికి దారితీసింది. తాండ్ర పాపారాయుడు ప్రతాపానికి, వీరత్వానికి ఈ యుద్ధం ప్రతీకగా నిలిచింది. ఆ యుద్ధంలో జరిగిన మారణకాండ, బొబ్బిలి వీరుల వీరమరణాలు, బొబ్బిలి స్త్రీల ఆత్మాహుతి.. ఆ యుద్ధంలో జరిగిన మారణకాండ, బొబ్బిలి వెలమ వీరుల, తెలగ వీరుల వీరమరణాలు, బొబ్బిలి స్త్రీల ఆత్మాహుతి మొదలైనవి బొబ్బిలి కథకు ఒక వీరోచిత జానపద గాథ స్థాయి కల్పించాయి. వెలమవంశంలో ఆణిముత్యం వంటి వాడు రంగారావు ప్రభువు అలాంటి రంగారావు ప్రభువు బొబ్బిలి ప్రభువైన రంగారావు బొబ్బిలి పట్టణాన్ని తన నివాసంగా ఏర్పరచుకొని ప్రజలను

కన్నబిడ్డల్లా చూసుకుని పరిపాలిస్తున్నాడు. చరిత్రలో ఈ సంస్థానానికి గొప్ప వీరోచిత స్థానాన్నీ కల్పించాయి. ఈ సంస్థానానికి సంబంధించిన కథలను వీరుల వ్యక్తిత్వాలను ప్రతిబింబించే విధంగా కథలను గేయాలను బుర్రకథకులు చెబుతూ పాడుతారు. నేటికీ ఈ యుద్ధ ఘట్టాలను వివిధ కళారూపాల్లో ప్రదర్శిస్తుంటారు.

అరయ విజయనగర దరిదాపు నందు ... 2
సిరులతో బొబ్బిలి వర్ధిల్లుచుండే ...
అలపాదు సాపదులు తల్పారు కింద
బొబ్బిలి నేలిన పెద్దలెవన్నా ... ఆ ...
నరసారాయుడు మంత్రి సేనాది ధర్మరాయుండే ....
వినరా ఆంధ్ర కుమారవీర వీరగాధ వినరా ...
పండిన పండితుడు అంగరక్షకుడు వెంగళ రాముండూ ....
వినరా ఆంధ్ర కుమారవీర వీరగాధ వినరా ...
తా ... తయ్య ... తరికిట ... తరికిట ... తా ...
గండర గండర పరుషాలు తాంద్ర పాపారావు ...
వినరా ఆంధ్ర కుమారవీర వీరగాధ వినరా...
ఉరుము భయము ఉడుపుడు చేసే ముత్యాల పాపన్న..
వినరా ఆంధ్ర కుమారవీర వీరగాధ వినరా ...
తా ... తయ్య ... తరికిట ... తరికిట ... తా ...
ప్రేమతో నేలుచుండిన ప్రభు రంగరావు తందానా ...
తందాన దేవ తందనానా ...
తందానా ... తందాన రాజ తందనానా ...
అరికిట ... గిరికిట ... తరికిట ... జంతరి ... తరిగిట ... తా ...

## 2.5. భజన పాటలు:

ఉత్తరాంధ్రలో ప్రజలు చేసే భజనలు దేవునిపై ఉన్నటువంటి భక్తి భావాలను ప్రతిబింబిస్తాయి. ఈ ప్రాంతానికి సంబంధించిన ఎన్నో భజన బృందాలు ప్రత్యేకంగా ఒక్కొక్క దేవునికి ఒక్కొక్క మందిరాన్ని ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో భజన కార్యక్రమాలు చేస్తారు. ముఖ్యంగా వారానికి ఒకసారి ఈ భజనలు చేస్తారు. అదేవిధంగా పండగ సమయాల్లో గ్రామ దేవత ఉత్సవాలు మొదలైన సందర్భాల్లో భక్తి భావంతో పూజిస్తారు. ముందుగా ఆదిదేవుడైన ఆ విఘ్నేశ్వరుని పూజిస్తూ ప్రార్థిస్తూ గేయాలను పాడుతారు.

## శ్రీ విఘ్నేశ్వరుని ప్రార్థన

వినాయకుడు సకల దేవతాగణములకు అధిపతి (గణనాయకుడు, గణపతి, గణేశుడు). అన్ని అడ్డంకులు తొలగించువాడు(విఘ్నేశ్వరుడు). అన్నికార్యములకూ, పూజలకూ ప్రథమముగా పూజింపవలసినవాడు. విజయానికీ, చదువులకూ, జ్ఞానానికీ దిక్కైన దేవుడు. భక్తులు భజన ప్రారంభించే ముందుగా ఆ గణపతి దేవుని పాటతో ప్రారంభించిన తరువాత మిగతా దేవుళ్ళను స్మరించుకుంటూ భక్తితో భజనలు చేస్తారు.

పార్వతి తనయ గణపతి దేవా
పరుగున రావయ్యా......
ఓ దేవా పరుగున రావయ్యా....... "పార్వతి తనయ"
ముందుగా నీ నామంబు తలంచెద
ముక్తి మార్గము నోసగుమయ్యా ......
భక్తదయా మా పూజలు గైకొని
నిత్యము మము కాపాడుమయ్యా....... "పార్వతి తనయ"
గజముఖ వదనా గణపతి దేవా
భక్తుల పాలిట దయామయ్యా ......
మూషిక వాహన ముందుగా వేడితిని
దారి చూపుమా వేగమయ్యా....... "పార్వతి తనయ"
ఈశ్వర నందన విఘ్నేశ్వర
నా మొరలాలింపగా రావేమయ్యా......
నీ శరణములే మాకు రక్షణై
మమ్ములను కరుణించుమయ్యా....... "పార్వతి తనయ"

ఈ విధంగా ముందుగా విఘ్నేశ్వరుని ప్రార్థిస్తూ ఎటువంటి ఆటంకాలు ఎదురవకుండా తమ నమ్మకాలు, కోరికలు నెరవేరాలని భక్తులు ప్రార్థిస్తారు. ఈ భజనలో తాళాలు, మృదంగం, హార్మోనియం, చిడతలు, గజ్జెలు లయబద్ధంగా వాయిస్తూ పద్యాలను గేయాలను ఎంతో రాగయుక్తంగా పాడుతూ దేవుళ్ళను ప్రార్థిస్తారు. ఈ భజనలు అపారమైన భక్తి శ్రద్ధలతో చేస్తారు.

## శ్రీ శంకరుని ప్రార్థన

గ్రామంలో ఉండే భజన బృందాలు దేవునిపై భక్తితో ఎన్నో పాటలను పాడుతారు. అలా మహాదేవుడైన ఆ శంకరుని ప్రార్థిస్తూ భక్తితో ఇలా పూజిస్తారు. పిలిచిన వెంటనే కోర్కెలు ప్రసాదించే

దేవుడు భక్తసులబుడు ఆ మహేశ్వరుడు. యోగులకే అందని మహాయోగి. భక్తితో మనసు ఏకాగ్రతతో పూజించినట్లయితే ఎంతటివారికైనా కరుణించి వరాలిచ్చే కరుణాసాగరుడు. ఆ మహేశ్వరుని తలచుకొని ఇలా పాటలు పాడుతారు.

కైలాస దీసుడు కరుణామయుడు
ఆతని సరి దైవము అవనిలో లేదు "కైలాస"
పిలచినంత దరిచేరే సులభుడు
స్తుతులు శరణు కోరి వరమొసగే వరదుడు.....
నోరార వేడినా ... మొరలాలించి.....
లాలించే పాలించే బోలా శంకరుడు "కైలాస"
వేదాలకు దొరకని విభుదుడు
తత్వ వాదాలకు అందని వరదుడు
యోగి బృందాలకు చిక్కని పరమాత్ముడు
భక్తి బంధాలకు లొంగిపోయి బందీ అవుతాడు "కైలాస"
నిఖిలము కొరకై గరళం మింగిన నీలకంఠుడు
మార్కండేయని ఆయువు నోసగే మృత్యుంజయుడు
త్రిపురాసురలను మట్టుపెట్టినా త్రిభువన పోషకుడు
రక్కసులైనా తపములు చేసిన నిదాన వరాలు ఇచ్చే దేవుడు "కైలాస"

కైలాసంలో నివసించే ఆ దేవదేవుడు పరమాత్ముడు భక్తులను ఆదుకునే ఆపద్బాంధవుడు ఆ పరమేశ్వరుడు ప్రార్థించే సమయంలో ఈ రకమైనటువంటి పాటలు పాడుకుంటూ తమ భక్తిని చాటుకుంటారు. ఈ ఉత్తరాంధ్రలో ఎన్నో గేయాలతో భగవంతుని విన్నవిస్తారు. చాలా భజన

కైలాసంబున శివుడు ... తాండవ మాడుచుండెను
చెంతన పార్వతి నాట్యము చేయగ
తుంబుర నారద గానము చేయగ
నందీశ్వరుడే నాట్యము చేయగ
వందిమాగదులు తాళము చేయగ
ముగ్గురు తనయులు ముచ్చట చూడగ
చేతిలో త్రిశూలం దగదగ మెరవగ
తలపై చంద్రుడు తల తల మెరువగ

ఢమ ... ఢమ ... ఢమ ... ఢమ ... డమరుకనాథం

ఘన... ఘన... ఘన... ఘన... ఘంటారావం

శంభో ... అని శంఖారావం.

ఉత్తరాంధ్రలో భక్తి భావంతో పూజించే భక్తులు ఆ దేవదేవుడు శంకరుని మహిమలను కథలుగా అల్లుకుంటూ తన బాధలను విన్నవించుకుంటూ గేయాలను పాడుతారు.

శంభో మహేశ్వరా చంద్ర కళాధర గంగాధర శంకర
కన్నీరు తోడై కడగండ్లపాలై కుమిలేనురా ఈశ్వరా
రావేళ ... రావేళ ... "శంభో"
వెండి కొండపై నుంటివా నీవు హాయిగా ...
మొండి బతుకు మోయుచుంటిరా నేను మొండిగా ...
చంద్రిక పై నుంచి నావుగా ... ఉంచినావుగా ...
సుడిగుండమను నావగా ... "శంభో"
జీవితాన శాంతి లేదురా నందివాహనా ...
ఏ విధాన విన్నవింతురా నాగభూషణా ...
నాపై దయలేకపోయినా ... లేకపోయినా ...
నిరుపేద వాడైతిని ... "శంభో"
ఎన్నాళ్లు భరియింతును ఇన్ని కష్టాలనూ ...
కన్నీరు తుడవాలని నిన్ను ప్రార్థింతునూ ...
దయగల స్వామివి కావరా నన్ను బ్రోవరా ...
దరి చేర్చరా దేవా ... "శంభో"
నీ రాక కోరేనురా నీలకంఠరా ...
నీ పేరు తలచేనురా ప్రేమ మందిరా ...
దానవసంహార రావరా మమ్ము బ్రోవరా ...
ధరలోక రాజేశ్వర ... "శంభో"

## శ్రీ మహా విష్ణువుని ప్రార్థన

ఉత్తరాంధ్రలో ప్రజలు భక్తితో పూజించేటప్పుడు శైవ సంబంధమైన పాటలతో పాటు వైష్ణవ సంబంధమైన పాట పాడుతూ పడుతూ శైవ వైష్ణవ మతసామరస్యాన్ని చాటుకుంటారు. మనసారా ఆ హరినామ స్మరణ చేసినట్లయితే నరకపు బాధలు బాధలు తొలగిపోతాయి. దేవుని పూజించేటప్పుడు

మనసుని ఏకాగ్రతతో ఆ భగవంతుని పట్ల కృతజ్ఞతా భావం కలిగి ఉండాలి. అలాంటప్పుడు మాత్రమే మోక్షం లభిస్తుందని ఈ గేయంలో అద్భుతమైన తాత్వికతను పేర్కొన్నారు.

మనసారా హరి భజన చేయరా
నోరారా నారాయణా అని అనరా "మనసారా"
పాటే రాదనీ ప్రజలు నవుదురని
గాత్ర సుద్ధియే కమ్మగ లేదని
ఈ పాటకు సరియగు తాళము లేదని
భయము బిడియము బాధవలదురా "మనసారా"
పాటయు తాళము గాత్రమున్నను
మనసేలేని స్మరణమే వృధరా
మనసొక చోట తనువొక చోట
ఉన్న మానవుని జన్మమే వృధరా "మనసారా"
యోగులైన మహా యోగులైనా
పూర్వ జన్మ సుకృతమే పోదురా
నారాయణ అని నామస్మరణచే
నరకపు బాధలు తొలగిపోవురా "మనసారా"

పురాణాల ప్రకారం త్రిమూర్తులలో విష్ణువు లోకపాలకుడు, శిష్ట పరిరక్షణ కొరకు, దుష్టశిక్షణ కొరకు ఆయన ఎన్నో అవతారాలలో యుగయుగాన అవతరిస్తాడు. వాటిలో అతిముఖ్యమైన 10 అవతారాలను దశావతారాలు అంటారు. ఆ అవతారలు బట్టి విష్ణువు ఎక్కువ ప్రాచుర్యం పొందాడు. అటువంటి విష్ణువు నామస్మరణ చేయడం ద్వారా మోక్ష ప్రాప్తి లభిస్తుంది అని భావిస్తారు. ఈ విధంగా ఉత్తరాంధ్రలో భక్తితో విష్ణు నామాన్ని స్మరిస్తూ భజనలు చేస్తారు.

కస్తూరి తిలకం నారాయణం
కమలనయనం నారాయణం
గురువాయూర్ పుర నారాయణం
కలియుగ అవతార నారాయణం
గోవింద గోవింద నారాయణం
బదరీ నిలయం నారాయణం
భాగవత ప్రియ నారాయణం
నారద ముని శ్రేష్ట నారాయణం

శ్రీ శేష శయనం నారాయణం
శంకు చక్రధర నారాయణ
గోవింద గోవింద నారాయణం

## 2.6. తప్పెటగుళ్ళు గేయాలు:

తప్పెటగుళ్ళు ఉత్తరాంధ్రలో ఎక్కువగా కనిపించే జానపద కళ. తప్పెట గుళ్ళను ప్రదర్శించేవారు, రంగు బనియన్లు నిక్కరులు ధరించి, కాళ్ళకు బరువైన గజ్జెలు కట్టుకుంటారు. రేకుతో గుండ్రంగా చేసిన తప్పెట గుండ్లను, గుండెకు . కట్టుకొని, గట్టిగా వాయిస్తారు. వారు గుండ్రంగా తిరుగుతూ, లయానుగుణంగా అడుగులు వేస్తూ, ఎగురుతూ తప్పెట వాయిస్తూ పాడతారు. ఈ బృందంలో 20 మంది ఉంటారు. మిగిలిన వారు నాయకుడిలాగే తిరుగుతూ నృత్యం చేస్తారు. నాట్యం చివర, వీరు అద్భుత విన్యాసాలు చేస్తారు. తప్పెట గుళ్ళు కళాకారులు ముందుగా గణపతి ప్రార్ధనను చేసుకుంటూ గణపతి దేవుని ఆదిదేవుడుగా భావించి పాటలు పాడుతారు. వారు పాడే పాటల్లో గణపతి దేవుని యొక్క మహిమలను ప్రతిభ మించే కథలను నిరంతరాయంగా కొనసాగిస్తూ అద్భుతమైన కళా ప్రదర్శన చేస్తారు. ఈ గేయాలను మధ్య మధ్యలో పడుతూ ప్రేక్షకులను అలరించే విధంగా గంతులు వేస్తూ తప్పెటగుళ్ళను వాయిస్తూ అద్భుతమైన కళా ప్రదర్శన చేస్తారు కళాకారులు గణపతి దేవుని యొక్క పాటను ఈ విధంగా ప్రారంభిస్తారు.

సిద్ధి వినాయక శ్రీ గణాధిపా
ఇద్దరి తల్లుల ముద్దు బిడ్డడా
పెద్ద చెవుల వెల్వాన సుబ్రావరా!
పెరుగు పాలు పంచదార లొసెగెద !! !! సిద్ది !!
గద్దె పైన నిన్ను జేర్చముందుగ
ఘన దూర్వాలు పూజ చేసిన
మొద్దులై బుద్ధిమంతులౌనట
యుద్ధరం పరారనన్ను దేవా !! సిద్ది !!
సద్దు సేయకను బ్రోవరాగానను!
సమయమిదేరా సామజవదనా!!
శ్రద్ధతోడ నిను పూజించెడనా
శక్తి కొలది సేవించెద రా రా. !! సిద్ది !!
గద్య పద్య వాదాదులతో నిను
గ్రాగ్రాత్ర,మార భజనులు చేదురా

ఘన, విద్యలొసగి బ్రోవవయా మమ్ము
వేద,విద్య,విఘ్నరాజ, దేవా !! సిద్ది !!
కుడుములుండరాళ్ళు చెరుకు గడలను
అర్పించెద దేవ దేవా
సిద్ధముగానుంటిని నీ సేవకు
శివ, కుమార, భవ, విదుర దేవా !! సిద్ది !!
మద్దెల, తాళంభు భజియించెద
మరువకు జంభుతాసగుము, గౌరి
ముద్దుల కుమార బ్రోవరార నను
నను కరుణించి కాపాడుము దేవా !! సిద్ది !!

అంటూ ఈ విధంగా గణపతి దేవుని యొక్క పాటలను పాడుతూ ఉధృతంగా తప్పట గుళ్లను వాయిస్తూ అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించే విన్యాసాలను చేస్తారు. అదేవిధంగా కృష్ణునికి సంబంధించిన పాటలు రామునికి సంబంధించిన గేయాలు పాడుతారు. ఇందులో కథలు కూడా చెప్పుతూ మధ్య మధ్యలో పాటలను పాడుతూ నృత్య ప్రదర్శన చేస్తారు. వీరు రామాయణ, భారత, భాగవత కథల్ని గేయాలుగా అల్లుకుంటారు. ఇదంతా మౌఖిక సాహిత్యం . వీరు చెంచులక్ష్మి, సారంగధర, లక్ష్మణ మూర్ఛ వంటి పురాణ కథలతో పాటు, తెలుపాట, గాజులోడి పాట, మందులోడి పాట, చుట్టపాట, వంటి జానపదాలు కూడా పాడతారు. కృష్ణుని సంబంధించిన గేయాలను ఎక్కువగా పాడుతూ అతనిపై ఉన్న భక్తి భావాలను చాటుకుంటారు.

పిలిచిన పలుకదవేమిరా శ్రీ కృష్ణ పిలిచిన పలుకదవేమి
పలికిననీదగు భాగ్యముపోవున–పరుడననుచునను
వలచితిపోలేక భక్తుడనని నన్నెరుగజాలవో..
(మి) కలుశ హార కరుణాజధీహర–కమలాపథికంసారి మురారి
పిలిచి పిలిచి నేనలసితిరా హరి– నలధిశయన నీచరణమే శరణము.. పిలిచిన..
పలుకు పలుకులకు బంగరు తునకలు పడునని పలుకవా, దెల్పుమా క్రిష్ణ.. పలుకు..
పలుకుటకింత అలకఏలరా ప్రార్ధించెద నాతో పలుకుమురా..
(మి)పలుకు పలుకులకు తేనయి పరివిధముల పలుకరించర
చిల్లరేతు జనక శ్రీధరా నా పలుకులమె రవినిపలకవేరా..ప..
పలుకుటకింత పంతమ నాపై కవిశయన భక్తవత్సల
కలత ఏజేస్తావురా నామది కరుణా సాగర కమలనయననే..పి..

(మి)తలుకు తలుకుమని బెక్కులకాంతులు–ధగధగాల్మని మెరయుచుండగా.. తల్కు..

పల్కుపల్కులకు చక్తరపోల్చగ తత్సమయి నాతో పార్థశారధి.. పిలిచిన..

నరువజన నాతోమాట్లాడిన నవరత్నంబులు రాలిపోవున

పిలిచి పిలిచి మొరవిడినను పలుకపు

జలజనయన జగద్బాంధవహరి .. పిలిచిన..

(మి)తొలి జన్మంబున గోవసతులునినేల్క బల్కజేయుసుక్రుతమే

పరమమునేజేయు ప్రాప్తముదేవ – కలనైనను నినుమరువనురా.. పిలిచిన పలుకవేమిరా

**పీత గంగయ్య బృందం:** ఉయ్యాల పాట (జోల పాట) ఈ తప్పెటగుళ్ళను ప్రదర్శించే కళాకారులు ముఖ్యంగా యాదవులు వీరు ఆవులను, మేకలను పెంచుతారు. యాదవులు గావు పండుగ చేస్తారు. ఆ పండుగలలో ఉయ్యాల పాటలు జోల పాటలు సువ్వి పాటలు పాడుతారు అవన్నీ తమ కుల దైవమైన శ్రీకృష్ణునికి సంబంధించిన పాటలు భక్తి భావంతో పాడుతారు. ఈ విధంగా కృష్ణ పరమాత్మ చిన్నప్పుడు ఉయ్యాలలో ఉండే సన్నివేశాన్ని తలపించేలా జోల పాటలు పాడుతూ తప్పెటగుళ్ళను ఉధృతంగా వాయిస్తారు.

| | |
|---|---|
| జో_ _ _ జో....ఓ _ _ _లాలీ | "ఉయ్యాల" |
| తండ్రి నీకు జోల పాటలు పాడి | "ఉయ్యాల" |
| తండ్రి జోల పాటలు పాడి | "ఉయ్యాల" |
| తండ్రి నీకు ఊపుతున్నారు | "జో.. జో.." |
| తండ్రి ఈ కొండ కా కొండకు | "ఉయ్యాల" |
| రాగి దూలా వేసి | "ఉయ్యాల" |
| ముప్పై సేరులుదీ | "ఉయ్యాల" |
| మువ్వల గజ్జలు | "ఉయ్యాల" |
| పాతిక సేరులుదీ. | "ఉయ్యాల" |
| నీ పాట ఉయ్యాల | "ఉయ్యాల" |
| పన్నెండు సేర్లుదీ | "ఉయ్యాల" |
| పక్కటా ఉయ్యాలా | "ఉయ్యాల" |
| పన్నెండు మంది నీకు | "ఉయ్యాల" |
| పట్టు మహా దేవతలు | "ఉయ్యాల" |
| పట్టన ఒకదాది | "ఉయ్యాల" |
| నీకు ఊపనా ఒకదాది | "ఉయ్యాల" |

| | |
|---|---|
| సేదొయ్య ఒకదాది | "ఉయ్యాల" |
| నీకు సెప్పనా ఒకదాది | "ఉయ్యాల" |
| పక్కన ఒకదాది | "ఉయ్యాల" |
| నీకు ఊపనా ఒకదాది | "ఉయ్యాల" |
| నీల పోసును ఒకదాది | "ఉయ్యాల" |
| నీవు నిద్రించునొకదాది | "ఉయ్యాల" |
| జొలపట్టనొకదాది | "ఉయ్యాల" |
| నీవు పవళించునొకదాది | "ఉయ్యాల" |
| జో_ _ _ జో....ఓ _ _ _లాలీ | "జో.. జో" |
| జో_ _ _ జో.... ఓలాలీ ఉయ్యాల | "జో.. జో" |
| నీకు జోలపాటలు పాడి. | "జో.. జో" |

## 2.7. జముకుల పాటలు(బోనెల పాటలు):

### చారిత్రక వీర గాథ గేయం(గున్నమ్మ కథ)

ఉత్తరాంధ్రలో అత్యంత ప్రాముఖ్యత చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు గున్నమ్మ. స్వాతంత్ర్యానికి పూర్వం పన్నుల భారంతో పేద ప్రజలను పీడించే బ్రిటిష్ ప్రభుత్వ అధికారులను వీరోచితంగా ఎదిరించి ప్రాణాలు కోల్పోయిన శ్రామిక స్త్రీ గున్నమ్మ. ఇది చారిత్రక కథా గేయము. దీన్ని జముకుల వాళ్లు జమ్మికు అనే వాయిద్యాన్ని వాయిస్తూ కథాగేయంగా ఉత్తరాంధ్రలో వినిపిస్తారు. చారిత్రక కథా గేయాల్లో నాయిక లేదా నాయకుని పుట్టుక అద్భుతంగా వీర పరాక్రమాలు ధైర్య సాహసాలు ప్రతిబింబించేలా అద్భుతమైన కథనంతో కూడినటువంటి గేయాలు ఉంటాయి. ఈ విధంగా ఉత్తరాంధ్రలో సుబ్బారావు పాణిగ్రాహి ప్రజల కష్టాలపై ఎన్నో పాటలను, గేయాలను, నాటికలను రాశాడు. 'ఎరుపంటే కొందరికి భయం, భయం, పసిపిల్లలు వారికంటే నయం నయం', 'కష్టజీవులం మేము కమ్యూనిస్టులం అవునన్నా కాదన్నా అదే ఇష్టులం' వంటి ఆయన రాసిన పాటలు శాశ్వతంగా నిలిచి పోయాయి.

రాజాపురంలో.. గున్నమ్మ భీముడి గడియలో పుట్టిందని కథా గాయకుడు తెలపడంలో గున్నమ్మ భీముని వంటి ధైర్య సాహసాలను కల్గిన వీర వనితగా ఇందులో వ్యక్తమవుతున్నది. సాసుబిల్లి గున్నమ్మ బలవంతురాలు కాబట్టి పోలీసు జవాన్లను కొట్టి తన్ని వారు పారి పోయేటట్టు చేసింది. మెజిస్ట్రేటు, కలక్టరు మెడలను విరగ్గొడుతుంది. గంటలో పన్నెండు వందల పోలీసులను హతమారుస్తుంది.

చారిత్రక కథా గేయాల్లో వీరులు సామాన్యంగా శత్రువు దొంగచాటుగా చంపడం వల్లనే చని పోతుంటారు. గున్నమ్మను కూడ చెట్టుచాటు నుండి పోలీసు జవాను తుపాకీతో కాల్చి చంపేస్తాడు. చనిపోయిన గున్నమ్మ శత్రువు చేత దండాలను పెట్టించుకుంటుంది. పోలీసు జవాను "దండం దండమమ్మ సాసుబిల్లి గున్నమ్మ యే తల్లి గున్నదోలె సాసుబిల్లి గున్నమ్మ" గున్నమ్మను కీర్తించడం వల్ల ఆమె ఎంతటి వీర ధీర గుణాలు కలిగిన వీర వనితో తెలుస్తున్నాయి.

మందస, బాలిగాము..... రాజపురం గ్రామంబున
భీముడి గడియలేమొ..... పుట్టెనమ్మ గున్నమ్మ
అమాస గడియాన.. జల్మామైనాదోయ్ సాసుబిల్లి గున్నమ్మ "మందస"
ముగ్గురు తోడనేమొ.. గున్నమేమొ బుట్టింది.
ముద్దూ.. ముచ్చటగా.. పెరిగి పెద్దయ్యిందీ "సాసుబిల్లి గున్నమ్మ"

బలే మంచి దాయోయి.. సాసుబిల్లి గున్నమ్మ
యేదూరి రైతులకీ.. మీటింగు పెట్టిందీ
నాయిన ! అన్నలార.. మీరు తమ్ముళాల మీరు
మంత్రకోట అడివిలోకి.. బళ్ళనేమొ పుయ్యండి
బండి ఆశీల్లేకండ.. కలప కొట్టుకొద్దాము. "మందస"

కుండ కూళ్ళేమొ.... బండికేమొ గట్టారు.
కొరడా.. కత్తులేమొ.. బండికయిన గట్టారో
మందస, బాలిగాము.. రాజపురము గ్రామాల
నూరు బళ్ళూ... మరి .. బయలెల్లీ నాయెను.. "మందస"

ఎర్రని కళ్ళకేమొ.. ఎక్కినాది కోపము
నీలం కళ్ళకేమొ... నిండినాది కోపము.
వీర వనిత గున్నమ్మ. "మందస"
దమ్మిడి జీతగాడ... దగుల్బాజి జమాను
నా ఆడదాని – దెబ్బ.. యిది జూసుకోరా.. అని
బండి మొత్తా నుండి.. చెంగున దూకింది.
బండిలో బడితే.. చర్రున దీసింది.
ఎర్ర పాగాలను.. ఎగర గొట్టింది.
ఎనక దిరిగిన జమాన్లో... ఎంటా దగిలిందీ. "సాసుబిల్లి గున్నమ్మ"

అడ్డెడు 'వ్రగుండ – అడ్డుకొంగు వేసింది.
బడితే కర్రనేమొ.. చేతను బట్టింది.
శబ్ద భేది లాగ – ఎల్లుచున్నాది.
కడాలు కదలాడగా – మంత్రకోట తోటకేమో "సాసుబిల్లి గున్నమ్మ"

అడ్డెడు ఎర్రగుండు.. చేతల దీసిందీ
కలకటేరు.. మేస్త్రీటటు.. కళ్ళల్లో జల్లిందీ
మేస్త్రీటు... కలకటేరు.. మెడలిరగ్గొట్టింది
గంటల జంపినాది.. కంపెనీ జమానోల్ని "సాసుబిల్లి గున్నమ్మ"

జోడుగుళ్ళ తుపాకీతో.. గున్నమ్మని పేల్చాడా..
ఏడు నిలువు లెగిరి.. చనిపోయినాదమ్మ
"దండు దండమమ్మ సాసుబిల్లి గున్నమ్మ
యే తల్లి గన్నదోలె సాసుబిల్లి గున్నమ్మ" "మందస"

ఈ విధంగా సాసుబిల్లి గున్నమ్మ బ్రిటిష్ వాళ్ళను ఎదుర్కొనే పద్ధతి, ధైర్య సాహసాలను జమకు కధకులు కథాగానం చేస్తారు. జమకు కధకులు ఎన్నో పౌరాణిక సంబంధమైన కథలను గేయాలను కథా గేయాలను వినిపిస్తూ ఉండేవారు. రాను రాను కళారూపాలపై ఉన్నటువంటి ఆసక్తి తగ్గిపోయి ఆర్థిక భారానికి తట్టుకోలేక ఇతర వృత్తుల్లోకి వెళ్తున్నారు.

ఉత్తరాంధ్రలో జముకుల కథకులు ఎన్నో పౌరాణిక సంబంధమైన కథలను గేయాలను పడుతూ వైవిధ్యభరితమైనటువంటి జముకు చప్పుడులను లయబద్ధంగా వాగిస్తారు. సాధారణంగా వీళ్ళు రామి రంజము, భారతము, అలియా దేవి కథ, రెక్కల రంభ, బాణాసుర, ధర్మాంగదర, భృగు చక్రవర్తి, బట్టి విక్రమార్కుడు, విరాట కథ, జానపద కథలు, జానపద గేయాలు వీర గాధ గేయాలు వస్త్రాభరణం, సైంధవవనం, పరశురామిత్రము, గయోపాఖ్యానం, బాలనాగమ్మ, నల చరిత్ర, సౌభరి కల్యాణం, బాలనాగు, కాంబోజి, సత్య హరిశ్చంద్రుడు, జలగన కథ, అలియా కథ, మొదలైన మూడు వందల కథలు చెబుతూ మధ్య మధ్యలో ప్రేక్షకులను రంజింపచేయడానికి జానపద కథ గేయాలను, గేయాలను పాడుతారు. ఆ విధంగా ఈ జానపద గేయాలలో ఎక్కువగా ఊత పదాలు మాండలిక పదాలు ద్వంద అర్థాలను ఇచ్చే పదాలు ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ప్రాంతీయంగా ఉన్న పదజాలంపై వీరికి ఎక్కువగా పట్టుకుంటుంది. కాబట్టి వాటికి బాణీలను కట్టి గేయాలను అల్లుకుంటూ పాడుతారు. ఈ క్రింది గేయంలో ద్వంద్వ అర్థమిచ్చే పదసంపద తో కూడిన ఉత పదాలు మాండలిక పదాలను చేర్చారు. ఇది ప్రాంతీయ పద అస్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

తరి నానా ... తరి నానా... తరి నానా ... తానే తందనతానా ... 2

ఓ .... ఓ ఓ.... ఓ.... ఓ ఓ.... ఓ ఓ....

లింగ్ ... లింగ్ ... లింగిడి  లింగిడి కింద జంగిడి జంగిడి కింద కుసుమూరి

కసుమూరిపూడి ఆనందా ... మల్లెపూలు జల్లంగా

శ్రీకాకుళం దండలు హిర మండలం పొత్తులు

నా యమ్మా ... నా తల్లీ ...  నా చీరా ... నా  ఓ బాలికా ... 2

తరి నానా ... తరి నానా... తరి నానా ... తానే తందనతానా ... 2

గౌరమ్మ వచ్చి పాట పాడితే రాసమ్మ వచ్చి నాట్యమాడితే

నారాయణ బాబు స్టెప్పులేస్తే   కోటిగాడు వచ్చి  మొగ్గలాడితే

పాట మొత్తం ఊపే తరవై పూసిన మొగ్గె పోతా

బాట్రి కళ్ళు టైకుటుయ్ గబిగుబి సుర్రు సుర్రు ...

తరి నానా ... తరి నానా... తరి నానా ... తానే తందనతానా ... 2

నీ బుట్టమ్మ బుట్టి నీ నిమ్మపల్లి బుట్టి నీ స్టేషన్ పల్లి పెట్టి

నీ జంగిని పల్లి పెట్టి నా ఎండు పులుసులు పెట్టి

తెమ్మన్నాలే నీకు వెన్నెలకు చూసుకొని రమ్మన్నానే ... 2

ఓ బుట్టయ్య బుట్టి నీ నిమ్మపల్లి బుట్టి నీ స్టేషన్ పల్లి పెట్టి

నీ జంగిడి పల్లి పెట్టి నీ ఎండు పులుసులు పెట్టి

తెచ్చున్నానే నీకు వెన్నెలకు చూసుకుని వచ్చున్నానే ... 2

మా ఇంటి దళితగాడు పది రూపాయలు కొంగుతాడు ... 2

సన్నీకాయల కెళ్ళి జారిపడ్డడా నా మొయిల కల్లా

ఇంటిలో తీసుకెళ్లి దంచి కొట్టాడా నా  పీడే కల్లా...

మా బావల కోళ్లు కొట్టి కళ్ళు కాయలు పక్కన బెట్టి

పోలీసు బండి చూసి పొయ్యిలో వంపాడా నా సొరకాయ సొరాకల్లా

వాడు కోడి మాంసం తిన్నాడా జైలుతాపులు తిన్నాడా...

తరినా ... ఆ ... ఆ .... ఆ ఆ ... ఆ ... ఆఆ ...

తరి నానా ... తరి నానా... తరి నానా ... తానే తందనతానా ... 2

## 2.8. చెంచు నాటకం గేయాలు:

## శ్రీ కృష్ణుడు చెంచులక్ష్మీల సంవాదం

ఆధునిక కాలంలో చెంచులు వేసినటువంటి నాటకాలను చూసి వాటిని అనుకరిస్తూ ఉత్తరాంధ్రలో చెంచు నాటకాలను మొదలుపెట్టారు. ఈ నాటకాలను ముఖ్యంగా గ్రామ దేవతలు ఉత్సవాలు పండగలు మొదలైన సందర్భాలలో ప్రదర్శిస్తారు. ఇందులో శ్రీకృష్ణుడు, సత్యభామ, రుక్మిణి, చెంచులక్ష్మి, అర్జునుడు, భీముడు మొదలైన పాత్రల వేషధారణ చేస్తారు. పాటలను స్వయంగా తయారు చేసుకుంటూ వాటికి అనుగుణంగా హార్మోనియం మృదంగం, తాళాలు, వాయిస్తూ శ్రీకృష్ణుడు చెంచులక్ష్మీ ల మధ్య ఉన్నటువంటి సంవాదం ఇలా మొదలవుతుంది. శ్రీ కృష్ణ భగవానుడు రాధా రుక్మిణి కన్నా చక్కని దాయి అని ఆ చెంచులక్ష్మిని ఎన్నుకున్నాడు. ఆ చెంచులక్ష్మి కలిసిన తర్వాత ఆ కృష్ణ భగవానుడు ఎలా పిలుస్తున్నాడు అంటే

"శ్రీ కృష్ణుడు" అవతారమెత్తానే చెంచీతా
ఈ అవనిలోకి వచ్చానే నందానా

"శ్రీ కృష్ణుడు" స్త్రీలలో అవనిలో చెంచీతా
భామ సిల్క్ తో రాలేదే నందానా

"శ్రీ కృష్ణుడు" నాకు భార్యలు లేరానీ చెంచీతా
నేను భామతో రాలేదే నందానా

"శ్రీ కృష్ణుడు" సొగసైన చక్కనిది చెంచీతా
భామ సత్యభామ ఉన్నదే నందానా

"శ్రీ కృష్ణుడు" నాకు రూపుకీ చక్కనిది చెంచీతా
భామ రుక్మిణి ఉన్నదే నందానా

"శ్రీ కృష్ణుడు" పదహారు వేలేమో చెంచీతా
నాకు గోపికాస్త్రీలేమో నందానా

"శ్రీ కృష్ణుడు" అష్టభార్యలేమో చెంచీతా
నా ఇష్టముగానున్నారే నందానా

"శ్రీ కృష్ణుడు" వారికంటేనే నీవు చెంచీతా
భామ చక్కని దానివే నందానా

"శ్రీ కృష్ణుడు" ఈ గోడలో మనము చెంచీతా
భామ కలిసి మెలిసి ఉందామే నందానా

"శ్రీ కృష్ణుడు" బహు పుణ్యముంటుందే చెంచీతా
భామ నన్ను పెండ్లాడవే నందానా

చెంచు లక్ష్మీ నాటకంలో అలంకరణ అనేది ఎంతో అద్భుతంగానూ ఉంటుంది. ఈ ప్రదర్శన చేసేటప్పుడు నాట్యం చేస్తూ వివిధ హావభావాలతో చెంచులక్ష్మి శ్రీకృష్ణుల మధ్య జరుగుతున్నటువంటి సంభాషణలు, సంవాదాలు, చిలిపి చేష్టలు, ప్రజల నాకట్టుకునేలా ఉంటాయి. శ్రీకృష్ణుడు మాట్లాడిన మాటలకు చేసినటువంటి చేష్టలకు చెంచులక్ష్మి అంగీకరించకుండా, శ్రీకృష్ణుని మాటలను లెక్కచేయకుండా వ్యతిరేకిస్తూ చెప్పినటువంటి సన్నివేశాలు మాటలు ఈ గేయంలో ప్రతిబింబిస్తాయి.

"చెంచు లక్ష్మీ" పోవోయి పోవోయి కృష్ణుడా...
నీకు పొద్దేలా పోదురా నా స్వామీ
"చెంచు లక్ష్మీ" మా అన్నలోస్తారు కృష్ణుడా ...
నీకు అమ్ములో వేసెదరు నా స్వామీ...2
నీకు అరకులో వేసెదరు నా స్వామీ
"శ్రీ కృష్ణుడు" ఇంకొన్నాలయితే చెంచీతా
భామ నాకు భామలు కారే నందానా
"శ్రీ కృష్ణుడు" మేనరికం ఉన్నదే చెంచీతా
మనకి చుట్టారికం ఉన్నదే నందానా
"శ్రీ కృష్ణుడు" మేనత్త కూతురువే చెంచీతా
నీవు కొత్త మేనకోడలివి నందానా

## 2.9. రోకటి పాటలు:

రోకటి పాటలు, దంపుడు పాటలు అని జానపద గీతాలు ఎన్నో ఎప్పటినుంచో ఉన్నాయి. శ్రమ తెలియకుండా రకరకాల పాటలు పాడుకునేవారు. పిండి కొట్టడానికి వాడే పెద్ద రోకలి. దీనికి పిండి కొట్టే చివరన రోకలి పగిలి పోకుండా ఉండేందుకు ఒక ఇనుప ఉంగరము ఉంటుంది. దీన్ని 'పొన్ను' అంటారు. అరిసెలు, అప్పాలు(పిండి వంటలు) వండడానికి కావలసిన బియ్యం పిండి రోకలితో దంచడమనేది శ్రమతో కూడుకున్న పని. ఆ శ్రమను మర్చిపోవడానికి, పిండి కొట్టేటపుడు ముఖ్యంగా జొన్నలను సోళ్ళు, సద్దలు, కొర్రలు, సామలు, గంటెలు, మినుములు, సోళ్ళు పిండిగా కొట్టి వండుకుని తినేవారు. అది ఒక్కరోజు పని కాదు, ప్రతిరోజు కొనసాగించే పని. అలసట తీరడానికి పాడుకునే పాటలను 'రోకటి పాటలు' అంటారు. జానపద సాహిత్యములో ఇవి కూడా భాగము. ఈ పాటలు రోకటి పోటుకి(దెబ్బకు) అనుగుణముగా ఉంటాయి. ఉత్తరాంధ్రలో నంది పండుగలు గంగాదేవి పండుగ నిర్వహించేటప్పుడు ఈ రకంగా రోకటి పాటలు పాడుతారు. గంగాదేవి పండుగలలో కొట్నాల పాటలు, సువ్వి పాటలు (రోకటి పాటలు) పాడతారు.

సువ్వీ సువన్నలాలా

సువన్నలాలా

మా సువన్న ఓ లాలా మాయన్నలాల "సువ్వీ"

మా సువ్వీ కొట్నాలు సూటిగుండాలా "సువ్వీ"

మా సువ్వన్న సప్పలో రోటి దంపుల్లు "సువ్వీ"

నా పసుపు కుంకాలేమో "సువ్వీ"

పల్లేరానేసి ఉంచాలి "సువ్వీ"

ఎండలో ఉండేటి మండపది రోలు "సువ్వీ"

మా తీగ మండపు రోలు తిన్నంగా తిప్పి "సువ్వీ"

కలికి మండపు రోలు కమ్మంగా తిప్పి "సువ్వీ"

కొలిసే ఏదుం పోలు "సువ్వీ"

కొట్నాలు పోసి "సువ్వీ"

వీధి వీధి భామలకు పిలవనెళ్ళారా "సువ్వీ"

నా బాదము చెట్టుండేది బాపనోరిదీ "సువ్వీ"

మా బాపనోల పణితక్క "సువ్వీ"

పాడొక్క పాట "సువ్వీ"

నీ పాట పాడితే పోలు దంగాల "సువ్వీ"

నేనేమని పాటలు నేను పాడుతాను "సువ్వీ"

చిన్న చిన్న గావంచాలు జారుకడదమా "సువ్వీ"

సింకి సింకి కాగితాలు చేత పడుదామా "సువ్వీ"

రోకలిని ఉపయోగించి దంచడం ఒక కళ అని చెప్పవచ్చు. మనకు అవసరమయిన వస్తువును ఎంత బలంగా దంచితే మనకు అత్యంత ఉపయోగకరంగా ఉంటుందో అంతమేరకు దంచడం ఒక కళ. అలాగే ఒకే రోటిలో ఒకే సమయంలో ఒకరి తరువాత ఒకరు ఒకరి రోకలితో మరొకరి రోకలి తగలకుండా వేగంగా అత్యంత నైపుణ్యంగా ఇద్దరు లేదా ముగ్గురు దంచుతారు. కొన్ని శుభకార్యాలకు ప్రారంభ సూచికగా ఉదాహరణకు పెళ్ళి పనులు ప్రారంభించేటప్పుడు రోకళ్లకు పసుపు దారంతో రక్షా బంధనం కట్టి బేసి సంఖ్య వచ్చేలా ఐదు నుంచి పదకొండు మంది ముత్తైదువుల చేత పసుపు కొమ్ములను దంచి పసుపు తయారు చేస్తారు. **ఉత్తరాంధ్రలో** పెళ్లిలోనూ పండుగల్లోనూ కొట్నాలు దంచినప్పుడు పాడే పాటలు కొట్నం పాటలు (రామ కోట్నం పాటలు) ఇలా పాడతారు.

సువ్వి సువ్వి లాలీ

సువ్వి భద్ర పురుష లాలీ
సువ్వి శ్రీముఖలింగ చంద్ర రాగది "సువ్వి"
ఒకరి ఒకరి కొప్పులోన జానెడేసి మల్లెలమ్మ "సువ్వి"
సదాశివని కొప్పులోన సన్నజాజిలు "సువ్వి"
మంచినీళ్లు భావి వద్ద అంచులేని ఆకుపుట్టి "సువ్వి"
ఇంచి ఇంచి పిలవరమ్మా పేరంటాలని. "సువ్వి"
రావి కర్ర పెట్టి లోన సేరు చుక్క బొట్టు పెట్టి "సువ్వి"
సేరు చుక్క బొట్టు పెట్టి – సెంగు విరిసి "సువ్వి"
దంచరమ్మా సెలియాలిద్దరూ "సువ్వి"
గట్టుమీద పండినాయి గోవర్ధన ధాన్యాలు "సువ్వి"
కలిసిమెలిసి దంచుదాం రామకోట్నాం "సువ్వి"
చెరువులో ఉన్న పండినాయి సేమంతి కీలు కొన్ని "సువ్వి"
కలిసిమెలిసి దంచుదాము కాంతలందరూ "సువ్వి"
మేనమామ తెచ్చినాడు మేలైన పట్టు చీర "సువ్వి"
సెంగు విరిసి కట్టండమ్మా సెలియాలిద్దరు "సువ్వి"

సంక్రాంతి పండుగ వస్తుందంటే చాలు దాదాపు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఇంటిలో రోకలి చప్పుడు వినిపిస్తుంది. ముఖ్యంగా హిందువులు తమ పెద్ద పండగ అయిన సంక్రాంతికి రోకలితో బియ్యాన్ని దంచి అరిసెలు లేక అప్పాలు తయారు చేస్తారు. ఈ విధంగా ఉత్తరాంధ్రలో ఇటువంటి పురాతన కాలం నుంచి సాంప్రదాయం వస్తూ ఉంది. ఈ గేయాలు మన సంస్కృతికి నిదర్శనాలు.

## 2.10. ఉడుపులు, నాట్లు పాటలు:

అచ్చమైన జానపదం అనేది పల్లెల్లో ఉండే జానపదులు పనిచేసేటప్పుడు శ్రమను కష్టాన్ని మరిచిపోవడం కోసం సరదాగా పాటలు పాడుకోవడం చేస్తారు. ఈ జానపద గేయాల్లో అచ్చమైన తెలుగు పల్లె పదాలు వెల్లువిరుస్తాయి. ఈ జానపదంలో పల్లె ప్రజల ఆచార సాంప్రదాయాలు సంస్కృతిలో ఇమిడి ఉంటాయి. పల్లె బతుకులో పాటకు ప్రధానమైన స్థానం ఉంది. అక్కడ అడుగడుగునా పాట వినిపిస్తుంది. వ్యవసాయ కార్యక్రమంలో పాట లేనిదే ఏ పనీ జరగదు. నాట్లకు పాట, కలుపులకు పాట, పంట కోతలకు పాట, బాయి నుంచి నీరు తోడేందుకు పాట! పశువులను కాస్తూ పని లేకుండా ఉండే కాపరి నోట పాట వినిపిస్తుంది. ఇక సాయంత్రం గూటికి చేరిన తరువాత గుక్కెడు గంజి తాగి బయటపడితే నడి రాత్రి వరకు నానా రకాల పాటలతో, కథలతో కాలక్షేపం జరగవలసిందే.

నోమినో మిన్నాల తుమ్మెదల బాల
నో మిన్నాల బాల తుమ్మెదల. "నోమినో"

కాకర చెట్టు కింద కంచాలు తోముతుంటే కాకరాకు వచ్చే కాలు మీద పడితే కాలు వాసిపోయింది కానీ పక్కనున్నటువంటి తన మొగుడు పట్టించుకోలేదు అని పల్లె ప్రజలు సరదాగా పాడుకొనే అద్భుతమైన గేయం.

కాకరా చెట్టు కాడ తుమ్మెదల
నేను కంచాలే తోముతుంటే తుమ్మెదల
ఆ ముండా కాకరాకు తుమ్మెదల
నా కాలు మీద పడ్డాది తుమ్మెదల
నా కాలోసి పోయిందే తుమ్మెదల
నేనేమీ సేతునమ్మ తుమ్మెదల
వాడు పక్కనే ఉన్నాడు తుమ్మెదల
వాడు పట్టించుకోలేదు తుమ్మెదల "నోమినో"

అలాగే బీర చెట్టు కింద బిందెలు తోముతుంటే బీరాకు వచ్చి బీపి మీద పడితే బీపోసి పోయింది. అని పక్కనున్న తన భర్త పట్టించుకోలేదు అనే వర్ణన ఇందులో ఉంది.

బీర చెట్టు కింద తుమ్మెదల
అమ్మ బిందిలే తోముతుంటే తుమ్మెదల
ఆ ముండా బీరాకు తుమ్మెదల
నా వీపు మీద పడ్డాది తుమ్మెదల
నా బిపోసి పోయిందే తుమ్మెదల
వాడు పక్కనే ఉన్నాడు తుమ్మెదల
వాడు పట్టించుకోలేదు తుమ్మెదల "నోమినో"

అలాగే చిక్కుడు చెట్టు కింద చిక్కులు విప్పుతుంటే చిక్కుడాకు వచ్చి చంప మీద పడితే చంపోసిపోయింది. కానీ పక్కనున్న తన మొగుడు పట్టించుకోలేదు అని భార్యాభర్తలు మధ్య ఉన్నటువంటి గొడవలను మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ గేయంలో ఈ గేయంలో పేర్కొన్నారు.

అమ్మ చిక్కుడూ చెట్టు కింద తుమ్మెదల
నే చిక్కులే విప్పుతుంటే తుమ్మెదల
ఆ ముండా చిక్కుడాకు తుమ్మెదల
నా చెంప మీద పడ్డాది తుమ్మెదల

నా చెంపోసి పోయిందే తుమ్మీదల

నేనేమీ సేతునమ్మ తుమ్మీదల

వాడు పక్కనే ఉన్నాడు తుమ్మీదల

వాడు పట్టించుకోలేదు తుమ్మీదల "నోమినో"

భార్యాభర్తల మధ్య ఉండే చమత్కారాన్ని ఉత్తరాంధ్రలోని జానపద గేయ రచయిత చేసే అద్భుత వర్ణన ఇది. పల్లెల్లో నివసించే జానపదలు తమ కష్టాన్ని మరిచిపోవడం కోసం వ్యవసాయ పనుల్లో నిమగ్నమై వివిధ రకాలైన పాటలను అల్లుకుంటారు. ఇందులో పల్లె పదాలు వ్యవసాయ సంబంధ పదాలు ఉంటాయి. సాధారణంగా పొలాల్లో వరి నాట్లు వేసేటప్పుడు కోత కోసేటప్పుడు కుప్పనూర్చేటప్పుడు ఎన్నో కూని రాగాలు చేస్తారు. ఇవి జానపదుల హృదయాల్లో నుంచి వచ్చినటువంటి స్పందనలు. ఇలా ఈ జానపద గేయంలో పల్లెటూరి అందమైన అమ్మాయి గురించి పొలాల్లో గట్లపై వయ్యారాన్ని వలకబోస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. ఆమె అందానికి ముగ్ధుడై పరవసుడైన జానపదడు తన మనసును తనకు అర్పించిన విధానం ఈ గేయంలో గేయ రచయిత అద్భుత వర్ణన చేశాడు. అట్లాగే పక్షులు పల్లెల్లో పంట చేతికి అందే సమయానికి ఆ ధాన్య గింజలను తినడం రైతుకు కష్టాన్ని మిగల్చడం సంఘటనల గురించి ఈ గేయంలో పేర్కొనబడింది.

ఉల్లి మల్లి చీర కట్టి

గజ్జలు పైకెగసి కట్టి

ఉన్న వాళ్ళ పిల్లా వచ్చేరా

ఓరోరి మామ...

ఉత్తరాంధ్ర పిల్లా నచ్చేరా "ఉల్లి మల్లి"

ఉన్నవాళ్ళ పిల్లానని

కన్ను గీటి రమ్మంటావు

కన్ను సైగలు నాకూ వద్దుర

ఓరోరి మామ...

కన్నెపిల్ల సొగసూ గిచ్చకుర "ఉల్లి మల్లి"

పచ్చ పచ్చ గట్టున నేను

పచ్చ గడ్డి కోస్తూ ఉంటే

పడుచుగుండె నారీ పోయెరా

ఓరోరి మామ...

పడుచు గుండె జారీ పోయెరా "ఉల్లి మల్లి"

దట్టమైన గంటి గుడ్లో
గంటి ఎన్నో ఏరుతుంటే
పాడుముండా చిలకా వచ్చేరా
ఓరోరి మామ...
ఉండనేమో ఉడిసీ పోయెరా "ఉల్లి మల్లి"

గ్రామీణ ప్రాంతాల్లో పనికి, పాటకు అవినాభావ సంబంధమున్నది. పనితోటే పాట పుట్టింది. పనిలోని అలసటను తెలియకుండా పాటతో మమేకమై పనిచేయడం వలన పని సులువుగా జరగడమే కాకుండా వేగవంతమవుతుంది. ఇలా పని, పాట సమ్మిళతమైన గ్రామీణ శ్రమ జీవులకు జీవనంలో భాగమయ్యింది. నాటు వేసేటప్పుడు పాట, కోత కోసేటప్పుడు పాట ఇలా మహిళలు పనిలోని శ్రమను తేలికపాటి చేసుకుంటూ తమ వ్యవసాయ పనులను కొనసాగించేవారు.

## 2.11. వినోద పాటలు:

జానపదులు పల్లెల్లో తమ ఉత్సాహాన్ని సంతోషాలను వ్యక్తం చేసేందుకు గేయ రూపంలో పాడుకునేటటువంటి వినోద భరితమైన పాటలు ఎంతో ఆనందాలను వ్యక్తం చేస్తాయి. ఈ గేయాలు ప్రజల హృదయాల్లో ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని మానసిక ప్రశాంతతను కలగజేస్తాయి. జానపద పాటల్లో వర్ణన ఎంతో అద్భుతంగా ఉంటుంది. పల్లెల్లో నివసించే పల్లె ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ పనుల్లో నిమగ్నమవుతూ తమ కష్టాన్ని మర్చిపోవడానికి సంతోషాన్ని వ్యక్తపరడం కోసం ఒక గేయ రూపంలో వైయక్తికంగానూ సామూహికంగానూ ఏర్పాటు చేసుకున్న కవిత్వ వర్ణనలు ఎంతో విశేషంగా ప్రజలను ఆకట్టుకుంటాయి.

హాయి హాయిరే కోడిపిల్లా... కియామన్నదే కోడి పిల్లా
హాయి హాయిరే కోడిపిల్లా... కియామన్నదే కోడి పిల్లా "హాయి హాయిరే"

కోసిన కోడి తీసి ఈక తోక తీస్తుంటే ... 2
ఈ ఊరు కల్లాలు... ఆ ఊరు కల్లాలు...
మన ఊరు కల్లాలు... ఎగరొచ్చాననదదే కోడి పిల్లా "హాయి హాయిరే"

కిందన మంటెట్టి చిటపట కాలిస్తే ...2
సాకలి పొయ్యి కాడ... సాకలి పొయ్యి కాడ...
సాకలి పొయ్యి కాడ... సలిమంటాలన్నదే కోడిపిల్లా.. "హాయి హాయిరే"

దుక్క మీదెట్టి నేను దబా దబా కొడుతుంటే ... 2
ఈ ఊరు దిబ్బలన్నీ ...ఆ ఊరు దిబ్బలన్ని....
మన ఊరి దిబ్బలన్ని... ఎగురొచ్చాననదే కోడిపిల్లా... "హాయి హాయిరే"

పొయ్యి కింద పిడక పెట్టి పోయి మీద ఉడుకుతుంటే ... 2
ఈ ఊరు పొలిమేర... ఆ ఊరు పొలిమేర...
మన ఊరు పొలిమేర... ఎగిరొచ్చాననదే కోడి పిల్లా ... "హాయి హాయిరే"

పోపుల పెట్టి తీసి మసాలా వేస్తుంటే...2
ఆ వచ్చిన వాసనలకు... ఆ వచ్చిన వాసనలకు...
ఆ వచ్చిన వాసనలకు... నోరూరిస్తుంటదే కోడి పిల్లా "హాయి హాయిరే"

ఉడికిన ముక్క తీసి ఊదుకొని తింటుంటే...2
నోట్లోకెళ్లాక... నోట్లోకెళ్లాక...
నోట్లోకెళ్లాక... మాట్లాడానన్నదే కోడిపిల్లా... "హాయి హాయిరే"

ఈ విధంగా పల్లెల్లో పెంచుకునే ఒక కోడిపిల్ల గురించి ఈ విధంగా వర్ణించారు. కోసిన కోడి ఈక తీస్తుంటే అన్ని ఊర్లలో సేద్యానికి సంబంధించిన ప్రదేశాల్లో ఉన్న కోడి ఎగిరి వచ్చింది. అలాగే కోడిని మంట పెట్టి కాల్చుతుంటే సాకలి పొయ్యి దగ్గర చలిమంట అని అంటున్నది. దుక్క మీద పెట్టి కొడుతుంటే అన్ని దిబ్బల మీద నుండి ఎగిరి వచ్చాను అన్నది. పొయ్యిలో పిడకెట్టి పొయ్యి మీద కోడి మాంసం ఉడుకుతుంటే అన్ని పొలిమేరల నుండి ఎగురొచ్చినట్లు కోడి పిల్ల అద్భుత వినోద భరితమైన వర్ణన ఈ జానపద గేయంలో వ్యక్తం అవుతుంది.

భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాన్ని భర్త యొక్క చేష్టలను ఈ గేయంలో వర్ణించారు. ఇందులో భర్త గొప్పతనాన్ని అతను చేసే ఘన కార్యాలను ఇందులో పేర్కొన్నారు. అప్ప అంటే అక్క అని కళింగ మాండలికంలో పేర్కొంటారు. అదే విధంగా ఈ ప్రాంతానికి సంబంధించిన వంటకం తోపను సోడి (రాగి) పిండితో తయారుచేసే వంటకాన్ని పరిచయం చేశారు. జానపదలు ఈ రకమైన గేయాలను వినోదం కోసం పద ప్రయోగాలు చేస్తారు.

ఉంగరాల జుట్టోడో ఓలె గాదప్పా
వాడు ఊరికంత మొనగోడే గాదప్పా .. .. .. 1
అలాంటి నా మొగుడో ఓలె గాదప్పా
వాడు రంగమెల్లిపోయాడే గాదప్పా .. .. .. 1

ఆ పావల పరకిచ్చో ఓలె గాదప్పా
వాడు పచ్చి సేప కొన్నాడే గాదప్పా.. .. .. 1
సేపంత నాకిచ్చో ఓలె గాదప్పా
వాడు ముళ్ళు సప్పరించాడే  గాదప్పా.. .. .. 1

ఉంగరాల జుట్టోడో ఓలె గాదప్పా
వాడు ఊరికంత మొనగోడే గాదప్పా.. .. ..1
అలాంటి నా మొగుడో ఓలె గాదప్పా
వాడు రంగమెల్లిపోయాడే గాదప్పా.. .. .. 1

పలాస స్టేషన్లో ఓలే గాదప్పా
వాడు పనస పండు కోన్నాడే గాదప్పా.. .. .. 1
పండంత నాకిచ్చో ఓలే గాదప్పా
వాడు పొట్టు సప్పరించాడే  గాదప్పా.. .. .. 1

ఉంగరాల జుట్టోడో ఓలె గాదప్పా
వాడు ఊరికంత మొనగోడే గాదప్పా.. .. .. 1
అలాంటి నా మొగుడో ఓలె గాదప్పా
వాడు రంగమెల్లిపోయాడే గాదప్పా.. .. .. 1

మూడడ్ల సోడి పిండో ఓలె గాదప్పా
వాడు తోపరేసుకొచ్చాడే గాదప్పా.. .. .. 1
తోపంత నాకిచ్చో ఓలె గాదప్పా
వాడు మండ సప్పరించాడే  గాదప్పా.. .. .. 1

అలాంటి నా మొగుడో ఓలె గాదప్పా
వాడు రంగమెల్లిపోయాడే గాదప్పా.. .. .. 1
వాడు రంగమెల్లిపోయాడే గాదప్పా.. .. .. 2

## 2.12. ఇతర జానపద గేయాలు:

రైతుల జీవితాలను ప్రతిబింబించే అంశాలను ఈ గేయంలో పేర్కొన్నారు. ఎండల్లో వానల్లో కష్టపడిన రైతుకు ఫలితం లేని పరిస్థితిని భూస్వాముల దౌర్జన్యాలను మొదలైనవి పేర్కొన్నారు. రోజు

కూలీ  చేసుకొని జీవనం సాగించే రైతులు సేద్యం చేస్తూ పంట పండించిన ధాన్యాన్ని చేతికి అందకుండా భూస్వాముల పట్టాలు చూపించి దోచేయడం రైతుల పొట్టను కొట్టడం చాలా బాధాకరమైన విషయం. మొక్కలు నాటి సేద్యం చేసి తర్వాత మధ్యలో వచ్చి భూస్వామితో పాటుగా బుగతోల్లు పంట మొత్తాన్ని లారీలకు ఎక్కించి దోచుకోవడం విషాదకరమైనది. చేతికి అందిన పంటను దోచేయడానికి మధ్యలో వీడెవడు అని నిలదీస్తూ వాడబ్బోచ్చిన దుబ్బు కోసి దుల్ల గోట్టు అని ఎదిరించడం సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబిస్తున్నది. ఈ గేయంలో వంగపండు ప్రసాదరావు గారు చేసిన సామాజిక చైతన్యం, మన హక్కులను మనం కాపాడుకోవాలి అనే విషయాన్ని తెలియజేస్తుంది.

కూడు గుడ్డాలేని కూలీనాలోలు
కొట్టాలి కొడవలికి  కక్కులు
అయ్యా ... కొయ్యాలి .. వరిసేని దుబ్బులు
అమ్మా ... ఎయ్యాలి వో...! వో...!  కూప్పలు "కూడు"

పంటకు వచ్చిందీ కామందుల సేని
ఆకలమంటలనీ ఏడుపింకమాని
ఎన్నుగింజ కడదాక కష్టమంతా  నాదేనని
ఎదురొచ్చే దొరబాబును
గుండె గుద్ది తోయ్యరండి "కూడు"

మడిలో బెడ్డలన్ని మన నెత్తురు గడ్డలూ
పండిన పంటలన్ని మన సెమటా సుక్కలూ
పట్టా పట్టుకొని  మన పొట్టలు కొట్టాలని
లారీ దెచ్చిన బాబుకు తూరుపు సూపించరండి "కూడు"

ఎండలో కష్టించిన కండలు నీవన్నా!
వానలో వొరు పెక్కిన వొల్లు నీదిరన్నా!
నీ కష్టం నీ ఇష్టం నీతోనే యీ లోకం
నీకు లేని తిండిగింజ కూకోని వున్నోడికేల "కూడు"

దుక్కులు దున్నేది నీవే  రైతన్నా
మొక్కలు నాటేసి నీవే ఓరోరన్నా
మద్దెములో యీడెవడు భూసోమట! బుగతోడట

ఆడబొౘ్చిన జెబ్బలిరిసి దుబ్బుకోసి దుల్లగొట్టు "కూడు"

ఉత్తరాంధ్రకు వందనాలను తెలియజేస్తూ సంప్రదాయంగా వస్తున్న ఈ ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు అంతరించిపోవడం ప్రాచీన సాంప్రదాయం కనుమరుగవడం ఈ గేయంలో ప్రధాన విషయం. దీనిని గ్రామ దేవత అయిన పోలేరమ్మను వేడుకుంటూ మరలా ఈ కళారూపాలకు పునర్వైభవం వచ్చేలా చేయమని గ్రామదేవతను విన్నవించుకుంటున్నారు. చెక్కభజనలు భామలు ఆడిన బాగోతాలు ఆడకుండా చేసి ఇంగ్లీషు దొరలు వాళ్ళ కళలను పోషించారు.

వందనమే ఉత్తరాంధ్ర మీకు వందనమే.. 2
బలే బలే తల్లివు బంగారమ్మవు
ఊరు పండుగల పోలేరమ్మవు
పేరేదైనా అందరి అమ్మవు "వందనమే"
ఊరు పండుగలు పెళ్లి సందడులు
అక్కల పాటలు చెక్కభజనలు
దిమిక్కిట తక దిమిక్కిట
తక దిమిక్కిట దిమిక్కిట దిమిక్కిట
అరె భామలు ఆడిన బాగోతాలు 2
ఆడకుండ చేసి ఈ జానపద కళలు
ఇంటిలో పెట్టారే ఇంగ్లీషు దొరల కళలు
కళ్ళు తెరిచి కాపాడవే తల్లీ
పల్లెటూరు మా పాటలు మళ్ళీ "వందనమే"

పూర్వకాలం పెద్దలు ఆడే గానుగాటలు, సిడతా బిల్లల కొమ్మలాటలు తాతలు తండ్రులు ఆడినటువంటి సిర్రాటాటలు పక్కనపెట్టి మూడు తెడ్డుల కర్రలాటను ప్రవేశపెట్టారు. ఇది ఆధునికంలో వచ్చినటువంటి క్రికెట్ ఆటను ప్రతిబింబిస్తుంది. నేటి కాలంలో యువత క్రికెట్ ఆటకు ఎంత ప్రాధాన్యమిస్తున్నారంటే క్రికెట్ మొదలైనప్పటి నుంచి చివరి దాకా ఉత్కంఠ భరితముగా టెలివిజన్లను వీక్షిస్తున్నారు. వంగపండు ప్రసాదరావు గారు ఈ గేయంలో ఆధునికంగా వచ్చిన ఆటలు మన దేశీయ జానపద ఆటలను కోలుకోలేని దెబ్బతీసినట్లు పేర్కొన్నారు.

నీ గానుగాటలు ఈలయాటలు
సిడతా బిల్లల కొమ్మాలాటలు
దిమిక్కిట తక దిమిక్కిట
తక దిమిక్కిట దిమిక్కిట దిమిక్కిట

మీ తాతల తండ్రుల సిర్రాటాటలు
మూల బెట్టినారే ఈ తెడ్డుబిల్లలాటా
ముందలెట్టినారే ఆ మూడు కొయ్యలాట
మన జాతి ఆటలు జాతర చేసి
విజయనగరము పేరు నిలపవే "వందనమే"

ఈ విధంగా ఉత్తరాంధ్ర జానపద గేయాలు ఎన్నో ఉన్నపటికీ బయట సమాజానికి తెలియకుండా ఎక్కడో మారుమూల గ్రామాలకు కొన్ని మాత్రమే అంకితమవుతున్నాయి. ఈ జానపద కళలను, గేయాలను ఆదరించేవారు కరువయ్యారు. మన సంస్కృతి సంప్రదాయాలను మనం కాపాడుకోవాలి. ప్రభుత్వాలు తగిన విధంగా జాగ్రత్తలు తీసుకొని మన సంస్కృతికి పునర్వైభవాన్ని తీసుకువచ్చే జానపద కళలను, గేయాలను కాపాడాలి. వీటిపై మరింత పరిశోధనలు జరిగి ఈ పల్లె సంస్కృతిని, కళారూపాలను కాపాడవలసిన బాధ్యత మనందరిది.

## 2.13. అంతరించిపోతున్న కళారూపాలపై గేయాలు

ప్రాచీన కాలంలో పల్లె ప్రజలు ఎంతో వైభవంగా తమ పండగలను సాంప్రదాయ పద్ధతిలో అవలంబించేవారు. ఇది పల్లె వాతావరణన్ని ప్రతిబింబించే విధంగా ఉండేది. నేడు ఈ యొక్క సాంప్రదాయం కనుమరుగవుతూ ఉన్నది. పల్లెలో నివసించే ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళుతూ గ్రామంలో ఉన్న సాంప్రదాయాలను పద్ధతులను అవలంబించడంలో వెనుకంజ వేస్తున్నారు. సంక్రాంతి సమయంలో గొబ్బెమ్మలను పిడకల దండలను తయారుచేసి ముగ్గులు వేసి ఎంతో అందంగా అలంకరించేవాళ్లు. నేడు అటువంటి సాంప్రదాయం కనుమరుగుతో ఉండడం ఈ పాటలో తెలియజేస్తున్నది. జానపద కళారూపం ఉద్దేశించి ఇక జానపదుడు పల్లె వాతావరణన్ని అక్కడున్న సాంప్రదాయాన్ని కళారూపాలను అంతరించే స్థితిలో ఉన్నట్లుగా ఈ గేయంలో ఆవేదన వ్యక్తం చేశాడు.

పల్లె మారిందీ ... నా పల్లె మారిందీ ... 2
నన్ను చూసి మౌనంగా రోదన చేసిందీ ...
నా పల్లె మారిందీ...
పల్లె మారింది ... నా పల్లె మారింది...

గమ్మత్తుగ ఆడేటి తోలుబొమ్మలాట
పిట్టకథల నవ్వించే హరిదాసుల పాట ... 2
జాలరి భాగోతాలు జముకుల పాట ... ఆ ...
కొమ్మదాసరి పాట తప్పెటగుళ్ళాట ... 2

ఏది ... ఏది ... సాంప్రదాయమేది ... 2

పల్లెనొదలి ఎక్కడికో వలస పోయిందా... 2

పల్లె మారిందీ ... నా పల్లె మారిందీ ... 2

భోగి పండగ నాటి పిడక దండలేవీ ...

సంక్రాంతిన గొబ్బిళ్ళ ముంగిళ్ళు ఏవీ ... 2

దసరాన చేపట్టిన విల్లంబులేవీ ... 2

రాములోరి గుడి కాడ రచ్చబండలేవీ... 2

ఏదీ ... ఏదీ ... పల్లెదనం ఏదీ..

ఏదీ ... ఏదీ ... పల్లెదనం ఏదీ ...

ప్రగతి రథం కింద పడి నలిగిపోయిందా...2

పల్లె మారిందీ ... నా పల్లె మారిందీ ... 2

చింత చెట్టు కింద కాయలేరుకోవడాలు

మావిళ్ళను దొంగలాగ దోచుకోవడాలు ... 2

మొగలిరేకుల తోడ జడలు కుట్టడాలు ... 2

పట్టు పావడాలు కట్టి పరుగెత్తడాలు ... 2

ఏదీ ... ఏదీ ... ఆ పసితనం ఏదీ ... 2

పుస్తకాల బరువుల్లో మునిగిపోయిందా ... 2

పల్లె మారిందీ ... నా పల్లె మారిందీ ... 2

నన్ను చూసి మౌనంగా రోదన చేసిందీ ...

నా పల్లె మారిందీ ...

పల్లె మారిందీ ... నా పల్లె మారిందీ ... 2

ప్రాచీన కాలంలో సాంప్రదాయబద్ధమైన గంగిరెద్దుల వారి ప్రదర్శన ఎంత అద్భుతంగా ఉండేది. ఆ రోజుల్లో గంగిరెద్దును అందంగా అలంకరించి ప్రదర్శన చేయించేవారు. ఈ గంగిరెద్దును ఇంటిలో కుటుంబ సభ్యునిగా ఎంగిరెద్దుల వాళ్లు చూసుకునేవారు. అప్పట్లో ఈ పశుసంపదను పట్ల ఎంతో గౌరవంగా చూసేవారు. నేడు ఆధునికంగా వచ్చినటువంటి యంత్ర పరికరాలు పశువుల స్థానాన్ని ఆక్రమించాయి. వ్యవసాయ పనుల్లో కూడా ఈ యంత్రాలను ఉపయోగించడం వల్ల పశు సంపద నిర్వీర్యం అయిపోతున్నది.

అట్లాగే కాలానుగుణంగా వచ్చిన పరిణామాలు దేహ సౌందర్యానికి ఉపయోగించే పౌడర్లు రావడం వివిధ మార్పులు చోటు చేసుకోవడం వంటి కొత్త ఆధునిక రంగాల వైపు సమాజం పయనించడం వల్ల ప్రపంచంలో మార్పులు ఏ విధంగా వస్తున్నాయో గంగిరెద్దుల వారి పాటలో ఈ విధంగా గేయ రచయిత తన ఆవేదనను వ్యక్తం చేస్తున్నాడు.

దేవా! ఏమి జరుగుతున్నది
అహు! ఏం చిత్రంగనున్నదీ ప్రపంచం
పసుపు రాత తగ్గిపోయి
పౌడరు రాతలెక్కువాయె
వాననూనె లెక్కువాత ప్రపంచం
ఆహా! ఏమి జరుగున్నది ప్రపంచం
చిన్న చిన్న మీసాలయ
చీపురు పుల్ల మీసాలయ
ముక్కు మీద మూడెంటులాయె ప్రపంచం
ఆహా! ఏమి జరుగున్నది ప్రపంచం

ఇలా ప్రపంచం రోజురోజుకు ఎలా మార్పు చెందుతుందో పాట ద్వారా వినిపించారు. తరతరాలుగా సాంప్రదాయపదంగా వస్తున్నటువంటి కళారూపాలు అంతరించే స్థితికి చేరుకోవడం మన దౌర్భాగ్యం. ఈ జానపద కళారూపాలను కాపాడే వారు లేరు. గ్రామాల్లో ఈ కళాకారులను ఎంతో గౌరవంగా చూసేవారు. వారిని ఇంటికి పిలిచి మరీ ఏదైనా కథలు గాని పాటలు గాని చెప్పించుకుని వారికి తగిన మర్యాదలు చేసేవారు. నేడు ఈ కళాకారుల స్థితిగతులు మారిపోయాయి. అలనాటి ఆచార, సంప్రదాయాల కలబోతతో కూడిన కాలములో పల్లెల్లో తమ మానసిక ప్రశాంతత కోసం జానపద కళారూపాలు ఎంతగానో తోడ్పడేవి. రాజుల కాలములోనూ ఇలాంటి కళలను ప్రోత్సహించి పల్లె జీవనాన్ని మరింత ప్రశాంతమయం చేసేవారు. ముఖ్యంగా పండుగల సమయంలో రాత్రి వేళల యందు ప్రదర్శించే వారు. గ్రామ పెద్దలు, ప్రముఖులు, కుల పెద్దలు తమకు తోచిన సాయం చేసి వారికి జీవనోపాధి కల్పించేవారు. ఈ కళారూపాలను అదరించేవారు కరువయ్యారు. సినిమా రంగం ప్రవేశంతో ఉన్న కళారూపాలు అన్నీ అంతరించే స్థితికి చేరుకున్నాయి. "అన్నమో రామచంద్రా" అంటూ కడుపు నింపుకోవడానికి యాచన చేస్తున్నారు.

జనాలనోట వచ్చిన పదమే (జానపదులు చెల్లీ) ... 2
జనాలకే ఆనందమునిచ్చే పల్లె పాటలమ్మా చెల్లె

రాత్రి వేళలో వేషం కట్టి, గజ్జలు కట్టి, దీపం పెట్టి,

రాగాలతోనూ, రక్తి కట్టించిన, రెక్కల రంభ
కథలను చెప్పే బోనెలాటలేవీ చెల్లె "జనాలనోట"
మన ఉత్తరాంధ్ర కళలన్నీ (కాలమయ్యనమ్మా చెల్లె) ... 2

దాసరి వాళ్లు సితార పట్టి తోంబురనాథం శృతి సరిచేసి
రెండు పక్కల ఇద్దరు కూర్చుని దక్కిలపైన దరువులు వేసి
రామాయణమును రక్తిగ పాడిన దాసరి పాటేది చెల్లె
ఏమైపోయాయి చెల్లె కారణమేమమ్మా చెల్లె
మన ఉత్తరాంధ్ర కలలన్నీ కాలమయ్యెనమ్మా చెల్లె
"జనాలనోట"

ఎరుకల వారి గిలక పాటలు జంగం పాడిన జంగం పాటలు
తోలుబొమ్మలు బాగోతాలు గొల్లలు ఆడిన అంజాటాలు
గొల్లల పాడిన జోల పాటలు తప్పెటగుళ్ళ తో పల్లె పాటలు
ఏమైపోయాయి చెల్లె కారణమేమమ్మా చెల్లె "జనాలనోట"

మాస్టీలు వారి ముష్టి యుద్ధము ఈటీ వారి కడమీదట
చెంచుల వారి చెంచు నాటకం గంటసాయిబు దీవెన పాటలు
ఎట్లు మాయ మాయె చెల్లె కారణమేమమ్మా చెల్లె "జనాలనోట"

పల్లెల్లో వేసే వీధి నాటకం, సాయిబు తెచ్చిన కోతి ఆటలు,
గొల్లలు పాడిన గొల్ల పాటలు, గంగా గౌరీ సవతి పాటలు,
జాలరి వారి జాలరి పాటలు కాపులు ఆడే కోలాటాలు
పాములోడు ఆడు పాములాటలు పిట్టలదొర చెప్పే అతిశయోక్తులు
ఏమైపోయాయి చెల్లె కారణమేమమ్మా చెల్లె "జనాలనోట"

చెక్కభజనలు సిత్తలి ఆటలు వీర ముష్టోల్ల వీరంగాలు
కోయి వాళ్ళ కోయి డాన్సులు సవరలు ఆడిన సక్కటి ఆటలు
గారడి వాడు కనికట్టాటలు జాతరలోనా జోగి పాటలు
ఏమైపోయాయి చెల్లె కారణమేమమ్మా చెల్లె "జనాలనోట"

మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చినటువంటి మార్పులు ఈ ఉత్తరాంధ్ర కళారూపాలపై ఎనలేని ప్రభావాన్ని చూపాయి. ఈ విధంగా ఉత్తరాంధ్ర వైభవాన్ని చాటి చెప్పే ఎన్నో కళారూపాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. "జనాల నోట వచ్చిన ఆ జనపదమే జానపదులు చెల్లీ" అని చెబుతూ ఈ కళారూపాలు "ఏమైపోయాయి చెల్లె" అని అంటూ "కారణమేమమ్మా చెల్లె" అని చెప్పుతూ గేయ రచయిత ఉత్తరాంధ్రలో ఉన్నటువంటి కళారూపాలు అంతరించే స్థితికి చేరుకోవడం గురించి ఉత్తరాంధ్రకు చెందిన భగవాన్ దాస్ మాస్టర్ గారు ఇలా వర్ణించారు. ఉత్తరాంధ్రలో ఉన్నటువంటి జానపద కళారూపాలు అంతరించిపోయే స్థితికి చేరుకోవడాన్ని ఈ పాటలో వ్యక్తమవుతున్నది. సహజత్వముతో ఉట్టిపడే ఈ జానపద కళారూపాలను, గేయాలను, కథా గేయాలను సంరక్షించుకోవాలి. మానవ జీవనయానాన్ని మరింతగా మెరుగుపరిచే జానపద కళలు శ్రమ జీవన సౌందర్యాన్ని పెంపొందించే విధంగా చేయాలి.

# అధ్యాయం 3

# జానపద కళారూపాల పుట్టుపూర్వోత్తరాలు - వికాసం

# అధ్యాయం 3

# జానపద కళారూపాల పుట్టుపూర్వోత్తరాలు – వికాసం

## 3.1. పరిచయం:

జానపద జీవితంలో జానపద కళలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఈ జానపద కళలు మనిషి జీవితంలో ఆనందాన్ని విజ్ఞానాన్ని అందిస్తాయి. ఒక జాతి సంస్కృతి నిర్మాణంలో జానపద కళారూపాలు వాటి స్వరూప స్వభావాలు  ఎంతగానో ప్రభావాన్ని చూపుతాయి. మానవ జాతి పరిణామంలో మూడు దశలున్నాయి. అవి ఆటవిక, జానపద, నాగరిక దశలు. ఈ మూడు దశలు నృత్య కళలోను కన్పిస్తాయి. గిరిజన లేక ఆటవిక నృత్యం, జానపద నృత్యం. నాగరిక లేక శాస్త్రీయ నృత్యం అనేవి మూడు దశలు. గిరిజన నృత్యం జానపద నృత్యానికి మూలం అయినట్లు జానపద నృత్యం శాస్త్రీయ నృత్యానికి మూలమనడం సందేహం లేదు.

Folk Arts అనే ఇంగ్లీషు పదానికి సమానార్థకంగా తెలుగులో జానపద కళలు అనే మాటను ఉపయోగిస్తున్నాం. Folk అంటే జానపదులు. Arts అంటే కళలు. మనిషి ప్రకృతిని చూచి దానికి అనుకరణగా కళను రూపొందించాడు. మనిషి ప్రకృతిని చూచి అనేక విషయాలు నేర్చుకున్నాడు. జానపదులు అంటే గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారని వారు ఆడుకునే ఆటలు, పాడుకునే పాటలు, ఇతర కళలను జానపద కళలు అని పిలుస్తారు. అలనాటి ఆచార, సంప్రదాయాల కలబోతతో కూడిన కాలములో పల్లెల్లో తమ మానసిక ప్రశాంతత కోసం జానపద కళారూపాలు ఎంతగానో తోడ్పడేవి. రాజుల కాలములోనూ ఇలాంటి కళలను ప్రోత్సహించి పల్లె జీవనాన్ని మరింత ప్రశాంతమయం చేసే వారు. ముఖ్యంగా పండుగల సమయంలో రాత్రి వేళల యందు ప్రదర్శించే వారు. గ్రామ పెద్దలు, ప్రముఖులు, కుల పెద్దలు తమకు తోచిన సాయం చేసి వారికి జీవనోపాధి కల్పించేవారు. అంతేకాకుండా ఆయా గ్రామంలోని వారందరూ ఆ కుటుంబానికి బాసటగా నిలిచే అవకాశముంటుంది. తద్వారా సమిష్టితత్వము బలపడి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది.

జానపదం.. సాంస్కృతిక కళలు.. కళారూపాలు.. మానవశ్రమ నుంచి పుట్టి పురుడు పోసుకున్నవి. జానపదం అంటే పల్లె, పల్లె జనాలు పాడుకునే పాటలు, ఆటలు, నృత్యాలు, సామెతలు ఈ కోవకిందికే వస్తాయి. మానవ వికాసానికి, శ్రమ నుంచి సేద తీరడానికి కళలను శ్రమజీవులే సృష్టించుకున్నారు. ప్రకృతిలో విహరిస్తూ పాటలు అల్లిన కష్టజీవులు, చెట్టు నుంచి పుట్టవరకు అన్నింటినీ తమ జానపదంతో శిల్పంగా తీర్చిదిద్దారు. ఇదే సమయంలో అనేక ప్రాంతాలకు బతుకు తెరువు కోసం సంచరించిన సంచార జాతులు అనేక ప్రాంతాల సంస్కృతులను, సాంప్రదాయాలను పాటలుగా అల్లి సమాజానికి జ్ఞానాన్ని అందించారు. తెలుగు ప్రజల వికాసంలో జానపద కళలు భాగమయ్యాయి. ఇవి జనజీవన సంస్కృతికి

ప్రతిబింబాలుగా నిలుస్తున్నాయి. జీవన సమరంలో సుఖదు:ఖాలను బాణీలుగా చేసుకొని వెలసిన జానపదాలు విజ్ఞాన, వినోదాలను పంచేవిగా ఉన్నాయి.

## 3.2. జానపద కళలు – వికాసం:

జానపద కళల ఆవిర్భావం ఎప్పుడు జరిగింది దానికి ప్రధానమైనటువంటి ప్రాచీన ఆధారాలు గురించి ప్రస్తావించినట్లయితే ఆదిమ మానవుడి కాలం నుండి తరతరాలుగా వస్తున్నటువంటి చారిత్రక విషయాలను పరిశీలించవలసి ఉంటుంది. ఆదిమ మానవుడు అడవుల్లో జంతువులు పక్షులు వన్యప్రాణుల మధ్య జీవనం సాగిస్తూ ఉండేవాడు. కొన్ని సాదు జంతువులను పక్షులను మచ్చిక చేసుకొని వాటిని వివిధ వ్యవసాయ పనుల కోసం ఆహార లభ్యత కోసం ఉపయోగించుకున్నాడు. కొన్ని క్రూర మృగాలను వేటాడడం ద్వారా ఆహార ఉత్పత్తిని చేసుకున్నాడు. సాధారంగా ఒకే రకానికి చెందిన ఈ పక్షులు గాని జంతువులు గాని వాటి ఆహారం కోసం సామూహికంగా కలిసి ఉంటూ వేటను కొనసాగించేవి. వాటిని అనుకరిస్తూ ఆదిమ మానవుడు సామూహిక జీవనానికి అలవాటుపడి జంతువులను పక్షులను వేటాడడం మొదలైనవి నేర్చుకున్నాడు. జంతువులు నివాసం ఉండే గృహాలను తన నివాస స్థలాలుగా ఏర్పరచుకున్నాడు. మానవునికి అనుకరణ శక్తి ఎక్కువ. ప్రకృతిలో పశువులు, పక్షులు మొదలైన ప్రాణులు తమ జాతి ప్రాణులతో కలిసి సామూహికంగా జీవించేవి. ఆదిమ మానవుడు వాటిని చూచి సామూహిక జీవనాన్ని అలవాటు చేసుకున్నాడు. ప్రకృతికి సంబంధించిన ఎండ, వాన, గాలి, చలి, పశుపక్ష్యాదులు మొదలైన వాటి చేత కలిగిన భయభ్రాంతులు వలన ఆది మానవుడు తనకు తెలియని ఏదో ఒక అతీతశక్తి తనను ఆదరిస్తుందని తలచాడు. ఆ అతీతశక్తినే దేవుడుగా సృష్టించుకొని ఆరాధించడం మొదలు పెట్టాడు. సూర్యునివేడి మనుష్యులను వెంటాడేది. వాటి నుండి రక్షణ పొందడానికి సూర్యునికి సూర్యనమస్కారాలు చేయడం, ఎండకు మగ్గిన వారికి వర్షం రావడం ద్వారా వారు జల దేవతకు మొక్కడం ఇలా ఎవరికి వారు వారి ఇష్ట దైవాలైన సూర్యుని, జల దేవతలను ఆరాధించేవారు. ఇంకా కొంతమంది ప్రకృతి దేవతలను ఆరాధించడం ఇలా సంతోషాన్ని పట్టలేక ఎవరి నోటికి వచ్చిన పదాలను వారు సమకూర్చుకోనేవారు. కష్టం నష్టం బాధ సుఖం మొదలైనవి వచ్చినప్పుడు వారు వివిధ రూపాల్లో వాటిని వ్యక్తపరిచేవారు. ఆ విధంగా భాషాభివృద్ధికి పునాదులు పడింది. తద్వారా వారు గొంతెత్తి పాడేవారు. ఆనందంతో అవయవాలు చలించాయి. ఆడ, మగ అనే తేడాలు లేకుండా ఆనందంతో వారి నోట పాటనారంభించారు. ఇలా అటవిక జాతి మూలాల నుంచి జానపద కళకు పునాది వేయడం జరిగింది. . ఆ ఆరాధనా సమయంలో భక్తితో పాటలు పాడుకున్నాడు. ఆనంద పారవశ్యంతో ఒళ్ళు తెలియక గంతులు వేశాడు. భగవదనుగ్రహం కోసం ఎన్నో ఆరాధన క్రమాల్ని అనుసరించాడు. ఆ ఆరాధనే ఒక కళగా, వృత్తిగా స్వీకరించాడు. ఈ కళ మన సంస్కృతిలో భాగంగా స్థిరపడింది. తర్వాత వినోద విజ్ఞానం కోసం ఈ జానపద కళలు తమ స్వరూప స్వభావాలను మార్చుకుంటూ నూతనత్వాన్ని

పొందుతూ ఉంది. సమాజంలో వచ్చినటువంటి సాంఘికాభివృద్ధి మానవ మేధో వికాసం ఈ కళాభివృద్ధికి దోహదం చేశాయి. తెలుగులో జానపద కళారూపాలపై ఎంతోమంది విశ్వవిద్యాలయం స్థాయిలో పరిశోధనలు జరుపుతున్నారు. తెలుగులో మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి "తెలుగువారి జానపద కళారూపాలు" అనే గ్రంధాన్ని రచించారు. ఇందులో ఎన్నో తెలుగు జనపద కళారూపాల గురించి వివరించారు. ఇది ఎంతో ప్రామాణికమైన జానపద కళారూపాలకు సంబంధించిన గ్రంథం.

## 3.3. ఉత్తారాంధ్ర జిల్లాలలో జానపద కళారూపాల ఆవశ్యకత

ఒక దేశ సాంస్కృతిక జీవనంలో ఆహ్లాదకరమైన పరిమళాలను వెదజల్లే సహజమైన కళలే జానపద కళలు. జానపద కళలు చాలావరకు మౌలికంగా వినోదాత్మకాలు. కొన్ని విజ్ఞానాత్మకాలు. మరికొన్ని విజ్ఞాన వినోదాత్మకాలు. ఇటువంటి ఉత్తరాంధ్ర జానపద కళలు ఎన్నో విభిన్న రూపాలలో కనిపిస్తున్నాయి. అవి తోలు బొమ్మలాట, యక్షగానం, హరికథ, బుర్రకథ, వీధినాటకం, పగటి వేషాలు, వాలకం, రుంజలు, భజనలు, దొమ్మరాట, గంగిరెద్దులవాళ్ళు, పులివేషాలు, మోడీఆట, పిట్టలదొర, గారడీలు, కర్రసాము, కత్తి సాము కోలాటం మొదలైనవి.

దీనిలో ముఖ్యంగా తోలుబొమ్మలాట, వీధినాటకం, హరికథ, బుర్రకథ, తప్పెటగుళ్ళు, దింసా నృత్యం, వాలకం, బుడబుక్కలవారు వంటివి. ప్రజల మీద ప్రత్యక్ష ప్రభావం కలిగినటువంటివి. జానపదులకు అస్తిత్వాన్నిచ్చి వారి ఉనికిని శాశ్వతం చేసిన కళారూపాలు ఇవే. అవసరమైన సందర్భాల్లో విజ్ఞాన వినోదాత్మక శైలితో సమాజాన్ని చైతన్యవంతం చేయగలిగిన శక్తివంతమైన సాధనాలు ఈ ఉత్తరాంధ్ర జానపద కళలు. మనదైనందిన జీవితంలో జానపద కళాప్రదర్శనల ద్వారా ఎంత ఆనందాన్ని అనుభవిస్తున్నాం. జానపదకళల ద్వారా ప్రజాచైతన్యం, సామాజిక ప్రయోజనం కలిగించే సాధనాలుగా మరియు వివిధ రంగాలు తమ ప్రయోజనాల కనుగుణమైన ప్రచార సాధనంగా ఉపయోగించుకుంటున్నాయి.

శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నంలో కూడా చాలా వరకు గిరిజనులు ఉన్నారు. ఇతర కులాల వారు తో పాటు వారు కూడా వివిధ నృత్యాలు వివిధ కళారూపాలను ప్రదర్శిస్తూ ఉంటారు. గ్రామాల్లో వివిధ కులాల వారు వారికి తోచిన విధంగా వేషాలు వేసి వారి కళలను ప్రదర్శిస్తూ పాటలు పాడుతూ జనాలను ఆనందింపజేసేవారు. అలానే ఆయా కులాల వారు తమ జీవిత కాలంలో పాటించే ఆచారాలు సంస్కృతులు వలన అప్పుడే కొన్ని కళారూపాలు ఏర్పడ్డాయి. వారు పెళ్ళిళ్ళలో పండుగ దినాలలో సంవత్సరం పొడవునా వారికి ఆనందం వేసినప్పుడల్లా కొన్ని ప్రదర్శనలు చేసుకునేవారు. అవి నేటికీ కొన్ని కొన్ని కనుమరుగైపోయాయి. ఈ ఆధునిక కాలంలో ప్రజానీకం సాంకేతికకు అలవాటుపడి ఎంతో ప్రాచీన కళారూపాలను చూడడం ప్రదర్శించడం మర్చిపోతున్నారు. మన ప్రాచీన కాలం నుండి

వచ్చిన ఈ కళలను కళారూపాలను వదులుకోవడం ప్రజలకు ఒకరకంగా లోటుగా భావించాలి. దక్షిణ భారతదేశంలోని ఉత్తరాంధ్రలోని జానపద కళారూపాలను మంచి ప్రాచుర్యం ఉంది. కళాకారులు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ తమ కళారూపాలను ప్రదర్శిస్తూ కీర్తించబడ్డారు. ఉత్తరాంధ్ర ప్రసిద్ధ జానపద కళారూపాలైన తప్పెటగుళ్ళు, బుర్రకథ, హరికథ, గంగిరెద్దులవారు, జంగాల కథలు బుడబుక్కలవాళ్లు, పకీరు వేషం పిట్టలదొర, తుపాకి రాముడు, పులి వేషాలు, ఉద్దానం పగటి వేషాలు లాంటి కళారూపాలు ఉత్తరాంధ్ర జిల్లా ప్రజలను గాక ఇతర ప్రాంతాల వారిని కూడా ఎంతో ఆకర్షించాయి. ఒక ప్రాంత ఆచారాలు సంప్రదాయాలు కట్టుబాట్లు ఆ ప్రాంత వాతావరణం భౌగోళిక స్థితిగతులు వనరుల లభ్యత ఇతర అంశాలను ప్రతిబింభింపజేస్తుంది. జానపద కళారూపాల్లో ఉత్తరాంధ్ర కళారూపాల గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఇక్కడి ప్రాంత కళారూపాలకు సంబందించిన సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు కట్టుబాట్లకు ప్రాధాన్యం లభిస్తుంది. కొందరికి ఉపాధితో కూడిన వృత్తి ఏర్పడి వారి జీవితం సునాయాసంగా ముందుకు సాగుతుంది. రాబోయే తరాల వారికి ఈ కళారూపాలను చూసే అదృష్టం కలుగుతుంది.

## 3.4. ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – వర్గీకరణ:

కళారూపాలు విజ్ఞానాన్ని ప్రతిబింబజేసే వినోదాత్మకాలు. ఇవి సమాజ నిర్మాణంలో ఎంతో ప్రభావాన్ని చూపుతాయి. ఉత్తరాంధ్ర సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా కళారూపాలు ఎన్నో ఉన్నాయి. ఈ కళారూపాలు ప్రత్యేక నృత్యానికి, ఆటలకు, వృత్తికి, మతానికి, కథకు, భజనలకు, వేషధారణకు, సంబంధించినవి ఎన్నో ఉన్నాయి. ఆయా వర్గాలకు సంబంధించిన అంశాలను బట్టి వాటికి ప్రత్యేక స్వరూప స్వభావాలు ఉంటాయి. ప్రత్యేకమైన ఆదరణ ఇవ్వడం జరుగుతుంది.

ఉత్తరాంధ్ర గుండె చప్పుళ్ళను తన బాణీల ద్వారా వినిపించే కళారూపాలు, కళాకారులు ఎందరెందరో వున్నారు. తోలుబొమ్మలాట, దాసరులు తప్పెటగుళ్ళు, హరికథ, బుర్రకథ, జముకుల కథ, రుంజవాయిద్యం, తూర్పు భాగవతం (బామాకలాపం) బోనెల పాట, గంగిరెద్దుళ్ళు, ఎరుకలోళ్ళు, జంగాల కథ (బేడజంగాలు, బుడిగె జంగాలు), దాసర్లు, చెంచులు, సాతాని వైష్ణవులు, పగటి వేషగాళ్ళు, గంటసాయిబు, ఫకీరు వేషం, పిట్లలదొర, దొమ్మరాట– దొమ్మరులు, పొడపోతులవారు, కాలుగంటి వారు, మాలమాష్టీలు, బుట్టబొమ్మలు, డప్పు కళాకారులు, పులివేషాలు, కత్తిసాము– కర్రసాము, అద్దానం పగటి వేషాలులో పాటుగా గిరిజన జానపద కళలైన థింసా, తోంగ్సేన్ నృత్యం, ఇటిక పండుగ, కొమ్ముునృత్యం, మయూర నృత్యం వంటివాటి గురించి కూడా ప్రస్తావించుకోవాల్సి వుంది.

## 3.5 అంతరించిపోతున్న జానపద కళారూపాలు:

జానపద కళారూపాలు ఎంతో వైవిధ్యభరితమైన ప్రత్యేకతలను కలిగి ఉంటూ సమాజ అభ్యుదయం కోసం ప్రధాన పాత్ర వహిస్తాయి. జాతి నిర్మాణ సంబంధించిన అంశాలకు అభివృద్ధికి ఈ జానపద కళారూపాలు ప్రభావితం చేస్తాయి. ఉత్తరాంధ్రలో ఎన్నో కళారూపాలు తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి. ప్రజల్లో వచ్చే ఆలోచన విధానము ఆర్థిక అభివృద్ధి సాంకేతిక విప్లవము ప్రపంచీకరణ సరళీకరణ నేపథ్యం కొత్త పరిశ్రమల ఏర్పాటు ఉపాధి అవకాశాలు మొదలైనవి కళారూపాల పట్ల విపరీతమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. భవిష్యత్ తరాలకు సంబంధించిన అభివృద్ధి అనేది లేకపోవడం వల్ల కుటుంబ పోషణ కష్టంగా మారడం వల్ల ఈ జానపద కళారూపాలపై ఆధారపడిన వ్యక్తులు వీటిని వదులుకోవాల్సి వస్తున్నది. ఉత్తరాంధ్రలో ఇలా కనుమరుగైన కళారూపాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో హరికథ, బుర్రకథ, బుట్ట బొమ్మలాట, పిట్టలదొర, బుడబుక్కల వారు, రుంజ, వాలకం ఎన్నోపగటి వేషాలు మోడీలు, ఎరుకలోళ్లు, ఎముకల కథ, కాశీకావడి, గంటసాయిబులు మొదలైన ఎన్నో కళారూపాలు అంతరించే స్థితిలో ఉన్నాయి.

అంతరించిపోతున్న జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటితరంపై అధికంగా ఉన్నది. ఆధునిక యుగంలోనూ జానపదకళలను అధునీకరించాల్సిన అవసరమున్నది. సహజత్వముతో ఉట్టిపడే జానపద కళారూపాలను సంరక్షించుకోవాలి. మానవ జీవన యానాన్ని మరింతగా మెరుగుపరిచే జానపద కళలు శ్రమ జీవన సౌందర్యాన్ని మరింతగా పెంపొందించే విధంగా చేయాలి. అలనాటి ఆటల మాధుర్యాన్ని రానున్న కాలానికి పదిలంగా అందిస్తేనే గ్రామీణ జీవన ముఖ చిత్రం సులువుగా అర్థమవుతుంది. గ్రామాల కలబోతతో కూడిన భారతావనిలో గ్రామీణ జనులకు జానపద కళారూపాలు మానసిక ప్రశాంతత ఎంతగానో చేకూరుస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కళల కాణాచిగా పేరు గాంచిన భారత్‌లోని కళా సంపద రాబోవు తరాలకు అందించే విధంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలి.

## 3.6. జానపద కళాకారులు దుస్థితి:

సమాజంలో జానపదులు వినోద విజ్ఞానాల కోసం ఈ కళారూపాలను ఆదరించేవారు. ఇవి మన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన ఇతిహాసాలను పురాణాలను వేదాల్లో ఉన్న మంచిని చెడును తెలియపరచి ఉన్నతమైన జీవనం కోసం మార్గనిర్దేశం చేసేవి. అప్పటిలో ఈ జానపద కళా ప్రదర్శన చేసే కళాకారులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారు. ప్రత్యేకంగా కళారూప ప్రదర్శన సంబంధించిన సకల విషయాలు విద్యను నేర్చుకొని వాటిని ప్రదర్శించేందుకు ఆసక్తిని చూపేవారు. కళాకారులు ప్రదర్శన ఎంతో అద్భుతంగా ఉండేది. ఎంతో దూరం నుంచి కూడాను పల్లె ప్రజలు వచ్చి వీటిని చూడడానికి ఆసక్తి చెప్పేవారు. రాత్రి పగలు అక్కడే ఉండి కథలు, నాటకాలు, పద్యాలు వింటూ ఉన్నతమైన పాత్రల స్వభావాన్ని గ్రహించేవారు. అలిసిపోయిన పల్లె ప్రజలకు వీరి ప్రదర్శనలు సేదతీర్చేవి.

మానవుడి మనోవికాసానికి, వినోదానికి, మంచి నడవడికి జానపద కళారూపాలు, ఆలంబనగా నిలిచాయి. సినిమాలు, టివిలు లేని ఆ రోజుల్లో ఈ వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. కళలను నమ్ముకుని జీవనం సాగించిన కళాకారులకు నేడు ఆదరణ కరువవ్వడంతో కళలను నమ్ముకోలేక, నముకున్న కళలు విడిచి పెట్టక దుర్భర జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నాటి కళలను, కళాకారులను రక్షించుకుందామని, ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆదుకునేందుకు నామ మాత్రపు చర్యలు తప్ప  చేసింది ఏమీలేదు. విదేశీ సంస్కృతిని, వారి అలవాట్లను పుణికిచ్చుకుంటున్న నేటి తరం నాటి జ్ఞాపకాలను, కళలను పట్టించుకునే అవకాశం లేకుండా పోతోంది. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. వీరు నాటి రాజుల చరిత్రను, భాగవతం, రామాయణం, హరికథలతో పాటు, పద్యాల రూపంలో అందులో విషయాలను, వివరించేవారు. రామాయణ, మహాభారతం, భాగవతంలోని సారాంశాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రజలు ఇచ్చే మూల్యాన్ని తీసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. గంగిరెద్దులవాళ్లు, జంగాలు, పాముల వాళ్లు, హరికధా దాసులు, ఇలా చెప్పుకుంటూ చాలామంది జానపద పాటలను, వేదాల్లోని సారాంశాన్ని పాటల ద్వారా పలికిస్తూ జీవనం సాగించేవారు. గంగిరెద్దులు వాళ్లు సంక్రాంతి వచ్చిందంటే గ్రామాల్లో ఎద్దులను ఇంటింటికీ తిప్పుతూ, పాటలతో సారాంశాన్ని చెబుతూ భిక్షాటన చేసేవారు. హరికథా దాసులు కూడా అంతే. సగం రాత్రి వాళ్లు కూడా వేకువ జామున గ్రామాల్లో తిరుగుతూ భిక్షాటన చేసేవారు. కళలను ప్రోత్సహించేది ప్రధానంగా గ్రామాల్లోని రైతాంగం, చేతివృత్తిదారులు, గిరిజనులు, హరిజనులే. నేడు వ్యవసాయ సంక్షోభం వల్ల, ఆధునిక ప్రపంచ పరిణామాల ప్రభావం వల్ల చేతివృత్తులు దెబ్బతిన్నాయి. కరువు కాటకాలు మన జానపద రూపాలను, క్షీణదశకు తీసుకువచ్చాయి.

ప్రధానంగా గ్రామీణ ప్రజానీకంపై ఆధారపడిన సాంస్కృతిక వృత్తులు నేడు అంతరించి పోతున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వం కూడా మన జానపద సాంస్కృతిక వృత్తులను కాపాడడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయి. గ్రామాల్లో ఈ వృత్తి కళాకారులు, కూలీనాలి చేసుకుంటూ ప్రదర్శనలు ఇస్తూనే ఉన్నారు. ఊపిరి ఉన్నంతకాలం కళారూపాలను కాపాడుకుంటామని, ముందుతరాలకు వృత్తి కళలను అందిస్తామని ఈ వృత్తికళాకారులు ఇప్పటికీ ధీమాతో ఉన్నారు.

ఒకప్పుడు జానపదకళలకు ఎంతో గుర్తింపు ఉండేది. కానీ ఇప్పుడాపరిస్థితి లేదు. నానాటికీ ఆదరణ తగ్గడంతో కళాకారుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది. జానపద కళలయిన బుర్రకథలు, కోలాటం, హరికథలు, పగటివేషాలు వేసేవారికి నానాటికి ఆదరణ కరువవుతోంది. ప్రస్తుతం ఈ కళలు సంక్రాంతి పర్వదినాలు, గ్రామదేవతల పండుగల్లోనూ అమ్మవారి ఉత్సవాల్లో  ప్రేత్యేక సందర్భాలలో  ప్రముఖుల సమావేశ సభలలో మాత్రమే ప్రదర్శించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ కళలను నమ్ముకుని జీవనోపాధి పొందేవారు.  తమ రంగాలవైపు వెళ్లిపోవడం వల్ల ఇవి మరుగునపడుతున్నాయి.

సరైన ఆదరణ లేక పోవడం వల్ల కూడా ఈ పరిస్థితికి కారణంగా చెప్పుకోవచ్చు. పూర్వం పల్లె ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రభుత్వ పథకాలు ప్రచారం చేస్తూ ప్రజల హృదయాలను చూరగొనడంలో ఈ కళాకారులకు ఉన్న ప్రత్యేకతే వేరు. కాని ఇప్పుడు వీటి స్థానాన్ని బుల్లితెర ఆక్రమించేసింది. ఫలితంగా వారికి ఆదరణ కరువైపోయింది.

కళాకారులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆదుకుంటామని వేదికలెక్కి మైకులయితే విరగ్గొడుతున్నారే కాని చిల్లిగవ్వయినా సాయం అందించడం లేదని కళాకారులు వాపోతున్నారు. స్వతంత్ర కాలం నుంచి నేటి వరకు జానపద కళారూపాల పాత్ర అమోఘమైంది. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ముందున్న కళాకారులపై ప్రభుత్వ వైఖరి శోచనీయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఎన్నో ఏళ్లుగా అంతరించిపోయిన జానపదకళలను వెలికి తీసుకువచ్చేందుకు ప్రస్తుతం ఉన్న వారిని సద్వినియోగం చేసుకోవాలి. ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. భావి తరాలకు మన కళలను భావితరానికి అందించాలి అందించాల్సిన అవసరం ఉంది.

# అధ్యాయం 4

# ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు - పరిశీలనాంశాలు

# అధ్యాయం 4

# ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – పరిశీలనాంశాలు

## 4.1. బుట్టబొమ్మలు:

బుట్టబొమ్మలు ఈ తరంవారు మరచిపోతున్న అపురూప కళ. వెనకటి రోజుల్లో బుట్టబొమ్మలకు ప్రజలలో ఎంతో ఆదరణ ఉండేది. బుట్టబొమ్మలు ఉత్తరాంధ్ర ప్రాంతములో పెళ్ళి ఊరేగింపులలోనూ దేవుని కళ్యాణ ఉత్సవ సమయాల్లోనూ, తిరునాళ్ళు, జాతరలు, దేవుని కళ్యాణ ఉత్సవాలలో బుట్టబొమ్మల ప్రదర్శనను నిర్వహిస్తారు. గుంపులుగా చేరే ప్రజల మధ్య పొడవుగా, ఆకర్షణీయమైన రంగులతో అలంకరించబడి ఎత్తుగా కనిపించే ఈ బుట్టబొమ్మల ప్రదర్శన జరుగుతుంది. ప్రజల తిరుగుతూ ఎలాంటి మాటలు మాట్లాడకుండా వినోదం కలిగించే బుట్టబొమ్మలంటే ప్రజలకెంతో మక్కువ. మధ్య మధ్య ఈ డప్పుల వాయిద్యాలతో సన్నాయి మేళాలతో బుట్టబొమ్మల ప్రదర్శన ఉంటుంది. బొమ్మను ధరించే పాత్రధారులు కాళ్ళకు గజ్జెలు కట్టుకొని అడుగులు వేస్తూ లయబద్ధతను పాటిస్తారు. బుట్టబొమ్మల్లో భార్యాభర్తల బొమ్మలు చెప్పుకోదగినవి. భార్యాభర్తల సరససల్లాపాలు, అందుకు అడ్డుపడే దుష్టపాత్రలు, దుష్టుల్ని తరిమేందుకు భర్త బొమ్మ చూపే తెగువ, తన తప్పుల్ని క్షమించమని భార్య బొమ్మ వేడుకోవడం, పాములవాడి బొమ్మ నాగస్వరం ఊదుతూ చేసే నృత్యాలు, సింగి, సింగిడు వంటి హాస్యపాత్రలతో సహజంగా ఆకట్టుకునే రీతిలో బుట్టబొమ్మల ప్రదర్శన సాగుతుంది.

బొమ్మల పైభాగమంతా బొమ్మ ఆకారాన్ని పోలిఉండి, లోపలి భాగమంతా డొల్లగా వుండి కళ్లు, నోటి ప్రాంతంలో రంధ్రాలను కలిగి ఉంటాయి. బొమ్మ లోపలి భాగంలోకి వ్యక్తులు దూరి నృత్యం చేస్తుంటే నిజంగా బొమ్మే అలా చేస్తుందా అన్పిస్తుంది. మగవాళ్ళే ఎక్కువగా బుట్టబొమ్మలను ఆడిస్తూ వుంటారు. సుమారు పదిమంది కళాకారులు బుట్టబొమ్మల ప్రదర్శనకు అవసరమవుతారు. వెదురు, రంగులు, చింతగింజలు రంగులను ఉపయోగించి తయారుచేసే బుట్టబొమ్మ ఒక్కొక్కటికి ఎక్కువ మొత్తంలో ఖర్చవుతుంది. బుట్టబొమ్మలలో సింగి, సింగిడు చేసే హాస్యం పిల్లలను ఆకట్టుకుంటుంది. ప్రదర్శన లేని సమయాల్లో బుట్టబొమ్మలను నాఫ్తలినన్ గోళీలు, పురుగులను నివారించే స్ప్రేలను వాడుతూ కాపాడుతారు. ఎక్కువగా బొమ్మ చుట్టూ గుడ్డలను చుట్టి కూడా కాపాడతారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన కట్టా సూర్యనారాయణ బుట్టబొమ్మల కళని జాతీయస్థాయికి తీసుకెళ్ళిన కళాకారుడు. కాగా ఆయన తండ్రి కట్టా మల్లయ్య తొలినాళ్ళలో ఈ బొమ్మల తయారీకి విశేషకృషి చేసి పేరొందారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా ఈ బుట్టబొమ్మల కళాకారులిప్పుడున్నా ప్రదర్శనలు అంతంతమాత్రంగానే సాగుతుండడానికి వాటిని ఆదరించేవారు కొరవవడమే కారణం. ఆ కళారూపానికి ఆదరణ అపురూపమైన బుట్టబొమ్మల కళారూపాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

బుట్టబొమ్మలు ప్రజా సమూహాల మధ్య ఎత్తుగా ఉండి అందరికీ కనిపించే తీరులో అందర్నీ ఆకర్షిస్తూ ఉంటాయి. బుట్టబొమ్మలు ఎత్తుగా ఉండి నడుము భాగము నుండి క్రిందికి దిగేకొద్దీ లోపల కాళీగా మారుతూ పెద్దగా బుట్ట ఆకారంలో మారుతుంది. అందువలననే వీటిని బుట్టబొమ్మలంటారు. బుట్టబొమ్మలు బొమ్మల పై భాగమంతా బొమ్మ ఆకారంగా ఉండి లోపలి భాగం డొల్లగా ఉండి బొమ్మ యొక్క కళ్ళభాగంలోనూ, నోటి దగ్గర రంధ్రాలుంటాయి. ఆటగాడు ఈ లోపలి భాగంలో దూరి, తలను దూర్చి నృత్యంచేస్తే కేవలం బొమ్మే అభినయించినట్లుంటుంది. బుట్ట బొమ్మలు ఎవరితోనూ మాట్లాడవు. ప్రజల మధ్య తిరుగుతూ వినోదపరుస్తాయి. బుట్టబొమ్మలలో పలురకాలు ఉన్నాయి.

## ప్రదర్శన:

ఈ బుట్టబొమ్మల్ని పురుషులే ఆడిస్తారు. ప్రదర్శించే కళాకారులు ప్రత్యేకంగా మంచి నైపుణ్యం కలిగి ఉండి నృత్యం చేస్తూ బొమ్మను మోయవలసి ఉంటుంది. ఈ బొమ్మల్లో భార్యాభర్తలు, వారి ప్రేమ కలాపాలు, వారి ప్రేమను భగ్నం చేసే దుష్ట పాత్ర, స్త్రీ బొమ్మతో కామకేళీ విలాసాలు. ఇది చూచిన భర్త వెంటబడి దుష్టపాత్రను తరమడం తరువాత భార్య వెంట పాత్ర, స్త్రీ పాత్ర క్షమించమని వేడుకోవడం ఇలా బొమ్మల ప్రదర్శన సాగుతుంది. ఈ ప్రదర్శనానికి కూడా డప్పుల వాయిద్య ముంటుంది. సన్నాయి మేళం ఉంటుంది. బొమ్మను ధరించిన పాత్రధారి కాళ్ళకు గజ్జెలు కట్టుకొని అడుగులు వేస్తాడు. బుట్టబొమ్మల్లో పాములవాడి బొమ్మ కూడా ఉంటుంది. నాగస్వరం ఊదుతూ, నృత్యం చేస్తూ ఉంటుంది. ఒక్కొక్కసారి ఈ బొమ్మలు నాలుగైదు కూడా ఉంటాయి. ఈ బొమ్మలో సింగి, సింగిడు వంటి హాస్యపాత్రలు కూడా ఉంటాయి. బొమ్మలను అతి సహజంగా జీవకళ ఉట్టిపడేలా రంగు రంగులలో చిత్రిస్తారు.

పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు సందర్భమేదైనా ఈ రెండు బొమ్మలను తప్పనిసరిగా వాడుతారు. పెళ్ళికొడుకు పెళ్ళికూతురు అలంకరణతో ఆరడుగుల ఎత్తు నుండి పన్నెండు అడుగుల ఎత్తు వరకూ తయారు చేస్తారు. గుర్రాలు గేదెలు ఎద్దు తల ఆకారం గల బొమ్మను గూడు మాదిరిగా వెదురుబద్దలతో లేదా ఇనుప ఊచలతో చేయబడిన దాని ముందు భాగాన తగిలించి ఎద్దు ఆకారానికి మరుస్తారు. ఏనుగులు ఎద్దులు పాములవాడు దేవత బొమ్మలు దేవతల బొమ్మలలో ముఖ్యమైనవి కాళిక మరియు వినాయకుడు, ఆంజనేయుడు మొదలయినవి.

## బుట్టబొమ్మల తయారీ:

బుట్టబొమ్మల తయారీలో పలు రకాలు ఉన్నాయి. మొదటి రకం వెదురు బద్దలను సన్నగా చీల్చి వాటిని మధ్యలోనూ లోపలి భాగంలోనూ తగిన ఖాళీ వదిలి బొమ్మలకు అనువైన ఆకారాలుగా మార్చుకొంటారు. దానిపై దళసరి బట్టను చుట్టి సూదితో దగ్గరగా తగిన బిగువుతో కుడతారు. తరువాత ఆ బట్టపై చింత గింజలపొడి, ఉడకబెట్టిన పిండిలాంటి గంజి మిశ్రమంగా చేసి గుడ్డపై పూస్తూ పోతారు. అలా నాలుగైదుసార్లు రాసి కావలసిన మందం వచ్చాక ఎండలో పెట్టి దానిపై ఉడ్ ప్రైమరీ అనబడు

పెయింటును పూస్తారు. తరువాత ఆయిలు పెయింట్లతో అందముగా అలంకరించి ప్రదర్శనకు సిద్ధము చేస్తారు. రెండవరకం తలభాగమును షాపులలో కొని దానికి మిగిలిన ఆకారాన్ని సన్నటి ఇనుప ఊచలను కావలసిన ఆకారంలో వంచి దానిపై ఈనెలతో అల్లిక చేస్తారు. అలా అల్లుతూ కావలసిన బొమ్మ ఆకారం తయారు చేస్తారు. దానిపై దలసరి బట్టను వేసి తరువాత మిగిలినదంతా మొదటి రకంగానే చేస్తారు. మూడవ రకం ఇది నూతనంగా కొంచెం ఎక్కువ పెట్టుబడి కలిగినది రబ్బరును కావలసిన ఆకారములో కత్తిరించి కొన్నిచోట్ల ప్లాస్టిక్ వినియోగించి పూర్తి చేస్తారు. తరువాత బొమ్మకు పెయింట్ల అవసరం లేకుండా మామూలు బట్టలు చుట్టి జుట్టు మొదలయినవి అతికిస్తారు.

## 4.2. తోలు బొమ్మలాటలు:

తోలుబొమ్మలాట భారతదేశంలోని ఒక ప్రాచీన జానపద కళారూపం. తెలుగు రాష్ట్రాల్లో ఒకప్పుడు బాగా ప్రసిద్ధి చెందింది. మానవుడు నాటక దశలోకి ప్రవేశించే పరిణామక్రమంలో తోలుబొమ్మలాట ఎంతో క్రియాశీల పాత్ర పోషించింది. పురాణాలు, కావ్యాల్లోని ఘట్టాలు, సాంఘిక కథలు ఈ కళారూపానికి ప్రధాన ఇతివృత్తాలు. ప్రాణంలేని బొమ్మలకు జీవం పోసే అద్భుతమైన కళ ఇది. కాలం గడచిన కొద్దీ ఈ కళకు ఆదరణ తగ్గిపోతోంది. ఇప్పుడు దాదాపు అంతరించే దశకు చేరుకుంది. ఒకప్పుడు తోలుబొమ్మలాటకు ఎంతో ఆదరణ ఉండేది. ప్రాచీనకాలం నుంచి తెలుగువారిని అలరింపజేస్తున్న జానపద కళారూపం తోలుబొమ్మలాట. రంగులచిత్రం చూసిన అనుభూతి ఇది చూసినప్పుడు కలుగుతుంది. తెరను కదిలించే తీరును బట్టి బొమ్మలను దగ్గరగా, దూరంగా చూపించే కళానైపుణ్యం ఈ కళాకారుల సొత్తు. పౌరాణిక కథలను ప్రదర్శిస్తున్నప్పుడు బొమ్మల కదలికలను బట్టి పాటలు, మాటలు ఉంటాయి. తోలుముక్కలతో బొమ్మలను తయారుచేస్తారు. పాత్రోచితమైన బొమ్మలను రూపకల్పన చేయడంలో ఈ కళాకారులు సిద్ధహస్తులు. 13వ శతాబ్దంలోనే తోలుబొమ్మలాటను పాల్కురికి సోమనాధుడు "పండితారాధ్య చరిత్ర"లో ప్రస్తావించాడు. ఈ బొమ్మలాట వాళ్ళు 12 నుండి 19వ శతాబ్ది దాకా కళావైభవంతో వెలుగొందారు. రామాయణం, మహాభారతం, భాగవతం వంటి ఇతిహాసాలు, పురాణాలు ఈ కళ ద్వారా ప్రదర్శిస్తారు. తోలుబొమ్మలాటలో కథ, బొమ్మలు, తెర, నీడ ప్రధాన పాత్ర పోషిస్తాయి.

తోలు బొమ్మలాట పుట్టుకపై పరిశోధకుల్లో వివిధ అభిప్రాయాలున్నాయి. ఇవి భారతీయుల ఖ్యాతిని ముఖ్యంగా తెలుగు వాళ్ళ ఖ్యాతిని విదేశాల్లో చాటి చెప్పిన గ్రామీణ కళారూపం. తోలుబొమ్మలతో పౌరాణిక నాటకాల్ని ప్రదర్శిస్తారు. కాబట్టి ఇది తోలుబొమ్మలాట నాటకం అయింది. జింక, మేక, చర్మాలతో ఈ బొమ్మల్ని తయారు చేస్తారు. తోలును బాగా శుభ్రం చేసి పల్చగా తయారు చేసుకొంటారు. దానిపై బొగ్గుతో బొమ్మ ఆకారాన్ని గీచుకొని, తల, మొండెం, చేతులు, కాళ్ళు కత్తిరించుకొంటారు.

చిన్నకత్తితో మధ్య మధ్య చిన్న రంధ్రాలు కత్తిరించి తయారు చేస్తారు. ఇలా తయారైన బొమ్మపైన ఒక వైపు మాత్రమే రసాయన ప్రక్రియలతో తయారుచేసిన రంగుల్ని మంచినైపుణ్యంతో చిత్రిస్తారు.

ఈ తోలుబొమ్మలాటలో కవిత్వం, సాహిత్యం, సంగీతం, శిల్ప, చిత్రకళలు మేళవించి ఉన్నాయి. లలితకళలన్నింటిలో కన్నుల పండుగ చేసే ప్రదర్శన తోలుబొమ్మలాట. మన ప్రాచీన సాహిత్యంలోనూ, శాసనాలలోనూ బొమ్మలాట ప్రస్తావనలు, వర్ణనలూ ఉన్నాయి. మేక, జింక చర్మాలను సేకరించి చక్కగా శుద్ధి చేసి బొమ్మల సైజుకు చక్కగా గీత గీసి కత్తిరించి రంగులద్దుతారు. పాత్రోచితంగా రంగులు చిత్రిస్తారు. తోలుబొమ్మలవారు గ్రామంలోకి వెళ్ళి గ్రామస్థులను పరిచయం చేసుకొని అందరూ కూర్చోడానికి అనువైన బహిరంగ స్థలంలో పందిరి వేస్తారు. అది మూడు పక్కల మూయబడి ఒకవైపు తెరచి ఉంచుతారు. పందిరి లోపలి భాగంలో ప్రదర్శనకు సంబంధించిన సామాగ్రినంతా ఒక క్రమంలో అమర్చుకుంటారు. లోపలి ప్రక్క తెరను ఆనుకొని ఓ బల్లను వేస్తారు. ఆముదపు దీపాలు గాని, పెట్రోమాక్సులైట్లను గాని వెలిగిస్తారు. దీపాల కాంతి తగ్గితే బొమ్మల అందచందాలు తగ్గుతాయని జాగ్రత్త పడతారు. ఈ రాత్రికి బొమ్మలాట ఉందని చాటింపు వేస్తారు. విఘ్నేశ్వరపూజతో నాటకం ప్రారంభమవుతుంది. పాట పాడేవారు. హార్మోనియం వాయించేవారు. తాళం వేసేవారు, వంతపాటలు పాడేవారు అందరూ నేపథ్యంలో కూర్చొని ప్రదర్శనకు సహకరిస్తారు. వేదికపై వెదురుబొంగుకు కట్టబడ్డ బొమ్మల్ని ఆడించే వ్యక్తి పాటలు పాడుతూనే ఉంటాడు. సంభాషణలు కూడా ఇదే రీతిలో కొనసాగుతాయి. ప్రదర్శన సమిష్టి కృషితో విజయవంతమవుతుంది. ఈ బొమ్మలాటకు బ్రహ్మలాంటి వాడు సూత్రధారుడు. రామాయణ, భారత, భాగవత కథలతో పాటు ఇతర పురాణలలోని కథలను కూడా వీరు ప్రదర్శించేవారు. మధ్యమధ్యన హాస్యం కోసం జుట్టుపోలిగాడు, బంగారక్క బఫూన్, అల్లాటప్పాగాడు, కేతిగాడు మొదలైన ప్రదర్శనలు జొప్పిస్తారు. వానాకాలం వెళ్ళితేనే ఈ ప్రదర్శనలు సజావుగా సాగుతాయి.

ఈ తోలుబొమ్మలాట వాళ్ళు దేశదిమ్మరులు. ప్రదర్శనలిచ్చుకుంటూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్ళుతుంటారు. వీళ్ళలో బహుభార్యాత్వం ఉంది. ఏ కారణంగానైనా ఒకామెకు గొంతు సమస్య వస్తే మరొకరు ఆ బాధ్యత నిర్వహిస్తారు. తెరలోపలే పాటలు పాడేవారు, మద్దెల, హార్మోనియం వాయించేవారు, తాళం వాయించేవారు వంత గాళ్ళు అందరూ ఉంటారు. సమస్త వస్తు సామాగ్రిని సిద్ధం చేసుకొన్న తోలుబొమ్మలాటలో సూత్రధారుడు చాలా ప్రాముఖ్యాన్ని కలిగి ఉంటాడు. తెరలోపల నుంచే ప్రదర్శనను క్రమం తప్పకుండా నడిపే బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకొంటాడు. కథను చాలా వివరంగా, ఆసక్తిదాయకంగా చెబుతుంటాడు. బొమ్మలాట జట్టులో ప్రతి ఒక్కడూ కళాకారుడే. పురుష పాత్ర వెనుక పురుషుడు, స్త్రీ పాత్రల వెనుక స్త్రీలు నిలిచి పాటలు, పద్యాలు వచనాలు పాడుతూ ఉంటారు. తోలుబొమ్మలాటలవారు సుందరకాండ, మైరావణ, సతీసులోచన, ఇంద్రజిత్తు, అంగదరాయబారం,

లక్ష్మణమూర్ఛ, లవకుశ, ఉత్తర గోగ్రహణం, కీచకవధ, పద్మవ్యూహం, శశిరేఖా పరిణయం వంటి గాథల్ని ప్రదర్శనలిస్తూ ఉంటారు.

తోలుబొమ్మలాట బయటకు కనిపించినంత సులభంగా ఉండదు. ఒక బృందాన్ని తయారు చేయాలంటే కనీసం రెండేళ్లు పడుతుంది. కనీసం ఏడు నుండి పన్నెండు మంది ఉంటేకానీ ఇది సాధ్యం కాదు. ఎందుకంటే ఇందులో అనేక భాగాలు ఉంటాయి. బొమ్మ తయారీ, చర్మం శుద్ధి, రంగుల తయారీ, హార్మోనియం నేర్పడం, తాళం వేయడం, మృదంగం వాయించడం, ఇతిహాసాలు చెప్పడం, రాగం తీయడం వంటివి అనేకం. పిల్లలకు ఇవన్నీ నేర్పాలంటే చాలా సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది. అందువల్ల జీవనోపాధి కూడా ఇబ్బంది అవుతోంది. తోలుబొమ్మలాటను ప్రదర్శించడానికి ఎక్కువ మంది అవసరమవుతారు. అందువల్లే వీళ్ళు ఇద్దరు, ముగ్గురిని పెళ్లి చేసుకునేవారు. ఎందుకంటే మొత్తం కుటుంబం అంతా ఈ కళా ప్రదర్శనలో భాగంగా ఉంటారు. వేరే కుటుంబం వారిని భాగస్వాములుగా చేసుకుంటే పంపకాల వద్ద గొడవలు వస్తాయి. అందువల్ల వాళ్లే రెండు, మూడు పెళ్లిళ్లు చేసుకొని ఎక్కువ మంది పిల్లలను కనేవారు. అయినా ఆ రోజుల్లో పోషణ కష్టమయ్యేది కాదు. తోలుబొమ్మలు ఒకనాడు తెలుగువారి సాంస్కృతిక విజ్ఞానానికి ప్రతీకలు. ఆనాడు వాటికి బహుళ ప్రజాదరణ ఉంది. నాటకాలు, తరువాత రేడియోలు సినిమాలు కంప్యూటర్లు సెల్ఫోన్లు రావడంతో ఈ కళ దెబ్బతిన్నది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాలు వీటిపై శ్రద్ధ వహించి ఈ కళారూపాన్ని పరిరక్షించి ఈ కళారూపాలపై ఆధారపడిన కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

## 4.3. తూర్పుభాగవతం (భామాకలాపం):

ఉత్తరాంధ్రలో విశాఖపట్నం శ్రీకాకుళం విజయనగరం గంజాం కోరాపుట్ మొదలైన ప్రాంతాల్లో ఇది ప్రచారంలో ఉంది. ఈ భాగవతం సామాన్య ప్రజానీకాన్నే కాక పండితుల్ని, విద్వాంసుని, కవుల్ని, గాయకుల్ని కూడా విశేషంగా ఆకర్షిస్తుంది. పురాణ కథలను నాట్య రూపంగా ప్రదర్శించే నాట్యమేళాన్ని భాగవతం అని అంటారు. ఇదే వ్యవహారంలో భాగోతం అని బోగోతం అని అంటారు. భాగవతులు అంటే భగవంతునికి సంబంధించిన కథలను ప్రదర్శించే వారని అర్థం. వీరిని వ్యహారంలో బాగోతులు అని అనడం ఉంది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో ప్రదర్శించే ఇటువంటి భాగవతాన్ని "తూర్పు భాగవతం" అని పిలుస్తున్నారు. దీన్నే అక్కడివారు వీధిభాగవతం అని కూడా అంటారు. భాగవతం పేరుతో ఆంధ్రదేశంలో ఎన్నోరకాల వీధిభాగవతాలు ఉన్నాయి. ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రాంతానికి మాత్రమే కాదు సంప్రదాయానికి కూడా చెంది ఉన్నాయి. వందలాది బృందాలు ఏర్పడ్డాయి. అనేకరూపాలతో రూపాంతరంచెంది కూచిపూడి భాగవతం, చిందుభాగవతం, గంటె భాగవతం. తూర్పుభాగవతం మొదలైన పేర్లతో ఏర్పడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ భాగవతాన్నిప్రదర్శించే వారిలో వివిధ కులాలకు చెందిన వారుంటడం విశేషం. వారిలో చిందుభాగవతానికి చెందిన మాదిగల నుండి ప్రదర్శనకు తప్పెటగుళ్ళు అనే చెందిన ఎర్రగొల్లలు, కుచిపూడి భాగవతానికి చెందిన బ్రాహ్మణులు, ఇంకా వేరే సంప్రదాయానికి చెందిన వీధిభాగవతాల యానాదులు, దాసర్లు ప్రముఖులు ఇన్ని కులాలవారున్నారు. ఉత్తరాంధ్ర ప్రజలను తూర్పువారని తూర్పు తీరం అంటారు. తూర్పు ప్రజలయాస, మాండలికాలు, శైలితో రాయబడి పాడుతున్నది కాబట్టి దీన్ని తూర్పుభాగవతం అంటారు. ఇది ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రదర్శింపడుతుంది. ఈ సంప్రదాయంలో ఎక్కువగా పారిజాతాపహరణ కథని ప్రదర్శించడం వల్ల ఈప్రదర్శన సంప్రదాయానికి పారిజాతపహరణమనే పేరు కూడా వచ్చింది. తూర్పుభాగవత కథల్ని వంకాయల బలరామభక్త సరస్వతుల సుబ్బయ్యశాస్త్రులగారు. అధికార్ల సత్యనారాయణగార్లు రచించారు. పద్య, గద్య, దరువు. ద్విపదలతో రాశారు.

ఇందులోని కథా వస్తువు శృంగారాత్మకం. సత్యభామ తానే కృష్ణుని కంటే అందగత్తెనని, బలంలోకూడా కృష్ణుడికంటే బలమైనదానినని, శమంతకమణి తనవద్ద ఉండుటచే ధనంలో కూడా అధికురాలునని అహంతో ఉంటుంది. ఆ అహం వీడడానికి కృష్ణుడు సత్యభామ కౌగిలివీడి రుక్మిణివద్దకు చేరుకుంటాడు. అతనెంతకీ రాకపోగా.. విరహదు:ఖాన్ని భరించలేక తన తిరిగి వేదననంతటనీ ఆమె చెలికత్తె దగ్గర వెళ్ళబోసుకుంటూ రాయబారం పంపి అహంను వీడి కృష్ణుణ్ణి రప్పించుకుంటుంది. సత్యభామ తనపై అలిగి వెళ్ళిపోయిన శ్రీకృష్ణుడి దగ్గరికి రాయభారం పంపి తిరిగి తన ఇంటికి రప్పించుకోవడమే ఇందులో కథ. ఇది కాక కృష్ణలీలల్ని, జలక్రీడల్ని కూడా ఇందులో ప్రదర్శిస్తారు. దీనిపై జయదేవుని గీతగోవింద ప్రభావం ఉందని పరిశోధకులు అభిప్రాయం. ప్రధానంగా సత్యాకృష్ణుల మధ్య నడిచిన ప్రణయ కలహమే ఇందులోని వస్తువు. కథ చిన్నది అయినా అందులో అష్టవీర నాయకుల వర్ణన, విప్రలంభ శృంగారంతో నిండి ఒక ప్రబంధమైపోయి వరుసగా తొమ్మిది రోజులు ప్రదర్శించే స్థాయికి చేరుకుంది. కూచిపూడిని ఒకరు పాడితే ఇంకొకరు అభినయించాలి. తూర్పుభాగవతంలో తాళం, రాగం, అభినయించడం ముఖ్యపాత్రధారిది. హాస్య నవరసాల పాత్రలు సూత్రధారులవి. అందరూ మెప్పుగా వాయించడం మృదంగంవారివి. తెల్లవార్ల వంతపాడటం, తాళం కొట్టడం హంగుదారులది.

ఈ కళారూపంలో సుమారు పది మంది వరకు పాత్రధారులంటారు. సత్యభామ, శ్రీకృష్ణుడు, దాసి మొదలైన పాత్రలతో పాటు వంతపాట పాడేవారు, మృదంగం, హార్మోనియం, తాళాలు వాయించే వారుంటారు. సత్యభామ పాత్రధారి స్త్రీ వేషం వేసుకొంటూ బరువైన నగలు, పొడవైన జడ, ముక్కుకుబుల్లాకి, మొక్కచెవులకుబుట్టలు, నెత్తననాగరం, జడకుచ్చులు, చేతికి దండకడియాలు, కాళ్ళకు గజ్జెలు అచ్చంగా యక్ష గానంలో మాదిరిగా తయారవుతాడు. శ్రీకృష్ణుని వేషం వేయిస్తారు. సూత్రధారి లేదా మాధవి పాత్రధారి ఎర్రటి, తెల్లటి వస్త్రాలను ధరిస్తూ నిలువు నామాలుపెడతారు. మిగతావారంతా

పంచెలు ధరిస్తారు. మృదంగం, హార్మోనియం, తాళాలు ప్రధానవాద్యాలు. తూర్పువీధి బాణీలో మృదంగము ప్రధానపాత్ర వహిస్తుంది. మృదంగాన్ని నడుముభాగానికి కట్టుకొని నిలబడి తెల్లవార్లూ వాయించాలి. ఇందుకు సాధారణంగా ఇద్దరు వాద్యకారులుంటారు. మృదంగం ప్రేక్షకులను ఉత్తేజపరుస్తుంది. వాయిద్యకారులు తమ మృదంగంతో సముద్రగర్జనలు కూడా వినిపిస్తారు. ఆ దరువును బట్టి నృత్యం ఉంటుంది. భేరీలు వినిపిస్తారు. కొన్నిసార్లు వెనుకకు, ముందుకు కూడా మృదంగాలను కట్టుకొని వాయిస్తారు. మృదంగ కళాకారులు తమ విద్యనంతటికి ప్రదర్శించి విద్వాంసులు అనిపించుకుంటారు. ఇందులో దరువులు, వృత్తాలు, అర్థచంద్రికలు, చూర్ణికలు వంటి దేశీయ సంగీత బాణీల్ని వాడుతారు. రాగాలు, తాళాలు, నేటి కర్ణాటక సంప్రదాయానికి చెందినవి అయినా రాగసంచారం, తాళ ప్రసారం ప్రాచీన సంప్రదాయ పద్ధతిలో నడుస్తుంది. తెలుగు దేశంలో ప్రదర్శింపబడే ఏ కళారూపంలో లేని విధంగా ఇందులో మృదంగం అత్యంత ప్రాముఖ్యాన్ని కలిగి ఉంటుంది. తూర్పు భాగవతానికి ఆయువుపట్టు మృదంగమే. జాతరలో ప్రదర్శింపబడే ఈ కళా రూపాన్ని చూచి జానపదులు అత్యానంద భరితులవుతుంటారు.

తూర్పు భాగవతంలో భాగవతుడే హాస్యగాడు కూడా అవుతాడు. కృష్ణుడితో ఉన్నప్పుడు ఇతడు మాధవుడు. సత్యభామతో ఉన్నప్పుడు మాధవి. ఇలా రెండు పాత్రల్ని హాస్యగాడే పోషిస్తాడు. హాస్యగాడు తలకు భగవతి అనే టోపిని ధరిస్తాడు. భగవతి 'ఓం' శబ్ద ప్రతిపాదిత చిహ్నంగా ఉండి, నాటకాన్నంతా నిరాటంకంగా నడిపేలా చేస్తుందని నమ్ముతారు. తూర్పు భాగవతంలోని ఆహార్యం ప్రత్యేకతను సంతరించుకుని ఉంటుంది. వారు రసాయనాలు కలిపిన వస్తువుల్ని ఆహార్యంలో వాడరు. పసుపు, ఎరుపురంగుల్ని నూనెలో కలిపి అద్దళం తయారు చేసుకొంటారు. దీనికి సింధూరం కలుపుతారు. స్త్రీ పాత్రలు కూడా నొసట విభూతి రేఖలు ధరిస్తారు. ఇది దృష్టి దోషాల్ని రూపు మాపుతుందని వారు భావిస్తారు. ఇందులో ప్రధాన పాత్ర అయిన సత్యభామ అలంకరణ చాలా సంక్లిష్టమైందిగా ఉంటుంది. సత్యభామకు 27 నక్షత్రాలను సూచించే 27 రకాల నగల్ని అలంకరిస్తారు. సత్యభామ ప్రవేశ దరువులో వాటిని సవివరంగా వివరిస్తుంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, జిల్లాల్లో అమ్మవారి పండుగలకు, గ్రామదేవతలపండుగలకు, ముఖ్యంగా పైడితల్లమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ, మోదకొండమ్మ. కొత్తమ్మతల్లి కోటదుర్గమ్మ, పండుగలకు మొదటిరోజున ఈ ప్రదర్శన తప్పనిసరిగా ఉంటుంది. అలాగే ఇతర తీర్థాలలోనూ, పేరంటాల జాతర్లలోనూ ప్రదర్శిస్తారు.

## 4.4. పిట్టలదొర:

ఎవరైనా గ్రామంలో సాధ్యంకాని మాటలు మాట్లాడితే, పిట్టలదొర, తుపాకి రాముని మాటలు అంటూ నేటికీ వ్యవహరించే నానుడి కనిపిస్తుంది. చెక్కతో తయారుచేసిన పొడవాటి ఒక తుపాకీ చేత పట్టుకొని, ఖాకీ నిక్కరు ధరించి, ఖాకీ చొక్కాధరించి, కోటుధరించి తలపై దొరటోపీ ధరించి కాళ్లకు

బూట్లు ధరించి, ప్యాంటును పైకిమడతపెట్టి, నోటితో ఈలను ఊదుతూ మాటలు సమకాలీన సమాజంలో ఉన్నటువంటి సంఘటనలను అంతర్జాతీయ విషయాలను దేశంలో ఉండే రాష్ట్రంలో ఉండే సంఘటనలను చెబుతూ ప్రతి ఒక్క విషయానికి హాస్యాన్ని జోడించుకుంటూ నిరంతరాయంగా ధారాళంగా చెబుతూ ప్రజలను మైమరిపించే టట్లు చేయడం పిట్టలదొరకు వెన్నతో పెట్టిన విద్య. పల్లెల్లో వీధి వీధి తిరుగుతూ పండితుల దగ్గరి నుండి పామరుల వరకు అందరిని కడుపుబ్బా నవ్వించే కళాకారుడు పిట్టలదొర. అతనికి ప్రదర్శనలో వాద్యాలు, పాటలు, అడుగులు అవసరం లేదు, అతనిమాటలే వాద్యాలు పాటలు అడుగులవుతాయి. అతను మాటలతో చిన్న పెద్ద, ముసలి ముతకా అందరికీ నవ్వులు తెప్పిస్తూ, నవ్వి నవ్వి కడుపు చెక్కలయ్యేలా చేస్తాడు. అతను వేషం ధరించి పల్లెలో మొదలైన దగ్గరి నుండి అతని వెంట పిల్లలు నవ్వుతూ తిరుగుతూనే ఉంటారు. అది అతని నైపుణ్యంతో కూడిన ఆకర్షణగా చెప్పవచ్చు. ఉత్తరాంధ్ర సంస్కృతిలో జానపద కళలు భాగమై, ఉత్తరాంధ్ర సంస్కృతీ వైవిధ్యాన్ని భాష గొప్పదనాన్ని తెలియజేస్తున్నాయి. ఇవి ప్రదర్శనలో భిన్నప్రక్రియలు కలిగి జానపద సమూహానికి విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తూ వస్తున్నాయి. ఆయా కళల కళాకారులు కూడా తమ కళను తరతరాలుగా పోషించుకుంటూ కాపాడుకుంటూ వస్తున్నారు. ఈ జానపద కళల్లో హాస్యం ప్రధానమైనది. తాము ప్రదర్శించే కథలో ప్రేక్షకునికి ఆసక్తిలేనట్లయితే, ఆ కథాంశంలో హాస్యాన్ని ప్రవేశపెట్టి కళాకారులు ప్రదర్శించే అంశాన్ని రక్తి కట్టిస్తారు. ఎడతెరపి లేకుండా ప్రత్యేక విషయంతో సంబంధం లేకుండా ఆశ్చర్యాన్ని కలిగించే విషయాలు అద్భుతాలు అతిశయోక్తులు అతని మాటల్లో కోటలుదాటే విధంగా చెప్పుతూ ప్రజలను ఆశ్చర్యచకితులను చేస్తాడు. తనకు ఎంతో డబ్బు ఉందంటూ, ఎంతో బంగారం ఉందంటూ మేడలు మిద్దెలు వున్నాయి అని చెప్పుతూ నేను లక్షాధికారినే కానీ భిక్షంపెట్టండి అంటూ తన తమాషా మాటలతో ప్రజలను నవ్విస్తూ, కవ్విస్తూ అలరిస్తూ మెప్పిస్తూ జీవనోపాధిచేస్తూ తన పొట్టపోసుకుంటూ ఉంటాడు. నవరసాలలో హాస్యరసం గొప్పది. అటువంటి "హాస్యాని ప్రజలకు అందించి వారిని కడుపుబ్బ నవ్వించే వారే ఈ పిట్టలదొరలు. వీరి హాస్యోక్తులు ఈ విధంగా ఉంటాయి.

"గుడ్మార్నింగ్ సార్, నేనిప్పుడే లండన్ నుంచి వచ్చాను సార్ రెండు కాళ్ల బండిపై వచ్చాను సార్ డబ్బులేని దొరగారు, యిక్కడ మీకు ఇళ్లు కట్టించమని నన్ను పంపారు సార్" వీరి అలంకరణ, మాటలు చూడగా ఆనాటి బ్రిటీష్ పరిపాలన తుపాకీపాలనగా ఉండేది కావున ఆ పరిపాలనను సుతిమెత్తని హాస్యోక్తులతో వ్యంగ్యంగా విమర్శిస్తూ ప్రజలను నవ్వించేవారని తెలుస్తోంది. ఈకళారూపాన్ని లత్కోరుసాబ్, బుడ్డర్ ఖాన్, తుపాకీరాముడు అని కూడా పిలుస్తారు.

ప్రమధ పురాతన నటు చరిత్రం
క్రమమొంద బహునాటకము
లాడువాడు లలితాంగరస

కళాలంకార రేఖల

బహురూపమాడేడివారు.

అని శ్రీ పొల్కురికి సోమనాథ కవి వ్రాసినదానినిబట్టి ఈ పిట్టలదొర కళారూపం ప్రాచీన కళారూపాలలో ఒకటని తెలుస్తోంది. అన్నమయ్య వ్రాసిన సర్వేశ్వర శతకంలోనూ, పాల్కురికి సోమనాధుడు వ్రాసిన పండితారాధ్య చరిత్రలోను బహురూపాల ప్రస్తావన ఉంది.

"మీరు వస్తారని ఆకాశమంత అరుగువేయించాను సార్, పటికరాళ్ల పచ్చడి. ఉమ్మెత్త ఇగురు, ఇటుకరాళ్ల వేపుడు, లారీల కొద్దీ పులిహోర, చెరువులకొద్దీ సాంబారు, జిల్లేడుపాల పెరుగు చేయించాను సార్... చేసినవాడే కానీ తిన్నవారు లేరు సార్...."

ఈ విధంగా హాస్యంతో కూడిన చురకలతో జనాన్ని పిట్టలదొర నవ్విస్తూంటాడు. ఈ కళాకారునికి సమకాలీన సామాజికాంశాలపై అవగాహన మరియు సమయస్ఫూర్తి ఎంతైనా అవసరం. పల్లెల్లో వీధి వీధి తిరుగుతూ పండితుల దగ్గరి నుండి పామరుల వరకు అందరిని కడుపుబ్బా నవ్వించే కళాకారుడు పిట్టలదొర. అతనికి ప్రదర్శనలో వాద్యాలు, పాటలు, అడుగులు అవసరం లేదు, అతని మాటలే వాద్యాలు పాటలు అడుగులవుతాయి. అతను మాటలతో చిన్న పెద్ద, ముసలి ముతకా అందరికీ నవ్వులు తెప్పిస్తూ, నవ్వి నవ్వి కడుపు చెక్కలయ్యేలా చేస్తాడు. అతను వేషం ధరించి పల్లెలో మొదలైన దగ్గరి నుండి అతని వెంట పిల్లలు నవ్వుతూ తిరుగుతూనే ఉంటారు. అది అతని నైపుణ్యంతో కూడిన ఆకర్షణగా చెప్పవచ్చు. 'సోగ్గాడే చిన్ని నాయన ఒక పిట్టనైన కొట్టలేదు సోగ్గాడు... కట్టె తుపాకెత్తుకోని గట్టుమీద నడుస్తుంటే కాలు జారి పడ్డాడే సోగ్గాడు' అంటూ 'ఆస్తిపరులు' సినిమాలో పట్టణ నేపథ్యంలోని ప్రియుడిని సరదాగా హేళన చేస్తూ ఒక పల్లెటూరి పిల్ల పాడిన పాట ఉంటుంది. ఇందులో అతడు పిట్టలదొర వేషంలో కనిపిస్తాడు.

పిట్టలదొర కళాకారుడు తాను ప్రధానంగా ఐదు నుండి పది నిమిషాల నిడివితో ఒక కథను గానం చేసినట్టుగా సంభాషిస్తాడు. అందులో ప్రధానంగా తన తుపాకి , వెంకట్రాముని పెళ్లి, తన అత్తమామల పెళ్లి తన వేట గురించి చారిత్రక సమకాలీన ఆర్థిక సాంఘిక అంశాల గురించి ప్రస్తావిస్తాడు. ఈ సన్నివేశాలతో ప్రాచీన ఆధునిక కవులకందని భావుకతతో, అతిశయోక్తి అలంకారంతో జానపదులను కడుపుబ్బ నవ్విస్తాడు. అంతేగాక తాను మాట్లాడే భాషలో ఉత్తరాంధ్ర యాస, వ్యవహార పదాలు విస్తృతంగా ప్రయోగిస్తాడు. జానపద కళల్లో బృంద కళలే మనుగడ సాధించలేని కాలంలో కూడా ఈ కళాకారులు తమ కళను కాపాడుకుంటూ వస్తున్నారు. ఎన్నో తరాల నుండి వ్యక్తిగతంగా ఒక్కరే ప్రదర్శించగల కళ లేదా పిట్టలదొర వేషం అక్కడక్కడ కొనఊపిరితో, ఆ కళాకారులు మెరుస్తూ జీవితం కోసం కాకుండా కళ మీద ఉన్న అభిమానంతో ప్రదర్శిస్తూ వస్తున్నారు.

తుపాకీ వెంకట్రాముని సంభాషణలో జానపదులకు ఆసక్తిని కలిగించే అంశాలే ఎక్కువగా ఉంటాయి. తన దగ్గర అన్ని ఉన్నాయంటూనే తన దగ్గర ఏమీ లేదనే విషయాన్ని స్పష్టం చేస్తాడు.

అంతేకాకుండా తను మాట్లాడే భాషలో ఉత్తరాంధ్ర యాసతో పాటు కళింగాంధ్ర వ్యవహార పదాలు, జంట పదాలు ఎక్కువగా ప్రయోగిస్తాడు. జానపదులను ఆకర్షించే విధంగా వీటన్నింటిని అద్భుతంగా తన నైపుణ్యంతో ప్రదర్శిస్తూ పొట్ట పోసుకుంటూ వస్తున్నాడు పిట్టలదొర. నేటి ఆధునిక కాలంలో కూడా పిట్టలదొర అనగానే పండితులకైనా, పామరుల కైనా పెదాల మీద చిరునవ్వు కనిపిస్తుంది. పిట్టలదొర వేషం తరతరాలుగా జానపద సమూహానికి ఆనందాన్ని కలిగిస్తూ వస్తున్నప్పటికీ, ఆ వేషం వేసే కళాకారులు మాత్రం ఆర్థికంగా పటిష్టం లేకుండా అదే వేషాన్ని కడుతూ గ్రామంలో మారాజా, మారాజా అంటూ ఇంటింటికి తుపాకి పట్టుక తిరుగుతూ పొట్ట కోసం అన్వేషిస్తూనే ఉన్నారు. వారి మాటల్లో ఉన్న గాంభీర్యం, ఆనందం వారి జీవితాల్లో మాత్రం కనిపించదు.

## 4.5. దోమ్మరాట(దొమ్మరులు):

బిక్షుక వృత్తితో కాలము గడుపుతూ ఊరూరు తిరుగుతూ స్థిరనివాసం లేక సంచార జీవనం చేస్తూ పొట్టకూటికై ప్రదర్శింపబడే అద్భుతమైన సాహసవంతమైన ప్రాచీన కళారూపం దొమ్మరాట. ఇది ఒక ప్రత్యేక కులమువారు అభ్యసించిన కళ. దొమ్మరాట కులంపేరుతో ఏర్పడిన సాహస కళ. ఈ కులమువారు దయనీయస్థితిలో సమాజంలో ఒక ఉనికి, ఒక గుర్తింపు లేక మిగుల దుర్భర దరిద్రజీవనం చేసి ఊరి బయట తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుంటూ బ్రతుకుతున్నా, వీరు ప్రదర్శించే ఆట మాత్రము ఆబాల గోపాలానికి ఆకర్షణీయంగా చూచుటకు ఆసక్తిగా ఉంటుంది. ప్రదర్శిస్తున్నంత సేపు ఉత్కంఠ భరితమై గగుర్పాటు కలిగే విధంగా చూపరులకు భయాందోళనలు కలిగిస్తుంది. ఈ దొమ్మరాట ఆ కులస్థులకు ఉగ్గుబాలతో బెట్టిన విద్య. ఇది కుటుంబ సభ్యులందరూ అభ్యసించే జానపద కళారూపం. దీనిని జీవితాంతము అభ్యసించి కొనసాగించే కళ కనుకనే ఇది కులవృత్తికే పరిమితమైనది. కులవృత్తితో కొనసాగిస్తున్న ఈ కళకు ఒకప్పుడు రాజాశ్రయము రాజపోషణ వుండేది. మడులు, మాన్యాలు కూడా వుండేవి. ఒకప్పుడు ప్రభువుల సమక్షంలో వారి విద్యను చూసి మెప్పుపొంది విలాసంగా జీవించిన వారు ఈనాడు ఆవిద్యను బాటసారులకి చూపి యాచకులుగా బ్రతుకుతున్నారు.

దొమ్మరి ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, ఒడిషా, మహారాష్ట్ర, బీహార్ తదితర రాష్ట్రాలలో కనిపించే ఒక సంచార జాతి. వీరిలో కొందరు వీధిలో సర్కస్ ప్రదర్శనలు ఇచ్చి సంపాదించేవారు. ఒకనాడు పడుపు వృత్తే వీరి జీవనాధారం. వారికి సంబదించిన సామెత. " చెప్పేది సారంగ నీతులు, దూరేది దొమ్మరి గుడిసెలు" వెళ్ళటం లేదు. ఆడవారు దువ్వెనలు, సూదులు, పిన్నీస్లు అమ్ముకుంటున్నారు. వీరు ఒళ్లు గగుర్పొడిచే విద్యలు ప్రదర్శిస్తారు. సన్నటి తాడుపై నడచి అబ్బురపరుస్తారు. బిందె మీద బిందెలు పెట్టి వాటిపైన సాహసాలు చేస్తారు. గడ ఎక్కి ఊరికి శుభం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటారు. ఈనాటి జిమ్నాజియానికి తీసిపోని విన్యాసాలు చేస్తారు దొమ్మరులు. దారిన వెళ్లేవారు కూడా కాసేపు నిలబడి వీరి ప్రదర్శన చూసి సంతోషంగా తమకు తోచినంత ఇచ్చి వెళ్ళేవారు. దొమ్మర కులస్థులు నిత్యసంచారులు.

చివరికి వారుండే గుడిసెలను కూడా గాడిదలపై వేసుకుని ఊరూరా తిరుగుతారు. వీరు ఇంట్లో వస్తువులతో పాటు కోతులు, గుర్రాలు కుక్కలను కూడా తమ వెంట తీసుకెళ్లి ముందుగా ఊరి చివర దిగుతారు. తర్వాత ఊరి పెద్ద వద్దకు పోయి ఆ గ్రామంలో ప్రదర్శన ఇస్తామని చెబుతారు. దొమ్మరులు గ్రామంలో అడుగుపెడితే శుభసూచకమనే భావన ఉండేది. ఎవ్వరూ అడ్డు చెప్పేవారు కాదు. పదేళ్లు వచ్చేసరికి వీరు తమ పిల్లలకు శిక్షణ ఇస్తారు. గడ ఎక్కడం, దూకటం, పల్టీలు కొట్టటం, మొగ్గలువేయడం బిందెల మీద బిందెలు పెట్టి దానిమీద మనిషిని నిలబెట్టటం వంటివి సాధన చేయిస్తారు. విన్యాసాలు ప్రదర్శించే వీరంతా గ్రామ కూడలిలోనో, చావిడి దగ్గరో ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. దొమ్మరులు గ్రామానికి వస్తే శుభం కలుగుతుందని ప్రజల నమ్మకం కనుక వర్షాలు కురవకపోయినా, పంటలు పండక పోయినా దొమ్మరవాళ్ళను ఆ గ్రామానికి ప్రత్యేకంగా పిలిపించుకుంటారు. విన్యాసాలు చేసే సమయంలో ప్రమాదవశాత్తు జారిపడితే వెంట తెచ్చుకున్న చెట్ల పసర్లతో వైద్యం చేసుకునేవారు.

దొమ్మర కుటుంబంలో ఉన్నవారంతా వంశపారంపర్యంగా ఈ విద్యలను బాల్యం నుంచే అభ్యసిస్తారు. ఇది కులవృత్తి, కుటుంబవృత్తి. ఇందులో కుటుంబ సభ్యులెల్లరూ భాగస్వాములే. దొమ్మరాటలో భార్యభర్తలు వారి పిల్లలు అందరూ పాల్గొంటారు. భర్త వివిధ విన్యాసాలు చేస్తే భార్య మద్దెలను వాయిస్తూ మధ్యమధ్య కేకలు వేస్తూ చప్పట్లు కొట్టిస్తూ వుంటుంది. ప్రదర్శనానికి ముందు మద్దెల గట్టిగా వాయించుతారు. ఈ శబ్దానికి గ్రామీణ వాసులందరూ ఆబాలగోపాలం గుమిగూడుతారు. వీరంతా ప్రదర్శనానికి ఆటంకము కలిగించకుండా దూరంగా వుండడానికి పెద్ద వలయాకారముతో గీతగీసి ఆ వలయములోనికి రాకుండా ప్రేక్షకులను వెలుపల కూర్చోబెడుతారు. చాలా చోట్ల నిలబడే చూస్తారు. ఈ ఆటల్లో వయసులో ఉన్న ఇద్దరో ముగ్గురో స్త్రీలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటారు. ఓ పెద్ద వెదురు గడను పాతుతారు. దానిని బలమైన త్రాళ్ళతో పక్కలా లాగి కడతారు. ఒకరు బిగ్గరగా డోలు వాయిస్తుంటే దొమ్మరుల పిల్లలు పిల్లిమొగ్గలు వేస్తుంటారు. అప్పటికి ఊరి జనులంతా గుమిగూడుతారు. యువతుల పిల్లిమొగ్గలకు, చేసే విన్యాసాలకు యువకులు ఉబ్బితబ్బిపోతారు. డప్పు డోలూ ధ్వనుల దొమ్మరుల విన్యాసాలకు బలాన్ని చేకూరుస్తాయి. స్త్రీలు ఎత్తుగా ఉన్న తీగ మీద వెదురుగడ ఆధారంగా ఆ పక్క నుంచి ఈ పక్కకు నడిచివెళ్ళే సన్నివేశం ఒళ్ళు గగుర్పొడిచేదిగా ఉంటుంది. ఒక్కోసారి తీగ మీద నుంచి వారు పడిపోతారేమోనన్న భయం కూడా కలుగుతుంది.

ఎత్తుగా ఉన్న గడ మీదకి స్త్రీ పురుషుడూ గబగబా ప్రాకి పై అంచున నిలబడి, కూర్చొనీ, పడుకొని, అనేకరకాల విన్యాసాలు చేస్తారు. అక్కడి నుంచి పల్టీకొట్టి తాటి నుంచి జారి కిందకు వస్తారు. గడ మీదకు స్త్రీ ఎగబ్రాకి గిర్రున తిరుగుతూ చాతుర్యాన్ని చూపడం జరుగుతుంది. ప్రేక్షకులు చప్పట్లతో ఈలలతో దొమ్మరసానిని ఉత్సాహపరిచి ఆనందిస్తారు. ఇదే తరుణంలో ప్రేక్షకుల నుండి దొమ్మరసానులు, పిల్లలు, పెద్దలూ డబ్బులు యాచిస్తారు. సంచులు నింపుకుంటారు. దొమ్మరాట వ్యాయామక్రీడలా కన్పించే

జానపద కళారూపం. ఈనాటి సర్కస్ ఆటకు మూలం దొమ్మరాటలేనని విజ్ఞుల అభిప్రాయం. దొమ్మరసాని గడ ఎక్కడం గ్రామానికి శుభం అనే నమ్మకం నేటికీ పల్లెప్రజల్లో ఉంది.

భయంకరమైన విద్యలను ప్రదర్శించే దొమ్మర కులస్థుల ఉత్తరాంధ్రలో పలాస, మెలియాపుట్టి విజయనగరం, దాసుపురం, వీరాపురం, శ్రీకాకుళంలలో ఉన్నారు. రాళ్ళను చేతులతో పగలగొట్టడం, గుండెపై రాళ్ళను ఎత్తటం, తీగలపై కర్రను పట్టుకుని అటు ఇటు తిరగడం, ఇనుప రింగుల లోకి దూరడం, కోతులతో విన్యాసాలు చేయించడం. పైకి కాలు లేపి చేతులతో నడవడం, నిప్పుతో మండుతున్నటువంటి రింగులలోకి దూరడం సన్నగా ఉన్నటువంటి రంగుల్లోకి శరీర భాగాలను వెళ్లేలా చేయడం సాహసంతో కూడినటువంటి మొగ్గలు వేయటం, గుర్రపు స్వారీ లాంటి విద్యలు చేస్తారు. డబ్బులతో మ్రోగించడం, చిన్నపిల్లలను చేతులతో పట్టుకొని పైకి లేపడం అదేవిధంగా ఒక కర్రను తీసుకొని ఆ కళకు ఒకవైపు తను పట్టుకొని మరోవైపు పిల్లవాడిని పైకి పెట్టి నిలువుగా ఉంచడం, అదేవిధంగా పడుకోబెట్టడం ఆ తర్వాత కర్ర ను విడిచిపెట్టి పై నుండి పడుతున్న పిల్లవాడిని పట్టుకోవడం, ఈ సందర్భములో కళ్లుమూసుకున్న ప్రేక్షకులు ఆకాశమునంటే విధంగా చేసే కరతాళ ధ్వనులు, మిగులగగుర్పాటు కలిగిస్తుంది. ఇంతటి సాహసవంతమైన భిక్షక కళారూపములోని వివిధ అంశములను వివిధ విన్యాసాలతో అనుకరించి వీటి జతకు కొన్ని జంతువుల విన్యాసాలను కూడా జత పరచి చూపెట్టి సర్కస్ అను పేరుతో నవనాగరికంగా మహానగరాలలో లక్షలాది రూపాయలు ఆర్జించుచున్నారు. దొమ్మరాటవారు మాత్రము, తట్ట, బుట్ట చేత బట్టుకొని పొట్టకూటికై ఊరూరు తిరుగుతూ, తమ కులవృత్తితోనే మిగుల దయనీయ స్థితిలో మండుటెండల్లో చేసే వీరి విద్యలు కూడా పొట్ట నింపడం లేదు. నానాటికీ ఆదరణ కోల్పోతున్న ఈ కళారూపాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఆధునిక సమాజం పైన ప్రజాప్రభుత్వంపైనా ఎంతైనా ఉంది.

## 4.6. పాములాటలు (మోడీలు):

పాముబుట్టను పట్టుకొని నాగస్వరం వాయిస్తూ ఇంటింటికీ తిరిగే పాములవాళ్ళను నేటికీ మనం అంతటా చూస్తున్నాము. పాముల్ని పట్టి, ఆడించి ప్రజల్ని యాచించి జీవించడం వారి వృత్తి. పుట్టల్లోని పాముల్ని పట్టి విషం తీసి, పళ్ళను పీకేసి మూతి కుట్టి గుడ్డూ పాలు పోసి మచ్చిక చేసి నాగస్వరం ఊదుతూ దానితో గ్రామాల్లో ఎన్నో విన్యాసాలు, నృత్యాలు చేయిస్తారు. ఒక్కొక్కసారి రెండు కోడె త్రాచుల్ని ఎదురెదురుగా ఉంచి, తాను వాయిద్యంతో ఆ రెంటినీ రెచ్చగొట్టి లబ్జుగా పాముల బూర ఊదుతూ తాను నేత్ర పర్వంగా నృత్యం చేస్తాడు. పాము పొడిచినట్లు, విషం తలకెక్కి నట్లూ తూలుతూ, త్రుళ్ళుతూ సొక్కి పోతూ, తనమంత్ర విద్యను ప్రవేశపెట్టి, క్రమేపీ కోలుకుని బ్రతికానన్నంత సంతోషంతో ఆనంద నృత్యం చేసి ప్రజలందరిని తృప్తిపరిచి డబ్బులు దండుకుంటాడు. నిజంగా పాములవారి నృత్యం నేత్ర పర్వంగానే వుంటుంది. సహజంగా చాల మంది స్వయంగా త్రాచు పాముల్ని చూడలేరు. అటువంటి తెల్ల త్రాచుల్నీ, కోడె త్రాచుల్నీ, గోదుమవన్నె త్రాచుల్నీ కష్టపడి పట్టుకొచ్చి తమ జీవనోపాధి కోసం వృత్తిని సాగిస్తారు.

కోడెనాగు, మల్లినాగు, చంపంగినాగు, త్రాచుపాము వంటి పాములను మెడలో వేలాడ దీస్తారు. వీరు ఒక ఊరినుంచి మరో ఊరికి సంచారం చేస్తూ పాముల్ని పడుతూ, పాము కాటుకు గురైన వాళ్ళకు మందులిస్తూ జీవిత యాత్ర సాగిస్తారు. వాయిద్యాల కనుగుణంగా మెలికలు తిరుగుతూ పాము నాట్యం చేస్తుంది. ప్రేక్షకులు సంతోషించి తమకు తోచినంతా ధనాన్ని దానం చేస్తారు. ఆ విధంగా పాములవాడి కుటుంబ జీవనం గడుస్తుంది. వాయిద్యాలతో రెచ్చగొట్టి ఒక్కోసారి రెండు త్రాచులు పెనవేసుకొని కలహించే దృశ్యాన్ని చూపిస్తారు. అది ప్రేక్షకుల ఒళ్ళు గగుర్పొడిపించేదిగా ఉంటుంది. ఒక్కోసారి పాములతో కరిపించుకుంటూ, విషమెక్కినట్టు సోలిపోతారు. క్రమేపీ ఏదో అతీతశక్తితో కోలుకున్నట్టు నటిస్తారు. ఇది చూసిన ప్రేక్షకులు దయతో చేతికి వచ్చినంతా ఇస్తారు. ఈ విధంగా వారు ఒక ఊరి నుంచి మరో ఊరికి సంచారం చేస్తూ పొట్ట పోసుకుంటారు.

### పోటీల మోడీలు:

ఈ రోజుల్లో మోడీలంటే ఎవరికీ తెలియదు. కానీ ఏబై సంవత్సరాల క్రితం ఈ మోడీలు అధికంగా పల్లె ప్రాంతాల్లో జరిగేవి. పలానా గ్రామంలో ఫలానా అరోజున మోడి అని తెలిస్తే సరి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండొప తండాలుగా వచ్చి పడేవారు. అది ఒక పెద్ద ఉత్సవంగానూ ఇరుపక్షాల మధ్య జయాపజయాల పోరాటంగానూ సాగేది. ఒక్కొక్క సారి గ్రామ జాతర్ల సమయం లోనూ, సంతల సమయాల్లోనూ కూడ ఈ ప్రదర్శనాలు జనరంజకంగా జరిగేవి. ఈ మోడీలు అరవై సంవత్సరాల క్రితం పాములనాడించే పాముల వారి ముఠాల మధ్యనే జరిగేవి. ఇవి చాల పౌరుషవంతంగా జరిగేవి. చావు బ్రతుకుల పోరాటంగా పోరాడే వారు. అయితే ఈ మోడీలను ఇతర కులస్థులైన పెద్దేటు గొల్లలు మొదలైన వారు చేసే వారని ప్రతీతి. ఈ మోడీలకు సంబంధించిన వారు ఇంద్రజాలం, హస్తలాఘవ విద్యలలో మంత్ర తంత్రాలలో ఆరి తేరినవారై వుండేవారు. ఇవి ఊరి మధ్యనో, లేక విశాల మైన మైదాన ప్రదేశంలోనో ప్రజల మధ్యన జరిగేవి.

## 4.7. పగటి వేషాలు:

జానపద కళారూపాలన్నీ కూలాలను బట్టి వృత్తిని బట్టి, వాద్యాల పరికరాలను బట్టి పేర్లు ఏర్పడితే, ప్రదర్శనా స్థలమునుబట్టి గూడా కొన్ని జానపద కళారూపాలు పిలువబడగా, ప్రదర్శనా సమయాన్ని బట్టి ఏర్పడిన ఏకైక కళారూపం పగటి వేషాలు, ఈ జానపద కళారూపాలు పగటిపూట మాత్రమే ప్రదర్శింపబడుతాయి, వేషాలు అనడం వల్ల ఇవి ఒకటిగానేగాక, పలువేషాలుగా ప్రదర్శింపబడుతాయి. కనుక వీటిని బహువచనంలో వేషాలని పిలవడం ఆచారమైంది. పగటివేషాలంటే పగటి పూట ప్రదర్శించే కళారూపమని అర్థం. సాధారణంగా ఇతర కళారూపాలు ఏ కాలల్లోనైనా ప్రదర్శించవచ్చు. కాని, పగటి వేషాలు మాత్రం పగటి పూట మాత్రమే ప్రదర్శింపబడతాయి. కేవలం ప్రదర్శనా సమయమే కళా రూపానికి

పేరుగా ఆపాదించబడడం అనే ప్రత్యేకత బహుశ ఈ ఒక్క కళారూపానికే దక్కిందేమో! పగటిపూట ప్రదర్శించబడే వేషం. వేషం అంటే మారు వేషం, పాత్రధారి, పాత్రపోషణ అనే పర్యాయ పదాల అర్థంగా ఇక్కడ తీసుకోవాలి. పగటి వేషం అన్నా వేషాలు అనే సమానార్థానే కలిగి వుంటాయి. ఎందుకంటే అది ఒక వేషం కాదు. ఒక వేషంతో వచ్చే వివిధ వేషాలు అంతే కాక, అవి ఇతర కళారూపాలుగా రోజుకు ఒకసారే ప్రదర్శించబడక అనేక ప్రదేశాలలో, అంటే ఇంటి ముందు, గ్రామ చావిడులలో, విశాలమైదానాలలో, రోడ్ల వెంట, దుకాణాల ముందు, ఇలా ఎలాగైనా, ఎప్పుడైనా ప్రదర్శింప బడతాయి. కాబట్టి వేషం అనే మాటకు ప్రదర్శన సందర్భాన్ని బట్టి బహువచనంగా తీసుకోవాలి. అనేక చోట్ల వివిధ గ్రామాలలో ఇలా సంచారం చేస్తూ, తమ జీవనవిధానాన్ని ప్రదర్శనతో ముడి పెట్టుకున్న కళాకారులే పగటి వేషగాళ్ళు. ఈ కళారూప ప్రదర్శన ఒక రకంగా అంటే అలవోకగా ప్రదర్శింపబడే నాటక ప్రక్రియ. అంటే ఇక్కడ ఉద్దేశ్యం ఇవి ఇతర జానపద నాటక ప్రదర్శనలలాగా వీటికి పూర్వరంగ ఆర్భాటాలు, సుదీర్ఘ ప్రారంభాలు వుండవు. కేవలం ప్రదర్శించే స్థలం, ప్రేక్షకుల ఆదరణ, నిరాదరణలు, కళాకారుల ప్రతిభ పైనే ప్రదర్శనా శైలి ఆధారపడి ఉంటుంది.

పగటి వేషాలు ఫలానా కాలంలోనే పుట్టాయి అని చెప్పడానికి అనేకమంది పరిశోధకులు వివిధ ప్రయత్నాలు చేశారు. అయితే పరిశోధకులు ఈ కళారూపం ముందు సామాన్య కళారూపంగా పుట్టి, కాలక్రమేణా ఒక సంక్లిష్ట కళారూపంగా మారిందని వాదిస్తారు. శాతవాహనుల పరిపాలనా కాలం నుంచి ఈ కళారూపం వుందని, హాలుడు రాసిన “గాధా సప్తశతి"లో దీని ప్రస్తావన వుందని ఒక వాదన. తరువాత 13వ శతాబ్దం నాటివాడైన పాల్కురికి సోమన రాసిన "పండితారాధ్య చరిత్ర”, "బసవ పురాణం'' లో కూడా పగటి వేషాల ప్రస్తావన వుంది. శ్రీశైలం వెళ్ళే భక్తులకు ప్రయాణ బడలికను తీర్చే సాధనంగా ఈ కళారూపం అప్పుడు ఉపయోగపడిందని ఒక అభిప్రాయం. అంటే కళారూప వికాస దశ అటు సామాజిక వ్యవస్థతోను, ఇటు మతపరమైన ధోరణులతోను ముడిపడి ఉందని అర్థమవుతోంది. మొదటి చిన్న చిన్న భాగాలు, ముక్కలుగా వున్న ఈ కళారూపాలు శిష్ట సాహిత్యం, మార్గ కళారూ పాలు, వాటిని ప్రదర్శించే దేశికుల నుంచి జానపదులకు చేరాయని అర్థం. పగటివేషాలు కూడా కూచిపూడి భాగవతుల యక్షగానాలలోని కొన్ని చిన్న చిన్న అంశాలే పగటి వేషాలుగా మార్పు చెందాయి అన్నది ఒక వాదం. అర్ధనారీశ్వర, శక్తివేషాలు, ఈ రకానికి చెందిన వాదనని బలపరుస్తాయి.

ఆంధ్రదేశంలోని అన్ని ప్రాంతాలలోను, రాయలసీమ, కోస్తా, తెలంగాణా ప్రాంతాలలోను, తూర్పు కర్ణాటక, ఉత్తర తమిళనాడులోను, బెంగాల్, ఉత్తర ప్రదేశ్ ను, దాదాపు ఇలాంటి కళారూపం వుంది కాబట్టి సాంస్కృతిక, కళాత్మక వారసత్వాలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి చేరే అవకాశం ఉంది అనేది మరొక వాదం. ఏది ఏమైనా పై వాదనలను నిర్ద్వంద్వంగా బలపరచలేం! ఎందుకంటే ఇవన్నీ అయివుండవచ్చు. కాకపోవడానికి సరైన ఆధారాలు లేవు. పగటి వేషాల్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రస్తుతానికి జంగాలు, ప్రస్తుతం ఈ కళారూపాన్ని తమ జీవనాధారంగా చేసుకున్న వాళ్ళు జంగాలు. 'జంగమ' అంటే ఒక ప్రదేశంలో స్థిరంగా వుండని వారని అర్థం. చరిత్రపరంగా చూస్తే వీళ్ళు అటు శైవానికి, ఇటు వైష్ణవానికి సంబంధించిన వాళ్ళు.

పూర్వకాలంలో ఈ పగటి వేషకళాకారులకు జమీందార్లు, జాగీరుదార్లు, పాలెగాళ్లు, భూస్వాములు, ఇతర ధనిక వర్గాల ఆదరణ పోషణ వుండేది. సంచారంలో భాగంగా వాళ్ల ప్రదర్శనాలు ముగిశాక సంభావనలు తీసుకొనేవారు. కానీ నేడు జమీందార్ల, జాగీరుదార్ల, వ్యవస్థ రద్దయ్యాక ఈ కళాకారులు గ్రామ గ్రామం తిరిగి, ప్రతి ఇంటికి, బజార్లలో ప్రతి అంగడి ముందు ప్రదర్శనమిచ్చి జీవనం సాగిస్తున్నారు.

ముఖ్యంగా పగటి వేషాల ప్రదర్శనల ప్రధానలక్ష్యం, వ్యంగ్యాత్మక ధోరణి ద్వారా హాస్యాన్ని సృష్టించడం. తద్వారా ఆయా కులాల సంబంధించిన అవగాహన పూర్తి సమాజానికి కలిగించడం. ప్రేక్షకుల ఏకాగ్రత ఆకర్షించడానికి, వ్యంగ్యాన్ని వాచికాభినయంలో భాగంగా కళాకారులు విరివిగా వాడుతారు. ఈ వేషాలు ఒక రోజు ఒకే చోట ప్రదర్శింపబడవు. వీధివీధి, ఇల్లిల్లూ తిరుగుతూ ప్రతిరోజు దాదాపు ఐదారు గంటలు వివిధ ప్రదేశాలలో ప్రదర్శిస్తూ వుంటారు. ప్రదర్శన కొనసాగుతున్నప్పుడు కళాకారులు, ప్రేక్షకుల మధ్యన స్థల వ్యత్యాసాలుండవు. ప్రేక్షకులు, ప్రదర్శకుల చుట్టూ వృత్తాకార, అర్థవృత్తాకారాలు చతురస్కార అర్దచతురస్కారాలుగా ఏర్పడి, కళాకారులకు చాలా దగ్గరగా ఉంటారు. ఇతర జానపద నాటక ప్రక్రియలలోలాగ ఇక్కడ రంగస్థల వస్తు సామగ్రిని ఉపయోగించడానికి వీలులేదు. ప్రేక్షకుల ఆసక్తి, ఓపికలపై ఈ ప్రదర్శనా సమయాన్ని కుదించడమో, పెంచడమో అవుతుంది.

ఈ కళాకారులు ఒక పాత్రను దానికి సంబంధించిన ప్రత్యేకతను చాటుకుంటూ ప్రతిభావంతంగా ప్రదర్శన చేస్తారు ఈ ప్రదర్శనలో ముఖ్యంగా కృతయుగం త్రేతాయుగం ద్వాపరయుగం కలియుగం మొదలైన యుగాలలో వివిధ దేవతల అవతారాలను వాటి యొక్క ప్రత్యేకతను ప్రదర్శన చేస్తూ ఉంటారు. ముఖ్యంగా రాముడు లక్ష్మణుడు ఆంజనేయుడు గ్రామ దేవతలు వివిధ వేషధారణను ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శనలో ఎంతో వైభవంగా కళాత్మకంగా వివిధ వేషధారణ వాటికి సంబంధించిన పరికరాలను (ఆయుధాలను) రంగులను అలంకరించుకుని ప్రజలను ఆకట్టుకునే విధంగా ప్రదర్శన చేస్తారు. కళాకారులు పౌరాణిక పాత్రలతో పాటు కొన్ని చారిత్రక పాత్రలు కూడా వేస్తుంటారు. ఆధునిక స్వతంత్ర సమరయోధులు గాంధీ, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్. సుభాష్ చంద్రబోస్ వంటి పాత్రలు ప్రదర్శన చేస్తారు. అలాగే ఫకీరు సాహెబ్, ఇంద్రజాల మాయగాడు, భద్రాచల దాసుడు సాతాని వైష్ణవులు వంటి పగటి వేషాలు వేసుకుంటూ గ్రామాలల్లో వీధులలో తిరుగుతూ ప్రజలను ఆనందపరుస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ సమయంలో సమకాలీన సమాజానికి సంబంధించిన అంశాలను

సంభాషణలను జోడించి ప్రజలను మెప్పిస్తుంటారు. అయితే ఇతర జానపద రూపకాల వలెనే ఈ కళారూపాలకు కూడా కళాదరణ తగ్గిందని చెప్పవచ్చు.

జానపద కళారూపాలపై పరిశోధన చేసిన శ్రీ బద్రి కూర్మారావు ఇలా చెబుతున్నారు. కృతయుగం త్రేతాయుగం, ద్వాపర కలియుగాలకు సంబంధమైనవి పగటివేషాలు. కృతయుగంలో దేవతలు, రాక్షసులు సాగర మధనం చేస్తున్నప్పుడు అమృతం పుడుతుంది. ఆ అమృతం రక్షసుల పాలుకాకుండా చేసేందుకు సాక్షాత్తు ఆ మహావిష్ణువే మోహినీ వేషం వేసుకుని అమృతం దేవతలకు పంచి పెట్టడం జరిగింది. త్రేతాయుగంలో శ్రీరాముని ధర్మపత్ని సీతాదేవిని అపహరించుకు పోవడానికి లంకాధిపతి రావణుడు జంగమ వేషధారియై తన కార్యం నెరవేర్చుకున్నాడు. ద్వాపర యుగంలో ఊర్వశి శాప ఫలితంగా అర్జునుడు బృహన్నల వేషంతో రక్తి కట్టించాడు. కలియుగంలో రాజ్యాన్ని కాపాడడానికి కళింగరాజు గంగరాజు వేషం వేశాడని చరిత్ర చెబుతోంది. ఈ అంశమే కాకుండా పగటి వేషాలు వేసే కళాకారులు పౌరాణిక పాత్రలతో పాటు కొన్ని చారిత్రక పాత్రలు కూడా వేస్తుంటారు. సాధారణంగా తెలుగు వారి పండుగ లైనా దసరా, సంక్రాంతి, దీపావళి సందర్భంలోనూ గ్రామ దేవతల జాతర్లు ఉత్సవాలు సందర్భంగా వేస్తుంటారు. ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా ఈ కళారూపాలపై ఆధారపడినటువంటి కళాకారుల జీవితాలను మెరుగుపరిచేలా వారికి తగినటువంటి ఆర్థిక వెసులుబాటును ఇళ్ల స్థలాలను కేటాయించి సబ్సిడీ రుణాలను సంబంధించిన దుస్తులను అందించి సహాయం చేయాలి. మన సంస్కృతిని కళారూపాలను పరిరక్షించాలి.

## 4.8. ఎరుకల వాళ్ళు:

సోది చెపుతానమ్మ సోది"
మధుర మీనాక్షి పలుకు
కంచి కామాక్షి పలుకు
కాశీ విశాలాక్షమ్మ పలుకు
బెజవాడ కనక దుర్గమ్మ పలుకు
జొన్నవాడ కామాక్షమ్మ పలుకు
శ్రీ శైల భ్రమరామ్మ పలుకు
సకల దేవతలు పలుకు..
అమ్మ పలక మన్న పలుకు చెప్పటానికే వచ్చా
అడిగింది అడిగినట్లు చెపుతా.. అడగంది అడిగినట్లు చెపుతా..
మాట చెప్పి పోదామనే వచ్చినా బిడ్డా..
అమ్మ పై నమ్మకం పెట్టుకుని అడుగు..

జరగబోయేది చెపుతా జరిగింది చెపుతా.. వినుకోయే తల్లి..

అని ఎడమ చేయి అందుకుని..

ఎడమ భుజం తాకిందంటే పుట్టింటి సోది అడుగుతున్నవని అర్థం, కుడి భుజం తాకిందంటే మెట్టినింటి సోది అని అర్థం.

నేను చెపుతున్న సోది ఏమంటే..

అంటూ.. చేయిని ఎడమ భుజం తాకించి.. ఈ సోది అడుగుతున్నవే బిడ్డా.. ! ఎందుకడుగుతున్నవంటే.. ఈ దినాలు వచ్చిన్నయంటే నన్ను తల్చుకుని కన్నీరు మున్నీరు అవుతావే బిడ్డా! అంటుంది.

''చేతినిండా అన్నం ఉంది. నిండు నూరేళ్లు ఆయుష్షు ఉంది. ధర్మగుణం చాలా ఉందమ్మా నీకు. కఠినత్వం లేదు. కుళ్లు, కుత్సితం లేదు. అన్నం పెట్టే బంధువులున్నారు. ఆదరించే బాలలున్నారు. కొడుకులు, కోడళ్లు, చూసేవాళ్ళున్నారు నీకేం ఫరవాలేదమ్మా. నిండు నూరేళ్లు పూజిస్తారు నిన్ను..'' అని చెబుతోంది.

సోది చెప్పే పాటను కంఠతా చేసి ఉంటారు. చూసి చదవడానికి వాళ్లలో చాలామందికి చదువురాదు. తల్లి నుంచి కూతురు నేర్చుకుంటుంది. ఏళ్లుగా ఈ పరంపర కొనసాగుతోంది. ఇది ఎరుకల వృత్తి. సోది చెప్పి, బుట్టలల్లి జీవనాన్ని సాగిస్తారు.''దేవుడు మనుషులకు బతకడానికి ఒక్కొక్కరికి ఒక్కో పనిముట్టు ఇచ్చాడు. మాకు మగవాళ్లకు ఈతాకు కోసే కత్తి, ఆడవాళ్లకు సోదిబుర్ర ఇచ్చాడని పెద్దోళ్లు చెప్తారు. ఎరుక చెప్పే వాళ్ళు కావడంతో వీరిని ఎరుకల వాళ్ళంటారు. 'ఎరుక వాళ్లు లేని ఊరు ఊరే కాద'న్నాడు ఆ దేవుడు. ఇళ్లల్లో మగపిల్లలకు అడవికి పోయి ఈత కోసుకొచ్చి బుట్టలల్లడం నేర్పిస్తారు. ఆడపిల్లలకు బుట్టలల్లడంతోపాటు సోది చెప్పడం కూడా నేర్పిస్తారు''. సముద్రంలో గవ్వలు తెచ్చి, వాటిని గట్టి అట్టలా ఉండే గుడ్డకు కుట్టాలి. పసుపు, కుంకుమ బొట్లు పెట్టాలి. అది వాళ్ళ సోది దేవత రూపం. ఇక బుర్ర కోసం... చెట్టునే ఎండిపోయిన సొరకాయ కావాలి. దానికి కింద వైపు చిల్లు పెట్టి గుజ్జు, గింజలు తీసేసి శుభ్రం చేసి ఆరబెట్టాలి. కర్రకు సొరకాయ బుర్ర, వీణతంతిని కడితే అదే సోది బుర్ర. నాలుగైదేళ్ళకోసారి పాత బుర్ర తీసేసి కొత్త బుర్రను కట్టాలి. చేతిలో సోదిబుర్ర, నాలుక మీద పాట ఉంటే... కరువులో కూడా అన్నం పుట్టించుకోవచ్చు అని వాళ్ళు అంటారు .

సోదికి వెళ్లే రోజు ఉదయమే నిద్రలేచి స్నానం చేసి గదిని శుభ్రం చేస్తారు . సోది బుర్రని తుడిచి, పసుపు రాసి కుంకుమ పెడతారు . సోది చెప్పేటప్పుడు దేవత రూపాన్ని బియ్యంలో పెట్టి, ఆకువక్కలు, దక్షిణ పెట్టి దణ్ణం పెడతారు. దేవతలందరినీ తలుచుకుని వాక్కు ఇవ్వమని వేడుకుంటారు . ఎవరి ఇలవేల్పు వారికి వాక్కు ఇస్తారు. సోదిలో వాళ్ళు ఏం చెప్పుతారనేది తర్వాత వారికి గుర్తుండదు. పిల్లలు పుట్టని వాళ్లు, అనారోగ్యం వచ్చినవాళ్లు, ఇంట్లో కలతలు, పెళ్ళీడు దాటినా పెళ్ళి కుదరకపోవడం.. ఏ

కష్టం ఉన్నా వీరిని పిలుస్తారు. వీరు చెప్పినట్లు జరిగితే మళ్లీ పిలిచి భోజనం పెట్టి, చీర, తాంబూలం పెడతారు. 'సోది' అని తేలిగ్గా తీసిపారేస్తాం కానీ.. ఇప్పటి కౌన్సెలింగ్‌లు అన్నిటికీ అదే పునాదేమో అనిపిస్తుంది. మనిషి కష్టంలో ఉన్నప్పుడు ఓదార్పు కావాలి. 'భయపడవద్దు, ధైర్యంగా సాగిపో' అని చెప్పే ఒక శ్రేయోభిలాషి ఉండాలి. 'సోది'లో అలాంటి అభిలాషే ఉంటుంది. శాస్త్రబద్ధతను పక్కన పెడితే... సోది చెప్పడంలో.. 'నువ్వు చేయాల్సిన పని నువ్వు చెయ్యి, నీకు అండగా దైవశక్తి ఉంది, ఆ శక్తి నిన్ను సరైన దారిలోనే నడిపిస్తోంది' అని ధైర్యం చెప్పడం ఉంటుంది.

సోదె అనేది పూరాణాలలో దేవతా కథలలో, రాజుల కథలలో ప్రాముఖ్యము వహించినా సమాజములో మిగుల నిరాదరణగా, దైన్యంగానే జీవన యాత్ర కొనసాగింపబడుచున్నది. ఇది ఏ కథలో పాత్ర వహించినా అది వారి కన్నీటిని తుడిచి వారి ఉజ్జ్వల భవిష్యత్తుకు పరిష్కారోపాయములు తెలిపి తోడ్పడిన కళగా గుర్తింపు పొందినది. దేవతలైనా, రాజులైనా పరిష్కార మార్గము తెలియక బాధ పడే పరిస్థితులలో కొరవంజిని ఆశ్రయించక తప్పదు. కొన్ని కొన్ని సందర్భాలలో ఎరుక నెరుక పరచేవారుగానే గాక, దూతలుగా, రహస్య సందేశములను చేరవేసే వారుగా ఈ సోదె పాత్రలు కీలకమైనవిగా తోడ్పడియుండుట మనకు సుపరిచితమే. ఇంతటి విశిష్టమైన పాత్ర పోషణ చేసినవారు ఈ నాటికీ భిక్షుకవృత్తితో జీవనం సాగిస్తున్నారు. ఈ భిక్షుక వృత్తికి ఆలంబనగా తోడ్పడే కళారూపమే సోదె. దీనినే, ఎరుక, గద్దె, కొరవంజి, అని వివిధ పేర్లతో పిలుస్తారు. దీనిని ప్రత్యేకంగా ఒక కులము వారే కులవృత్తిగా చేపట్టినారు. వీరిది సంచార జీవనం. వీరు ఊరూరు తిరుగుతూ వుంటారు గనుక ఏవూరు వెళ్లినా ఊరి బయట ఈత చాపలతోనో, ఈత దబ్బలతో దడెలు నేర్పాటు చేసుకొని, వాటిపై చాపలు కప్పి, వాటిని నివాసయోగ్యంగా చేసుకుంటారు. కొన్ని కొన్ని చోట్ల ఈ కులస్థులందరూ కలసి స్థిరనివాసం ఏర్పాటుచేసుకుంటారు. అవి కూడా ఊరిబయటే వుంటాయి. వాటిని ఎరుకులగూడెం అని పిలుస్తారు. ఒట్టి సోదె చెప్పడంతోనే కడుపు నిండదు. గనుక వీరు ఈత ఆకులతో చాపలు, ఈత దబ్బలను చీల్చి బుట్టలు, తడకలు అల్లి వాటిని అమ్ముకొని ద్రవ్యార్జన చేస్తారు. ఈ పనులన్నీ స్త్రీ, పురుషులు కలసి చేసినా సోదె జెప్పువారు మాత్రము స్త్రీలే. ఇది నిజంగా ఏక పాత్రాభినయమే. సోదెను చెప్పించుకొనువారు స్త్రీ, పురుషులెవరైనా కావచ్చు సోదె చెప్పేది మాత్రము స్త్రీనే. ఇది స్త్రీకి దక్కిన ఏకైక కళారూపం.

పూర్వకాలంలో కురవంజులు రాణివాసపు స్త్రీలకు 'ఎరుక' చెప్పేవారు. కురవ జాతికి చెందిన స్త్రీలు కాబట్టి వారిని కురవంజులనేవారు. నేడు 'సోది చెప్తానమ్మ సోది సోదోయమ్మ సోది' అంటూ గ్రామాలలో, పట్టణాలో వీధివీధికీ తిరిగే 'ఎరుకలసానులు' కురవంజులే. ఆ కాలంలో రాజులకు, వారి కుటుంబాలకు భవిష్యత్తను గూర్చి చెప్పే జ్యోతిష్కులు వారి ఆస్థానాల్లో ఉండేవారు. కాని పేదలకు ఎరుకల స్త్రీలే జోస్యం చెప్పేవారు. 'ఎరుకో' అనే కేక వినిపించేసరికి స్త్రీలు వారిని పిలిపించుకొని తమ భవిష్యత్తు గూర్చి

చెప్పించుకునేవారు. ముఖ్యంగా కన్యలకు ఎటువంటి మొగుడు దొరుకుతాడో, ఎప్పుడు పెళ్ళవుతుందో అని తల్లులు పిలిచి పిలిచి మరీ చెప్పించడం పల్లెల్లో మామూలుగా కన్పించే దృశ్యం.

వీరు సోదె జెప్పుటకు గ్రామాల్లో వీధి, వీధులలో ఇంటింటికి వెళ్లే సందర్భంలో తాటాకులతో చేసిన పీపీలు, గిలకలు, కుదుర్లు కూడ వెంట బెట్టుకొని వాటిని పావలాకో, అర్ధరూపాయికో అమ్ముకుంటారు. లేదా భిక్షానికి, అన్నానికి బదులుగా వీటిని ఇస్తూ వుంటారు. జరిగింది జరగబోయేది చెప్పే 'ఎరుకత'కు గ్రామీణులు తమ శక్తి మేరా డబ్బు, ధాన్యము ఇచ్చేవారు. ఈనాడు ఎరుక చెప్పించుకునే ఆచారం గణనీయంగా తగ్గినా అక్కడక్కడా ఇంకా ఉంది. ఎరుక చెప్పే స్త్రీలు వెదురుబుట్టలల్లడం, మంచం నులక పేనడం వంటి ఇతర పనులు కూడా చేస్తారు. మగవారు పిట్టలు పట్టడం, చేస్తారు. అనాది నుంచీ నేటిదాకా తెలుగు అభిమానాన్ని, విశ్వాసాన్ని పొందిన జానపద కళారూపం 'ఎరుక'.

ఈ కళారూపానికి ఆహార్యమంటూ వుండదు. వారి నిజస్వరూపమే ఆహార్యము. సోదెకు ఉపయోగించేది ఈతాకులతో అల్లిన ఒకబుట్ట. ఇదొక ప్రత్యేకమైన శైలిలో అందంగా అల్లి వుంటారు. ఆ బుట్టలో నాలుగు పలకలు గల గవ్వలతో కుట్టిన వస్తువుంటుంది. అడుగు భాగం చదరంగా పైభాగం వంపుగా సన్నగా వుంటుంది. తలపై వుంచుకొనుటకు వీలుగా వుంటుంది. ఇందులో ఒక ఆకారముతో ఒక ఫ్రేము వుంటుంది. దానికి చుట్టూ అద్దాల బిళ్లలు, గవ్వలు అతికించి వుంటారు. దానినే దేవతా స్వరూపంగా భావిస్తారు.ఆ దేవతను పసుపు కుంకాలతో పూజిస్తారు. సోదె చెప్పే స్త్రీ చీర, రవికెను ధరించి, నునుపైన వంపుగల తల, తలపై బుట్ట, చేతిలో తట్ట, వ్రేళ్ళలో రాగివిగాని, సిల్వర్విగాని ఉంగరాలు ధరించి వుంటుంది.చేతిలో తంబురా (సోదిబుర్ర), మరో చేతిలో వెండికట్టులు గల మంత్రశక్తి గల పుల్ల పట్టుకుంటారు. చేతిలో కడియాలు ధరించి వుంటుంది. మెడలో పూసలు దండలు, ముఖాన పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకొని వయ్యారంగా నడుస్తూ ఏదో గొప్ప శక్తులున్న దేవతా స్త్రీలుగా కన్పిస్తారు. తన జోలిలో చంటి బిడ్డ వుంటుంది. వీపుపైగాని, భుజానకిగాని,తాటాకు పీపీలు, గిలకలు తగిలించుకొని వస్తారు. తన ఉనికిని తెలియజేసుకోడానికి పాటలు పాడుకుంటూ వస్తారు. లయాత్మకంగా శబ్దము చేస్తూ తాళయుక్తంగా, రాగ యుక్తంగా పాటపాడుకుంటూ వస్తారు. తానెంత దీనురాలయినా, తానెంత దరిద్రావస్థలో వున్నా, పిడికెడు భిక్షానికై తన దైన్యస్థితిని దిగమింగుకొని, ఎదుటి వారిని కవ్వించి, నవ్వించి, మెప్పించి, ఆకర్షించి సోదె చెప్పించుకొనుటకు హాస్యభరితమైన శృంగార గర్భితమైన పాటలు పాడుకుంటూ వస్తారు.

సాక్షాత్తూ కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి పద్మావతికి ఎరుక చెప్పినట్టు కథ కూడా ఉంది. ఎవరైనా అమ్మ పిలవగానే వెళ్ళి కూర్చొని చాటలో బియ్యం, పసుపుకుంకాలు, పావలాబిళ్ళ తెప్పించి పక్కకు పెట్టి వాక్కునిచ్చే దేవత గవ్వల పలకను బుట్టలోంచి తీసి ముందుంచి కూనిరాగం తీస్తూ కట్టుపుల్లను ఇలవేల్పుకు తాకించి 'అమ్మా పలుకు / జగదాంబా పలుకు / కంచి కామాక్షమ్మా పలుకు

/ మధుర మీనాక్షీ పలుకు / విశాలాక్షీ పలుకు' అంటూ ఆవాహనం చేస్తారు. తరువాత వారికి రాబోయే కష్టాలను, సుఖాలనూ వివరంగా గేయరూపకంలోనే చెబుతుంది. వారి సందేహాలను తీరుస్తుంది.

## 4.9. బోనేల పాట (జముకుల కథ):

ఆంధ్రప్రదేశ్ లోని అతి ప్రాచీనమైన జానపద కళారుపాలలో జముకుల కథ ఒకటి. జముకుల కథ (బోనేలపాట) ఉత్తరాంధ్ర చెందిన అతి ప్రాచీన జానపద కళారూపం. ఈ కళారూపం ఆంధ్రదేశమంతటా ఉన్నప్పటికీ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి జిల్లాలలోను, తెలంగాణాలోనూ విశేష ప్రచారం ఉన్నాయి. జముకుల కథకులు అనాదిగా ఈ ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రసిద్ధి చెందారు. ఇది ఖంగుమనీ మ్రోగే మనోహరమైన వాద్యం. ఈ జముకుల కథలో వీర, కరుణ, శృంగార రసాలు ప్రధానపాత్ర వహిస్తున్నాయి. ఈనాటికీ ఈ కళారూపం విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలలో అక్కడక్కడా సజీవంగానే వుంది. వృత్తిగా ఈ జానపద కళారూపాన్ని స్వీకరించిన అనేకమంది కళాకారులు జీవనం సాగిస్తున్నారు. వీరిలో చాలామందికి ఇది వంశపారంపర్య వృత్తి అయ్యింది. అలా వంశపారపర్యంగా వృత్తినే నమ్ముకున్నవారికి 'జముకుల' కథ పవిత్రమైనదిగా భావిస్తుంటారు. ఈ కళారూపంలో జముక వాయిద్యం గురించి ఆ కళాకారులు ఒక పౌరాణిక కథ చెబుతుంటారు.

సుకేతుడు అనే రాక్షసుని సంహారం అనంతరం ఎల్లమ్మదేవి ఆ రాక్షసుడి వెన్నుమీద చర్మాన్ని వలిపించి ఒక డబ్బాకు మూతగా అమరింప చేసిందని, వెన్నునరం ఏకనరంగా తాడును తయారు చేయించిందని, కాలిమూలుగు దుమ్ము బిళ్ళగా తయారు చేయించిందని, ఇలా తయారయ్యిందే జముకు అని ఆ పురాణగాథ. అంతేకాదు జానపదుల్లో ఈ జముకుల కథకు సంబంధించి మరో మూఢనమ్మకం కూడా వుంది. అదేమంటే ఈ జముకు ధ్వని వినిపించినంత మేరా గాలి, దెయ్యం, పిశాచం లాంటివి ఏమీరావని, వాటి ప్రభావం పడదని నమ్ముతుంటారు.

ఈ కళారూపం కాకతీయుల కాలంనుండి 13వ శతాబ్దం బహుళ ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది. జముకుల కథలను జక్కులకథలని కూడా అంటారు. ఆంధ్రప్రదేశ్ లోని షెడ్యూలు కూలాలలో ముఖ్యంగా మాల, మాదిగ కులస్థులు ఈ ప్రదర్శిస్తారు. కళను తెలంగాణాలోని వీరికి పంబలవారని బైండ్లవారని పేరుంది. జముకుని జమిడిక అని కూడా అంటారు. శ్రీకాకుళం జిల్లాలో బుడికిపాట, వేదాబోనెలపాట అని కూడా అంటారు. జముకుచేసే శబ్దం బుడబుడక్కమని ఉండటంవల్ల బుడబుక్కల పాటలని కూడా అంటారు. దీనికి జముకును కఱ్ఱతోగాని, రేకు, కంచు, ఇత్తడితో గాని తయారు చేస్తారు. కుంచం ఆకారంలో ఉన్న ఒకడొక్కుని ఒక ప్రక్క చర్మంతో మూస్తారు. ఆ చర్మానికి మధ్యభాగం చిన్న రంధ్రంచేసి నరాన్ని దారాన్ని కట్టి లోపల భాగం నుంచి రెండుపక్క ఒక కఱ్ఱ ముక్కకు కట్టి చేతితో దానిని లాగి పట్టిలోపలి భాగంలో ఆ నరాన్ని మోగించనట్టయితే ఒక శ్రావ్యమైన శబ్దం వస్తుంది. కఱ్ఱముక్కకు

మువ్వలు కూడా కడతారు. కర్రతో దారాన్ని బిగుతుగాలాగి వదులుతూ చేతివేళ్ళతో మీటుతూ కావలసిన దరువులు వేస్తారు.

జముకుల కథలో ముగ్గురు వ్యక్తులు పాల్గొంటారు. కథ చెప్పేవ్యక్తి స్త్రీ వేషం వేసుకుంటాడు . భామకలాపాలలో సత్యభామలా వేషం వేసుకుంటాడు.. బంగారంతో తయారుచేసిన నగలు ధరిస్తాడు. పెద్దవాలు జడ, జడగంటలు, నెత్తిమీద నాగరం, ముక్కుకు ముక్కెర, బుల్లాకి, చెవులకు బుట్టలు, నడుముకు వడ్డాణం. చేతికి దండం కడియాలు, గాజులు, కాళ్ళకుమువ్వలు ధరిస్తాడు. చీరకట్టుకుంటాడు మిగతా ఇద్దరు రెండు జముకులను చంకలకు తగిలించుకొని పంచెలు కట్టుకుంటారు. కాళ్ళకు మువ్వలుకడుతారు. స్త్రీ వేషధారి పాటకు అనుగుణంగా జముకులు వాయిస్తూ దరువులు మారుస్తూ వంతపాడతారు. ఇందులో ఒకవ్యక్తి వ్యాఖ్యానం చెప్పగా మరో వ్యక్తి హాస్యం చెబుతాడు. కథకుని చేతిలో రుమాలు ఉంటుంది. కథకుడు ముందుగా గిరడా (పెద్దదీపం) ఎదురుగా నిలబడి ప్రార్థన చేసి కథ ప్రారంభిస్తాడు. ఆడుతూ, పాడుతూ, బాణీలను మారిస్తూ సమయానుకూలంగా నృత్యం చేస్తాడు. అతని చేతిలో రూమాలు సందర్భాన్ని బట్టి కొన్ని సందర్భాలలో చెర్నకోలగాను, మారుతూ ఉంటుంది.. సాధారణంగా గ్రామాలలో వేసవికాలంలో భజనమందిరం వద్దగాని, రామమందిరం వద్దగాని లేదా ఎవరైనా కోరి వారింటివద్ద రాత్రి 8 గంటలకు ప్రారంభమై సుమారు నాలుగైదు గంటలు కథాగానంతో రక్తికట్టిస్తారు. గ్రామస్థులందరూ ఆ పాట పాడేచోటుకు చేరుకొని కూర్చొని కథవింటారు. అక్కడ చేరిన ప్రజలే కానుకలు. ఇస్తారు. భత్యం ఇస్తారు. బట్టలు పెడతారు.

వీరు భారతం, రామాయణం కథలతో పాటు పరశురాముని యుద్ధం, శ్రీకృష్ణ అహల్యాదేవి, రెక్కలరంభ, సారంగధర, బాలనాగమ్మ, కాంభోజరాజుకథ వంటి కథలు పాడతారు. ప్రస్తుతం ఇటువంటి ప్రదర్శనలులేవు. ఇక రాష్ట్రంలో చాలా ప్రాంతాలలో ఇంటిదేవతలు, గ్రామదేవతల కొలువులలో, పండుగలు. జాతర్లలో స్థానిక గ్రామదేవతల కథాగానం మహిమలు పాడతారు. అమ్మవార్లకు మనవి చెబుతారు. ఈ విధమైన పాటలు పాడేవారు ప్రత్యేకమైన వేషాలు ఏమివేసుకోరు. ముగ్గురు వ్యక్తులు పంచెలు కట్టుకొని, తలపాగాధారించి, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని జముకుల సహాయంతో పాడతారు. తెలంగాణాలో అంకమ్మకథ, రేణుక ఎల్లమ్మ కథ, కోస్తాంధ్రలో గంగానమ్మ, పోలేరమ్మ, మారెమ్మ మొదలైన కథలు, ఉత్తరాంధ్రలో పైడితల్లమ్మ, నూకాలమ్మ. మరెదమ్మ, ముత్యాలమ్మ, బంగారమ్మ, పోలమ్మ వంటి దేవతల కథలు పాడతారు. గ్రామాలలో ప్రజలకు, వ్యాధులు ప్రబలినప్పుడు జాతర సమయాలలోనూ వీరు జముకుల కథాగానంచేస్తారు. "జముకుడు వచ్చాక జాతరాగుతుందా? అనే సామెత (ఉత్తరాధ్ర) బట్టి జముకుల ప్రాధాన్యత తెలుసుకోవచ్చు. విప్లవకవి సుబ్బారావు పాణిగ్రాహి జముకుల కథ కళారూపాన్ని తన రాజకీయ అవసరాలకు అనుగుణంగా మలచుకున్నాడు. ఆయన శ్రీకాకుళం ఉద్యమ సిద్ధాంతాన్ని తన భావజాలాన్ని ఈ కళారూపం ద్వారా ప్రచారం చేసి రాష్ట్రమంతా

ప్రసిద్ధి పొందాడు. జముకుల పాటలు సుమారు 20 బాణీల వరకు ఉన్నాయి. పాండురాజు కుమార్లు పంచపాండవులు పేరుకి పెద్దోడు వాడు ధర్మరాజండి ఈ విధమైన పాటలు ఈ కళారూపంలో బాగా ప్రాచుర్యం పొందాయి. ఇది ప్రాచీన కాలం నుంచే మన కథల్లో, పురాణాల్లో వస్తున్న సంప్రదాయము లేకపోతే కథ అసంపూర్ణంగా ఉన్నట్లు తోస్తుంది. జముకుల కథల్లో పూర్వకాలంలో రామాయణ, భారత, శక్తి సంబంధమైన కథలే ఉండేవి. ఆధునిక కాలాన సాంఘిక రాజకీయేతర వృత్తాలు కూడా జముకుల కథలుగా కనిపిస్తుండడం విశేషం. బుర్రకథ అటు గ్రామీణ జనుల్నీ ఇటు నాగరికుల్నీ ఆకర్షించగా, జముకుల కథ మాత్రం కేవలం గ్రామీణులకే పరిమితమైనదిగా కనిపిస్తుంది. ప్రజలకు లేదా పాలకులకు కనువిప్పు కలిగించే అంశము తప్పనిసరిగా ఇందులో ఉండేవి.

## 4.10. వాలకం:

'వాలకం' అనే పదం వాడుక వల్ల 'వాలకం' అనేది కళారూపం ప్రచారంలోకి వచ్చినట్టు తెలుస్తున్నది. వాలకం ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎక్కువగా వ్యాపించి ఉన్న జానపద కళారూపకం. వాలకం ఒక రకంగా ఆశువిద్య. ఇది వీధి ప్రదర్శన. దీనికి పెద్దరంగ స్థలం అక్కర లేదు. పండుగలు, జాతరలు, గైరమ్మ సంబరాలలో నలుగురు గుమిగూడిన చోట ఈ ప్రదర్శన ఉంటుంది. వాలకాన్ని వీధుల్లో ఎత్తుగా ఉన్న ప్రాంతంలో ప్రదర్శిస్తారు. రంగస్థల ఏర్పాటుకు ప్రత్యేకంగా పనిచేయాల్సిన అవసరం లేదు.

వాలకాన్ని ప్రదర్శించే నటులు రంగస్థలంపై ప్రవేశించి అప్పటికప్పుడు ఆశువుగా ఒక విషయాన్ని తీసుకొని. సంభాషణలను చెబుతూ నటనను ప్రదర్శిస్తారు. అప్పటికప్పుడు ఒక విషయాన్ని కళాత్మకంగా మలిచి ప్రదర్శించే 'వాలకం' గొప్ప కళారూపం. ఆశువుగా పదాలను వల్లిస్తూ చెప్పే ఈ కళారూపం అవధాన పద్య విన్యాసాన్ని తలపింపజేస్తుంది. అప్పటికప్పుడు సన్నివేశాన్ని ఊహించుకొని సంభాషణల్ని ఆశువుగా కూరుస్తారు. ఇలా 'కళాత్మకమైన విషయాన్ని రూపొందించి పరిష్కారమార్గాన్ని చూడపం ప్రతిభతో కూడుకున్నది. అవధాన ప్రక్రియను ఇది పోలి ఉంటుంది.

సాధారణంగా ఒకే వ్యక్తి ప్రదర్శిస్తాడు. అప్పటికప్పుడు ఒకవిషయాన్ని కూర్చుకొని అబినయిస్తాడు. ఈ పాత్రధారి గోచీ కట్టుకొని చిన్నపాటి తలపాగా చుట్టుకొని ముఖానికి కొంత రంగు వేసుకుంటాడు. ఒక తాటాకు కొమ్మను వెనుకకు వాలకం తోకగా తగిలించుకుంటాడు. నవ్వులతో కూడిన సంభాషణలో సాగే వాలకంలో ఇందులో విదూషకుడు ప్రధాన ఆకర్షణగా ఉంటాడు. గ్రామాల్లో జరిగే సంబరాలలో మండుతున్న తాటాకులను మొలకు కట్టుకొని ప్రజల మధ్యలో గిర్రున తిరుగుతూ చురకలంటిస్తూ చేసేది కమ్మవాలకం. మూర్ఖుడైనవాడు తాటాకులు కట్టుకుని తిరుగుతాడని ఒక ప్రచారం ప్రజల్లో ఉంది.

ఇతివృత్తాలు సమకాలీన సమస్యలకు సంబంధించి, సాంఘిక అంశాలకు చెందినవై ఉంటాయి. జటిల సమస్యలకు పరిష్కారం కూడా చూపుతుంది. సంఘంలో జరిగే అవకతవకలు, సమాజంలోని

లోటుపాట్లు, గ్రామాల్లోని సంగతులు, అధికారుల మాటలు, కరణంగారి తెలివితేటలు, ప్రభుత్వ నిర్ణయాలు, దినదిన పరిణామాలు, గ్రామ పెద్దల దాష్టీకం, పన్నులు వసూలు చేసే అధికారుల ఆగడం, వ్యక్తుల ప్రవర్తనల తీరును ఒకటేమిటి అన్నింటినీ కొంచెం హాస్యం జోడించి ప్రేక్షకులకు తెలియజేస్తాడు. ఆ రోజు ఆ పాత్రధారణలో వాలకం చేసిన వ్యక్తి ఎవర్ని ఏమన్నా, తిట్టినా, ఎగతాళి చేసినా ఎవరు ఏమీ అనరు. అనడానికి వీలుకాదు. అంతా హాస్యం మాటున మరుగుపడిపోతుంది. ఇది ఒకవిధంగా సమాజంలోని కుళ్ళును కడగటమే. అందరికీ చురకలంటిస్తూ వాస్తవికంగా జీవించమంటూ వాలకం ప్రదర్శన సాగుతుంది. తాటాకులు కట్టుకొని మరొకరికి తాటాకులు కట్టి ఎద్దేవా చేస్తూ వాలకాన్ని ప్రదర్శిస్తారు. సమాజానికి కీడు చేసే వ్యక్తుల ఆగడాలను ప్రజల ముందు బయటపెడుతుంటారు.

ప్రదర్శన ముగింపుకు వచ్చే సమయాన తోకకు నిప్పుతగిలిస్తారు. ఆ తాటాకుమంటతో వాలకం వేషధారి రంగ స్థలం చుట్టూ తిరిగి నిష్క్రమిస్తాడు. ఇది రామాయణాంతర్గతమై, లంకా దహనానికి పూనుకున్న హనుమంతుని పాత్రకు నకలు కావచ్చు. ఆశువుగా అవధానంగా వడిచే ఈ జానపద కళారూపంపై విభిన్న కోణాలలో పరిశోధకుల పరిశోధన సాగాల్సిన అవసరం ఉంది. వాకలాన్ని ప్రదర్శించే కళాకారులు గ్రామాల్లో దొరలకు ప్రజలకు  వినోదం కలిగించి పారితోషికం పొందుతారు.

## 4.11. గంగిరెద్దుల వాళ్లు:

దూ దూ బసవన్నా ఇటురారా బసవన్నా
ఉరుకుతూ రారా  బసవన్నా
అమ్మవారికీ దండం బెట్టు
అయ్యగారికీ దండం బెట్టు
మునసబు గారికి దండం బెట్టూ
కరణం గారికి దండం బెట్టూ
రారా బసవన్నా, రారా బసవన్నా....

అంటూ గంగిరెద్దుల వాళ్ళు అంబోతును తగిన విధంగా శిక్షణఇచ్చి చక్కగా అలంకరించి గంగిరెద్దుగా తయారు చేసి సన్నాయి వాయిస్తూ సంక్రాంతి రోజుల్లో గ్రామాల్లోకి వచ్చి గంగిరెద్దుల చేత  వివిధ రకాలైన విన్యాసాలు చేయించి గ్రామ ప్రజలను మెప్పించి అలరించి కానుకలు పొందేవారు.

గంగిరెద్దులాట మన సంస్కృతిలో ఓ భాగం. సంక్రాంతి వచ్చిందంటే చాలు.. గంగిరెద్దులాటలతో పల్లెలన్నీ సందడిగా మారుతాయి. గంగిరెద్దుల వాళ్లు ఎద్దులతో చేయించే విన్యాసాలు అబ్బురపరుస్తాయి. భారతీయ జీవన విధానంలో పశు సంపదకు ఎంతో ప్రాముఖ్యం ఉన్నది. ఆవును గోమాతగా భావిస్తే, ఎద్దు.. నందీశ్వరుడిగా (శివుడి వాహనంగా) పూజలు అందుకొంటున్నది. ఆ పాడి పశువులే ప్రధాన

పాత్రధారులయ్యే జానపద కళారూపం 'గంగిరెద్దులాట'.. మన సంస్కృతిలోనూ భాగమైంది. పూర్వకాలం నుంచీ మనుగడలో ఉన్న ఈ కళ.. పల్లెవాసులతోపాటు పట్టణవాసులనూ అలరిస్తున్నది.

గంగిరెద్దులవాళ్లు ముందుగా వయసులో ఉన్న కోడె గిత్తల్ని ఎన్నుకొని, మచ్చిక చేసుకుంటారు. సర్కస్ జంతువులకు తర్ఫీదు ఇచ్చినట్లు వాటికి నృత్య విన్యాసాలు నేర్పిస్తారు. డోలూ, సన్నాయి లాంటి వాద్యాలకు అనుగుణంగా అడుగులు కదిపేలా, తమ మాటలకు తగినట్లు తల ఊపేలా పాఠాలు నేర్పిస్తారు. ముందరి కాలెత్తి సలాం చేసేలా, ఒక కాలు గాల్లో ఉంచి మూడు కాళ్ల మీద నిలబడేలా తర్ఫీదునిస్తారు. సాధారణ కోడెలను ప్రత్యేక శ్రద్ధతో నాట్య విన్యాసాలు చేసే గంగిరెద్దులుగా తీర్చిదిద్దుతారు. ఆ తర్వాత ఆటకు తీసుకువస్తారు. కొందరు పెద్దల జ్ఞాపకార్థం లేగ దూడలను గంగిరెద్దులవాళ్లకు దానం చేస్తారు. వాటికి శిక్షణ ఇచ్చి ఆటలాడిస్తారు.

గంగిరెద్దులవారు యాదవ ఉప కులాల్లో ఒకదానికి చెందినవారుగా భావిస్తున్నారు. వీరిని పూజ గొల్లలు అంటారు. వీరు తాము సింహాద్రి రాజు సంతతివారమని అంటారు. మహాభారతంలోని యయాతి కుమారుడైన యదువు వీరికి మూలపురుషుడనీ కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి. గంగిరెద్దుల ఆట తెలుగు జానపద కళల్లో చాలా ప్రసిద్ధి చెందిన ఆట. ఇక్కడి నుంచే తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు పాకింది. వీరిలో గంగిరెద్దుల దాసర్లు(వైష్ణవ మతస్థులు) కూడా ఉన్నారు. గంగిరెద్దులను రామన్న, లక్ష్మన్న, సీతమ్మ తల్లి, హనుమంతుడు అనే పేర్లతో పిలుస్తారు. నాయకుడు ఎలా చెబితే అలా చేసేలా ఎద్దులకు ట్రయినింగ్ ఇచ్చి గంగిరెద్దులుగా మారుస్తారు.

**ఆకట్టుకొనే అలంకరణ:**

గంగిరెద్దుల అలంకరణ ఆకట్టుకునేలా ఉంటుంది. ఉన్నంతలో అందంగా తీర్చిదిద్దుతారు. బట్టలను బొంతలుగా కుట్టి, వాటికి అద్దాలు పొదుగుతారు. మరింత ఆకర్షణ కోసం చెమ్కీ దండలు జతచేసి, మూపురం నుంచి తోక వరకూ కప్పుతారు. ముఖం దగ్గర రంగుల తోలు కుచ్చు, మూతికి తోలుతో కుట్టిన శిఖమారు కడుతారు. కాళ్లకు గజ్జెలు, మెడలో గంటలు కట్టి బసవన్నను అలంకరిస్తారు. వాటిని ఆడించే కళాకారులూ ప్రత్యేకంగా ముస్తాబవుతారు. నెత్తికి రంగుల తలగుడ్డ, మూతిమీద కోరమీసాలు, చెవులకు కమ్మల జోడు, పాత కోటు, చేతికి వెండి మురుగులు, పంచె ధరించి ఆకర్షణీయంగా కనిపిస్తారు. సన్నాయి బూర, డోలు, చేతిలో చిన్న కంచు గంట పట్టుకొని ప్రదర్శన నిర్వహిస్తారు. ఆటతోపాటు గాత్రంతోనూ వినోదాన్ని పంచుతారు. సన్యాసమ్మ, రాములోరు, గంగరాజు, ఈశ్వరమ్మ, వీరగున్నమ్మ పాటల్లాంటివి పాడతారు.

**ఆడిస్తూ.. ఆశీర్వదిస్తూ:**

సంక్రాంతి పర్వదినాల్లో ఇంటింటికీ తిరుగుతూ గంగిరెద్దులను ఆడిస్తారు. తమ ఇంటికొచ్చిన గంగిరెద్దును సాక్షాత్తు నందీశ్వరుడి స్వరూపంగా భావించి ఇంటివాళ్లు హారతి పట్టి పూజిస్తారు. 'డూ డూ

బసవన్న.. రా రా బసవన్నా..' అనగానే ఎద్దులు ముందుకు వస్తాయి. 'అమ్మవారికి దండం బెట్టూ.. అయ్యగారికి దండం బెట్టు' అనగానే, ముందరి కాలెత్తి సలాం చేస్తాయి. 'అయ్యగారికి శుభం కలుగుతుందా! తలపెట్టబోయే కార్యం సఫలమవుతుందా! 'అనగానే గంగిరెద్దులు తలాడించడాన్ని శుభ సూచకంగా, నందీశ్వరుడి దీవెనగా భావిస్తారు. గంగిరెద్దువాళ్లు కూడా ఎద్దు ముందుకాళ్లను ఛాతీమీద పెట్టుకొని ఆడిస్తారు. ఇంటిల్లిపాదినీ తమదైన శైలిలో పొగుడుతూ, ఆశీర్వచనాలు ఇస్తారు.

## ప్రాచీనకాలం నుంచే:

'గంగిరెద్దుల వాడు కావరమణచి ముకుతాడు పొడిచి పోటెద్దులట్లు'

అని 'పలనాటి వీర చరిత్ర'లో శ్రీనాథుడు ఉదహరించాడు. దీనిని బట్టి ప్రాచీనకాలం నుంచే ఈ గంగిరెద్దులాట ప్రచారంలో ఉన్నదని తెలుస్తున్నది. గంగిరెద్దులవాళ్లు ఎద్దులను కుటుంబ సభ్యులుగా భావిస్తారు. గంగిరెద్దు చనిపోతే, మనిషికి చేసినట్టే అంత్యక్రియలు చేస్తారు. దినకర్మలూ నిర్వహిస్తారు. శతాబ్దాల చరిత్ర కలిగిన గంగిరెద్దులాట, నేడు కనుమరుగయ్యే స్థితికి చేరుకొన్నది. ఈ కళను నమ్ముకొని తరాలుగా జీవనం సాగించిన వేలాది కుటుంబాలు, ప్రస్తుతం ఆదరణ లేక ఇతర వృత్తులను ఆశ్రయిస్తున్నారు.

## పురాణ సంబంధిత చరిత్ర:

పూర్వం గజాసురుడుఅనే రాక్షసుడు ఉండేవాడట. శివుడి గురించి తపస్సుచేసి, తనలోనే ఉండమని వరం కోరతాడు. లింగరూపంలో శివుడు గజాసురిడిలో చేరతాడు. పరమేశ్వరుడు కనిపించకుంటే మూడులోకాలు అల్లకల్లోలం అవడం ఖాయం. అందుకే విష్ణుమూర్తి గంగిరెద్దులు ఆడించేవాడిలా వేషం వేసుకొని, శివుని వాహనం అయిన నందిని బసవన్నగా, తుంబురుడిని, నారదుడిని డప్పు, సన్నాయి వాధ్యకారులుగా, వారితో పాటు ఇంద్రుడినీ వెంటబెట్టుకొని గజాసురుడి దగ్గరకి వెళతాడు. ఆట పాటలతో అసురుడిని మెప్పిస్తారు. బహుమతి ఏమి కావాలో కోరుకోమంటాడు గజాసురుడు. అప్పుడు నంది అతని లోపల ఉన్న తన ప్రభువు శివుడిని ఇమ్మంటాడు. రాక్షసుడయినా ఆడిన మాట తప్పరాదు. అది నీతి. అందుకే నందినే స్వయంగా తీసుకోమని కోరతాడు. అప్పుడు నంది తన వాడి అయిన కొమ్ములతో గజాసురుడి పొట్టను చీల్చి శివుడిని బయటకు తెస్తుంది.

## ప్రదర్శన విధానమిది:

ఒక బృందంలో ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు గంగిరెద్దును తీసుకుని సంచారానికి బయలుదేరతారు. ప్రధాన వ్యక్తి గంగిరెద్దును ఆడిస్తుంటే, మిగతా వారు డోలు, సన్నాయి వాయిస్తుంటారు. మేళతాళాలకు అనుగుణంగా గంగిరెద్దును ఆడిస్తుంటారు. వీరంతా ఒక్కో గ్రామంలో మకాం వేస్తూ, గ్రామ పెద్దల అనుమతితో ఊరి మధ్యలోగానీ, చౌరస్తా లాంటి ప్రదేశంలోగానీ గంగిరెద్దుల ప్రదర్శన నిర్వహిస్తారు. గ్రామంలోని కూడళ్ళలో, ఖాళీ ప్రదేశాల్లో సీతాకళ్యాణం కథను అనుకరిస్తూ గంగిరెద్దులను

పాత్రధారుల్ని చేసి జానపదుల మనసుల్ని దోచుకుంటారు. అలాగే తమ తొడలపైన, గుండెలపైనా గంగిరెద్దులను ఎక్కించుకొని నృత్యం చేయిస్తారు. గంగిరెద్దు నోటిలో గొంతు పెట్టి ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తారు. రకరకాల సినిమా పాటలు, జానపద గీతాలను సన్నాయిలో వాయిస్తూ వాటికి అనుగుణంగా గంగిరెద్దుల చేత డ్యాన్స్ చేయిస్తూ జనాన్ని మంత్ర ముగ్ధులను చేస్తారు. ప్రదర్శన తరువాత గ్రామ ప్రజలు ప్రేక్షకులు ఇచ్చే, బట్టలు, డబ్బులు, ధాన్యాన్ని తీసుకుంటారు. వీలున్నంత వరకు ఇంటింటికీ తిరిగి యాచన చెయ్యడానికి ప్రయత్నిస్తారు. అయితే రాను రాను వీరికి ఆదరణ తగ్గిపోతోంది. ఫలితంగా ఆదాయం లేక వేరే వృత్తుల్లోకి వెళుతున్నారు.

**ఉత్తరాంధ్రలో గంగిరెద్దులవారు:**

శ్రీకాకుళం జిల్లా మందస మండలం సారంగపురంలోను, జాడుపూడి, మెళియాపుట్టి, ఆముదాలవలస దరి చింతాడ మొదలగు ప్రాంతాలలో ఉన్నారు. విజయనగరం జిల్లా బాడంగి మండలం పిన్న వలస, గంట్యాడ, డెంకాడ, ఎస్.కోట మొదలగు ప్రాంతాలలోను విశాఖ జిల్లా సబ్బవరం (గంగిరెడ్ల కాలనీ), చోడవరం(ద్వారకానగర్) వేపగుంట, బొడ్డుపల్లి, లంకలపాలెం, మల్లునాయుడు పాలెం మొదలగు ప్రాంతాలలో ఉంటున్నారు. వీటిలో ఒక్క సబ్బవరంలోనే ప్రభుత్వం యిచ్చిన కాలనీ యిండ్లలో గత 25 సంవత్సరాలు నుండి నివాసముంటున్నారు. మిగతా ఏ ప్రాంతంలోను వీరికి ప్రభుత్వం పక్కా ఇల్లు ఇవ్వలేదు. కులవృత్తినే నమ్ముకొని ఇంకా ఏవిధమైన పనులకు వెళ్ళరు. గంగిరెద్దుల కులస్థులలో మగవారు గంగిరెద్దు పట్టుకొని ఊరంతా తిరిగితే ఆడవారు గ్రామాలలో కరక్కాయలు, దగ్గుమందులు, గిలకలు అమ్మేవారు. నేడు ఆ పరిస్థితులు మారటంతో ఆడవారు ఫ్యాన్సీ సామానులైన బొట్లు, కాటుకలు, తిలకాలు, అద్దాలు, పైనలు (దువ్వెనలు) ఊరూరా అమ్ముకొని వస్తున్నారు. కొన్నిచోట్ల ఆడవారు ఈత చాపలు, బుట్టలు, గిలకలు అల్లటం చేస్తుంటారు. సంక్రాంతి రోజులలో తప్పించి మిగతా రోజులలో పూట గడవటం కష్టంగా ఉంటుంది.

## 4.12. రుంజ వాయిద్యం:

జాతి నిర్మాణానికి మూలాలుగా ఉన్న జానపద కళారూపాల్లో రుంజలది విశిష్ట స్థానం. రుంజ కళాకారులు దాత కులాల వారిని ఆశ్రయించి, గోత్రాలు పొగిడి వారి వంశ చరిత్రలు పాడి, జీవనోపాధి పొందుతుంటారు. తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ఆశ్రిత కళాకారుల్లో వీరభట్టులు, భట్రాజులు, విప్రవినోదులు, పిచ్చుకగుంట్లు , రుంజలు, పొడపోతలవారు, మాల మాస్టీలవారు తదితర రకాల వారున్నారు. వీరు ఆయా దాత కులాలను ఆశ్రయించి, వారి వంశ చరిత్రలు పాడి.. జీవనోపాధి పొందుతారు. బ్రాహ్మణులకు విప్రవినోది, వైశ్యులకు వీరముష్టి, గొల్లలకు పొడపోతలు లేదా మందెచ్చులు, మాల కులస్తులకు మాలమాస్టీలవారు  ఆశ్రిత కళాకారులుగా ఉన్నారు. రుంజ కళాకారులు

విశ్వబ్రాహ్మణులను మాత్రమే యాచిస్తారు. వీరు వ్యవసాయంతో పాటు రుంజ వృత్తిని చేపడతారు. రుంజ వారు ఆది నుంచి వ్యవసాయ దారులు. వ్యవసాయంతో పాటు ఈ రంజు వృత్తిని చేపట్టేవారు.

తక్కు ధిక్కు... తకధిక్కు ధిక్కు... తకమని... అంబుజా సనుడు తాళంబువేయ– అంటూ మెల్లగా ప్రారంభమైన గానం క్రమంగా ఊపందుకుంటుంది. ఈ గానంలో వేగం, తాళంలో తీవ్రతను పెంచుకుంటూ– రుంజు ధ్వని తీవ్రతను పెంచుతూ కథలు చెపుతారు రుంజవారు. వీరి కథలకు అప్పట్లో మన రాష్ట్రంలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. వీరిదగ్గర ఉన్న రుంజలను వాయిస్తూ కథలు చెప్పి తమ కళను ప్రదర్శించి యాచిస్తారు. అయితే వీరు ఎవరినిబడితే వారిని యాచించరు. కేవలం విశ్వబ్రాహ్మణులను మాత్రమే యాచిస్తారు. కనుకనే ఆశ్రిత కులాలలో ఇది ఒకటిగా గుర్తింపుకు నోచుకుంది. రుంజు వాయిద్యకులు త్రేతా యుగానికి చెందిన వారనీ విశ్వకర్మ సృష్టించిన రుద్ర మహేశ్వరుల సంతతివారనీ ఇతి హాసం తెలియచేస్తూ ఉంది. రుంజలు కథ చెబుతూ వాయించే వాయిద్యమే రుంజ. రుంజు వాయిద్యానికి ఒక ప్రత్యేకత ఉంది. చర్మ వాయిద్యాలలో చాలా పెద్దది రుంజ. దీని శబ్దం ఒక కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. వృత్తి గాయకుల వాయిద్యాలలో ఇంత పెద్దది మరొకటిలేదు. దాదాపు మూడున్నర అడుగుల ఎత్తుండే ఈ వాయిద్యాన్ని నిలబెట్టి వాయించేవారు. రుంజకారులు మోయలేని బరువుగానే దీనిని మోస్తుంటారు. నా సంసార బరువును ఇది మోస్తున్నప్పుడు దీని బరువును మేము మోయలేమా అని ఆ కళాకారులంటారు.

ఈ కళలో కళాకారులకు ఎటువంటి ఆహార్యం వుండదు. ప్రదర్శనానుగుణంగా బిగ్గరగా అరవాల్సున్నందున పేద కడుపుకు బలంగా పై కండువాను నడుముకు బిగిస్తారు. భక్తి, వీర రసప్రధానమైన కళయిది. శబ్దప్రధానమైన రుంజ కళలో దాదాపు మూడడుగుల ఎత్తుతో పద్దెనిమిది నుండి ఇరవై అంగుళాల వ్యాసార్ధంతో వుండే భారీ వాయిద్యం యిది. పైభాగం కంటె కింది భాగం వెడల్పు తక్కువుండే గుండ్రటి యిత్తడి డోలక్‌కు రెండు వైపుల గుండ్రటి ఇనుప కడియాలకు (రింగులకు) చర్మం బిగించి కళాకారులే స్వయంగా తయారు చేసుకుంటారు రుంజను. దీని తయారీకి పూర్వం జింక చర్మం ఉపయోగించేవారు తరువాత్త తరువాత మేకచర్మం ఉపయోగిస్తూన్నారు.

## రౌంజకాసుర వధ:

విశ్వకర్మ పురాణం ప్రకారం ఒకప్పుడు రౌంజకాసురుడు అనే రాక్షసుడు గొప్ప గొప్ప వరాలు పొంది. దేవతలను, అన్ని లోకాలలోని జనులను నానా హింసలకు గురిచేసేవాడు. రౌంజకాసురుని భాదలు తట్టుకోలేక దేవతలు అందరు విశ్వకర్మను ప్రార్దించగా. అతను సర్వ సైన్యాలతో వెళ్లి రౌంజకాసురున్ని ఓడించి, వధించారు. అతని శరీరంతో ముప్పైరెండు రకాలుగా వాయించగల రుంజ అనే వాయిద్యాన్ని విరాట్ విశ్వకర్మ తయారుచేశాడు. ఆ వాయిద్యాన్ని పార్వతి పరమేశ్వరులు వివాహంలో ఉపయోగించలనుకున్నారు కాని, రౌంజకాసురుని శరీరంతో తయారుచేయడం వలన దానిని

ఉపయోగించాడినికి ఎవరు ముందుకు రాలేదు. దాంతో విశ్వకర్మ రుంజ అనే బాలుడిని సృష్టించాడు. అతనే రుంజలకు మూల పురుషుడిగా చెపుతారు. విశ్వకర్మ పురాణం, గోత్రాలను గురించు చెపుతూ, కేవలం విశ్వకర్మనే యాచిస్తారు రుంజలు.

## రుంజుల విశిష్ట లక్షణం:

ఏ గ్రామానికి చేరుకున్నా వారు విశ్వ బ్రాహ్మణులను మాత్రమే యాచించడం. విశ్వ బ్రాహ్మణులు వీరిని ఎంతగానో ఆదరించి, దన ధన్యాలను దానం చేస్తారు. రుంజ వాద్యకులు తమ వాయిద్యాలతో, గానంతో, కథలతో వారిని రంజింపజేస్తారు. సంగీత శాస్త్రానికి సంబంధించిన సప్తతాళాల్నీ, ముప్పైరెండు రాగాలనూ తమ ప్రదర్శనల్లో వినిపిస్తారు. మూల స్థంభం, పంచముఖ బ్రహ్మావిర్భావము, పార్వతీ కళ్యాణము మొదలైన కథలను చెప్పడమే కాక, మధ్య మధ్య శ్రావ్యమైన కీర్తనల్నీ పాడుతూ, వాయిద్య నైపుణ్యాన్ని రుంజుపై పలికిస్తారు. మాములుగా మన భాగవత కాలక్షేపాలలో, కథాంతంలో, మంగళ సూచికంగా, పవనామా సుతుని బట్టి పాదార విదములకూ– అనే పారంపర్యంగా వచ్చే మంగళ హారతినే వీరూ అనుకరిస్తారు. రుంజ కథ ఓంకారంతో , అంబా స్తుతితో ప్రారంభమవుతుంది . తరవాత దక్ష యజ్ఞం , పార్వతీ కళ్యాణం మొదలగు కథలు చెప్పి పారితోషకం తీసుకుని దీవెనలు ఇస్తారు .

**రుంజ కథా గానం ప్రారంభం ఈ విధంగా ఉంటుంది:**

మంగళం
ఓం హ్రీం రాట్టుకూ మంగళం
ఓం హ్రీ రాట్టుకూ మంగళం
లోక మీసా లోకమనియా
లాకులేక కోక కరుణాతో
వాక్కు తెలిసియు వాక్కు చేరవు
రాక లేకను రాకరాకృతి........................ !!ఓం!!
పంచతత్వ ప్రపంచములను
నది యొంత శిక్షించునో ఘనభువి
పంచదాయ లనేటి పంచ
బ్రహ్మల చాటించి పల్కె......................... !!ఓం!!
ఖ్యాతి కెక్కిన పోతులూరీ
దాతలింగా ప్రణమ బ్రహ్మ
జ్యోతి బింబము కన్న మిక్కిలి
ప్రితి లేదని నిలిచి కొలిచిన...................... !!ఓం!!

రుంజు వాయిద్యకులు త్రేతా యుగానికి చెందిన వారనీ విశ్వకర్మ సృష్టించిన రుద్ర మహేశ్వరుల సంతతి వారనీ ఇతిహాసం తెలియచేస్తూ వుంది.

అంబా స్తుతి

కాంభోజి రాగం.

కంబుకాంధారీరాయాం

కాశీం హరీం రాం

బీంబోధారీ రాం

అంబుజాక్షీవేలా.............................. !!అంబా!!

ముజ్జగము లేలేటి

మోక్షదాయీ మహమ్మాయీ

సజ్జన రక్షాగాల్

గజ్జులు ఘల్మనంగ.................... !!అంబా!!

అని మోక్షదాయకమైన ముజ్జగములేలు మాతను స్మరించి తరువాత చేతులతో ఒక తాళాన్ని వాయిస్తారు. ఆ తరువాత పంచ ముఖోద్భవ బ్రహ్మలనూ, వారి వారి విధులనూ, శ్రోతలకు వివరిస్తారు. ఈ ప్రపంచాన్ని విశ్వకర్మ రక్షిస్తున్నాడంటూ సకల విశ్వం యొక్క కర్తవ్యాన్ని సంక్షిప్తంగా వివరిస్తారు. అలాగే. ఈ విధంగా రుంజ కళాకారులు తమ కళని ప్రదర్శిస్తున్నారు . కానీ ప్రస్తుతకాలంలో ఈ కళకి నమ్ముకున్న వారు చాలా తక్కువ మంది ఉన్నారు. ఇటువంటి కళలని ఆదుకుని భావితరాల వారికి అందించాల్సిన బాధ్యత మనందరి పైనా ఉంది అనడంలో అతిశయోక్తి లేదు.

## ఉత్తరాంధ్రలో రుంజ కళాకారులు:

శ్రీకాకుళం జిల్లా లోని అంపోలు , మామిడివలస , ఆడవరం గ్రామాలలో కొన్ని కుటుంబాలు ఉన్నాయి. మొన్నటివరకు 20 మంది కళాకారులు ఉండేవారు. ప్రస్తుతం ఈ కళను విడిచిపెట్టి ఇతర వృత్తులలోకి ప్రవేశిస్తున్నారు. ప్రస్తుతానికి 3 గురు కళాకారులు ఉన్నట్లు అంచనా. వీరిలో (1) విభూది కృష్ణమూర్తి (2) శాంతం కామరాజులు ముఖ్యులు. వీరు రుంజ వాయిద్యం పట్టుకున్నప్పుడే వీరిని రుంజలు అంటారు. కాని కులం రీత్యా వీరు బేడ జంగాల కులానికి చెందినవారు. ఈ రుంజ కళాకారులు ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తరాంధ్ర ఒరిస్సా, మహారాష్ట్ర, లలో విశ్వబ్రాహ్మణుల ఇంటికి వెళ్తారు. ఎక్కడకు వెళ్ళినా ఒక సంస్కృత శ్లోకం చదివి తెలుగులో కథ చెబుతారు. సాధారణంగా ముగ్గురు ఉంటారు. ఒకరు కథ చెబితే , ఒకరు వాయిద్యం వాయిస్తే ఇంకొకరు వంతగా ఉంటారు. ఈ కళాకారులు ఇంతకాలం ప్రభుత్వ గుర్తింపునకు, సహాయానికి నోచుకోలేదు. సామాజిక మార్పుల వల్ల ఈ కళ వీరితోనే అంతరించిపోతున్నది. సినిమాలు, టీవీలు రావడంతో వీరి కళకు ఆదరణ కరువైంది. అన్ని జానపద

కళారూపాలతోపాటు రుంజ కూడా మరుగున పడుతోంది. కులవృత్తులు ఆర్థిక ఇబ్బందుల్లో పడడం వల్ల విశ్వబ్రాహ్మణులు కూడా వీరిని ఆదరించడం తగ్గింది. కళింగాంధ్ర జిల్లాలు, ఉభయగోదావరి జిల్లాలతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో వీరు ఉన్నప్పటికీ తగిన గుర్తింపు లేదు. ఈ కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించి, తగిన సహాయ సహకారాలు అందించాలి. అంతరించిపోతున్నటువంటి ఈ కళారూపాన్ని పరిరక్షించాలి.

## 4.13. తప్పెటగుళ్ళు:

తప్పెటగుళ్ళు కళారూపం ఉత్తరాంధ్రలో (కళింగాంధ్ర) ముఖ్యంగా శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం మొదలైన ప్రాంతాలలో అత్యంత ప్రాముఖ్యత వహించినటువంటి కళారూపం. ఈ కళారూపం ప్రేక్షకులను ఎంతో మంత్రముగ్దులను చేస్తుంది. తప్పెటగుళ్ళు ప్రదర్శన చేసేటప్పుడు కళాప్రదర్శకులు ఎంతో వైవిధ్యభరితమైనటువంటి విన్యాసాలను చేస్తూ తమ ప్రతిభను ప్రదర్శిస్తారు. తప్పెటగుళ్ళు యాదవులకు సంబంధించినటువంటి అత్యంత ప్రాముఖ్యత వహించిన కళారూపం. ఉత్తరాంధ్రకు సంబంధించిన యాదవులు వీటిని ప్రదర్శించడం ఎంతో ప్రతిష్టగా భావిస్తారు. ఈ ప్రాంతానికి సంబంధించినటువంటి యాదవులు ఈ కళారూపం అస్తిత్వాన్ని కొన్ని వందల సంవత్సరాలుగా కాపాడుకుంటూ ముందు తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కళా ప్రదర్శనను ముఖ్యంగా పండుగల సమయంలోనూ గ్రామ దేవతల ఉత్సవాలు మరియు ఈ ప్రాంతానికి సంబంధించిన దేవుళ్ళ ఉత్సవాలలోనూ ప్రదర్శిస్తారు. ప్రస్తుతం ఈ కళారూపాన్ని రాజకీయ లబ్ధి కోసం వారి యొక్క సొంత ప్రయోజనాల కోసం రాజకీయ నాయకులు ఉపయోగిస్తున్నారు. అదేవిధంగా ఈ కళారూపాన్ని ప్రభుత్వానికి సంబంధించిన పథకాలను సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలను అప్రమత్తం చేసే ఈ సమయంలో ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తారు. అదేవిధంగా దేవుళ్ళ ఊరేగింపులోనూ వీటిని ప్రదర్శించడం చేస్తారు. యాదవులు కోనారులు గొల్లలుగా పిలువబడేటటువంటి ఈ కులస్తులు గ్రామీణ ప్రాంతాలలో మేకలను గొర్రెలను ఆవులను మొదలైనవాటి పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. వీటి పోషణార్థం అడవులకు కొండగుట్టలకు మేకలను గొర్రెలను తీసుకుని వెళ్లి వాటిని మేపడం చేస్తారు. పగలు రాత్రులు వీటి సంరక్షణ కొరకు కాపలా కాస్తారు. ఇలా కాపలా కాసే సమయంలో ఒంటరితనాన్ని పోగొట్టుకునేందుకు వివిధ పాటలను గేయాలను పాడుతూ వృత్తిపరంగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ అలా దూరంగా జీవిస్తారు. వీరు అనేక పాటలు అశువుగా పాడుతుంటారు.

తప్పెటగుళ్ళకు సంబంధించిన పాటలు ఈ కళింగాంధ్రలో ముఖ్యంగా శ్రీకాకుళంలో పుట్టి ఇతర ప్రాంతాలకు వ్యాపించినట్లు జానపద పరిశోధన ద్వారా తెలుస్తున్నది. ఇట్లా ఈ కళారూపం సరిహద్దు ప్రాంతాలు అయినటువంటి తూర్పు గోదావరి పశ్చిమ గోదావరి వరకు విస్తరించింది. ప్రతి గ్రామంలో

ఉండే కులస్తులు ఈ ప్రాంతాలలో గుంపులు గుంపులుగా ఉంటూ తమ కళా ప్రదర్శనను ప్రదర్శించడంలో ప్రావీణ్యం కలిగి ఉంటారు. అయితే ఈ కళాప్రదర్శన సంబంధించిన వివిధ బృందాలు వారికంటూ ఒక ప్రత్యేకత తెలియపరచుకుంటూ పాటల వైవిధ్యాన్ని కనబరుస్తూ భక్తికి సంబంధించిన గేయాలను పాడుతుంటారు. వీరి యొక్క చరిత్ర నాలుగు వందల సంవత్సరాల పైబడి ఉండొచ్చు. వీరు ప్రదర్శించే కళా ప్రదర్శనలో వీరావేశంతో గజ్జెలు ధరించి అందర్నీ ఆకర్షించే విధంగా భక్తి పారవశ్యంతో సాహస కృత్యాలతో ప్రదర్శన చేయడం జరుగుతుంది. దీన్ని దీన్ని చూడడానికి ప్రేక్షకులు ఎంతో ఆనందాన్ని పొందుతారు. ఈ కళారూపం సాధారణంగా గొల్ల కులానికి సంబంధించిన యాదవులు వారి యొక్క వైవిధ్యాన్ని ప్రదర్శనా యుక్తంగా వివిధ భంగిమల్లో చేస్తూ ప్రదర్శనను ఆసక్తికరంగా నిర్వహిస్తారు.

తప్పెట కళాకారులు ముఖ్యంగా తప్పెటగుళ్ళు ప్రదర్శన సమయంలో కాళ్ళకు గజ్జెలు కట్టుకొని అందరూ ఒకే రకమైనటువంటి బనియన్లు లంగోటి నిక్కర్లు ధరించి ఉంటారు. వీరి ప్రదర్శన చేసే సమయంలో గుండెకు గుండ్రాటి రేకు డబ్బాను తగిలించుకొని కట్టుకుంటారు. ఈ విధంగా కట్టుకున్నటువంటి ఈ రేకు డబ్బాను ప్రదర్శన సమయంలో ఒక డప్పు మాదిరిగా పాటకు తగిన విధంగా లయబద్ధంగా వాయిస్తూ గంతులు వేస్తూ ప్రదర్శన చేస్తారు. ఈ ప్రదర్శనలో గజ్జలతో కాళ్ళని ఊపుతూ గుండె కట్టుకున్నటువంటి తప్పెట గుండును వాయిస్తూ ఉంటారు. ఇలా వాయించడం ఎంతో ఆశ్చర్యానికి గురి చేస్తుంది. వీరు చేసే నాట్యం ఎంతో వేగంగా ఉధృతంగా ఉంటుంది. దానికి తగిన విధంగా తప్పెట గుండెను వేగంగా కొడుతూ పాటకు తగిన విధంగా తప్పట వాయిస్తూ కళా ప్రదర్శన చేస్తారు.

కళా ప్రదర్శనలో తప్పెటగుళ్ళు వాయించే బృందానికి ఒక నాయకుడు ఉండడం జరుగుతుంది. ఆ నాయకత్వం వహించినటువంటి వ్యక్తి అతడే చెప్పిందే శిరోధార్యం. అతను తమ బృందంలో నాయకుడిగా ఉంటూ కళా ప్రదర్శన జరిగే సమయంలో కొన్ని రకాల సూచనలు ఇస్తూ అందరిని జాగృతం చేస్తూ తన ప్రదర్శనను అనుకరించే పాటకు తగిన విధంగా నాట్యము చేసే విధంగా అందరికీ మార్గదర్శకత్వం వహిస్తాడు. వీరందరు కూడా సాధారణంగా పల్లె వాతావరణం సంబంధించిన నిరక్షరాస్యులు. వీరికి నాయకుడు చెప్పిందే చేస్తూ నాయకుడిని అనుకరిస్తారు. ఈ కళా ప్రదర్శన సంబంధించి 15 నుంచి 20 మంది వరకు జానపద కళా ప్రదర్శకులు ఉండవచ్చును వీళ్లు తాళం లయ అనుకరిస్తూ వలయాకారంగా తిరుగుతూ ప్రదర్శనను చేయడం జరుగుతుంది ఇది ఒక రకంగా ప్రజలను ఆసక్తి కలిగించే విధంగా చూడడానికి అద్భుత దృశ్యంగా ఉంటుంది.

ఈ కళా ప్రదర్శన సంబంధించినటువంటి పాడే పాటల ఇతివృత్తాలు భారతం మహాభారతం రామాయణం పురాణ ఇతిహాసాలు సంబంధించిన అంశాలు తీసుకొని ప్రదర్శన చేయడం జరుగుతుంది. ఈ జానపద కళారూపం సంబంధించిన తప్పెట వాయించే సందర్భంలో ప్రదర్శన దాని స్థాయి పెరిగేకొద్దీ ప్రతి ఒక్కరూ తమ తమ ప్రతిభా విశేషాలను ఆకర్షణీయంగా ప్రదర్శిస్తుంటారు. ఒకరికి మించి ఒకరు

పోటీ వైవిధ్యాన్ని ఏర్పాటు చేసుకుంటూ తను చేసే డప్పు విన్యాసంలో తగ్గట్టుగా నృత్య భంగిమలను సర్కస్ ఫీట్లు ను ప్రదర్శన చేస్తారు. తప్పెటగుళ్ళను వాయిస్తూ లేక అనుగుణంగా కాళ్ల గజ్జల ఊపుతూ వలయాకారంగా తిరుగుతూ మరికొందరు నేలపై పడుకొని తిరుగుతూ విన్యాసాలు చేయడం జరుగుతుంది. ఇందులో ప్రతి ఒక్కరు కూడా సమూహంగా ఏర్పడి గురువు చెప్పే మాటలను సూచనలను అనుగుణంగా తమ ప్రదర్శనలను చేస్తూ ఉంటారు. ఇలా చేసే సందర్భంలో ఒకరిపై ఒకరు అతనిపై ఇంకొకరు నిలబడి తప్పేటను వాయిస్తూ ఉండడం జరుగుతుంది. ఇది ఒక రకంగా సాహసంతో కూడినటువంటి వాద్యవిశేషం. ఈ తప్పెట కళారూపాన్ని కేవలం పురుషులు మాత్రమే చేయడానికి అనుకూలంగా ఉంటుంది ఇందులో ఇతరుల జోక్యం చేసుకోవడానికి వీలు ఉండదు. ముఖ్యంగా స్త్రీలు ఈ కళారూపాన్ని ప్రదర్శించడంలో అనుకూలించదు కేవలం పురుషులు మాత్రమే ప్రదర్శన యోగ్యమై ఉంటుంది. ఈ కళా ప్రదర్శనలు కళాకారులు ఎన్నో వైవిధ్యభరితమైనటువంటి విన్యాసాలను చేయడానికి ఆశిస్తారు. అలా చేసే ప్రయత్నంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొవలసి వస్తుంది. ముఖ్యంగా ఒకరిపై ఒకరు నిలబడి ఒక గోపురం మాదిరిగా నిలబడి తప్పెటగుళ్ళు వాయించడం అనేది సాహసంతో కూడినటువంటి కళా ప్రదర్శన చేసి ఒకరి తర్వాత ఒకరు దిగుతూ నేలపై వెల్లకిలా పడుకొని తిరుగుతూ ప్రదర్శన చేయడం సాహసకృత్యం. అదేవిధంగా ఈ కళా ప్రదర్శన చేసే సందర్భంలో కుండ పై నిలబడి నృత్యం చేస్తూ ప్రదర్శన చేస్తారు అదేవిధంగా నీటితో నిండినటువంటి మట్టి కుండని తలపై పెట్టుకుని కుండ పడిపోకుండా నృత్యం సామూహికంగా చేయడం చేస్తారు.

ఈ కళారూపం నోటి ద్వారా మౌఖికంగా ఒకరి నుండి ఒకరికి సాగుతూ ఉంటుంది. ఉత్తరాంధ్ర స్థానిక యాస మాండలికంలో గేయాలను పాడడం జరుగుతుంది. స్థానికంగా ఉండే ప్రజలు ఈ గేయంలో ఉన్నటువంటి స్థానిక యాసను సులభంగా గ్రహించగలుగుతారు. స్థానిక యాస మాండలికంలో ఉన్నటువంటి ఈ పదాలు ఇందులో ఉపయోగిస్తారు. తూర్పు భాగవతం, సారంగధర పాట, లక్ష్మణ మూర్ఛ, గాజులోడి పాట, మందులోడి పాట, రెల్లిదాని పాట, మొదలైనటువంటి పాటలు స్థానిక ఇతివృత్తాలను ఆధారంగా చేసుకొని గేయాలను కథా గేయాలను పాడుతారు. గేయానికి సంబంధించినటువంటి పల్లవిని చరణాలను వివిధ రకాల వాయిద్యాల సమ్మేళనాలతో చరణాన్ని పలుసార్లు వివిధ నృత్యాలతో కొన్ని గంటల సమయంతో చరణాన్ని సాగదీస్తూ కథను అల్లుకుంటూ గేయ రూపంలో ప్రదర్శన చేస్తూ ఉంటారు. ఈ ప్రదర్శన తగ్గట్టుగా తప్పెటగుళ్ళు ఉధృతంగా గట్టిగా కొడుతూ కళ్ళతో గజ్జల శబ్దం చేస్తూ వలయాకారంగా తిరుగుతూ చేయడం ఈ కళా ప్రదర్శన విశేషం. ఈ విధంగా చేయడం ద్వారా స్థానికంగా ఉండే ప్రజలు కొంత దూరంలో ఉన్నప్పటికీ అందులో ఉన్నటువంటి శబ్ద విన్యాసం చూడడానికి ప్రజలు ఆసక్తి చూపుతారు. ఇట్లా చేస్తూ ఉన్న ఈ కళా ప్రదర్శనలో ముఖ్యంగా తప్పెట వాయిద్యం మాత్రమే ప్రేక్షకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఇందులో ఉన్నటువంటి గేయం కానీ

కథా గేయం గాని బయటకు అంత స్పష్టంగా వినసొంపుగా వినిపించదు కేవలం తప్పెటగుళ్ళు లయబద్ధంగా వాయించే విన్యాసాలు ప్రేక్షకులను ఆకర్షిస్తుంది.

## 4.14. పొడపోతలవారు:

ఉత్తరాంధ్రలో యాదవులను ఆశ్రయించి జీవనం సాగించేవారు పొడపోతులవారు. బ్రాహ్మణులకు "విప్రవినోదాలు" వైశ్యులకు "వీరముష్టులు", విశ్వబ్రాహ్మణులకు "రుంజలు" మొదలైన వారున్నట్లే యాదవులకు ఉత్తరాంధ్రలో పొడపోతలవారున్నారు. పొడపోతుల వారిని యాదవులు పొడపోతులవారు అనే పేరుతోనే పిలుస్తారు. ఐతే పొడపోతులవారు తాము "పొడపాటుకులము" అని తమను గురించి తాము చెప్పుకుంటారు. యాదవులను గురించి తాము పొగడ్తలతో పాటలు పాడతారు కాబట్టి తమకు "పొడపాటకులు" అనే పేరు వచ్చిందని పెద్దలు చెప్పారు. పొడపోతులవారు వీరు సాంప్రదాయంగా తెల్లని పంచెలను చొక్కాలను ధరిస్తారు. తలపాగా ధరిస్తారు. వీరు విజయనగరం జిల్లాలో ఉన్నారు. ఈ జిల్లాలో గజపతినగరం మండలం మరుపల్లి గ్రామంలోను, గంట్యాడ మండలం కొండదామరపల్లి గ్రామంలోను, సీతానగరం మండలం చినంకలం గ్రామంలోను, బాడింగి మండలం కూనవలస గ్రామంలోను ఉన్నారు. పొడపోతులవారు జంగం కులానికి చెందినవారు. జంగం కులంలో శారదజంగాలు, మెట్టు జంగాలు, పరమటజంగాలు, ఊరజంగాలు, చెరుకూరి జంగాలు, బుడగజంగాలు మొదలైన అనేక రకాలవారు ఉన్నారు. పొడపోతులవారు చెరుకూరిజంగం శాఖకు చెందినవారు. వీరు ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని యాదవుల్లో ఒక శాఖ అయిన ఆలగొల్లలను యాచిస్తారు. ప్రస్తుతం వీరు ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు, ఉభయగోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాలోని ఎర్రగొల్లలు, పూజగొల్లలు మొదలైన వారిని కూడా యాచిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి గతంలో ఎప్పుడో కొన్ని యాదవ కుటుంబాలవారు అండమాన్ నికోబార్ దీవులకు వెళ్ళి అక్కడే నివసిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఆరు వందల యాదవ కుటుంబాలవారు ఉన్నారని పొడపోతులవారు చెబుతున్నారు. పొడపోతుల వారు ఆదీవులకు కూడా వెళ్ళి అక్కడ ఉన్న యాదవ కుటుంబాల వారిని యాచిస్తున్నారు.

ఉత్తరాంధ్రలో గొల్లలు, యాదవులు, కొనారులు అని పిలవబడే ఇండ్లకు వీరు వెళ్లి వారి కులగోత్రాలను కుల చరిత్రను చెపుతూ పొగుడుతూ కుల గోత్రాలు కాటంరాజు కథను చెబుతారు. వీరిని కుల గురువులు అని కూడా పిలుస్తారు. వీరు కాటమరాజు కథల్లో పోలురాజుకథ, కాటమరాజు పుట్టుక (పెద్దిమాదేవి నోములు), చంద్రగుప్త మహారాజు కథ, దూర్వాస మహాముని కథ (ముసలందుడ్డు పుట్టుక కథ), పల్లికొండ పుట్టుక, యాదవులు దక్షిణాది ఆవులుమేపడం కథ, ఆలవారి పాపమ్మ సువ్వి పాటలు, పాపనూకకథ (పాపనూక వలపోత), కొచ్చర్లవారి కొమరమ్మ కథ, ఎర్రకోటపాడు కోదాడు తేవడం, బొల్లావు పుట్టుక, బొల్లావు యుద్ధం, బత్తుడన్న కథ మొదలైన కథలను చెబుతారు. వీరు సంవత్సరానికి ఒకసారి యాదవులలోని, ఆలగొల్లలు శాఖ వారి ఇంటికి వెళ్లి యాచిస్తారు. వీరికి సొంత ఆస్తులు ఉండవు.

వీరు గ్రామాలను పంచుకుంటారు. వీరు ఒక్కొక్క కుటుంబానికి 50 నుండి 300 గ్రామాల వరకు పంచుకుంటారు.. పట్టణాలలో యాదవుల ఇండ్లను కూడా పంచుకుంటారు. ఒక పట్టణంలో యాదవుల ఇళ్లు ఎక్కువగా ఉంటే ఇంకొంతమంది చేరి పంచుకుంటారు. వీరు ఆయా ప్రదేశాలకు వెళ్లలేకపోతే వేరొకరికి అమ్ముకుంటారు. ఏ గ్రామంలో ఎవరు గొల్లలు, వారి గోత్రాలు ఏమిటి, ఏ ఇంటి పేర్లతో ఉన్నారో మొదలగు సంగతులన్నీ వీళ్ల దగ్గరే ఉంటాయి. ఒక్కొక్క ప్రదేశాల్లో ఒక్కో ఇంటి వద్ద ఒక్కొక్క పూట భోజనం చేస్తూ వారు ఇచ్చే పారితోషికాన్ని తీసుకొని వారిని కులగోత్రాలతో పొగడుతారు.

గ్రామాలకు వెళ్ళినప్పుడు ఒక కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు కలిసి వెళతారు. వీరిలో ఒకరు ప్రధాన కథకుడు గాను మిలిగిన ఇద్దరూ వంతలుగాను ఉంటారు. గ్రామంలోని యాదవ కుటుంబాలు వారి సంఖ్యను బట్టి వీరు ఒక్కొక్క గ్రామంలో ఐదు రోజుల నుంచి మొదలుకొని పదిరోజుల వరకు ఉంటారు. గ్రామంలో ఉన్నంతకాలం వీరు భోజన, స్నానపానాలన్నింటినీ యాదవుల ఇళ్ళలోనే చేస్తారు. ఐతే అన్ని రోజులూ ఒకే ఇంట్లో ఉండరు. ఒక్కొక్క ఇంట్లో ఒక పూట మాత్రమే భోజనం చేస్తారు. భోజనానికి వస్తున్నట్టు ముందుగానే యాదవులకు చెబుతారు. యాదవులు కూడా వీరిని గురువులుగా భావించి సంతోషంగా వీరికి భోజనం పెట్టడంతో పాటు చందా కూడా ఇస్తూ ఉంటారు. యాదవులు తమ శక్తిని బట్టి 50, 100, 200, ఇలా ఎంతో కొంత ఇస్తారు. ఊర్లో ఉన్న యాదవులందరూ డబ్బు ఇచ్చిన తరువాత మరొక ఊరికి వెళతారు.

పొడపోతులవారి వంటి ఆశ్రితకులాల వారు యాదవులను మాత్రమే యాచిస్తారు. మిగిలిన ఏ ఇతర కులాల వారినీ యాచించరు. సంతానంలో మగవారు లేకపోతే ఆ గ్రామాలు ఆడపిల్లలకు వెళ్తుంది. ఇలా కొన్ని తరాలుగా గొల్లలకు, పొడపోతలవారికి అవినాభావ సంబంధం ఉంది. వీరి తాత ముత్తాల నుండి వచ్చిన మౌళిక విద్య, తాళపత్ర గ్రంథాలలోని కథలు నేర్చుకొని గొల్లల ఇండ్లకు వెళతారు. వీరిని తెరచీరల వారని కూడా అంటారు. కాటమరాజు కథలను చెప్పే పటం "12 మూరల పొడవు", "6 మూరలు" వెడల్పు గల తెరపై బొమ్మలు ఉంటాయి. ఈ బొమ్మల సహాయంతో కథలు చెబుతారు. వీరు ఎన్నో తరాలుగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతమున్నవారికి 3 తరాలు వారు మాత్రమే తెలుసు. ఎవరైనా భోజనం దగ్గర ఏదైనా లోటుచేస్తే వారిని విమర్శిస్తూ పాటలు పాడతారు. విసిగిస్తే వారి పేరున బొమ్మ కట్టి గ్రామ గ్రామాల్లో చెడ్డవారని చెబుతామని భయపెట్టి వారి వద్ద నుంచి పారితోషికం పొందుతారు.

గ్రామంలోని యాదవులందరూ డబ్బు ఇచ్చిన తరువాత చివరిరోజు పొడపోతుల వారు తమ వద్ద ఉన్న తెరపటాన్ని విప్పి అందులో ఉన్న బొమ్మలను చూపిస్తూ కాటమరాజు కథల్లో ఏదో ఒక కథను చెబుతారు. ఆ మరుసటిరోజు ఆ ఊరు విడిచి మరో ఊరికి వెళతారు. పొడపోతులవారి ప్రదర్శన లేక కథాఖ్యానం ఆంధ్రదేశంలో కళింగాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణాజిల్లాలలో కూడా ఉంది. పొడపోతులవారు కథను రాత్రిపూట మాత్రమే చెబుతారు. పగలు చెప్పరు. కథను చెప్పేటప్పుడు పురుషులు

మాత్రమే పాల్గొంటారు. ఇందులో స్త్రీలు పాల్గొనరు. వీరు కథాఖ్యానం సందర్భంలో కాటమరాజు కథలను చెబుతారు. అందువల్ల వీరి ప్రదర్శన సాహిత్యం ఉన్న జానపద కళ కిందికి వస్తుంది. వీరు తరతరాల నుంచి సాంప్రదాయకంగా తమ కళను ప్రదర్శిస్తున్నారు. అందువల్ల వీరి కళ వీరికి మాత్రమే పరిమితం. వీరు తమ కళను యాదవుల ఇళ్ళ దగ్గర యాదవులకోసం మాత్రమే ప్రదర్శిస్తారు. ఐతే మిగిలిన కులాలవారు కూడా వీరు చెప్పే కథలను వినడానికి వస్తారు.

## 4.15. మాలమాస్టీలు:

మాలలను ఆశ్రయించే కులాలను మాలమాస్టీలు అంటారు. 'మాల మాస్టిన్' అనే కులానికి చెందిన వీరు ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తరాంధ్రలో ఉభయ గోదావరిజిల్లాల్లో అక్కడక్కడా ఉన్నారు. వీధుల్లో ప్రదర్శనలిస్తూ వచ్చే అరకొర సంపాదనతో కుటుంబాలను పోషించుకుంటారు. అయితే సంచార జీవులు కావడంతో వారికి ప్రభుత్వ పథకాలు దక్కడం లేదు. తమ వృత్తికి ఆదరణ లేకపోవడం, ప్రభుత్వ సహకారం లేకపోవడంతో సమస్యల్లో ఉన్నామంటూ మాల మాస్టిన్‌లు చెబుతున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో కోరుకొండ ప్రాంతంలో ఈ గ్రామీణ సాహసవీరులు నేటికీ కనిపిస్తారు. వీరు తుంబర, (సితార) జముకు చిడతలు సహాయంతో సారంగధర చరిత్ర, అళియారాణి, శశిరేఖ పరిణయం, భూలోక సుందరి, శివకుమారుడు, నల్లగులాబి కథ (కాశీమజలి), గగనవీరుడు కథ, సుగుణశీల, పువ్వులబుట్ట, కాంభోజరాజు కథ, సన్యాసమ్మకథ, ముగ్గురు మరాఠీల కథ, మొదలగు పాటలు పాడతారు. క్రైస్తవ గీతాలు కూడా పాడతారు. వివిధ ప్రాంతాలకు వెళ్లి తమ సాహసాలను ప్రదర్శించడం వారి వృత్తి. ప్రజలిచ్చే కానుకలు తీసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిన్న వయసు నుంచే వీరు ఈ వృత్తిలో శిక్షణ పొందుతూ ఉంటారు. చిన్న చిన్న విన్యాసాలు చేస్తుంటారు.. ప్రజలను మెప్పించడమే లక్ష్యంగా ప్రమాదకర విన్యాసాలు చేస్తుంటారు. గ్రామీణ భారతంలో ఎగువ కులాల వారికి వినోదం కోసం అనేక వృత్తులవారు ఉన్నారు. జానపద కళారూపాల ద్వారా వారిని అలరించేవారు. అదే తరహాలో మాల, మాదిగలను రంజింపజేసేందుకు మాల మాస్టిన్, మాదిగ మాస్టిన్ అనే తరగతులను తయారు చేశారు'' అని కొందరు చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు.

వీరుపాటలతో పాటు సర్కస్ విద్యలు కూడా ప్రదర్శిస్తారు. వారు పది కేజీల బరువుండే రాయిని గాల్లోకి విసిరి అది కిందపడుతున్నప్పుడు తమ ఛాతీతో ఢీకొడతారు. పొట్టేలుతో పోటీ పడి దాని కొమ్ములు వంచి కుదేలు చేస్తారు. బరువుతో ఉన్న వాహనాలను జుత్తుకు కట్టుకుని లాగుతారు. శరీరంపైనుంచి బరువైన వాహనాలను పోనిస్తారు. గెంతులు(జంపులు), మొగ్గలు(పల్టీలు), రాళ్ళు ఎత్తుట, బండిచక్రాలు ఎత్తుట, గొర్రెపోతులను గుండెతో గుద్దుట, తలపై కొబ్బరి కాయతో కొట్టుకొనుట, నీళ్ళ బిందెలను పళ్ళతో ఎత్తుట, మొదలగు సాహసవిద్యలను కూడా చేస్తారు. ఒకటా రెండా ఇలాంటి ఎన్నో విన్యాసాలు వారికి కొట్టిన పిండి.

శ్రీకృష్ణదేవరాయులు కాలంలో రాజ్య రక్షణ కోసం ఎంపిక చేసిన వారి వారసులు ఆ తర్వాత ఈ వృత్తిలోకి దిగినట్టు చరిత్ర పరిశోధకులు అంటున్నారు. ‘‘మాల మాస్టిన్, మాదిగ మాస్టిన్ అంటే ఒకప్పుడు షెడ్యూల్డ్ కులాలవారే. కానీ, వారు వృత్తి రీత్యా సంచార జీవులుగా మారడంతో ఎస్సీలుగా కూడా గుర్తింపు దొరకలేదు. వారు తమ సాహసాలతో కృష్ణదేవరాయులు కాలంలో రాజ్య రక్షణలో భాగంగా ఉండేవారు. ఆయుధాలను చేత పట్టి వివిధ గ్రామాల్లో ప్రజలకు అండగా ఉండేవారు. ఆ తర్వాత రానురాను వారిలో అనేక మంది సాహసాలు చేసే వృత్తి మానుకున్నారు. విన్యాసాలు చేస్తూ కథలు చెబుతారు. పగలు విన్యాసాలు చేస్తూ, రాత్రిళ్లు వివిధ రకాల కథలు చెబుతూ ప్రజలను రంజింపజేసేవారు. ఈ మాల మాస్టిన్‌లు. రానురాను ప్రజల జీవనశైలిలో వచ్చిన మార్పులతో గ్రామీణ జీవనంలో వారికి ఆదరణ తగ్గిపోతోంది. ఈ కులానికి చెంది, సాహస విద్యలు ప్రదర్శించే రామాంజనేయులు తమ వృత్తి వివరాలు వివరించారు. ‘‘మొదట పెనుగొండ అనే పట్టణంలో శ్రీకృష్ణదేవరాయుల ప్రోత్సహంతో మా సాహసాలు మొదలయ్యాయని పూర్వీకులు చెబుతుంటారు. అప్పట్లో కరవు వల్ల తలో దిక్కు చెదిరిపోయన సమయంలో మాల కులానికి చెందిన ఒకరికి సాహసాలు చేసేందుకు అవసరమైన సామగ్రి అందించారు. మాల పేటల్లో ఉండడం, వారి పెట్టింది తినడం అలవాటుగా మారింది. పగలు విన్యాసాలు చేయడం, రాత్రి వేళ అనేక కథలు చెప్పడం అలవాటు. ఎన్నో ఏళ్లుగా ఇలానే సాగుతున్నాం’’ అని ఆయన తెలిపారు.

అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఎలాంటి రక్షణ లేకుండా ఈ విన్యాసాలు సాగించే క్రమంలో పలువురు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. అయినప్పటికీ మరో దిక్కు లేక ఈ వృత్తి కొనసాగుతున్నామని వారు చెబుతున్నారు. "మేము చేసే విన్యాసాలే మాకు కడుపు నింపుతాయి. ఏదయినా ఓ ఊరు పోతాం. అక్కడే పిల్లా పాపలతో ఉంటాం. ఆ పేటలో మాలలు పెట్టింది తింటాం. అయినా ప్రభుత్వాలు కొన్ని వృత్తుల వారిని గుర్తించారు. కానీ మమ్మల్ని దూరం పెట్టేశారు. గంగిరెద్దులు, జంగాలు, మందులోళ్లు, బుడబుక్కలవారిని గుర్తించారు కానీ మాల మాస్టిన్‌లకు ఎలాంటి గుర్తింపు లేదు. దాంతో మా తాతలు, తండ్రులు చేసినదే మేం చేశాం. ఇప్పుడు మా బిడ్డలు, మనవళ్లు కూడా అదే పనిలో ఉన్నారు. ఒకరిని చూసి ఒకరు నేర్చుకోవడమే. దానికి ట్రైనింగ్ అంటూ ప్రత్యేకంగా ఉండదు. మా కులం ఏంటో కూడా చెప్పే పరిస్థితి లేదు. దాంతో చదువుకున్న వాళ్లు కూడా ఇదే వృత్తిలో సాగాల్సి వస్తోంది" అని రామాంజనేయులు వివరించారు. ప్రాణాలు పణంగా పెట్టి వీరు చేసే సాహసాలు తీరని శోకాన్ని కలిగిస్తున్నాయి. అనేక మందిని శాశ్వతంగా దూరం చేస్తున్నాయి. తమ బృందంలోనే, తమ కళ్లెదురుగా వివిధ ప్రమాదాల్లో గాయపడి ఐదుగురు చనిపోయారని పి.నాగేశ్వరరావు అనే వ్యక్తి చెప్పారు. ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేక ఈ పనిచేస్తున్నామన్నారు. వారి తాత, తండ్రుల కాలంలో కూడా ఇలా జరిగింది. కానీ వారు మానలేదు.

వీరు ఈ సాహసాలు చేయడం, జనాలను సంతృప్తి పరచడం, తద్వారా వచ్చిన దానితో బతకడం మినహా మరోటి తెలియదు. వేరే అవకాశం ఉంటే వదిలేసే వాళ్ళు. వీరికి పొలాలు ఏమీ లేవు. అందుకే డప్పులు వాయిస్తూ, పాటలు పాడతారు. ఆటలు ఆడతారు. ఎన్నో రకాల విన్యాసాలు చేస్తారు. కొన్నిసార్లు ఈ విన్యాసాలు చేస్తున్నప్పుడు ప్రమాదాలు జరుగుతాయి. తీవ్రంగా గాయపడి కొందరి ప్రాణాల మీదకు వస్తుందని నాగేశ్వరరావు వివరించారు. వీరు రోడ్డు మీద విన్యాసాలకు వెళితే ఏమవుతుందో చెప్పలేరు. అయినా వీరికి  మరో దారి లేదు. ప్రభుత్వం ఎలాంటి సహాయం అందించడం లేదు. చివరకు పిల్లల చదువుల కోసం సర్టిఫికేట్లు కూడా పొందడం లేదు. ఎప్పుడు  ఎక్కడ ఉంటారో  తెలియదు.  ప్రస్తుతం ఈ మాల మాస్టిన్‌లలో చిన్నారులను బడికి పంపించే అలవాటు మొదలైంది. దీంతో వీరిలో అక్షరాస్యత పెరుగుతుందని, భవిష్యత్ తరాలు  ప్రమాదకర విన్యాసాలకు దూరంగా ఉంటారన్న ఆశాభావం ఆయా కుటుంబాల్లో వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ లెక్కల ప్రకారం మాల మాస్టీలు, మాదిగ మాస్టీలు అనే జాతులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సంచారజీవులుగా ఉన్నారు. అయితే వారికి కుల సర్టిఫికెట్లు మాత్రం ఇవ్వడం లేదు. ఎస్సీలలోని ఉప కులాల్లో వారి తరగతి లేదు. అంతేగాకుండా ఎస్సీలతో కలిసి జీవిస్తున్నప్పటికీ వారికి మాత్రం సర్టిఫికెట్లు ఇప్పించాలనే అంశంలో ప్రయత్నాలు ఫలించడం లేదు. కుల సర్టిఫికెట్ల అంశంపై కొంత ప్రయత్నం చేస్తున్నామని ఎస్సీ సంక్షేమ సంఘం నాయకుడు బత్తుల రామేశ్వరరావు  తెలిపారు. ఇటువంటి మాలమాస్టీలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలో ఉన్నారు. "మాల మాస్టిన్‌ల విషయంలో అధికారిక లెక్కలు కూడా లేవు. అనధికార సమాచారం ప్రకారం ఏపీ, తెలంగాణల్లో కలిపి వీరు 800 మంది ఉంటారని అంచనా. వారంతా ఎస్సీల్లో భాగంగానే ఉన్నారు. వారిని కూడా గుర్తించి సబ్ కేటగిరీలో సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఎవరు, ఎక్కడ ఎంత మంది ఉన్నారనే విషయంలో స్పష్టత లేకపోవడంతో వారి సమస్య పరిష్కారం కావడం లేదు. ఆదుకునేందుకు రక్షణ ఏర్పాట్లు చేస్తూ ప్రమాదకర విన్యాసాలు చేయాల్సిన అవసరం వీరికి ఏర్పడకుండా చూస్తామని ప్రభుత్వం చెబుతోంది." ఎస్సీల జీవనవిధానంలో మాస్టీలు ఒక భాగం. మారుతున్న కాలానికి తగినట్లుగా వారిలో మార్పు తీసుకురావాల్సి ఉంది. కుల సర్టిఫికేట్లు, శాశ్వత గృహవసతి. వారికి ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. యువతరం విద్యావంతులు కావడానికి తోడ్పాటు అందించాలి.

## 4.16. బుడబుక్కలవాళ్ళు:

బుడబుక్కల వాళ్ళు ముఖ్యంగా తెలుగునాట ఒక సంచార తెగ. భక్తిని ప్రబోధిస్తూ పురాణ గాథలు పాటలుగా పాడుతూ మంచిని, నీతిని బోధిస్తూ ఊరూరా తిరుగుతూ ఉండేవారు. ఈ వేషాన్ని వేసేటప్పుడు సంప్రదాయక వస్త్రాలుంటాయి. పూర్వ కాలంలో వీళ్ళు అర్ధరాత్రి దాటిన తరువాత, ఒక దాని మీద ఒకటి మూడు, నాలుగు జతల బట్టలను తొడుగుకొని, పంచే, లాల్చీ, పెద్ద తలపాగా ధరించి, పెద్ద కుంకుమ

బొట్టు పెట్టుకొని, లాయరుకోటు, పైన శాలువా, ఒత్తుగా మెలి వేసిన మీసాలతో, భుజం మీద ఒక దుప్పటి వేసుకొని, నుదుటన పసుపు బొట్లు అడ్డంగా పెట్టి, ఆపైన ఎరుపు బొట్టు రూపాయి బిల్లంత సైజు పెట్టుకొని, గడ్డం మీద నుండి తల పైకి వచ్చేట్లుగా ఎర్రరంగు గుడ్డ చుట్టూకుంటారు. మేడలో రుద్రాక్ష మాలలు, చేతికి కడియాలు తొడుక్కుంటారు. ఇంతకు ముందు గ్రామ పెద్దలు బహుకరించిన సింహతలాటాలు, మెడల్స్ తో అలంకరించుకుంటారు. ఘంటా కంకణం, మకర కుండలాలు ధరించి గ్రామం లోకి అడుగు పెడతారు.

ఒక చేతిలో లాంతరు పట్టుకొని, మరో చేతిలో ఢమరుకం(బుడబుక్క)ను వాయిస్తూ, వీధిలో గంబీరంగా నడుస్తూ భక్తి ప్రచారం చేస్తూ, సామెతలతో ప్రజలను మెప్పిస్తూ నైతిక బోధ చేస్తూ తెల్లవారుఝామున ఆరు ఏడు గంటల వరకు తిరుగుతూ ఉండేవారు. సూర్యోదయానికి తిరిగి ఇళ్లకుజేరెవారని ప్రతీతి. వీధిలో వారు ఏ ఇంటిముందు ఆగేవారు కాదు. ఏ గృహస్థు అయినా ఏమైనా ఇస్తే ఆగి తీసుకునే వారు కానీ యాచించే వారు కాదు. పగటి వేషాల వారు బుడబుక్కల వేషాన్ని రమ్యంగా ప్రదర్శిస్తారు. ఢమరుకం 'బుడ బుడ...' అంటుంది కాబట్టి వీరు ఈ వేషాన్ని బుడ బుడకల వేషం అని పిలుస్తారు. పెద్దపెద్ద మీసాలు పెట్టుకుంటారు.

'అంబ రావే...జగ దంబ రావే.... –బుడబుక్
కంబ కంటిని .... కాళి రావే ....–బుడబుక్ '
అయ్యలారా...అమ్మలారా... ఈ రోజు వేషం బుడబుక్కలు.
బుడబుక్కలు చెప్పే మాటలు దేవతలా ముచ్చట్లు.
'కాశి విశాలాక్షి పల్కు ...కంచి కామాక్షి పల్కు...బుడబుక్
కలకత్తా కాళి పల్కు.....మధుర మీనాక్షి పల్కు...బుడబుక్
ఆ కొండపై వెలసిన విజయవాడ దుర్గమ్మ పల్కు...'

మేం ఇప్పుడు పుట్టినోల్లం కాదు మారాజా. " కృతయుగంలో శ్రీ హరి బుడబుక్కల వాని వేషం వేసి శివునికి త్రిపురాసురల సంహరించే ఉపాయం జోస్యం చెప్పినాడు మారాజ్. త్రేతాయుగం లో దంభికాసురుడనే రాక్షసుడిని చంపి వాని డింభం డోలక ఢమరుకం చేసి, వాని నరము తాళ్ళుగా, చర్మం మూతలుగ, చేసి బుడబుక్కల వాని వేషంలో వచ్చి, సూర్యవంశం గురించి చెప్పి, ఢమరుకం వాయించిన మేము ఇప్పుడు ఇల్లిల్లు తిరిగి దీవిచి పోతున్నాం మారాజ్. త్రేతాయుగంలో దశరద మహారాజు సంతానం లేకుండా చింతిస్తున్న సమయంలో శ్రీ మహావిష్ణువు, బాగా యాలోచన చేసి, రఘువంశం ఇంతటితో ఆగి పోరాదు, దశరధుని నిరాశను ఆశగా చిగురింప చేయాలని ఒక రోజు బుడ బుక్కలవాని వేషంలో వచ్చి "రాజా, రాజాధిరాజ, రాజ మార్తండ, రవి కల్ప భోజ, రాజ, నీకు భవిష్యత్తు చాల ఉంది. సంతానం లేదని చింత పడవద్దు. నువ్వు వీరుడివి, శూరిడివి, అమాత్యుడివి, కాబట్టి నీకు పుత్ర సంతానం కావాలనే ఆలోచన

వుంది. అందుకు చక్కని పథకం చెబుతాను విను అన్నాడు". అంతవరకు ఎంతో చింతిస్తున్న దశరధుడు నిరాశ నిస్పృహలను వదలి పెట్టి, భవిష్యత్తు మీద ఆలోచనతో, ఆశతో చెప్పండి అన్నాడు. అప్పుడు శ్రీ మహావిష్ణువు "పుత్రకామేష్టి" యాగాన్ని చేస్తే తప్పకుండా నీకు పుత్రులు జన్మిస్తారు అని చెప్పాడు. అలా పుట్టిన మేము ఇప్పడు గ్రామా గ్రామాన తిరిగి మంచి విషయాలు, దేవతలా ముచ్చట్లు తెలుపుతూ ఉంటాం. తమ వంటి దాతలు ఉన్నంత కాలం ఈ దేశానికి, ఈ భూమికి మంచి జరుగుతుంది. ఈ సంవత్సరం మా సేటు గారికి లక్షల లక్షల లాభం కలిగి, శుభోజ్జయం కలిగి, బుడబుక్కల వారి ఆశీస్సులు గలిగి ఎల్లప్పుడూ జయాన్ని పొందాలి....జయీా భవ..... విజయీా భవ.... దిగ్విజయీా భవ .......

'అంబ పల్కు...జగదంబ పల్కు.....–బుడబుక్

కాశి విశాలాక్షి పల్కు ...కంచి కామాక్షి పల్కు...బుడబుక్

## బుడబుక్కల కుటుంబాలు:

బుడబుక్కల వారు ఆంధ్ర దేశంలో సుమారు మూడు వేల కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం లోని దాంపురం దగ్గర ఒకప్పుడు మూడు వందల కుటుంబాలు వుండేవి. క్రమేపి ఉపాధి కోసం నాలుగు పక్కలు చెదిరి పోయారు. ఈ వృత్తి వారికి పరిధులు లేవు. ఏ గ్రామంలోనైనా యాచన చేయవచ్చు. అయితే ఒకరు వెళ్ళిన గ్రామానికి మరొకరు యాచనకు వెళ్ళరు. వారి ఆచార వ్యవహారాలు వేరుగా వుంటూ వారిళ్ళల్లో జరిగే పెళ్ళిళ్ళు అయిదు రోజులు జరుగుతాయి. ఆ సమయంలో అందరూ మద్యాన్ని సేవిస్తారు. అలాగే వారి కులాచారం ప్రకారం ఎవరైనా తప్పు చేస్తే కుల పెద్దలు విచారించి వారికి జరిమానా విధిస్తారు. ఆ వచ్చిన డబ్బుతో అందరూ విందు ఏర్పాటు చేసుకుంటారు. పురుషులు ఇలా యాచిస్తే స్త్రీలు చాపలు అల్లుతారు.

## సామాజిక అంశం:

వ్యవసాయంలో పంట దిగుబడి తగ్గి బాధ పడే రైతులు ,అనేక సమస్యలతో నిరాశ చెంది జీవితంపై విరక్తి చెందుతున్నారు .ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా, బాధలలో ఉన్న వారందరిని నిరాశకు లోను కావద్దు, భవిష్యత్తులో బాగుంటుందని చిగురించే ఆశలు ఈ కళాకారులు ఈ వేషం ద్వారా కలిగిస్తున్నారు. ప్రస్తుతం బాధల నుండి విముక్తి పొందటానికి చేయవలసిన పనుల గురించి ఆలోచించి, ఆచరణలో పెట్టటమే తక్షణ మార్గం పరిష్కారమని ప్రజలకు చెప్తారు. విజయం సాధించాలంటే అసంతృప్తి, అసహనం, మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి. సమాజంలో అన్ని వర్గాలతో సత్సంబందాలు నెలకొల్పుకోవటం ద్వారా సానుకూల దృక్పధాన్ని అలవరచికోవాలి. పరిపరి విధాల పోయే మనసును సానుకూల దృక్పధం వైపుకు మరల్చమని చెప్పేదే ఈ వేషం. నేడు ప్రజలకు భవిష్యత్ మీద నమ్మకం కలిగించే మాటలు చెప్పటానికి మానసిక వైద్యులు, సానుకూల ఆలోచన తరగతులు నిర్వహించే వారు కృషి చేస్తున్నారు.

ఒక ఉన్నతమైన జానపద కళారూపం ఇలా యాచనకే పరిమితం కావడం విచారకరమైన విషయం. బుడబుక్కల వారిలో అనేక తెగలు ఉన్నాయి. వీరు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలలో కూడా ఉన్నారు. మిగతా చోట్ల ఉన్నారేమో తెలియదు. ఆదరణ కరువైతే కళారూపాలు కూడా మార్పు చెందుతాయి. భుక్తి కోసమే ఆరాటం. వీరి గురించి మా చిన్నతనం లో చాలా కథలు ప్రచారంలో ఉండేవి. చేతబడులు చేయడంలోను, వాటికి విరుగుడు చేయడంలో ప్రావీణ్యం ఉండేది కొందరికి అనేవారు. అర్ధరాత్రి దాకా శ్మశానంలో పూజలు చేసి బయల్దేరేవారు అని కూడా ఒక అపనమ్మకం ఉండేది. వీరు తాయత్తులు కూడా కట్టేవారు. వీరు ఊరిలో తిరిగినంత కాలం ఊరికి శుభం జరుగుతుందని ఒకప్పుడు నమ్మేవారు.

ఆ వేషము, ఆ పలుకు, వాచకం, ఢమరుక శబ్దం, గుబురు మీసాలు చూపించి తల్లులు పిల్లలని భయపెట్టే ప్రయత్నం చేసేవారు “బూచాడు వస్తున్నాడు, అల్లరి చేస్తే ఎత్తుకు పోతాడు” అంటూ. అంతే తప్ప వారిని బూచాడు, బుచ్చోడు అంటూ పిలవడానికి వేరే కారణం ఏమి లేదు. వీరు గ్రామాలకు వచ్చినప్పుడు గ్రామకట్టు, గౌరికట్టు కడతారు. దాని వలన ఆ గ్రామానికి ఎటువంటి అశుభాలు జరగవని చీడలు రావని వారి నమ్మకం, వారిచేత చిన్న పిల్లలకు తాయత్తులు కూడా కట్టిస్తారు. దానివల్ల చిన్న పిల్లలకు చెడు గ్రహణ దోషాలు రావని గ్రామీణుల నమ్మకం. వీరిలో కుల పెద్దల మాటే చెల్లుతుంది. వినని వారికి శిక్ష గ్రామ / కుల బహిష్కరణ కూడా ఉండవచ్చు. ఇంకో చిత్రమైన విషయం ఏమిటంటే భార్య తప్పు చేసినా భర్త తప్పు చేసినా బాధ్యత భర్తదే. బుడబుక్కల వాళ్లకు రైతులు ధాన్యం కొలిచి ఇచ్చేవారు. క్రమంగా ఆ సంప్రదాయాలు కనుమరుగైపోవడంతో ఈ కళాకారులు కేవలం దయనయమైన యాచకులగానే మిగిలిపోయారు. బుడబుక్కల వారు ప్రాచీనం నుంచి వున్నవారే. వీరి గురించి అనేక మంది కవులు వారి గ్రంథాలలో వర్ణించారు. 18 వ శతాబ్దానికి చెందిన అయ్యల రాజు నారాయణా మాత్యుడు హంస వింశతిలో వారి వేషధారణ గురించి వివరించాడు. అలాగే పైడి మర్రి వెంకటకవి చిత్రాంగద చరిత్రలో వివరించాడు

అంబ పలుకు జగదంబా పలుకు, దుర్గాంబా పలుకు శాంకరీ పలుకు ఓంకారీ పలుకు వారాహీ పలుకు మహంకాళీ పలుకు జయమౌతది జయము జయమౌతది, అయ్యగారు ఏదో తలపెట్టినాడు అవుతుందా కాదా అని మీమాంసలో నున్నాడు అవుతుందిలే దొరా కార్యం శుభమవుతుంది అంటూ ఏవో చెబుతూ గృహస్తుకి ఆసక్తి కలిగిస్తూ పలికేవారు. ఇంటికి కావలసిన అవసరాల గురించి, కొనబోయే వస్తువుల గురించి, కొత్త అల్లుళ్ళ గురించి రకరకాల పధకాలు వేస్తూ వుంటారు. తాము వచ్చిన ప్రదేశంలో ఏ వైపు ఈతి భాదలు వుంటాయో చెప్పి, నివారణ ఉపాయాలు ప్రజలకు తెలియచేసి ధైర్యం చెపుతూ ముందుకు సాగుతారు బుడబుక్కలవారు. “దొర కుడిభుజాన వెంకటేశ్వరుడు సాయమైతడు. దొరపట్టిందల్లా బంగార మైతది. చెయ్యదలచిన పని చేకూర్తది. అయ్య గారి కుడి కంట్లో పుట్టు మచ్చున్నది.

దాని ఇసేస మేమంటే? అయ్య కొద్ది లోపల నాల్గు కాళ్ళ తెల్పు, నడి నెత్తిన సుక్క గల పంచ కళ్యాణి గుర్రాన్ని ఎక్కే పోతుండండి. అయ్యకు నొసట లక్ష్మీ రేఖుండాది. ఈపున ఇంజామర, అరికాలున తామర పద్మం వుండె. అయ్యగారు తెల్ల ఏనుగు ఎక్కి భూ పరిపాలన చేసే వంతుండది. దొరా, ఓ దొరా..మాదొరా.. మా దొడ్డ దొరా.... త్యాగాల దొరా, భోగాల దొరా" అంటూ అయ్యగారిని ఈ విధంగా ఊదర గొడతాడు. "అద్గదిగో దొరా, మీమీద కీడు తలపెట్టిన వారిని వెను వెంట పసిగట్టి వాడిపళ్ళన్నీ పీకించి ఒక్కంత మండించి, భస్మంబు చేసేసి అయ్యగారి కిచ్చే భారం ఈ రామజోగిదే దొరా...తమ కీర్తి ఇంద్రునికన్న గొప్పది. చంద్రునికన్న గొప్పది. మీకు మీరే సాటి" అంటూ.. డబ్బులు దండుకుంటారు. వీరు ఒక్కొక్కరూ ఒక్కొక్క వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఆరె బుడబుక్కల వాళ్ళు భిక్షాటన వృత్తిగా జీవిస్తారు. వీరి మాతృభాష మరాఠి, ఇళ్ళలో మరాఠి భాషను వాడతారు. బయటమాత్రం తెలుగు మాట్లాడతారు. ఆరె బుడబుక్కల వారి పరికరాన్ని డక్కు అంటారు. పరమశివుడు నాట్యం చేసే సందర్భంలో వాయించిన ఢమరకాన్నే వీరు ప్రధాన వస్తువుగా స్వీకరించినట్లు చెప్తారు. గ్రామదేవతలకు సంబంధించిన పాటలను ద్విపదశైలిలో పాడుతూ డక్కును లయబద్ధంగా వాయిస్తూ చాలా హుందాగా ఇంటింటికి తిరుగుతారు. వీరి యాచనలో బియ్యం, డబ్బుల కంటే పాత గుడ్డల యాచనే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. యాచించిన పాతగుడ్డలను బొంతలుగా కుట్టి విక్రయిస్తారు. బొంతలు కుట్టడాన్ని ఒక కుటీర పరిశ్రమగా సాగిస్తారు.

## 4.17. హరిదాసులు:

ఆ మహాద్భుత హరినామ స్మరణ త్యాగయ్య విరచించిన శ్రీహరి గీతామృత ఆనంద గాన స్రవంతిలో సాగిపోతూ హరి దాసు ఆతని పాట, తంబురా నాదం, గానం, తన్మయ నృత్యం, ఆ మఖర సంక్రమణ వేళ, సంక్రాంతి నెల పట్టిన వేళ, లేగ దూడలు చెంగు చెంగున గెంతే వేళ, కోడె దూడల మెడలో గంటలు మ్రోగే వేళ, రంకెలు వేస్తూ కదలాడే వేళ, ఇతర పశువుల అంబా రవాలు వినిపించే వేళ, పక్షుల కిలకిలా రవాలు, కావు కావున కాకుల గుంపులు అరిచే వేళ, పొద్దు చుక్క పొడిచిన వేళ, చలి గణ గణ వణికించే వేళ, కుక్కోరో మని తోలి కోడి కూసే వేళ, కళ్ళాపి జల్లుల శబ్దాలు వినిపించే వేళ, ఆ వేకువతో లేచి ఆవు పేడతో కన్నియలు గొబ్బెమ్మలు చేసి, వాటిని పసుపు కుంకుమ పూలతో అలంకరించే వేళ, ఇళ్ళ ముంగిళ్ళలో రంగవల్లులు అద్దె వేళ, అలంకరింపబడిన ఆ గొబ్బెమ్మలను రంగవల్లికలలో వుంచే వేళ, ఆ ఉషోదయ నేపథ్యంలో మంద్రంగా, సుదూరంగా వినిపించే అద్భుత నాదం, అమృత గానం, ఆ చివరి పదం కృష్ణార్పణం... అతనే హరిదాసు.

హరి అంటే విష్ణువు, ఇంద్రుడు, యముడు అని అర్థం. దాసు అంటే హరిని కీర్తించేవాడు, కథకుడు అని అర్థం. విష్టుపురాణాన్ని పాట, పద్యం, గద్యం రూపంలో రాగయుక్తంగా వల్లెవేస్తాడు కాబట్టి ఆయనే హరిదాసుగా చరిత్ర చెబుతుంది. ఈ హరిదాసు వేషదారణ పురాణాల నుంచి ఉంది. పురాణాల్లో నారథుడి వేషధారణ ఇందుకు నిదర్శనం. ఆయన వారసులే హరిదాసులుగా చెబుతుంటారు. మకర సంక్రాంతి

పర్వదినానికి 20 రోజుల ముందు తరువాత గ్రామాల్లో వేకువజామునే హరినామస్మరణ చేస్తూ వీధుల్లో ప్రజలకు కనువిందు చేస్తూ తన కళానైపుణ్యం ప్రదర్శించే హరిదాసులు ప్రస్తుతం కనుమరుగవుతున్నారు.

హరిదాసు, అందంగా కట్టుకున్న బంగారు జరీతో కూడిన ఎర్రని పచ్చని పట్టు పంచెపై పసుపు పచ్చని పట్టువస్త్రాన్ని నడుము చుట్టూ తిప్పి కట్టి, ఆకు పచ్చని పట్టు తలపాగా తలకు చుట్టి, మెడలోబంతి పూల హారంతో, పట్టు వుత్తరీయముతో, నుదుట హరి నామంతో, భుజాలపైన, వక్షముపైన, తిరునామాలతో, భుజాన తుంబుర తో ఒక చేత్తో చిడతలు, మరో చేత్తో తుంబుర మీటుతూ, శిరస్సు పై, పసుపు కుంకుమలతో, తిరు నామంతోనూ, పూలతోనూ, మామిడి ఆకులతోనూ ,అలంకరించ బడిన, ప్రత్యేక రీతిలో తయారు చేసిన, తళ తళ లాడే రాగి పాత్ర శిరస్సు పై ధరించి, ఆ ధనుర్మాసములో రోజులు గడిచే కొద్ది ఒక దాని పైన మరొకటిగా పాత్రలు, అలంకరణలు పెరిగి పోతూ వస్తాయి. ఆ పాత్రలు వెడల్పుగా ఎత్తు తక్కువగా వుండి, ఒక దాని కంటే మరొకటి చిన్నదయిన పాత్రలు, ఒకదానిపై మరొకటి పెంచుతూ, నెల చివరికి వచ్చే సరికి నాలుగు అడుగుల ఎత్తున, పాత్ర పాత్రకి బంతి పూలతో,పుష్పాలంకరణ, పసుపు, కుంకుమ, తిరునామాలు మామిడి ఆకులు, వీటన్నింటితో అలంకరించి, వాటన్నింటిని, తలపైన స్థిరంగా నిల బెడుతూ పడకుండా నియంత్రిస్తూ, సాధన చేస్తూ ఒకదానిపై ఒకటి పాత్రలు పెంచుతూ నడచి వస్తుంటే, గాలి గోపురంతో సహా ఆ పాండు రంగడు నడచి వస్తున్నాడా అని తలపించే మహత్తర ఆహార్యముతో, నుదిటిపై నామాలు, చేతి చిడతల శబ్దాలతో, కాళ్లకు గజ్జెలు, చేతిమనికట్టుకు పూసలు, నడుముకు బిగించిన కండువ చిందులేస్తూ, ప్రదక్షణ రీతిలో తిరిగే సమయయంలో వింత వింతగా ధ్వనించే కాళ్ళ గజ్జల రవళి వినిపించే వేళ, తంబుర నాద తరంగిణిలో మమైకమై, ఒక పాదం పై బరువు ఉంచి మోకాలు నేలకు మోపి వినయంగా కూర్చొని తలవంచి తలపైనున్న పాత్రలో గృహ యజమానురాలు బిక్ష వేసేటప్పుడు హరిదాసు పలికే పదం 'కృష్ణార్పణం'. హరిలో రంగా హరి హరి... స్వామిరంగ హరి.. హరి.. అంటూ రసరమ్యంగా, రాగయుక్తంగా పురాణ ఇతిహాసాలను వల్లెవేస్తూ నృత్యం, గానం సందర్భోచితంగా హాస్యం మేళవించి, ఛలోక్తులతో, రాగయుక్తంగా, గొంతు విప్పుతూ విధుల్లో నృత్యంచేసే కళాకారులు హరిదాసులు.

## వేకువజామునే ఇంటింటికీ:

హరిదాసులు వేకువజామునే ఇంటింటికీ వెళ్ళి హరికీర్తనలతో మైమరపించేవారు సంక్రాంతి చలిలో వీధుల్లో తంబూర, చిడతలతో, రాగయుక్తంగా, గానం చేస్తూ ప్రజలను మైమరిపించేవారు. ఆయనవెంట పిల్లలు కూడా పరుగెడుతూ.. కేరింతలు కొట్టేవారు. హరిదాసులకు బియ్యం, అరిసెలు, సకినాలు, డబ్బులు, దానంగా ఇచ్చేవారు. పనిలో పనిగా ఆ ఇంట్లో ఉన్న ఆడ పిల్లలకు పెళ్ళిళ్ళు కావాలని, మగ పిల్లలకు ఉపాధి, ఉద్యోగాలు దొరకాలని రాగయుక్తంగా ఆశీస్సులతో కీర్తించే హరిదాసులు కరువయ్యారు. పల్లెల్లో స్వచ్ఛమైన కలుషితం లేని ప్రజల్లో తన హరికథ గానంతో సుద్దులు, సూక్తులు

చెబుతూ యువతకు భవిష్యత్ కర్తవ్యాన్ని నూరి పోస్తూ సామాజిక చైతన్యాన్ని నింపడంలో హరిదాసుల పాత్ర మరువలేనిది.

### గ్రామ వేదికలపై కళారూపాలు:

ఉదయం గ్రామంలో భిక్షాటన చేసే హరిదాసులు సాయంత్రం గ్రామ కూడలి వేదికలపై హరికథలు, బుర్రకథలు, యక్షగాన కథగానంతో గ్రామ ప్రజలను మైమరిపించేవారు. పూర్వం వర్షాలు లేకున్నా కరువు కటకాలు వచ్చినా, గ్రామంలో అంటురోగాలు, అనర్థాలు వచ్చినప్పుడు గ్రామస్తులంతా విరాళాలు సేకరించి పురాణ ప్రవచనం చేయించేవారు. విరాటపర్వం, నలచరిత్ర, రామాయణం, భాగవతం, సుందరకాండలాంటివి చదివించేవారు. రోజంతా వ్యవసాయపనుల్లో అలిసిసొలసి శ్రమించిన ప్రజలకు తమ గాన, నృత్య కళారూపాలతో ప్రజలను ఆహ్లాదపరిచేవారు.

### కనుమరుగైన గ్రామీణ కళారూపాలు:

విదేశీ ప్రాశ్చత్య మోజులో గ్రామీణ కళలు, కళాకారులు, కళారూపాలు, కనుమరుగైయ్యాయి. కళారూపాలను ప్రదర్శించి పొట్టపోసుకునే కళాకారులు, హరిదాసులు, బుడుగ జంగాలు, గంగిరెద్దులు, యక్షగాన కళాకారులు, బుర్రకథ, హరికథ, భాగవతం, రామాయణం, కవులు, కళాకారులు గ్రామీణ వేదికలపై తమ కళను ప్రదర్శిస్తూ ఉపాధి పొందేవారు. ఇంటింటికీ టీవీలు, ప్రతిచేతికి ఇంటర్నెట్, గ్రామానికి సినిమా థియేటర్లు రావడంతో కళాకారులు వృత్తి, ఉపాధి కోల్పోయ్యారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పండుగలు ప్రాధాన్యతలు కోల్పోతున్నాయి. పిండివంటలు, ఫుడ్ ప్లాజాలకే పరిమితమయ్యాయి. గ్రామాలు కరువులు, అనావృష్టి, అతివృష్టి, అప్పులు, ఆత్మహత్యలతో ఖాళీ అయ్యాయి. పల్లెల్లో వృద్ధులు తప్ప యువత కనిపించడం లేదు. పల్లె లోగిళ్ళు ముగ్గులు లేక వెళవెళబోతున్నాయి. పట్టణ లోగిళ్ళు అపరిమిత జనాభాతో నిత్యం రద్దీతో, కాలుష్యంతో నిండిపోయాయి. ఈ రకంగా భారతీయ కళారూపాలు కనుమరుగవుతున్నాయి. తెలుగింట సంక్రాంతి మాసాన హరిదాసు లేనిదే సంక్రాంతియే లేదు. టీవీలు, సినిమాలు, ఇంటర్నెట్‌లు లేని రోజుల్లో ఈ హరిదాసులు ప్రజలకు పురాణ ఇతిహాసాలను రాగయుక్తంగా పాడుతూ ప్రజలను మైమరింపజేస్తూ వారి కళ్లకు కట్టినట్లుగా నృత్యంచేస్తూ చెవులకు శ్రవనానందం కలిస్తూ ప్రజలను సన్మార్గంలో నడిపించడంలో హరిదాసుల పాత్ర మరువలేనిది.

## 4.18. ఫకీర్ సాయిబు వేషం:

ఫకీర్లు ముస్లింలలో ఒక తెగవారుగా గుర్తింపు పొందారు. ముస్లింల ఆదరణతో జీవించే వీరు అల్లా పేరు మీద ముస్లింల ఇంటింటికీ వెళ్ళి 'దువా'(ఆశీర్వాదం) ఇస్తారు. కాల పరిణామక్రమంలో ఫకీరు వేషానికి జానపదుల్లో ప్రాధాన్యత ఉంది. తెలుగులో పాడే ఫకీరుల పాటలు వినసొంపుగా ఉంటాయి.

ప్రజలంతా కష్టాలు లేకుండా బాగుండాలని, పాడిపంటలతో ఊరు సల్లగుండాలని పాటలెక్కువగా పాడుతూ ఉండే పాటల మధ్యలో ఉపయోగిస్తూ ప్రజలను ఆకట్టుకుంటారు. పవిత్ర రంజాన్ నెలలో ప్రతి రొజూ తెల్ల వారు ఝామున 4 గంటలకు అల్లా భక్తులను మేలు కోల్పుతూ ఉంటారు. మిగతా రోజులలో ప్రతి శుక్రవారం ఉదయం 9 గం.ల నుండి 11 గం. ల వరకూ మరియు సాయంత్రం 4 గం.ల నుండి 6 గం.ల వరకూ అల్లాని ప్రార్థిస్తూ, గడప గడపకు తిరుగుతారు ఫకీరులు. అజ్మీర్ దర్గా నుండి సాధారణ దర్గాల వరకూ అల్లాని ప్రార్థిస్తూ జీవిస్తుంటారు ఫకీర్లు.

"ఏ ధంకా క భరోసా హై, అల్లా నబిర్ కేలో తమాషా
మహమ్మద్ కి అల్లాహై తూ, యహ నికల్ రహ హై "

(అల్లా, నబిర్ లు తమాషా చెయ్యండి. ఈ దప్పు నాకు భరోసా ఉండి. మహమ్మదీయులు అల్లా మీద భరోసా ఉంచి పాడుతూ ముందుకు కదులుతారు) అని పాడుతూ, అనుగుణంగా దప్పు వాయిస్తూ వస్తారు. మెడలో తావీజు, కళ్ళకు సుర్మ పెట్టుకుంటారు. పచ్చని, నారింజ, తెలుపు రంగు పూసల దండలు మెడలో వుంటాయి. పెద్ద చొక్కా, గల్ల లుంగి కట్టుకుంటారు. తలకు చిలక పచ్చని పాగా చుట్టుకుంటారు. ఒకరి చేతిలో గిరక మరో ఒకరి చేతిలో ఫకీరు భిక్షపాత్ర మిగిలిన వారు కంజరి పట్టుకుంటారు. వీరు కలిసి అల్లాపై పాటలు పాడుతుంటారు. ఉర్దూ యాసతో తెలుగు మాట్లాడతారు. ఇందుకు గాను భక్తులు వీరికి బియ్యం, డబ్బులు ఇస్తుంటారు. జట్టులో ఒకతను పాట పాడుతుంటే మరో ఇద్దరు అల్లాకేనాం అంటూ గొంతు కలుపుతారు. "ఆవులల్లాకి బేటా, ఫకీరు సాయిబులం" అనుకుంటూ వస్తారు. బాజిర్, అక్షయ పాత్ర, లైటు తీసుకుని బయలు దేరతారు. హిందూ ముస్లిం బేధం లేకుండా అందరి ఇళ్ళకు వస్తారు. గజల్స్ పాడుతూ, వాటి అర్థాన్ని తెలుగులో చెపుతూ, ప్రతి ఇంటి వద్ద దీవనలు చెప్తారు. "అల్లా కి పుత్రులం మనం . అల్లా అంటే భగవంతుడు. భగవంతుడు మనకు అనేక రకాలుగా వున్నాడు. మనం వయసులో వున్నపుడు పెంచిన కండల్ని, సంపదని చూసుకుని, బందు మిత్రులను చూసుకుని గర్వపడుతూ, సాటి వాడిని బాధ పెట్టడం గాని సాటి వాడికి హాని చేస్తే అల్లా క్షమించడు.

ఈ ప్రాణ మనేది ఒక చిలుక లాంటిది. ఆ చిలుకను తెచ్చి దేహమనే పంజరంలో బంధించారు. కాని ఈ పంజరం తలుపులు ఎప్పుడూ తీస్తే అప్పుడు పారి పోవటానికి సిద్దంగా వుంటుంది. పంజరమనే దేహం భగవంతుని పై ఆధారపడి ఉండి, ఆ భగవంతుడు పంజరం తలుపు ఎప్పుడూ తీస్తే, అప్పుడు ప్రాణమనే చిలుక పారి పోతుంది. ఈ ప్రాణం అనే చిలుకను ఎంత దాచి పెట్టినా, అది పారి పోవాలనే చూస్తుంది. కాబట్టి చిలుక ఉన్నంతవరకే ఈ ప్రాణం. చిలుక వున్నంతవరకే ఆ పంజరం. చిలుక పోయాక ఆ పంజరాన్ని పాట సామానుల వాడికి ఇస్తాం. ఈ దేహాన్ని ఖర్చు పెట్టి పూడుస్తాం, ఖననం చేస్తాం.

కాబట్టి మనిషికి ఉదారత్వం కావాలి. అందర్నీ గౌరవించాలి, పూజించాలి. అల్లాని ధ్యానించాలి. ఈ శరీరాన్ని చూసి మోస పోవద్దు. శరీరం అనేది కేవలం తొమ్మిది రంధ్రాల తోలుబొమ్మ . కాబట్టి ఈ

కడుపు లో ఎన్నో దుర్గంధ పదార్ధాలు వున్నాయి. సుఘంధ పరిమళాలతో పోషించినా, చనిపోయిన తరువాత ఆత్మ ఎక్కడికి వెళ్తుంది?

ఆత్మ వెళ్ళిన దేహం అగ్ని హోత్రుని పాలు

కఠిన శల్యములు గంగ పాలు

మీద కప్పిన దుప్పటి చాకలి పాలు

కొడుకు పెట్టినా కుడు కాకుల పాలు

దాచి పెట్టినధనము ధనుడి పాలు

భ్రష్ట పెళ్ళమేమో పరుల పాలు

అందుకే ఏది ఎవరికీ తోడూ రావు కాబట్టి ఈ ఆత్మ చాల గొప్పది. పరమాత్మ ఇంకా గొప్పది. ఆత్మ, పరమాత్మ ఒక్కటైతే మానవుడు సాధించేది చాల ఉంది. పంజరం దాటి చిలుక అడవిలోకి వెళ్ళిపోతుంది. కాబట్టి అడవి అనే లోకంలో చిలకలాగా జీవించాలి. పంజరాన్ని కాపాడుకోవాలి. చిలక పలుకులు పలకాలి.

"అల్లా కి రూప్ హమరే సాత్ రహే తక్ హం జీ సక్తే

వహి నహి తో హం నహిజి సక్తే "

(దేవుడు మనతో ఉన్నంత వరకే మనం బతకగలం. లేకపోతే మనం బతకలేము.)

మనం ఇహ లోకంలో పడే సుఖ దుఖాలను విడిచి దేవుడ్ని ప్రార్ధించాలి. అలా నిష్ఠతో ప్రార్ధించే వాడే స్వర్గానికి వెళ్తాడు.

"ఆద్మీ సుక్ దుక్ సే లోక్ కర్ అల్లా కే ప్యార్ కరనేసే

వహి ఆద్మీ జన్నత్ కు జాతా హై '

(అలాగే సతి మనిషిని హింసించి, బాధ పెట్టె వాళ్ళు "జోజక్ పహంచ్ త హై " –నరకానికి వెళ్తాడు.)

దుష్టులకు కను విప్పు కలిగిస్తూ, దుర్మార్గులని సన్మార్గులుగా నడిపిస్తూ, సాగుతుంది ఈ వేషం. భిక్షను తీసుకుని చివరిగా దీవిస్తారు....

"ఆవులిల్లకా ఆ బాదర్ కి బేటా బేతి సుఖనందర్ కే

ఆవు లైం లాక్ మేర బాప జీతే రామ్ "

(అల్లా పిల్లలయిన మీరందరు సుఖంగా ,ఆనందం గా జీవించండి ) అంటారు.

హిందూ మతస్తులకు, ముస్లిం మతదేవుడిని పరిచయం చేసి, ఏ దేవుడైనా ఆకాంక్షించేది ఒకటే అనే ధర్మాన్ని తెలియజేస్తారు. ఫకీరులు ఇప్పుడు దాదాపుగా గ్రామాలలో కనిపించడం లేదు. వీరికి తగిన సహాయ సహకారులు అందించి ఈ కళారూపాన్ని కాపాడవలసిన బాధ్యత మన అందరిది.

## 4.19. బుర్రకథ:

జానపద కళారూపాలలో అత్యంత ప్రజోపయోగమైనది బుర్రకథ అనడంలో అతిశయోక్తి ఏమీకాదు. ఇది జానపద కథాగానంలో ఒక అంశం. పాటలు పాడేవాళ్ళు బుఱ్ఱ అనే వాద్యం మోగిస్తూ కథ చెప్పడం వలన దీనికి బుఱ్ఱకథ అనే పేరు కలిగింది. దీనికే తందాన కథ అనే మరో పేరు కూడా ఉంది. బుఱ్ఱనే బుడుగె, గుమ్మెట అనే పేర్లతో పిలుస్తారు. ఈ కథాగాన ప్రక్రియ మొత్తం భారతదేశమంతా అల్లుకుని ఉంది. ఈనాటికీ ఈ కళారూపం రేడియోలలో, దూరదర్శన్లలో సినిమాలలో, రాజకీయ వేదికలలో, ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలలో, ఎన్నో ప్రచార మాధ్యమాలలో దీనికి విశేష ఆదరణ లభిస్తుందంటే బుర్రకథ ఎంత శక్తి వంతమైనదో ఆవశ్యకమైనదో, ఎంత ఆకర్షణీయమైనదో, అర్థమవుతుంది.

బుర్రకథ  పల్లెపదాలు, వంత హాస్యాలు, బిగువైన కథనాలు, పద్యాలు, పాటలు అన్నిటినీ కలుపుకొంటూ సరదా సరదాగా సాగిపోయే ఒక జానపద కళారూపం. పరిమితమైన ఆహార్యంతో, ఆడుతూ పాడుతూ హాస్యోక్తులు పలుకుతూ జన సామాన్యానికి చేరువగా వెళ్ళే కళారూపాలలో హరికథ మొదటిది అయితే బుర్రకథ రెండవది. హరికథలో కొంత సంప్రదాయ ముద్ర ఉండి బుర్రకథ పూర్తిగా జానపద కళారూపం. ప్రదర్శింపబడిన బుర్రకథ తెలుగునాట జానపద వినోదగాన ప్రక్రియలలో ప్రబోధానికీ, ప్రచారానికీ సాధనంగా ఈ నాటికీ విస్తృతంగా ఉపయోగపడే కళారూపం బుర్ర కథ. కథకుని చేతి ప్రక్రియ ఇది. ప్రదర్శన సౌలభ్యాన్ని బట్టి, వీర గాథలు, త్యాగమూర్తుల కథలు బుర్ర కథల ఇతివృత్తాలుగా బాగా పేరుపొందాయి. ఈ ప్రక్రియ ప్రచార సాధనంగా ఎంతగానో ఉపకరిస్తోంది. కుటంబ నియంత్రణ, రాజకీయ ప్రచారము, ప్రజలను విజ్ఞానవంతులను చేయడము వంటి కార్యక్రమాలలో ఇది బాగా వాడబడింది. జంగంకథ, పంబలకథ, జముకులకథ, పిచ్చుకుంట్ల కథ, తరువాత వచ్చింది. డాలు, కత్తితో పాడే ప్రధాన కథకుడికి పిచ్చిగుంట్ల కథలో ఇద్దరు వంతలున్నట్లే బుర్రకథలో కూడా ఉంటారు. దీనికి గౌరవం కల్పించి పద్మశ్రీ బిరుదు సంపాదించుకున్నవారు షేక్ నాజర్. పేరునుబట్టి వీరు ఇస్లాం మతానికి చెందిన వారైనా చెప్పిన కథలలో ఎక్కువ భాగం హిందూ దేవీదేవతలకు చెందినవే.  శ్రీకాకుళం పర్యటించినప్పుడు శ్రోతలు బొబ్బిలియుద్ధం కథ కోరారు. దానితో నాజర్ తానే కథారచనకూ నడుంబిగించాడు. అంతేకాదు సామ్యవాద దృక్పథం గల వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించుకున్నది. నాజర్ బొబ్బిలియుద్ధం, అల్లూరి సీతారామరాజు ప్రహ్లాద, క్రీస్తు, పల్నాటి యుద్ధం బెంగాల్ కరువు వంటి వస్తు వైవిధ్యంగల కథలను చెప్పి రక్తికట్టించారు.  "వినరా భారత వీరకుమారా విజయం మనదేరా దండాన తానా" అన్న చరణం బుర్రకథల్లో సర్వ సామాన్యం. బుర్రకథ ముగ్గురు ప్రదర్శకులతో

నిర్వహించబడుతుంది. – వీరిని కథ, రాజకీయం, హాస్యం అని పిలుస్తారు. మధ్యలో ఉండే కథకుడు పాడేదానికి చెప్పేదానికీ ఇటూ అటూ ఉన్న ఇద్దరూ తందాన తానా అని వంత పాడతారు.

కథ: ఇతనే ప్రధాన కథకుడు. ముఖ్య కథను, వర్ణనలనూ, నీతినీ, వ్యాఖ్యలనూ వచనంగా – అంటే మాటల్లో చెబుతూ, సందర్భం వచ్చినచోట భావపరమైన స్ఫూర్తిని కలిగించేందుకు రసవంతమైన పాటలు, పాడతాడు. కథకుడు ముఖ్య కళాకారుడు. ఇతనే ముఖ్య కథకుడు. ఇతను హాస్యంగా మాట్లాడడం చాలా అరుదుగా ఉంటుంది. ఒక వేళ ఎప్పుడైనా వేరే కబుర్లతో మిగిలిన ఇద్దరూ పక్కదారి పడుతున్నా ముఖ్య కథలోకి తీసుకొస్తూ నిబద్ధతతో కథ చెప్పడం ఇతని బాధ్యత. ఈ పాత్ర పోషించే వ్యక్తికి మాటా, ఆటా, పాటా బాగా తెలిసి ఉండాలి. ఇక కథ సంగతి సరేసరి. అతని వేషధారణ కూడా రంగుల అంగరఖా, తలపాగా, నడుముగుడ్డ, ముత్యాల గొలుసు, కాలిగజ్జెలతో కనుల పండువుగా ఉంటుంది.

రెండో వ్యక్తి: ఇతను ముఖ్య కథకుడి కుడిభుజం వైపు ఉంటాడు. అంటే – బుర్రకథ చూసేవారు ఎడమ పక్క నుంచి ఒకటి, రెండు, మూడు అని లెక్కపెడితే మొదట లెక్కకు వచ్చేది ఇతనే! ఇతను హాస్యగాడు కాదు. ముఖ్య కథకుడు ఎక్కువగా పాటలతో కథను చెబుతుంటే – మధ్యలో వచనం వచ్చినప్పుడల్లా సీరియస్ చర్చల్ని ఇతను కథకుడితో చేస్తుంటాడు. లేదా అతను వచనంతో కథ చెబుతుంటే – ఆహా ఓహో అంటూ వంత పాడుతుంటాడు. రంగుల దుస్తులతో, విభూతి రేఖలతో, చేత డప్పులతో వీరు కథకునికి పాటలోనూ, చిందులోనూ తోడుంటాడు. కథలో పట్టు నిలబెడుతుంటారు. ఏమైందని ప్రశ్నిస్తూంటాడు. ఉత్సాహాన్ని, ఊపును పంచుతుంటాడు. ప్రేక్షకుల ఆసక్తిని పెంచుతుంటాడు. మూడో వ్యక్తి హాస్యం చేసినప్పుడు అతనితో ఇతను చర్చిస్తాడు. ఆ సమయంలో కథకుడు వెనక్కి వెళ్తాడు. రాజకీయం, హాస్యం ఇద్దరూ సరదా సంగతులు చర్చించుకున్నాక– మళ్లీ మధ్యలోని కథకుడు ముందుకొచ్చి ముఖ్య కథను కొనసాగిస్తాడు. అయితే కొందరు అపోహపడే విధంగా రాజకీయం అనే ఈ వ్యక్తి – హాస్యగాడితో చర్చిస్తాడే గానీ హాస్యాన్ని పంచడం ఇతని బాధ్యత కాదు. కథ చెప్పేటప్పుడు ముఖ్య కథకుడికి అండగా ఉండి సహకరించడమే ఇతని ముఖ్య బాధ్యత.

మూడవ వ్యక్తి హాస్యం: బుర్ర కథ మొత్తం తీక్షణంగా సాగితే ఇబ్బంది కాబట్టి – అవకాశం ఉన్నప్పుడల్లా ఇతను హాస్యంగా మాట్లాడతాడు. – ప్రస్తుత నిత్య జీవితానికి సరిపడే విధంగా కబుర్లు చెబుతూ – ముఖ్య కథకి అప్పుడప్పుడు అడ్డుకట్ట వేస్తున్నట్టు అనిపిస్తుంది గానీ – అది కేవలం వినోదం కోసమే హాస్యగాడు తన హాస్యంతో ముఖ్య కథ తాలూకు విలువని తగ్గించకూడదు. ఎక్కడైనా అలా తగ్గితే కథకుడు జోక్యం చేసుకుని – కథ తాలూకు గాంభీర్యాన్ని కోల్పోకుండా చూస్తాడు. తిరిగి కథలోకి జనాన్ని తీసుకు వెళతాడు. మొత్తం మీద చూస్తే – బుర్ర కథలో ముఖ్య కథకుడు గంభీరమైన కథకుడైతే, హాస్యగాడు హాస్యం చేస్తాడు. రాజకీయం చేసే వ్యక్తి చేయాల్సిన పని సమతౌల్యం( బ్యాలెన్స్ ) కథకుడికి వత్తాసు పలుకుతూ కథ తాలూకు విలువనీ గాంభీర్యాన్నీ కాపాడడం, ప్రేక్షకుల ఆసక్తిని కాపాడేందుకు

హాస్యగాడితో కలిసి హాస్య చర్చలో పాలుపంచుకోవడం రెండింటినీ జాగ్రత్తగా నిర్వహిస్తాడు. అయితే ఇతను హాస్యగాడు కాదు. ఈనాడు కథాగేయ రూపంలో దృశ్య ప్రక్రియగా రూపు చెందిన బుర్రకథ ప్రభుత్వ కార్యకలాపాలను గ్రామీణ జనంలో ప్రచారం చేయడానికి ఒక శక్తిమంతమైన సాధానంగా ఉపయోగపడుతుంది.

## ఉత్తరాంధ్రలో బుర్రకథలు:

ఉత్తరాంధ్రలో మొన్న మొన్నటి వరకు అనేక బుర్రకథ దళాలు ఉండేవి. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస, నరసన్నపేట కోటబొమ్మాళి తాలూకాలు, చిలక పాలెం, రాజాం పరిసర ప్రాంతాలు బుర్రకథలకు నిలయమైనాయి. అల్లూరి సీతారామరాజు కథ, బొబ్బిలియుద్ధం, పల్నాటి వీర చరిత్ర, బాలనాగమ్మ వంటి కథలను గానం చేసారు. అలాగే విజయనగరం దాని పరిసర ప్రాంతాలలో కుమ్మరి మాష్టారు బుర్రకథ దళం, రొంగలి సత్యం బుర్రకథ దళం, రాఘవకుమార్ బుర్రకథ దళం వంటి అనేకదళాలు పాడాయి, ఆడాయి. ఇటువంటి కళారూపాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిది.

## 4.20. హరికథ:

హరికథ సకల సమాహార స్వరూపమైన విశిష్ట కళావిశేషం. హరికి సంబంధించిన లీలా విలాసాదుల్ని కథగా చెప్పే విశిష్ట కళారూపం. హరికథ ఆ తరువాతి కాలంలో హరిలీలా విలాసాదుల్నే కాక ఆయన పరివారానికి, భక్తులకు సంబంధించిన చరిత్రలకు కూడా వ్యాపించింది. ఇందులో కాలానుగుణంగా దేశనాయకులకు, సంఘసంస్కర్తలకు, రాజకీయపక్షాలకు, ఉద్యమాలకు, క్రైస్తవ ఇతివృత్తాలకు, ముస్లిం ఇతివృత్తాలకు సంబంధించినవి చోటుచేసుకున్నాయి. హరికథ జీవన స్రవంతిలో ఆధ్యాత్మిక ప్రచారమునకు నేటికీ బాగా వినియోగపడుతోంది. బుర్రకథలు తోలుబొమ్మలు, వీధినాటకములతో బాటు జీవనాధారముగ హరికథ వృత్తిగా జీవించిన, జీవిస్తున్న హరికథకూడ కాలానుగుణ పరిస్థితులకు ఎదురీదుతోంది. హరికథల ప్రభావము ఆధ్యాత్మికపరముగ ఈ కాలానికి మరపురానిది. హరిదాసులు, హరికథా సంబంధ విషయములే కాదు ఆధ్యాత్మిక జీవన దీప్తి రగిలించిన మహాపురుషుల కథలు పురాణ పురుషులు కథావస్తువులుగా హరికథలు గానము చేయగలుగుతున్నామని నారాయణ దాసును వినయముగా నేటికీ గుర్తుచేస్తూనే ఉన్నారు.

చేతిలో చిరతలు, కాలికి గజ్జెలు, పట్టుధోవతి పంచకట్టు నడుముకు పట్టు కండువా చుట్టుకుని 'హరికథ చెప్పెద వినుడీ' అని హరిదాసు కథాగానము చేస్తారు., నుదుట బొట్టు. మెడలో దండ. హరికథా ప్రారంభమునకు ముందు హరిదాసుకు మెడలో దండ వేయడానికి ప్రేక్షకులు ఉత్సాహము చూపుతారు. హరిదాసును భాగవతార్ అంటారు. స్త్రీ హరిదాసులను భాగవతారిణులు అంటారు. తెలుగునాట భారత,

భాగవత, భగవద్గీత, భక్తుల మహాచరిత్రలు హరికథా వస్తువులుగా గానం చేయబడతాయి. ఇప్పటికీ దేవాలయములలో పర్వదినములలో ఒకరోజుకు పరిమితము. అయితే ఒకప్పుడు గ్రామాలలో నెలల తరబడి ధారావాహికగా నెలకు పైబడి హరికథలు సాగేవి. పాండిత్యము, నటన, పాటలు, హాస్యము, చమత్కారము కలబోసి వేదాంత విషయములు ప్రతిభావంతముగా ప్రజలలో చొచ్చుకుపోయేలా చేయగలది. హరికథా ప్రక్రియ నారాయణదాసు గారు తెలుగు హరిదాసులకు పెట్టిన భుక్తిముక్తిదాయక వృత్తి అని హరిదాసులు కృతజ్ఞతలు చెప్పి హరికథను ప్రారంభిస్తారు. హరిదాసు కేవలము ప్రతిభ వలననే కథా ప్రవచనముతో ఆకట్టుకొనగలడు. అతనికి నృత్యగాన గేయ పాండిత్య ప్రతిభకు సహాయముగా ఫిడేలు, హార్మనీ, మద్దెల పక్క వాయిద్యములుంటాయి. భక్తి, సంగీత, సాహిత్య అభినయాల మేలుకలయికగా హరికథని తూమాటి దోణప్ప అభివర్ణించడం హరికథ విలువను చాటుతాయి.

హరికథా పండితుడు అంటే వేదపురాణాది పరిజ్ఞానముతోబాటు, సమకాలీన సాహిత్య ప్రవేశము పుష్కలముగా ఉన్నవాడని కూడా అర్థము. హరిదాసు స్వయముగా కవి కావచ్చు. కాకపోవచ్చు. పురాణ విజ్ఞానముతోబాటు, సమకాలీన విషయావగాహన మాత్రము తప్పక కలిగి ఉంటాడు. సమయస్ఫూర్తి కలిగి ఉపయోగించగలుగుతాడు. హరికథా భాగవతార్ లు ముఖ్యంగా, భారత, భాగవత, రామాయణం కథలు విశేషంగా చెబుతారు. ఇందులో నర్తనశాల, శ్రీకృష్ణరాయబారము, సుభద్రాపరిణయం, సీతాకల్యాణం, ఉత్తరగోగ్రహణం, విరాటపర్వం, భక్తకుచేల, రుక్మిణీ కల్యాణం, భూకైలాస్, ధృవచరిత్ర, సత్యహరిశ్చంద్ర, శ్రీకృష్ణగారడి, పార్వతీ కల్యాణం, భక్త మార్కండేయ కథలతోపాటు మూడున్నర వజ్రము, ద్రౌపదీ స్వయం వరం మున్నగు కథలు విశేషమైన ప్రచారములో వున్నాయి. పోతులూరు వీరబ్రహ్మం కథను రసవత్తరంగా నెలపాటు చెప్పేవారున్నారు. ఈ మధ్య షిర్డీసాయి చరిత్ర, అయ్యప్పస్వాముల కథలు, మిగుల ప్రచారములో వున్నాయి. ఇవి కాకుండా చారిత్రికకథలు, రాజకీయకథలు, మహాత్ములకథలు, కోకొల్లలుగా హరికథలుగా ప్రచారంలో వున్నాయి. హరికథా విద్యకు ఆదిభట్ల నారాయణదాసు పితామహుడని అంటారు. కాని ఆయనకు పూర్వమే హరికథ దాసులు కొద్ది మంది ఉన్నట్టు తెలుస్తూ ఉంది. కాని హరికథకు ఓ స్థిరరూపాన్ని, స్థానాన్ని ఇచ్చి హరికతకు గౌరవాన్ని సమకూర్చినవారు ఆదిభట్ల నారాయణదాసు. అందుకే ఆయన హరికథా పితామహుడయ్యాడు.

ఉత్తరాంధ్రకి చెందిన కొంతమంది హరికథ కళాకారులు:

**శ్రీకాకుళం జిల్లా:** దూసిబెనర్జీ భాగవతార్, బి. విజయలక్ష్మి బి.రంగారావు, బి. కె. వీరాచారి, దోరచిన్నబాబు, లండలచ్చయ్య, బి.యతిరాజు భాగవతారులు.

**విజయనగరం జిల్లా:** శ్రీ అప్పిలి రాఘవేంద్ర భాగవతార్, శ్రీమతి కాళ్లనిర్మల, మండ వరలక్ష్మి, ఎమ్.వి. రమణమూర్తి, డి. ఉమ, ఎమ్ రామమూర్తి, ఎన్. రూపకుమారి, జాడ కొండలరావు, పిఠాపురం ధనలక్ష్మి, రామదాసు, బి. సాంబమూర్తి భాగవతారులు

**విశాఖజిల్లా** : శ్రీమతి ఇందిరాబాల, శ్రీ కె. బాబా భాగవతార్, కట్టా జేజేరావు, దువ్వి అప్పారావు, కె. కళ్యాణి, ఐ. సూర్యనారాయణ, కె.లక్ష్మీకాంతం, కె. లక్ష్మీ రాజ్యం, ఎ.వి రమణాచార్యులు, డి. సత్యన్నారాయణ భాగవతారులు మరికొంతమంది.

హరికథ ఉత్తమ ప్రచార సాధనం కావడం ప్రజల్లో వచ్చినటువంటి ఆలోచనా ధోరణి వల్ల పరిస్థితులకు అనుగుణంగా రేడియోల్లోను, టెలివిజన్లలోను దీని ప్రాముఖ్యత హెచ్చింది. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అందరూ ఈ ప్రక్రియను ఆదరిస్తున్నారు. తమ తమ మత ప్రచారానికి ఉపయోగిస్తున్నారు. మారుతున్న సమాజంలో హరికథకులలో కూడా ప్రతిభా విశేషాలు తగ్గుతున్నాయి. ఆదరణ తగ్గి పోతున్నది. పొట్ట కూటికై హరిదాసులుగా చెలామణి అవుతున్నారు. నేటి కళారూపాన్ని ప్రదర్శించే కళాకారులు గ్రామాల్లోనూ కాలంతో పాటు కనుమరుగవుతున్నరు. వీరికి తగిన సహాయ సహకారాలు ప్రభుత్వం కూడా ఆదుకోవాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన మార్పులు ఇటువంటి కళారూపాల పై ప్రభావాన్ని ఎంతగానో చూపాయి. బహిరంగ ప్రదేశాల్లోనూ మండపాలలోనూ ఆలయ ప్రాంగణంలో గ్రామ ఉత్సవాలు సమయంలో నిర్మాణం చేపట్టి ప్రదర్శింపబడే ఈ కళారూపం ప్రస్తుతం వీటి జాడలు లేకుండా పోవడం బాధాకరమైన విషయం. ఇటువంటి కళారూపాన్ని పరిరక్షించి భావితరాలకు అందించవలసిన బాధ్యత మరియు కళాకారులను తగిన విధంగా గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉంది.

## 4.21. కాశీకావడి:

కాషాయ వస్త్రాలు ధరించినటువంటివ్యక్తి భుజంపై కావడిని పెట్టుకొని ఇరువైపులా బిందెలను ఆ బిందెలకు కాషాయ వస్త్రాలతో కప్పి ఒక గంట ను ఏర్పాటు చేసుకుని వాటిపై కొడుతూ కాశీ క్షేత్రాన్ని దర్శించే సన్యాసులు ముఖ్యంగా కాశీ యాత్ర మహిమలను కాశీ క్షేత్ర విశేషాలను అక్కడ ప్రసిద్ధమైనటువంటి సంఘటనల గురించి విశేషంగా తెలియపరుస్తారు. వీరు కాశీకి వెళ్లే క్రమంలో మధ్యలో జరిగినటువంటి ఒడిదుడుకులు సంఘటనలు పర్వతాలు నదులు అడవులు చెట్లు కొండలు గుట్టలు మొదలైన వాటి గురించి, వారు వెళ్తున్న క్రమంలో జరిగినటువంటి ఒడిదుడుకులను కష్టాలను సమస్యలను తెలియజేస్తారు. పూర్వకాలంలో కాశీకి వెళ్లడం అంటే విదేశాలకు వెళ్లినట్లే భావించేవారు. ముఖ్యంగా కొంతమంది ధనవంతులు మాత్రమే కొన్ని ప్రయాణ సాధనాల ద్వారా వెళ్లేవారు. సామాన్య ప్రజానీకానికి ఇది అంతగా అందుబాటులో ఉండేది కాదు. కాశీకి వెళ్లేటటువంటి వ్యక్తులు వారి యొక్క వేషధారణ చూసి ఎంతో అనుభూతి చెంది తగిన పారితోషికాలను ఇస్తారు. ప్రత్యక్షంగా కాశీ క్షేత్రానికి వెళ్ళ లేనటువంటి సామాన్య ప్రజానీకం ఈ కళారూపం పట్ల ఆకర్షితులై ఆ కాశీ విశ్వనాధుని పేరిట తగినంత డబ్బుని అందిస్తారు. ఈ కళారూపం దైవభక్తి పట్ల చిత్తశుద్ధిని కలిగినటువంటి విధంగా ఆధ్యాత్మికతతో కలిగి ఉంటుంది. నేటి కాలంలో ఈ కళారూపం పట్ల ఆసక్తి కనుమరుగవుతుంది. కేవలం

భుక్తి కోసమే ఈ కళారూపాన్ని ప్రదర్శించే విధంగా ఉత్తరాంధ్రలో అక్కడక్కడ మాత్రమే ఈ కళారూపాన్ని ప్రదర్శించడం జరుగుతుంది.

## 4.22. గంట సాయిబులు:

గంట సాయిబులు ఉత్తరాంధ్రలో ఏడాదికి ఒకసారి గ్రామాలకు వస్తారు. తెలుగు వారి జానపద కళాకారులలో బుడబుక్కల జాతివారు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నారు. ఇతర కులాలు వారు పగలు భిక్షాటన చేస్తే వీరు రాత్రి సమయాలలో భిక్షాటన చేస్తారు. బుడబుక్కలవారు రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో వ్యవహరించబడుతున్నారు. వీరిలో బొందివీలు, భరతసాయిబులు, రేయితురకసాయిబులని, గంటసాయిబులని, నిడకలోళ్ళని, గిలకలోళ్ళని, గుదగంటోళ్ళని కొన్ని రకాలవారున్నారు. ఉత్తరాంధ్రలో కొన్ని ప్రాంతాలలో బుడబుక్కల వారు, మరికొన్ని ప్రాంతాలలో గంటసాయిబులు ఉన్నారు. గంటసాయిబులు ముస్లింలు అయినప్పటికీ తెలుగు మాట్లాడతారు. వీరు నల్లటి కోటు ఎర్రటి తలపాగా కాళ్లకు ప్యాంటు వెనుకకు గంట చేతిలో చిన్న దమరుకం రాత్రి 12 గంటలు దాటిన తరువాత తెల్లవారు జాము నాలుగు గంటల వరకు భిక్షం అడుక్కుంటారు. ఆ సమయంలో భుజం పై ఉన్న కర్రకు ఒకవైపు హరికేన్ లాంతరు మరోచేతిలో దమరుకం, లబ్జుగా వాయిస్తూ నడుముకు ఒక పెద్ద గంటను కట్టుకొని, ఒకదానిమీద ఒకటి నాలుగు జతల బట్టలు తొడిగి, బిగుతుగా తలపాగ ధరించి, కాళ్ళకు మేజోళ్ళు (సాక్స్) భుజం మీద జంపకానా ధరించి వీధిలో గంభీరంగా నడుస్తూ ఉటో ఉటో (లేవండి లేవండి) అంటూ ఇంటింటికి వస్తారు.

"అల్లా దీవెనతో చల్లగా ఉండాలి
అందరూ చల్లగా ఉండాలి
పాడిపంటలతో సల్లగా ఉండాలి
కొడుకు కూతుళ్ళు సల్లంగా ఉండాలి" అని దీవిస్తుంటారు.

ప్రతి ఇంటి వద్దనుండి యాభై నుండి వంద రూపాయలు కానుకగా స్వీకరిస్తారు. కానుకలు స్వీకరించిన తరువాత అల్లాదీవెనలు గలగాలి. అందరూ సల్లగుండాలి. పాడి, పంట, పశువులు, కొడుకులు, కూతుళ్ళు. అల్లుళ్ళు పిల్లలందరూ చల్లగుండాలని దీవెనలిస్తారు. వీరికి వంశ పారంపర్యంగా వచ్చిన గ్రామాలుంటాయి. వీరు గ్రామాలను పంచుకుంటారు. ఒకరు వెళ్ళే గ్రామానికి ఇంకొకరువెళ్ళరు. సంవత్సరానికి ఒక్కసారే వెళ్తారు. ఇంచుమించు పంటలు ఇంటికి వచ్చే సమయంలో సంక్రాంతి రోజులలో వెళ్తారు. వెనుక భాగాన ముడ్డి దగ్గర గంట కట్టుకుంటారు కాబట్టి గుద గంట వారు అని వీరినే గంట సాయిబులు అని అంటారు. వీరు శ్రీకాకుళం జిల్లా మందస దగ్గర సారంగపురం అక్కడక్కడ. బిమిడి గ్రామంలోనూ మరియు కోస్తాలోని కొన్ని ప్రాంతాలలో నివసిస్తున్నారు.

## 4.23. సాతాని వైష్ణవులు:

చాత్తాద శ్రీవైష్ణవులు రామానుజాచార్యుల శిష్యులు చాత్తాద శ్రీ వైష్ణవులు. వీరిలో చాలా మంది పేర్లు స్వామి లేదా ఆచారి (ఆచార్య) అనే పదాన్ని కలిగి ఉంటారు. వీరిని సాతాని, చాతాని, అయ్యవారు, వీర వైష్ణవులు, విఖసులు (విఖస ఋషి వంశస్థులు కనుక) అని కూడా అంటారు. వీరి ప్రధాన వృత్తి వైష్ణవాలయాలలో అర్చకత్వం. వీరు ముఖ్యంగా గుడి వ్యవహారాలకు సంబంధించి నిమ్న స్థాయి పనులు చేస్తుంటారు. పురోహితులుగా వ్యవహరిస్తారు. సాతాని వైష్ణవులు వైష్ణవ మత సంప్రదాయానికి చెందిన వారు. రామానుజులు బ్రహ్మ సూత్రాల శ్రీభాష్యం, వేదాంత సారం, వేదాంత దీపిక, వేదార్థ సంగ్రహం, శ్రీరంగ గద్యం, వైకుంఠ గద్యం, శరణాగత గద్యం మొదలైన గ్రంథాలను రచించారు. దేశ వ్యాప్తంగా విశిష్టాద్వైతాన్ని ప్రచారం చేయడానికి పలువురు సింహాసనాధిపులను, అయ్యంగార్లను, నియమించారు. చాత్తాద వైష్ణవులూ , అయ్యంగార్లూ కైంకర్యం చేసే సంప్రదాయాలను ఏర్పరిచారు. అస్పృశ్యత లాంటి దురాచారాలను తొలగించడానికి సంస్కరణాత్మక పద్ధతులను ప్రవేశపెట్టారు. శ్రీరామానుజాచార్యులనే ఆద్యులుగా స్వీకరించిన తెంగలై శాఖీయ శ్రీవైష్ణవులే– చాత్తాద శ్రీవైష్ణవులు. వీరు 11వ శతాబ్దానికి ముందే వున్నట్లు లిఖిత శాస్త్రాలలో పరిచయం. చాత్తాద శ్రీవైష్ణవులు కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో సర్వత్రా వ్యాపించి వున్నారు. ద్రావిడ దేశం నుండి ఆరువందల సంవత్సరాల క్రితం, ఆంధ్ర, తెలంగాణాలోని పలు ప్రాంతాలలో వైష్ణవ ధర్మం పాటిస్తూ పల్లెవాసుల్లో ధార్మిక చింతన కలిగించడానికి వచ్చి స్థిరపడినట్లు తెలుస్తోంది. పల్లెలలో వీరు అనాదిగా దేవాలయాలనే నమ్ముకుని జీవిస్తున్నారు. వీరు దాదాపు 15 లక్షలకు పైగా వున్నట్లు సర్వే గణాంకాలు చెబుతున్నాయి. ద్రావిడ దేశంలో 'చాత్తాద వైష్ణవులు' ఆస్తులు, సంపదలుండి ధర్మకర్తలుగా, ఆలయాల్లో సేవకులుగా, పురోహితులుగా వివిధ పనులుచేస్తూ –'అయ్యన్', 'అయ్యంగార్'లుగా ప్రజలచే పిలువబడినారని, తెలుగు రాష్ట్రాలలో నైజాం కాలానికి పూర్వమే వీరు 'అయ్య', 'అయ్యగారు', పంతులుగా ఆదరించబడినారని తెలుస్తుంది. నాడు చాత్తాద శ్రీవైష్ణవులు – 'వీధి బడిపంతులుగా పల్లెపిల్లలకు పాఠాలు చెబుతూ, గుడిలో పూజారులుగా, ఊరి పురోహితులుగా ఆయుర్వేద వైద్యులు(డాక్టర్స్)గా వుండి ఊరి మిరాశీ, ఇనాం భూములు కలిగి వుండేవారు. వైష్ణవత్వం స్వీకరించిన బ్రాహ్మణులలోని కొందరు శిఖ, ముడిని కూడ త్యజించి– గురుపరంపరను అనుసంధానం చేసుకొని 'అష్టాక్షరీ'నే ఎంతో ప్రేమతో జపించేవారని తెలుస్తుంది.

శైవం, వీరశైవం ఆంధ్ర దేశంలో విజృంభించిన తరువాత తెలుగు దేశంలో రామానుజుని వైష్ణవం ప్రవేశించింది. వైష్ణవ దేవాలయాల్లో గుడి సేవకులుగా ఒక వర్గం ఏర్పడిందనీ, వారినే సాతానులంటారనీ, ఆరుద్ర గారు ప్రజాసాహితీ సంచికలో ఉదాహరించినట్లు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు పేర్కొన్నారు. (మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి.1992,పుట:733). తమిళంలో సాత్తదవక అనే మాట నుండి సాతాని అనే

మాట వచ్చింది. శరీరమంతా సుందరంగా పంగనామాలను ధరిస్తారు. కీర్తనలతో వైష్ణవ ప్రచారం చేస్తారు. చాత్తాదులలో జీయర్‌లు, సాతానీలు, పరవస్తు దాసరులు, తిరుతోపులనేవారు వుండేవారని తెలుస్తోంది. వీరిలో పాండిత్యము, కవిత్వము, శాస్త్రజ్ఞానం కలిగి మెప్పుపొందిన వారు అనేకులు. నేటికి గుట్టలపై వున్న నరసింహ, వెంకటేశ్వర, రామాలయాలలో పరంపరానుగతంగా అర్చకత్వంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయశాఖ ద్వారా నిర్వహించే పరీక్షలలో 'చాత్తాద శ్రీవైష్ణవ ఆగమము' ప్రత్యేకించబడుట విశేషము. నిజానికి చాత్తాద శ్రీవైష్ణవులు రామానుజాచార్యుల వారి శిష్యుల్లో ఆయన్నే దేవుడిగా కొలిచినవారు. శ్రీవైష్ణవ ప్రచారం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన వారు. బ్రాహ్మణుల్లో ఓ వర్గమైన వీరికి శిఖ ఉండేది. నడుము చుట్టూ గుడ్డ కట్టుకుని దేవాలయాల్లో అర్చకులుగా ఉండేవారు. అయితే రామానుజుల ఉద్యమంలో భాగంగా ప్రతి కులాన్ని శ్రీవైష్ణవులుగా చేయాలి, ఏ కులం వాడైనా శ్రీహరిని ఆశ్రయించిన వాడు ధన్యుడే అనే ఉద్దేశంతో ప్రజల్లో మమేకమవ్వడానికి ప్రయత్నించి, శ్రీవైష్ణవ ప్రచారంలో భాగస్వాములు అయ్యారు. ఈ సమయంలో సాధారణ ప్రజల నుంచి కొన్ని ప్రశ్నలు ఎదురయ్యాయి. మీరు, మేము సమానమే అయితే మీ ఆహార్యం అలా ఎందుకుంది, మేము ఇలా ఎందుకున్నాం. అని ఈ ప్రశ్నతో ప్రజలతో మమేకం అయ్యేందుకు చాత్తానులు సిద్ధమయ్యారు. శిఖను త్యజించారు. నడుము చుట్టు కట్టుకునే గుడ్డను వదిలేశారు. చాలా కులాలకు ఉంది గనుక జంధ్యాన్ని మాత్రం వదల్లేదు. అలా చాత్తాద శ్రీవైష్ణవులుగా మారారు. తమిళంలో చాత్తాద అంటే ఏమీ కప్పబడని వారు అని అర్థం. అంటే ఎప్పుడూ గుండుతోనే ఉంటారు, మీసాలు గడ్డాలు పెంచుకోరు, అర్చక వృత్తి చేసే వారైనా శిఖ ఉండదు. తల చుట్టూ, మెడలో తులసి మాల ధరిస్తారు. శ్రీహరిని భజిస్తూ, రామానుజుల వారే తమ దైవంగా భావిస్తూ, జీవనాన్ని గడుపుతారు.

'సమాజంలో స్వాములుగా దర్శనమిస్తూ, 'అయ్య'లుగా పిలువబడుతున్న చాత్తాద శ్రీవైష్ణవులను ఆదరించడం వల్ల పల్లెప్రగతి, జనచైతన్యం, మనోవికాసం తథ్యమన్నది మరువరాని సత్యం. ఉత్తరాంధ్రలో చాలా మంది సాతాని వైష్ణవులు ఉన్నారు. వీరు కోమట్లను యాచన చేస్తుంటారు. ఒక ప్రత్యేకత సంతరించుకొన్న వర్గంగా ఏర్పడి నేటికిని నిలచియున్న చాత్తాద శ్రీవైష్ణవులకు ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఇప్పటికి ఎలాంటి రాజకీయ ప్రాతినిధ్యం కలిగించడం లేదు. ద్రవిడ దేశంనుండి వచ్చిన వీరిలో చాలామందికి పల్లెల నుండి పట్నాలకు వలస వచ్చి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

## 4.24. జంగాల కథలు:

జంగాలు శైవ మతస్తులు, శివుడు వారి ఆరాధ్య దైవం. భక్తి ఉద్యమములో వచ్చిన సాహిత్యంలో 'శివుడిని' జంగమదేవరగా వర్ణించారు. శివుడు సంచారి. సంచార జాతులకు, ఆటవిక జాతులకు, అట్టడుగువారికి ఆరాధ్యుడు. ఇతర జానపద గాయకుల జీవనవిధానంతో పోల్చి చూస్తే 'జంగాలు' సంస్కృతి పరంగా కొంత ముందున్నట్టు కన్పిస్తారు. తెలుగు సాహిత్యంలో పలు గ్రంథాలలో గల వీరి

ప్రస్తావన ప్రాధాన్యతను తెలియజేస్తున్నది. తరతరాలుగా తమ తాత తండ్రులందించిన పాటనే పాడుకుంటూ, భిక్షాటనయే వృత్తిగా బతుకును వెళ్ళబుచ్చుతూ కళనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న జానపద గాయకులు 'జంగాలు'. జంగాల్లో సామాన్య జనులే జానపద భిక్షక గాయకులైన బుడిగ జంగాలని తెలుస్తుంది. వీరు ఉత్తరాంధ్ర అంతటా ప్రసిద్ధులు.

వీరు వాయించే వాద్యం పేరు 'బుడిగె'. పాట పాడుతున్నప్పుడు బుర్రల వంటి వానిని వాయించుతారు. వాటినే జంగాలు 'బుడిగెలు' అని వ్యవహరిస్తారు. బుడిగెలు వాయించేవారు కాబట్టి కాలక్రమేణా వీరు 'బుడిగె జంగాలు' అయ్యారు. జంగాలు చెప్పే, గానం చేసే కథ కాబట్టి దీనికి 'జంగం కథ' అనే పేరు వచ్చింది. వీరు ప్రధానంగా శివ భక్తులు. ఎక్కువగా శివలీలలనే కథలుగా గానం చేస్తూ ఉంటారు. మధ్యయుగ చరిత్రలో శైవ, వైష్ణవ మతాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్న రోజుల్లో శైవమత ప్రచారమే లక్ష్యంగా జంగం కథలు ప్రాచుర్యంలోకి వచ్చినట్లు తెలుస్తోంది. కాకతీయుల కాలంలో శైవ, వైష్ణవుల విజృంభణ కనిపిస్తుంది. 13వ శతాబ్దం నాటికే 'జంగం కథలు' ప్రచారంలో ఉన్నాయి. జంగం కథ ప్రదర్శనలో రంగస్థలం (వేదిక) అంటూ ఏమీ ఉండదు. నాలుగుదారులు కలిసే కూడళ్లు. వీధుల్లో ఒక పందిరి వేసి దీపాల వెలుతురులో కథా గానాన్ని ప్రదర్శిస్తారు. ప్రధాన కథకుడు తంబుర వాయిస్తూ కథ చెబుతుంటే, ముగ్గురు లేదా నలుగురు వంతకులు తలకు పాగా, కాళ్లకు గజ్జెలు కట్టుకుని, గుమ్మెట్లు (బుడిగలు) వాయించుకుంటూ వంత పాడతారు. బుడిగ జంగాలవారు మొదట్లో ఎక్కువగా శైవ సంబంధమైన కథలనే గానం చేసినప్పటికీ తర్వాతి కాలంలో బాలనాగమ్మ, బొబ్బిలియుద్ధం,చెంచుపాట సారంగధర చరిత్ర గంగాగౌరి సంవాదము సన్యాసమ్మకథలు, దేశింగురాజు కథ, భల్లాణ, సిరియాల, వామన విజయం, గాంధారి కథ, జరాసంధుని కథ, నరకాసురుని కథ, నలచక్రవర్తి, బభ్రువాహన, మాంధాత ఇలాంటి పౌరాణిక గాథలన కూడా ప్రచారంలోకి తెచ్చి బుడిగ జంగాలు జనరంజకంగా చెప్పి అలరిస్తారు. ఆనందింపచేస్తారు. ఉత్తరాంధ్రలో చాలా మంది బుడిగ జంగాలు ఉన్నారు. శ్రీకాకుళం లోని పలాస, మందస, కొత్తూరు మొదలైన గ్రామాలలో వీరు ఎక్కువగా ఉన్నారు.

## 4.25. దాసరులు:

గ్రామాలలో దాసరులు హరి నామ సంకీర్తనలు పాడుతూ అపారమైన భక్తి కలిగి ఉంటారు. జంగాలు శైవ మత ప్రతీకలయితే, దాసర్లు వైష్ణవ మత ప్రచారకులు. వేషధారణలో కూడా వైష్ణవ మత చిహ్నాలు పుష్కలంగా కనిపిస్తాయి. వీరు తరతరాలుగా వస్తున్నటువంటి ఈ వృత్తిని కొనసాగిస్తూ హరినామమును చేపడుతూ భిక్షాటన చేస్తుంటారు. నుదుటిన నిలువుగా నామాలు దిద్దుకొని తెల్లని పంచె చొక్కా కట్టుకొని తంబురను పట్టుకొని మీటుతూ చిడతలు తాళాలు కొడుతూ హరికి సంబంధించిన పాటలు పాడుతూ ఉంటారు. రామ నామాన్ని కృష్ణ నామాన్ని స్మరిస్తారు. విష్ణు సంకీర్తనలు చేస్తూ అతని

మహిమలను చెప్పుతారు. సంక్రాంతి శ్రీరామనవమి దసరా దీపావళి వంటి  పండుగ సమయాలలో ఉదయాన్నే ఇంటింటికీ వెళ్తారు.

'హరిలో రంగా హరి'

'గోవింద గోవిందా',

'హరే రామ హరే రామ రామ రామ హరే హరే

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే'. అంటూ హరినామాన్ని పాడుతూ భిక్షమడుగుతారు. వీరిలో పాగ దాసరి, బుక్క దాసరి, భాగవత దాసరి, దండె దాసరి, చిన్న దాసరి, మాల దాసరి మొదలైన ఉప జాతులున్నాయి. దాసరలు ఎన్నో భాగవత రామాయణ కథలు చెబుతుంటారు. సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి పాటలు, రామదాసు కీర్తనలు, శ్రీకృష్ణుని పాటలు పాడుతారు. రామదాసు కీర్తనల ప్రాముఖ్యం వీరి వ్యాప్తివల్లే పెరిగింది. ఉత్తరాంధ్రలో సంప్రదాయ చిహ్నాలతో సంస్కృతి సంరక్షకులుగా నిలిచిన వీరు కాలక్రమేణా కనుమరుగవుతున్నారు.

## 4.26. చెంచులు:

చెంచులు గిరిజన తెగకు చెందినవారు. సాధారణంగా వీరు అడవి ప్రాంతంలో నివసిస్తూ ఉంటారు. శ్రీశైలం నల్లమల అడవుల్లోనూ భద్రాచలం అడవుల్లోనూ నివసిస్తుంటారు.  శైవ వైష్ణవ మతాలకు సంబంధించిన దేవాలయాల ఉత్సవాలు పండగలు శుభకార్యాలు సందర్భాలలో వీరు పాల్గొంటారు. వీరి విష్ణు భక్తులుగా చెప్పుకుంటూ విష్ణు అవతారమైనటువంటి నరసింహస్వామిని తమ తెగకు చెందిన చెంచులక్ష్మి వివాహం చేసుకున్నట్లుగా చెబుతారు. వీరు శ్రీశైలంలో శ్రీశైలమల్లికార్జున స్వామిని పూజిస్తారు. అదేవిధంగా చెంచు మల్లయ్యగా మల్లన్నగా పిలుస్తుంటారు. అదేవిధంగా భద్రాచలంలో నివసిస్తున్నటువంటి చెంచులు భద్రాచల కోదండ రాముని తమ ఇలవేల్పుగా భావిస్తారు. వీరు ఈ విధంగా భక్తి భావంతో శ్రీశైలం మల్లికార్జున స్వామిని భద్రాచల రామయ్య కొలుస్తుంటారు. గిరిజనులు తమ ప్రాంతంలో ఉండే దేవుళ్ళను కొలుస్తూ బిక్షాటన చేస్తారు. వీళ్ళు వేసే వేషధారణ ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. నుదుటిన నామాలు పొడవాటి నామాలు తీస్తారు.  నెత్తిపై నెమలి ఈకల కిరీటాన్ని ధరిస్తారు. చేతిలో జేగంట, పిల్లనగ్రోవి పట్టుకుని రంగు రంగు వస్త్రాలను ధరిస్తారు. వాటిపై నల్లటి సాలువా కప్పినట్లుగా వేసుకుంటారు. వీరు పిల్లనగ్రోవితో వినసంపైన గానాన్ని వినిపిస్తారు. ప్రతి ఇంటి ముందు జేగంటను కొడుతూ ఉంటారు. ఆకర్షనీయమైనటువంటి నెమలి ఈకలు అలంకరణగా ఉంటాయి. శ్రీశైలం భద్రాచలం అడవుల నుంచి వచ్చినటువంటి కొందరు చెంచులు ఉత్తరాంధ్రలో భిక్షాటన చేస్తూ ఇక్కడే  నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో నరసన్నపేట మండలం కోమర్తి పరిసర ప్రాంతాల్లోనూ, విజయనగరం విశాఖపట్నంలోని అక్కడక్కడ గ్రామాల్లోనూ

నివసిస్తున్నట్లు బద్రి కూర్మారావు గారు తమ గ్రంథంలో పేర్కొన్నారు. (కూర్మారావు బద్రి. 2005. పుట:116) మీరు సాధారణంగా సంక్రాంతికి మిగతా పండుగ రోజుల్లో గ్రామాల్లో బిక్షాటన చేస్తుంటారు.

శ్రీరామనవమి శివరాత్రి మొదలైనటువంటి పర్వదినాలలో వీరు శ్రీశైలం భద్రాచలం చేరుకుంటారు. భక్తితో ఆ దేవుని పూజిస్తారు పాటలు పాడుతారు. అప్పట్లో ఇద్దరు ముగ్గురు బృందాలుగా గ్రామాల్లోకి వచ్చి బిక్షాటన చేసేవాళ్లు. నేడు గ్రామాలకు వచ్చేవారు కరువయ్యారు. వీరు పాడే పాటలు చెంచులక్ష్మికి, విష్ణు అవతారలకు సంబంధించినవిగా ఉంటాయి. కృష్ణునికి సంబంధించిన పాటలు పాడుతుంటారు. సత్యభామ సంబంధించినటు వంటి చెంచులక్ష్మి సంబంధించిన పాటలు పాడుతూ చెంచిత, నందన అనే పదాలను పాటల్లో పునారావృతం చేస్తుంటారు. వీళ్ళు డప్పు, నగారా, డోలు, కింగ్రి, పిల్లనగ్రోవి మొదలైన సాధనాలను ఉపయోగిస్తుంటారు. నువ్వు ఏ ఊరు దానివే చెంచిత?. నువ్వు ఎక్కడిదానివే చెంచిత?. అనే రకమైన ప్రశ్నార్ధకమైన నాటకాన్ని తలపించే విధంగా పాటలు పాడుతూ ప్రదర్శిస్తూ ఉంటారు. ఇందులో కృష్ణుడు సత్యభామ మధ్య సంవాదం జరిగే విధంగా పాటలు పాడుతూ వివిధ బృందాలుగా ఏర్పడతారు. ఇది భక్తి ప్రధానమైన తెలుగు జానపద ప్రదర్శన కళారూపం. సంచార తెగకు చెందిన చెంచులు ఈ కథను గేయరూపంలో పాడతారు. చెంచుల ఆరాధ్య దైవమైన చెంచులక్ష్మిని ప్రధాన కథగా భావించి కథ చెబుతారు. దీనిని రాత్రి సమయాల్లోను, పగటిపూట కూడా పాడతారు. ఉత్తరాంధ్రలో చెంచులు ఈ కథను చాలా ప్రాంతాల్లో పాడుతూ భిక్షాటన చేస్తు జీవితాన్ని గడుపుతున్నారు. 'చెంచిత కథ' గేయరూపంలో పాడటం చేత ఇది చెంచిత కథగా స్థిరపడింది.

ఈ కళారూపాన్ని చూసి ఆకర్షితులైన ఉత్తరాంధ్ర శ్రీకాకుళం జిల్లా గ్రామస్తులు ముఖ్యంగా చేనేత కార్మికులు దేవాంగ కులానికి సంబంధించిన వారు పండగలు గ్రామ దేవత ఉత్సవాలు మొదలైన సందర్భాలలో ఈ కళా ప్రదర్శన చేస్తున్నారు. ఇందులో కృష్ణుడు సత్యభామ గోపికలు బలరాముడు ఆంజనేయుడు మొదలైన వారి పాత్రలు ఉంటాయి. ఆ పాత్రకి సంబంధించిన ఆహార్యము కళా ప్రదర్శన చేస్తారు. వివిధ రకాలైన పద్యనాటక ప్రదర్శనను చేస్తుంటారు. ఇందులో చెంచుభాగోతం ఎంతో ప్రాధాన్యం కలిగినటువంటిది. ఇందులో విష్ణు సంబంధమైన మైనటువంటి పాటలను పద్యాలను పడుతూ నాటక ప్రదర్శన చేస్తారు. వీటిని ఉత్తరాంధ్రలో దేవాంగులు ప్రదర్శిస్తుంటారు. శ్రీకాకుళంలోని మందస, బ్రాహ్మణతర్ల, చాపర, సారంగపురము, మొదలైన గ్రామాల్లో ఈ చెంచు నాటకం చెంచు బాగోతం ప్రదర్శన ఇప్పటికీ ఉంది.

### గిరిజన జానపద కళారూపాలు:

## 4.27. తోంగ్సేన్ నృత్యం:

గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేటటువంటి ఉత్తరాంధ్ర జానపద కళారూపం తోంగ్సేన్. గిరిజనుల సంబరాలు సరదాలు సంతోషాలు అన్ని ఇప్పటికీ వారి మూలాల నుండి వస్తున్నవే. ఆదివాసీలు వారు పండించే పంటలు చేతికందే సమయంలో పండుగల సమయంలో పెళ్ళి వంటి శుభకార్యాలలో ఆటపాటలతో తమ ఆనందాన్ని పంచుకునేందుకు తమ సంస్కృతిని ప్రతిబింబింపచేసేందుకు ఈ సాంప్రదాయ తోంగ్సేన్ నృత్యం ఉత్తరాంధ్ర గిరిజనులు ప్రదర్శిస్తారు. పండుగొచ్చినా పబ్బమొచ్చినా వాళ్ళకు గుర్తు వచ్చేది డాన్స్. తోంగ్సేన్ అనే వాళ్ళ జానపద నృత్యానికి, కరాతే సన్నాయి సంబరం, సిగ్రాసిటికెన పుల్ల విరిగేలా, టకోరా మోత మోగేలా, సహా వాయిద్యాల జోరు కలగలిపి, వాళ్లు పాడే పాటలు నృత్యాలు డాన్సులు ఉగ్రూతలూగిస్తాయి. ఏ పండగ వచ్చినా అంతే. అన్నిటికంటే ముఖ్యంగా కార్తీక పౌర్ణమికి వాళ్ళ సంబరాలు అంబరాన్ని అంటుతాయి. వాళ్ళ సంబరాలకు వయసుతో సంబంధం లేదు. ఆడ, మగ, పెద్ద, చిన్న, ముసలి, ముతక అని తేడా లేదు. ఉత్తరాంధ్ర గిరిజనులు ఎంత ఎదిగినా ఎదుటివారి పట్ల తరగని మర్యాద, గౌరవం, ప్రేమ, వినమ్రత చూపిస్తారు.

ఉత్తరాంధ్రలో మారుమూల కొండ, మన్య ప్రాంతాలలో ఉన్నటువంటి ఈ నృత్య ప్రదర్శన అనేది బయటి సమాజానికి అంతగా తెలియదు. వీళ్ళు చేసే నృత్యం ఎంతో వైభవంగా ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ ప్రదర్శనలో అందరూ సంతోషంగా తమ ఆనందాన్ని తెలియపరిచేందుకు వారి సంస్కృతిలో భాగమైనటువంటి ఈ కళా ప్రదర్శన చేస్తారు. ఈ ప్రదర్శనలో గిరిజనులు స్త్రీలు అందంగా అలంకరణ చేసుకొని ఉత్సాహంగా అందరితో ప్రదర్శనలో పాల్గొంటారు. ఇది ముఖ్యంగా ఈ ఉత్తరాంధ్ర ప్రాంతానికి సంబంధించిన సవరలు ఈ ప్రదర్శన చేస్తుంటారు. ఇది సవర భాషలో సవర భాషకు సంబంధించిన పాటకి తగ్గట్టు లయబద్దంగా అడుగులను ముందుకు వేస్తూ తమ నాట్య ప్రదర్శనలు వివిధ రకమైన భంగిమలతో చేస్తారు. ఈ రకమైన జానపద కళారూపం ముఖ్యంగా సవర జాతిలో ఉంటుంది. ఆ సవర బాష యాసతో కూడినటువంటి పదజాలము గేయాలు ఉంటాయి. ఈ రకమైన కళారూపంలో ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది ఒకరి వెనుక మరొకరు ఉంటూ, ఇరుపక్కలా మరొక్కరు ఉంటూ, ఒకే రకమైనటువంటి నృత్య ప్రదర్శనలు చేస్తుంటారు. చేతులను భుజం పైకి, తల పైకి ఎత్తుతూ, అటు ఇటు ఊపుతూ తర్వాత నడుంపై చేతులను ఒక ప్రక్కన మరియు రెండువైపులా ఉంచి కాళ్ళను ముందుకు ఒక అడుగు వెనుకకు ఒక అడుగు వేస్తూ నృత్య ప్రదర్శన చేస్తారు. ఇది ఒక రకంగా తమ సంస్కృతిలో భాగమైనటువంటి ఈ కళారూపం ఎంతో విశేషమైనటువంటి ప్రత్యేకతను కలిగి ఉంటుంది. ఈ కళారూపం ప్రదర్శనలో స్త్రీలు చేసే నాట్య శైలి బహు విశేషంగా ఆకట్టుకుంటుంది.

"పండించే పంట వంటకం తొలి ముద్దను తినే ముందు తమ ఆరాధ్య దేవతలకు మొక్కులు చెల్లించి ఆ పంట పేరుతో పండుగలు జరపడం గిరిజనులు ఆనవాయితీ వస్తుంది. పోడు వ్యవసాయం

చేసే ముందు వారి దేవుళ్లకు ప్రార్థన చేసి కొండలను చదునుచేసి పంటలు వేసేందుకు అనుకూలంగా తయారు చేస్తారు. కొర్రలు, సామలు, ఊదలు, జొన్నలు, గంటెలు, చోడి, కందులు మొదలైన చిరుధాన్యాలను నిర్ణీత స్థలంలో విత్తనాలను వెదజల్లి వాటి సంరక్షణ ఏర్పాటు చేసుకుంటారు. ఆ ఫలసాయం తినేముందు వారి దేవతలకు నైవేద్యంగా ఆ పంటను చెల్లించి కొర్రకొత్తలు చేసుకుంటారు. ఈ పండుగలో తోంగ్సేన్ నృత్యం ద్వారా పంట పండించేందుకు తాము పడిన కష్టాన్ని మరిచిపోతారు. ఇలా ప్రారంభమైన నృత్యం వారు జరుపుకొనే పండుగలయిన కొండెంకొత్తలు, టెంక కొత్తలు, కంది కొత్తల ప్రదర్శనతో ఆగుతుంది. టెంక కొత్తలు పండుగల్లో ఒక్క రాత్రి వేళల్లో మాత్రమే గిరిజన గ్రామాల్లో ఆట, పాటలతో ఈ నృత్యం చేసి ఆనందిస్తారు"(కూర్మారావు బద్రి.2005,పుట:259).

ఉత్తరాంధ్రలోని గిరిజనులు తమ చేసే ప్రతి పండగల్లోనూ తమ ఆరాధ్య దేవతలను పూజించడం నృత్య ప్రదర్శన చేయడం అనేది సాంప్రదాయంగా వస్తున్నటువంటి ఆచారము. వీళ్ళు తమ ప్రాంతానికి సంబంధించిన గంటెలు, జొన్నలు, ఊదలు, రాగులు, సామలు, కొర్రలు పండించి ఆ పంటను ఇంటికి తెచ్చిన తర్వాత పండుగలు జరుపుకుంటూ తొలి ముద్ద తమ దేవతలకు నైవేద్యం పెడతారు. వీళ్ళు వ్యవసాయానికి కొండ ప్రాంతాన్ని అనుకూలంగా చేసుకుని పంటలు పండిస్తారు. గిరిజనులు ప్రత్యేకంగా పండిన ధాన్యాలు గాని, పండ్లు గాని వాటికి సంబంధించిన పేర్లతో వాటిని ఆహారంగా తీసుకోవడానికి ముందుగా వాటి పేర్లతో పండుగలను చేస్తారు. ఈ పండగల్లో వాళ్ళ సంతోషాలు సంబరాలు అంబరాన్ని అంటుతాయి. పండుగ రాత్రి సమయంలో గిరిజనులు తమ పనులను ముగించుకొని అందరూ వచ్చి ఈ నృత్య ప్రదర్శనను వీక్షిస్తారు.కొందరు ఉత్సాహంతో వాద్యానికి అనుకూలంగా వివిధ రకాల వైవిధ్యభరితమైన నృత్యాన్ని ప్రదర్శిస్తారు. గిరిజనుల నృత్యం ఒక్కో ప్రాంతంలో ఒక్కో సాంప్రదాయం ఉంటుంది. ఈ నృత్యం శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతంలోని కొత్తూరు మండలంలోని అడ్డంకి గ్రామం, పాలకొండ, సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురంలో ఉంది. గిరిజనులు సంస్కృతి సంప్రదాయాలను అనుసరిస్తూ చేసే వివిధ పద్ధతులను ఆచారాలను కాపాడడం భావితరాలకు ఒక సంస్కృతి ప్రసరణంలా అందించడం ఎంతగానో అవసరం. ఇటువంటి కళారూపాలను రక్షించడానికి ప్రభుత్వాలు తగిన వెసులుబాటును అందించవలసిన అవసరం ఉంది.

## 4.28. థింసా నృత్యం(జట్టునృత్యం):

ఉత్తరాంధ్ర మన్యము గిరిజనుల సాంప్రదాయ నృత్యం థింసా. ఇది ఆదివాసీ పదం. దీనికి అభినయం అని అర్థం. ఉత్తరాంధ్ర ఆదివాసీల పేరు ప్రస్తావించగానే ఎవరికైనా వెంటనే గుర్తుకొచ్చేది 'థింసా' నృత్యం. ఇది వారి జీవితాల్లో హృదయ స్పందనగా పెనవేసుకుపోయింది. తమ మనోభావాలను ప్రతిబింబిస్తూ పాటలు పాడుతూ, సంప్రదాయ వాయిద్యాలు లయబద్ధంగా మ్రోగుతుంటే మహిళలంతా జట్టు కట్టి చేసే ఆనంద నృత్యమే థింసా. పురుషులు గిరిజన సంప్రదాయ డప్పు, సన్నాయి, కొమ్ముబూరలు

వంటి వాయిద్యాలను మ్రోగిస్తూ ఉంటే సాధారణంగా 15 నుంచి 30 మంది మహిళలు పాట పాడుతూ వలయాకారంలో నృత్యం చేస్తుంటారు. విశాఖ ఏజెన్సీ, ఒడిశా సరిహద్దు గిరిజనులు ఈ థింసా నృత్యాన్ని తమ సంప్రదాయ నృత్యంగా ఆచరిస్తుంటారు. గిరిజనుల గ్రామ దేవతలను పూజిస్తూ సామూహికంగా బౌడా థింసా (పెద్ద నృత్యం), స్త్రీ, పురుషులిద్దరూ పక్షుల ఆరుపులను అనుకరిస్తూ లయబద్ధంగా వలయాలు చుడుతూ ఉద్రేకపూరితంగా చేసే గుండేరి థింసా (పక్షి నృత్యం). వ్యవసాయ పనులు చేసి సాయంత్రం సేదతీరే సమయంలో గొడ్డి బేటా థింసా (రాళ్ళను ఏరే నృత్యం), అడవిలో ఆకుల్ని ఏరుతున్నట్లు అనుకరించే పోతర్ తోలా థింసా (ఆకులను సేకరించే నృత్యం), పులి ఎదురు పడినప్పుడు వేటగాడు ఎలా తప్పించుకోవాలో తెలుపుతూ పులి, మేకలను అనుకరిస్తూ చేసే భాగ్ థింసా (బెబ్బులి నృత్యం).. ఇలా విభిన్న రకాలుగా థింసాను వర్గీకరించారు. కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా విభిన్న గిరిజన తెగల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే విధంగా ఈ నృత్యం తీర్చిదిద్దారు.

చైత్రమాసంలోను, వేరు వేరు పండుగలప్పుడు, వివాహాది శుభకార్యాలలో, ఇటికలపండుగలో, ఆడ, మగ, పెద్ద, చిన్న తేడా లేకుండా అందరూ ఈ నృత్యంలో పాల్గొంటారు. ఒక గ్రామంనుండి మరొక గ్రామానికి పోతు వాళ్ళిచ్చే సామూహిక భోజనం స్వీకరిస్తూ ఆనందిస్తారు. ఈ థింసా జట్టుకు ఒక నాయకుడు ఉంటారు. 15 నుండి 30 మంది పాల్గొంటారు. అప్పడప్పుడు పురుషులు, స్త్రీలు కలిసి నృత్యం చేస్తారు. ఎక్కువ సందర్భాల్లో నృత్యం చేసేవారు ఆడవారుకాగా వాద్యాలు మగవారు వాయిస్తారు. ఈ థింసాలో సన్నాయి, తుడుము, మోరి, కిరిది, జోడుకొమ్ములు, పిల్లన గగ్ర అనే అరడజను వాద్యాలు ఉంటాయి. వీటిని పురుషులే వాయిస్తారు. స్త్రీలు వారి గిరిజన సంప్రదాయబద్ధమైన చీరకట్టులో ఉంటారు. పురుషులు పంచెలు కట్టుకుంటారు.

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో ముఖ్యంగా పాడేరు, అరకులోయలో ప్రాంతాలలో ఈ నృత్యం వ్యాప్తిలో ఉంది. ఈ ప్రాంతాలలో కొండదొర, వాల్మీకి భగత, ఖాంద్ కొద్, కొటియా, బొండో మొదలైన గిరిజన తెగలున్నాయి. ఈ అన్ని తెగలవారూ చేసే నృత్యం థింసా. థింసా విధిగా బృందనృత్యం. 15 నుండి 30 మంది లేకుండా థింసా నృత్యం ఉండదు. ఈ తెగలవారు తమ తమ భావాలను వ్యక్తం చేయడనికి ఈ నృత్యం ఒక వాహికలాగా పని చేస్తుంది. థింసా నృత్యంలో 8 నుండి 12 రకాలున్నాయి. అందులో ప్రధానమైనది బొడథింసా. గ్రామదేవతలను పూజిస్తు చేసే నృత్యం బోడథింసా. కుడివైపు మగవాళ్ళు. ఎడమవైపు ఆడవాళ్ళు వరుసలో బారులుతీరి వీపు వెనుకనుంచి చేతులు పోనిచ్చి ఒకరినడుమొకరు పట్టుకుంటారు. కుడివరుసలోని మొదటి వ్యక్తి అడుగులు కదుపుతూ ముందుకు రాగా ఎడమవరుసలోని చివరి వ్యక్తి అతన్ని కలుసుకోవడం జరుగుతుంది. అప్పుడు మిగతానృత్యకారులంతా. పాములవలె మెలికలు తిరుగుతూ, హరి... హరి.. హుయి...హుయి... అని ఆనందంతో అరుస్తూ తిరిగి, చివరకు మళ్ళీ తమతమ వరుసల్లో చేరిపోతారు. గిరిజనులు జీవితంలో ఎదుర్కొనే వివిధ సంఘటనల

ప్రతిస్పందనే ఈ నృత్యం. పుట్టిన భూమితో ఎడతెగని సంబంధం పెట్టుకొని, ప్రకృతి సహజమైన దుస్తులు, నగలు ఉపయోగించి గిరిజనులు నిర్వహించే నృత్యం ఇది. నిరంతరం శ్రమించేటటువంటి అడవి తల్లి బిడ్డలు ప్రకృతి సౌందర్యాన్ని రమణీయతను ఆస్వాదించి తమ కష్టాలను మైమరచిపోయి ఆనందడోలికల్లో సంతోషాన్ని తెలియజేస్తూ తమ సంస్కృతి సంప్రదాయాలను నృత్య రూపంలో నాట్యముతో పరవశించి ఉత్సాహవంతంగా సామూహికంగా నిర్వహించుకునే పండుగే ఈ దింసా నృత్యం.

## 4.29. కొమ్ము నృత్యం:

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన గిరిజన నృత్య కళారూపాలు చాలా ఉన్నాయి. అందులో ఒకటి కోయ కొమ్ము నృత్యం. కోయ గిరిజనుల సాంప్రదాయ కొమ్ము నృత్యం. మాటలు లేని కాలంలో ఆనందం వ్యక్తం చేసేందుకు ఆదివాసులు వేసే గెంతులే నేటి ప్రపంచ దేశాల్లో గొప్ప ఆదివాసి నృత్యాలుగా వెలుగొందుతున్నాయి. అటువంటి నృత్యాలలో కొమ్ము నృత్యం ఒకటి. ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో నివసించే గిరిజనుల సంప్రదాయ నృత్యం. కోయ భాషలో ఈ నాట్యాన్ని పెర్యకొక్ అంటారు. కోయ భాషలో పెర్యకొక్ అంటే దున్నపోతు కొమ్ములు అని అర్థం. దున్నపోతు కొమ్ములు ధరించి దున్నలు కొమ్ముకొనే విధంగా నాట్యం చేస్తారు. కాబట్టి ఈ నాట్యాన్ని కొమ్ము నాట్యం అని అంటారు. వీరు ఉపయోగించే వాద్యం డోలు, కొమ్ము బూర. గిరిజనుల్లో కోయ జాతివారు మాత్రమే చేసే కొమ్ము కోయ నృత్యం అత్యంత పురాతన కళారూపంగా ప్రసిద్ధి చెందింది.. తలమీద అడవి దున్న కొమ్ములతో చేసిన కిరీటం, దాని పైన నెమలి పింఛాలు ధరించి, మెడలో పెద్ద డోలు వేసుకొని చేసే ఈ నృత్య రూపకాన్ని 'కొమ్ము డోలు' అని కూడా వ్యవహరిస్తారు. తొలకరి సందర్భంగా గిరిజనులు భూమి పండుగ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సరైన సమయంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని తమ దైవాన్ని పూజిస్తూ ఈ నాట్యం చేస్తారు. కొన్ని నృత్యాలు కేవలం దైవారాధనకే పరిమితం అవుతాయి. కానీ, కోయ నృత్యాలు వారి జీవితంలో భాగమైపోయాయి. కోయల పుట్టుక నుంచి మరణం వరకు జరిగే అనేకానేక కార్యక్రమాల్లో మద్యం, మాంసంతోపాటు 'కొమ్ము కోయ నృత్యం' తప్పనిసరిగా ఉంటుంది. అడవి బర్రె కొమ్ముల కిరీటం మధ్యలో మెరిసే నెమలిపింఛం గుత్తి మెడలో భారీ డోలు శబ్దంతో కదిలే మగవాళ్లు. కొప్పున పూలు సాంప్రదాయ చీర కట్టు సింగారించుకున్న అడవిలో చెంగున దూకే లేడిపిల్లలా ఆడపిల్లలు చేసే నృత్యం కొమ్ము కోయ నృత్యం. కొమ్ము కోయ నృత్యరూపకం అనేక ప్రత్యేకతల సమాహారం. ఈ నృత్య ప్రదర్శనకు కొన్ని ప్రత్యేక పద్ధతులు ఉంటాయి. స్త్రీ, పురుషులు కలసి లయబద్ధంగా అడుగులు వేస్తూ చేసే ప్రదర్శన అయినప్పటికీ, పురుషుల నృత్య పద్ధతి, స్త్రీల నృత్య పద్ధతికి కొంత వ్యత్యాసం ఉంటుంది. పురుషులు ప్రత్యేకమైన వస్త్రధారణతో డోళ్లను లయబద్ధంగా వాయిస్తూ, అడుగులో అడుగులు వేసుకుంటూ నృత్యం చేస్తారు. మహిళలు ఆకుపచ్చ చీరలు ధరించి, కొప్పులో పూలు పెట్టుకొని ఒకరిచేతులు ఒకరు పట్టుకొని పాటలు పాడుతూ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. 10 నుంచి 15 మంది పురుషులు డోళ్లు వాయిస్తూ, లయబద్ధంగా

అడుగులు కదిలిస్తూ వలయాకారంగా తిరుగుతారు. అప్పుడప్పుడూ వలయం మధ్యలోంచి దూసుకువచ్చి, కేకలు వేస్తూ ఒకరి కొమ్ములను మరొకరు ఢీ కొట్టిస్తారు. 10 నుండి 15 మంది స్త్రీల నృత్యం లాస్యంగాను, గేయ సహితంగాను ఉంటుంది. సందర్భోచిత గేయాలతో, రేల పాటలతో సాగుతుంది. బృందంలో ఒకరు పాడితే మిగతావారు అనుకరిస్తారు.

చైత్రమాసంలో భూదేవి పండుగ చేసుకునేదే భూమిపై ఏ విత్తు నాటరు కోయలు. ఆ పండగ సమయంలో వేటకు అడవికి వెళ్లే పురుషులు వేటకు వెళ్లి విజయవంతంగా ఇంటికి వచ్చిన సందర్భంగా చేసుకొనే నృత్యము ఈ కొమ్ము నాట్యం. ఇక డోలు నాదముతో పోల్చుకుంటే గిరిజన కుర్రాళ్ళు అడుగులు సున్నితంగా చాలా తక్కువ స్థాయిలో కదిలిస్తారు. ప్రత్యేకమైన వస్త్రధారణ నెత్తి మీద జత కొమ్ములు దాని మధ్యలో నెమలి పించం ఈకల గుత్తి మెడలో పెద్దదైన డోలు తగిలించుకోవడం వల్ల అడుగులు చాలా తక్కువ స్థాయిలో వేయడం జరుగుతుంది. వీరు వలయాకారంగా తిరుగుతూ అప్పుడప్పుడు వలయం మధ్య నుండి దూసుకు వచ్చి కేకలు వేసుకుంటూ కొమ్ములతో ఇరువురు గుద్దుకొంటారు. అప్పుడు వాయిద్యం జోరు ఎక్కువ అవుతుంది. కేకలతో ఒకరికొకరు తమ కొమ్ములతో ఢీ కొడుతూ వారి ప్రధాన వృత్తి అయిన వేటను ప్రతిబింబిస్తారు. కయ్యానికి కాలు దువ్వడమే కాదు కొమ్ములతో కుమ్మేస్తానంటూ నేలను పెకిలించే కొండ బర్రెను తలపించేలా విన్యాసాలు చేస్తారు. గొర్రెపోతు కొండను ఢీ కొట్టినట్టుగా ఇరువురు పలుమార్లు కొమ్ములతో ఢీ కొట్టుకుంటూ యుద్ధ విన్యాసాలను చేస్తారు.

కోయ స్త్రీ నాట్యం ఇతర గిరిజన తెగల నాట్యానికి దగ్గరగా ఉంటుంది. విశాఖ ఏజెన్సీ ప్రాంతాల్లో కనబడే దింసా నృత్యం దాదాపు కోయ నాట్యాన్ని పోలి ఉంటుంది. పురుష నాట్యంతో పోలిస్తే స్త్రీ నాట్యం లాస్యంగా ఉంటుంది. లయబద్ధంగా సాగిన వారి అడుగులు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. స్త్రీలు వేసే నాట్యంలో ఒక పద్ధతిలో ముందుకు అయిమూలగా నాలుగు అడుగులు వేసి అదే పద్ధతిలో ఒక అడుగును వెనుకకు వేస్తారు. నాట్యం చేసే సందర్భంలో స్త్రీలు ఒకరి చేతులు ఒకరు పట్టుకుని, ఒకరి నడుమును ఒకరు పట్టుకుని, చేస్తారు. ఈ అడుగుల్లో ఒక్కొక్క అడుగును గాల్లో లేపుతూ రెండో అడుగును వెనుకకు తడుతూ వలయాకారంగా నాట్యం చేస్తారు. ఒక్కోక్కప్పుడు వీళ్లు ముందుకు సాగే పద్ధతి పాము నడకవలె కనిపిస్తుంది. ఈ కదలికలు అందర్నీ అలరించడమే కాకుండా గిరిజనుల మధ్య సఖ్యతను సువృద్భావాన్ని పెంపొందిస్తాయి. పండుగలు పర్వదినాల లోను వేడుకల్లోనూ ఈ కొమ్ము కోయ నాట్యాన్ని ప్రదర్శిస్తారు. అడవికి వెళ్లి వేటాడడం విజయవంతం చేసుకుని తిరిగి ఇంటికి వచ్చి ఆ సంతోషంలో ఒళ్ళు పులకించేలా కొమ్ము నృత్యం చేస్తారు. వాగు వంకలకు కలిసి వెళ్లే కోయచెలికాళ్ళు ముచ్చట్లు చెప్పుకుంటూ మురిసిపోయే ఆనందం అంతా నృత్యభరితమే. ఈ నృత్యం విశాఖ గిరిజన ప్రాంతాలలో అక్కడక్కడా ప్రదర్శిస్తారు. ప్రస్తుత కాలంలో ఈ కళను నేర్చుకోడానికి అంతగా ఇష్టపడకపోవడంతో కొమ్ము కోయ నృత్యం కనుమరుగయ్యే స్థితికి చేరింది. పరిస్థితి ఇలానే కొనసాగితే ఈ ఆదివాసీ కళ.. క్రమంగా

అంతరించిపోయే ప్రమాదం పొంచి ఉంది. పరిస్థితి అంతవరకూ రాకుండా చూసుకోవడం మనందరి బాధ్యత.

## 4.30. మయూర నృత్యం:

మానవుడు ప్రకృతిని అనుసరిస్తూ ప్రకృతిలో నివసించేటటువంటి పక్షులు జంతువులు చేసే అరుపులు, నడకలు, అనుగుణంగా కొండ ప్రాంతంలోని గిరిజనులు చేసేటటువంటి నాట్యం ఎంతో అద్భుతంగా ఉంటుంది. మయూర నృత్యం అనేది నెమలి నడకను పోలి ఉంటుంది. నెమలి చేసేటటువంటి నడక గాని అదేవిధంగా ప్రకృతి వాతావరణానికి పులకించి నెమలి పింఛము విప్పినప్పుడు చేసే నృత్యము ఎంతో కమనీయంగా ఉంటుంది. శ్రీకాకుళం, విజయనగ,రం విశాఖపట్నం గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులు చేసే మయూర నృత్యం ఎంతో అద్భుతంగా ఉంటుంది. మయూర నృత్యం ఖోంద్ ల తెగవారు చేస్తారు. వీరిని కోదోలని సామంతులు అని కూడా అంటారు. ముందుగా భూదేవికి సూర్యభగవానునికి మ్రొక్కిన తరువాత నాట్యాన్ని ప్రారంభిస్తారు. ముఖ్యంగా పెళ్లి శుభకార్యాలు సందర్భంలోనూ అదేవిధంగా గిరిజనుల గ్రామ దేవతల ఉత్సవాలలోనూ భూమి పంట చేతికి అందే సందర్భంలో గిరిజనులు నిర్వహిస్తారు. మయూర నృత్యం చేసేటటువంటి వాళ్ళు ముఖ్యంగా తెల్ల పంచె కట్టుకుంటారు. కాళ్లకు గజ్జలు కొట్టుకుంటారు. తలకు తగిన విధంగా తలపాగా చుట్టుకుంటారు. గడ్డితో తయారు చేసినటువంటి తలపాగాకు రంగురంగుల కలిగినటువంటి గుడ్డ పీలికలను కుచ్చులుగా చేసి తగినంత సైజులో కట్టుకుంటారు. కాళ్లకు కట్టిన గజ్జలను "ముయ్యంగం" తలకు పెట్టినటువంటి తలపాగాను "తోయ్యంగం" అని అంటారు. నడుముకు వెనుక భాగాన తగిన విధంగా నెమలి పించం గుత్తిను కట్టుకుంటారు. నాట్యకారుడు నడుము ఒంచినప్పుడు నెమలి పించం విప్పినట్లుగా ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది.

ఈ నాట్యంలో రెండు వరుసల్లో నర్తకులు నిలబడి ఉంటారు. రెండు వరుసల్లో ఉన్నటువంటి వ్యక్తులు అటు ఇటు తిరుగుతూ నెమలి చేసేటటువంటి అరుపులను పోలిన విధంగా అరుస్తూ ఉంటారు. గుండ్రంగా తిరుగుతూ మోకాలిపై నిల్చొని ముందుకు వంగుతూ నెమలి పించం గుత్తి ఆకర్షణీయంగా కనిపించే విధంగా నెమలి చేసే నాట్యాన్ని చేస్తారు. గళ్ళు గళ్ళు మని శబ్దం చేసే గజ్జలు ఎంతో ఆకర్షణీయంగా చెవికి వినసొంపుగా ఉంటుంది. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలలో ఈ మయూర నృత్యం ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉంటుంది నెమలి ఈకలను అలంకరించడం ద్వారా ఎంతో ఆకర్షణీయంగా అద్భుతంగానూ ఉంటుంది. ఇది గిరిజనుల సంస్కృతికి వారసత్వ సంపద . నేటి కాలంలో ఈ కళా నృత్యాలు కనుమరుగవుతున్నాయి వీటి తగినంత ప్రోత్సాహం లేకుండా పోతున్నది. ఇటువంటి కళారూపాల పై తగినంత ప్రోత్సాహం ప్రభుత్వాలు అందించడం ద్వారా రాబోయే తరానికి ఇటువంటి సంస్కృతి సంప్రదాయాలను అందించటానికి వీలవుతుంది.

## 4.31. సవర నృత్యం:

ఒడిషాలోని గంజాం జిల్లాలో ఆంధ్రలోని శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువగా కనిపించే సవరల జనాభా దాదాపు 5 లక్షలుగా ఉంటుంది. శ్రీకాకుళం జిల్లాలో పర్లాకిమిడి పట్టణానికి పరిసర ప్రాంతాల కొండలపై నివసించే సవరలు ఆదిమ నివాసులు. అంటే ఆదిమ గిరిజనులు. కనీసం అక్షర జ్ఞానం లేక బాహ్య సమాజం అంటే తెలియని అమాయకులు. కాని ఆధునిక సమాజాలతో పోల్చితే నీతి, నిజాయితీ గల మానవీయులు సవరలు. సవరలు ఇంకా అనాగరికులుగానే కనబడతారు. తినడానికి తిండి, కట్టడానికి బట్టలేని పరిస్థితుల్లోనూ ప్రత్యేక జీవన సంస్కృతిని విస్మరించని అస్తిత్వం గల ఆదిమ ప్రపంచం వారిది. వీరు ప్రధానంగా పోడు వ్యవసాయం చేసుకుంటారు. భూమిని దున్నుకొని విత్తనాలు వేసేటప్పుడు వీరు పోడు వ్యవసాయం అనగా కొండలు గుట్టలలో కొంత భూమిని హద్దులు పెట్టుకొని వ్యవసాయం చెయ్యటం పంటలు పండిన తర్వాత ఆ భూమిని వదలి మరల వేరే భూమిని సాగుచేసుకోవటం. ఈ పద్ధతి కొన్ని ఆటవిక తెగలలోవుంది. వీరు పండించే పంట తొలిముద్ద దేవునికి నైవేద్యం పెట్టిన తరవాత ఆ పంట పేరున పండుగలు నిర్వహిస్తారు. కొర్రలు, కందులు, జొన్నలు, రాగులు పండిస్తారు. వేరు చేసే నృత్యంలో ఆడామగ అనే తేడా లేకుండా అందరూ కలిసి సామూహిక నృత్య ప్రదర్శన చేస్తారు. సవరలు వారి భాషలో పాటలు పాడుకుంటూ నృత్యం చేస్తారు. ఆ నృత్యాన్ని "సవర" నృత్యం అంటారు. వీరు ఎక్కువగా అడవి సంపదపై ఆధారపడి ఉంటారు. అడవిలో పండే పంటను పండ్లను దుంపలను గ్రామాల్లోకి తెచ్చి వాటిని విక్రయిస్తుంటారు.

సాధారణంగా అడవిలో పెరిగే చెట్లను నరికి వాటిని వంటచెరుకు కోసం ఉపయోగిస్తుంటారు. అదేవిధంగా వాటిని పట్టణాల్లోనూ గ్రామాల్లోనూ తెచ్చి విక్రయిస్తుంటారు. ముఖ్యంగా అడవిలో పండే మామిడి పళ్ళు, జీడిపళ్ళు, జీడి పిక్కలను ఈత పళ్ళు నేరేడు పళ్ళు, అడవిలో పండించే పువ్వులను, పండ్లు కూరకాయలను సంతల్లోకి తెచ్చి అది తక్కువ ధరకు అమ్ముతుంటారు. వీరు పూర్తిగా అడవి సంపదలపైనే ఆధారపడి కొండల్లోనూ గుట్టల్లోనూ జీవనం సాగిస్తుంటారు. సవరలు జీవన స్రవంతిలో కొందరు చాపలు, బుట్టలు అల్లుకుంటున్నారు. ఇంకా కొంతమంది ఆజాతిలోని భాగ్యవంతులఇళ్ళల్లో 'నౌకరీలు చెయ్యటం, పొలాలు, గొడ్డు కాపలా కాయటం చేస్తున్నారు, సవరులలో కూడా ఈ పద్ధతి ఉంది. వీరు కొండ దేవత పండుగ చేసుకొని వారి భాషలో పాడుకుంటూ నృత్యం చేస్తారు. శుభకార్యం, వివాహం వంటి సందర్భాలలో కూడా వీరు తమ నృత్యాలను ప్రదర్శిస్తుంటారు. సవర భాష దక్షిణ ముండా భాషకు చెందినది. ముండా బాషా ఆస్ట్రోఏషియన్ భాషా కుటుంబాల్లో ఒకటి. గిడుగు సవర భాషను నేర్చుకున్నారు. సవర వాచకాలను, కథల పుస్తకాలను, పాటల పుస్తకాలను, తెలుగు– సవర, సవర – తెలుగు నిఘంటులను తయారు చేశారు. సవర భాషలో రచనలు సేకరించడమే గాక, సవర భాషా వ్యాకరణ నిర్మాణంలో గిడుగు సాధించిన కృషి ఎనలేనిది.

## ఇతర జానపద కళారూపాలు

### 4.32. కర్ర సాము, కత్తి సాము, గరిడీలు:

ప్రాచీన కాలం నుంచి రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడినటువంటి యుద్ధ సంబంధిత రక్షణ ఆయుధాలకు సంబంధించిన శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణనిచ్చి రాజులు తమ రక్షణ కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకునేవారు. ఈ శిక్షణలో భాగంగా కర్రసాము ప్రత్యేకమైనటువంటి విశిష్టతను కలిగి ఉంటుంది. ఈ కర్ర సాములో ముఖ్యంగా వ్యక్తి తన ఆత్మ రక్షణ కోసం కర్రను నలు వైపుల తిప్పుతూ నృత్యాన్ని ప్రదర్శిస్తూ ఎంతో వైభవంగా చేస్తాడు. దీంతోపాటుగా కత్తిసాము కూడా ఆత్మరక్షణ కోసం ఏర్పాటు చేయబడినటువంటిది. ఈ కత్తిసాములో ఇరువురు లేదా నలుగురు తమ కత్తులను వివిధ రకాలుగా పైకి కిందికి పక్కకు తిప్పుతూ కళా విన్యాసాలను చేయడం జరుగుతుంది. ఈ కళా ప్రదర్శనలో కళాకారులు వివిధ రకాలైన భంగిమలతో మెలికలు తిరుగుతూ ఎదుటివారిని మంత్రముగ్ధుల్ని చేసే విధంగా ప్రదర్శన చేస్తారు.

గరిడీ ప్రదర్శనలో గురువు దగ్గర శిక్షణ పొంది వాటిని తీరిక సమయాల్లో సాధన చేస్తుంటారు. ఈ గరిడీ విషయంలో కర్రలను లేదా కత్తులను ఒక చేతితోను కొన్నిసార్లు రెండు చేతులనూ తిప్పుతూ ప్రదర్శన చేయడం ఎంతో కమనీయంగా ఉంటుంది. ఇది ప్రాచీన కాలం నుంచి సాంప్రదాయంగా వస్తున్నటువంటి కళారూపం నేటి ఆధునిక కాలంలో సాంకేతికత చోటుచేసుకోవడంతో తుపాకీలు యుద్ధ బాంబులు రావడంతో ప్రాచీన సాంప్రదాయంగా ఉన్నటువంటి కళారూపాలు కనుమరుగవుతున్నాయి. ముఖ్యంగా గ్రామ దేవత ఉత్సవాలు సందర్భంగా మాత్రమే కత్తిసాము కర్రసాము గరిడీలు ప్రదర్శనలో జరుగుతున్నాయి. మిగతా సమయాల్లో వీటి ప్రదర్శన జరగడం అనివార్యం. కేవలం గ్రామ సంబంధిత దేవతల ఉత్సవాలు జాతరలు ఈ సందర్భంలో మాత్రమే వీటిని ప్రదర్శించడం వల్ల వీటిపై ఆధారపడిన వంటి కళాకారులు తమ ప్రదర్శన విద్యలను వదిలి పెట్టవలసి వస్తుంది. కాలం మారుతున్న కొద్దీ కాలంలో వచ్చినటువంటి మార్పులు సాంప్రదాయాలు కళారూపాలు కనుమరుగవడం అనేది సహజ సిద్ధం. దీనికి అనుగుణంగా ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటూ సాంకేతిక మైనటువంటి యుద్ధ ఆయుధాలను వినియోగించడం జరుగుతుంది. ప్రాచీన కాలంలో విజయ నగర రాజులు ఎంతో వైభవంగా ఈ సాంప్రదాయ కళారూపాలను పెంచి పోషించారు. ఈ కళా ప్రదర్శనలో ముఖ్యంగా బళ్ళెం, ఈటెలు, కత్తి, డాలు. వెదురు కర్ర, మొదలైనటువంటి ఆయుధాలతో కర్ర సాము, కత్తి సాము గరిడీ ప్రదర్శనలు చేయడం ఎంతో ఆసక్తిని కలిగిస్తుంది. ఆరు ఏడు అడుగుల వెదురు కర్రను తీసుకొని వివిధ అడుగుల్లో తిప్పడం, ఇద్దరు వ్యక్తులు కర్ర యుద్ధం చేయడం, తిప్పే కర్రకు రెండు చివర్లో గుడ్డను చుట్టి అగ్గిని వెలిగించుకొని

తిప్పడం, గుండ్రని చక్రాన్ని తయారు చేసుకొని దాని చుట్టూ దివిటీలను వెలిగించుకొని మధ్యలోనే అడ్డుకర్రను పట్టుకొని తిప్పుతారు.

ప్రాచీన కాలంలో ఈ గరిడీ ప్రదర్శనకు ఎంతో ప్రాముఖ్యత ఉండేది ప్రాచీన రాజరిక వ్యవస్థ నుంచి ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థ వరకు వచ్చినటువంటి మార్పులు ప్రాచీన సాంప్రదాయ కళలను కనుమరుగుపరిచాయి. ఇవి కేవలం ప్రత్యేకమైనటువంటి పండగలు ఉత్సవాల సందర్భంలో మాత్రమే ప్రదర్శించడం వల్ల ఈ కళా రూపాల ఉనికి లేకుండా పోతున్నది. ఆ రోజుల్లో యుద్ధ తంత్ర సాధనాలుగా ఉన్నటువంటి ఈ కళారూపం నేడు గ్రామదేవతల ఉత్సవాలకు నిండుదనాన్ని చేకూర్చే సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. గ్రామాలలో కొన్ని ప్రత్యేకమైనటువంటి స్థలాలలో శిక్షణా శిబిరాలుగా ఉన్నటువంటివి. నేడు ఆధునికత సంతరించుకోవడంతో ఈ కళారూపాల ప్రదర్శన ఆదరణ లేకుండా ఈ కళారూపాలు కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయి.

## 4.33. పులి వేషాలు:

పగటి వేషాలలో పులి వేషాలు వేసే కళాకారులు ఎంతో వైవిధ్యమైన ప్రదర్శనను చేయాల్సి ఉంటుంది. అడవిలో పులి ఏ విధంగా ఉంటుందో అటువంటి వేషధారణ ధరించి పులిని అనుకరించేలా ప్రదర్శన చేయడం  ఈ కళా రూపంలో ప్రత్యేకత. ఈ కళారూపాన్ని ఉత్తరాంధ్రలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్ లోనూ తెలంగాణ రాష్ట్రంలోనూ ప్రదర్శిస్తూ ఉంటారు. ఇందులో కళాకారుడు తన నాట్య ప్రదర్శన ద్వారా అందర్నీ ఆకర్షించేలా వివిధ భంగిమలను వేస్తూ అందర్నీ భయపెట్టేలా ఉంటుంది. పులివేషం వేసిన వేషధారి తన శరీరంలోని అన్ని భాగాలను పసుపు నలుపు రంగులతో నింపేయాల్సిందే. అక్కడక్కడా పులి చర్మం మీది చారల్లా నల్లని రంగు చారలను చిత్రించి, తలకు మాత్రం తోలుతో కుట్టిన టోపీని తగిలించుకుని అచ్చంగా పులిలాగానే తయారై వీధుల్లోకి వచ్చి ఆట ప్రారంభిస్తాడు. గ్రామదేవతల ఉత్సవాలు పీర్ల పండుగ సందర్భాల్లో ఈ పులివేషగాళ్ళు తమ ఆటలతో అలరిస్తారు. వీధుల్లో గంతులు వేస్తూ, ఎగురుతూ, మధ్యలో పల్టీలు కొడుతూ, తొడగొట్టి పంజా విసరినట్లుగా చేస్తూ ఇంటింటా తిరుగుతూ బిక్షాటన చేస్తారు. పులి వేషం అనేది జంతువుల నడక, గంతులకు అనుకరణగా భావిస్తారు. జానపదులు, గ్రామీణుల వల్లే ఈ కళా రూపం ప్రాచుర్యాన్ని పొందింది. ఇది చూడడానికి చిన్నపిల్లలు భయపడతారు.  సాధారణంగా ఈ పులివేషాలు వేసేటటువంటి వారు ఎంతో నైపుణ్యాన్ని కలిగి ఉంటారు. ఈ కళా ప్రదర్శన చేయడం అంత సులువైనది కాదు. క్రిందకు  ఒంగుతూ పైకి లేస్తూ వివిధ రకాలైన నృత్యాలను చేయాల్సి ఉంటుంది ఉత్తరాంధ్రలో ఈ  కళారూపం ఇప్పటికీ మనుగడలో ఉంది.

## 4.34. డప్పు నృత్యాలు:

ఈ నృత్యాలు ఉత్తరాంధ్రలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల అంతటా ఉన్నాయి. ఈ జానపద డప్పు కళారూపం ప్రజలకు ఎంతో వినోదాన్ని ఉత్సాహాన్ని అందిస్తుంది. ఇందులో ఎంతోమంది కళాకారులు కలిసి ఒక బృందంగా తమ డప్పు ప్రదర్శన చేస్తారు. ఇది ఒక బృందానికి సంబంధించినటువంటిది. ఈ జానపద కళారూపాన్ని ప్రదర్శించే కళాకారులు ముఖ్యంగా ఉత్తరాంధ్రకు సంబందించిన మాల, మాదిగ, జగ్గిలి, కులానికి చెందిన వారు ప్రదర్శిస్తుంటారు. ఈ కళా ప్రదర్శనలో కళాకారులు 10 నుంచి 20 మంది కలిసి బృందంగా ఏర్పడి డప్పు కొడుతూ వివిధ రకాల విన్యాసాలు చేస్తుంటారు. వీరు తలకు తలపాగా చుట్టుకుని నడుముకు తెల్లటి పంచె కట్టుకుని కాళ్లకు గజ్జెలు కట్టుకొని నుదుట కుంకుమ బొట్టు పెట్టుకుని ఎర్రని లేదా పచ్చని చొక్కా వేసుకొని చంకలో డప్పు పెట్టుకొని చిరుతలతో (కట్టెపుల్లలతో) డప్పుపై కొడుతూ వివిధ రకాలైనటువంటి వాయిద్యాలను చేస్తూ కళా ప్రదర్శన చేస్తారు. దీనినే 'డప్పు నృత్యం' అని 'డప్పుల మేళం' అని అంటారు. ఈ డప్పు అనేది మేక చర్మంతో తయారు చేస్తారు. ఈ కళా ప్రదర్శనను కేవలం పురుషులు మాత్రమే సంఖ్య నియమం లేకుండా చేస్తుంటారు. దీనిలో పాట, అడుగు, వరుస నృత్యం దరువు అన్ని కలగలిసి ఉంటాయి. ఈ కళా ప్రదర్శనను గ్రామదేవతల ఉత్సవాలలో జాతర్లలో ఊరేగింపులలో ప్రదర్శిస్తూ ఉంటారు.

వీరు ప్రదర్శన చేసే సందర్భంలో ఇద్దరు జతగా ఉంటూ ప్రదర్శన చేస్తుంటారు. అదేవిధంగా వలయాకారంగా తిరుగుతూ ముందుకి వెనక్కి వంగుతూ డప్పు శబ్దానికి తగిన అడుగు వేస్తూ విన్యాసాలను చేస్తుంటారు. వీరు మ్రోగించే డప్పు శబ్దాలలో ఎన్నో రకాలైన వ్యత్యాసాలు ఉంటాయి. ఈ డప్పు కళాకారులు వాటికి అనుగుణంగా తమ భంగిమలను ప్రదర్శిస్తుంటారు. ఇవి చేసే సందర్భంలో బృందంలో ఒకరిపై ఒకరు నిల్చుని డప్పును వాయిస్తూ విన్యాసాలను చేస్తారు. డప్పు వేసే సందర్భంలో కొన్నిసార్లు నెమ్మదిగాను కొన్నిసార్లు వేగంగాను కొడుతుంటారు. ఆ వేగాన్ని తగ్గట్టుగా వాళ్ళ అడుగులు ముందుకు వెనుకకు వంగుతూ వలయకారంగా తిరుగుతూ ప్రదర్శన చేస్తుంటారు. ఉత్తరాంధ్రలో ఎంతో మంది జానపద కళారూపాలు వీటిపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ కళారూపం పెళ్ళి, ఇంటి శుభకార్యాలు ఇంటి దేవత ఉత్సవాలు మొదలైన వాటిల్లో ఉపయోగించబడుతున్నది. ఎన్నో కళారూపాలు కనుమరుగవుతున్నప్పటికీ ఈ డప్పు కళారూపం ఇప్పటికీ సజీవంగానే ఉంది. ఎంతో రంజకంగా సంతోషాన్ని ఇచ్చేదిగా ఈ కళారూపం గ్రామాల్లో నిలిచి ఉంది. ఈ నృత్య ప్రదర్శనలో గురువు చెప్పినట్టుగా శిష్యులు వివిధ రకాలయిన పాటలను పాడుతూ గురువును అనుకరిస్తూ ఉంటారు. వలయాకారంగా తిరుగుతూ ఉన్న బృందంలో గురువు మధ్యలో ఉండి వివిధ రకాలైన సూచనలు నృత్యాలను డప్పు శబ్దాలను చేస్తుంటాడు. దానిని శిష్యులు అనుగుణంగా ప్రదర్శన చేస్తుంటారు. దీనికి ప్రజలందరూ కూడా చూడడానికి అదేవిధంగా ఆ డప్పు శబ్దానికి నృత్యాన్ని చేయడానికి సంసిద్ధులవుతారు. దానికి కారణం ఆ డప్పు శబ్దానికి ఉన్నటువంటి ప్రత్యేకతే అని చెప్పవచ్చు.

# అధ్యాయం 5

# ఉత్తరాంధ్రలో అంతరించిపోతున్న కళారూపాలు

# అధ్యాయం 5

# ఉత్తరాంధ్రలో అంతరించిపోతున్న కళారూపాలు

## 5.1. పరిచయం:

మానవ సంస్కృతిలో అంతర్భాగమైన జానపద విజ్ఞానంలో జానపద కళలు ఒక విభాగం. అతి ప్రాచీనమైన ఈ నృత్య కళారూపాలు కాలానుగుణంగా వచ్చే మార్పులను చేర్పులను తనలో సంతరించుకుంటూ నూతనత్వాన్ని కలిగి ఉంటుంది. ఈ కళలు కాలక్రమంలో మార్పులు చేర్పులకులోనై వాటి ఉనికిని కోల్పోకుండా కొనసాగుతున్నాయి. సమాజ ఆవిర్భావం నుండి జానపద కళలలో కూడా ఎన్నో మార్పులు జరుగుతూ వచ్చాయి. నేడు ఇటువంటి సుదీర్ఘ చరిత్ర కలిగిన జానపద కళలు అంతరించిపోయే స్థితిలో ఉన్నాయి. ఉత్తరాంధ్ర జనపద కళారూపాల స్థితిగతులను పరిశీలించినపుడు ఈ పరిశోధనలో భాగంగా ఈ క్రింది విషయాలు పేర్కొనబడ్డాయి.

## 5.2. ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – నాడు:

పూర్వకాలంలో జానపద కళాకారులు ఎంతో వైభవంగా తమ కళా ప్రదర్శనను ప్రదర్శించేవారు. గ్రామంలో ఉండే ప్రజలు ఈ కళా ప్రదర్శనలు చూడటానికి ఎంతో ఆసక్తిని కలిగి ఉండేవారు. సాధారణంగా పల్లెల్లో ఉండే గ్రామస్తులు పగటిపూట తమ వ్యవసాయ పనులు పశువులను పెంచడం మొదలైన పనుల్లో అలసిపోయి సాయంత్రమయ్యే సమయానికి, రాత్రికి, ఇంటికి వచ్చి తమ శారీరక శ్రమను మర్చిపోవడానికి తీరిక సమయాలలో ఈ జానపద కళారూపాలు ఎంతో ఉత్తేజభరితంగా ఉంటూ ఉపయోగకరంగా ఉంటూ సంతోషాన్ని ఇచ్చేవి. ముఖ్యంగా గ్రామాలకు వచ్చే కళాకారులు ఎవరైనా వచ్చినట్లయితే వారికి తగిన విధంగా సదుపాయాలు సహకారాలు అందించి వారి ద్వారా వివిధ కళారూపాలు చెప్పించుకొని ప్రదర్శించేటట్లుగా చేసేవారు. కళాకారులు ప్రదర్శించే కళారూపాలలో పౌరాణిక సంబంధమైన ఇతివృత్తాలతో కూడినటువంటి రామాయణ భారత భాగవత భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబింపజేసే పురాణాలు ఇతిహాసాలు మొదలైనవి చెప్పించుకునేవారు. ఈ విధంగా ఈ పౌరాణిక కథలోని నీతిని వీరుల ధైర్య సాహసాలను పరాక్రమాలను తెలుసుకునేవారు. ఇందులో ఉండే భాష సహజంగా ఉంటూ ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉండడంవల్ల వీటిని సులువుగా అర్థం చేసుకునే వారు. ప్రజలు ఎంతో ఆనందంతో వారి యందు ఆసక్తి చూపేవారు.

ఉత్తరాంధ్రలో జానపద కళారూపాలు ప్రత్యేకంగా గ్రామ దేవత ఉత్సవాలలోనూ పండుగలు ఇతర ప్రత్యేక సందర్భాల్లో ఎక్కువగా ప్రదర్శించేవారు. ఇవి ఎంతగానో ప్రజలను ఆకట్టుకునేవి. ఈ కళారూపంలో ఒక్కొక్క పాత్రకి ఒక వైవిధ్యమైనటువంటి ప్రత్యేకతను కలిగి ఉండే విధంగా పోటీ తత్వంతో కూడిన

ప్రదర్శనలు ఉండేవి. జానపద కళాకారులు ఈ ప్రదర్శన నేర్చుకోవడానికి కళాకారులను ప్రత్యేకంగా గ్రామాల్లోకి వీధుల్లోకి ఇండ్లల్లోకి పిలిపించుకొని ఆ ప్రత్యేకమైన కళారూపాన్ని నేర్చుకునేవారు. ఈ విధంగా ఆ నేర్చుకున్న కళారూపాన్ని ప్రత్యేక పండుగల సమయాల్లో ప్రదర్శన చేసుకునేవారు. అందుకుగాను కుటుంబ సభ్యులను బంధు వర్గాన్ని చుట్టుపక్కల గ్రామస్తులను పిలిచేవారు. ఈ విధంగా కళారూపాలు గ్రామాలలో విస్తరిస్తూ పల్లె ప్రజలను ఎంతగానో సంతోషాన్ని ఇచ్చేవి. కళాకారులకు ప్రేక్షక మహాశయులు దానాలు ఏమైనా చేస్తే స్వీకరించి దాతలను ధర్మమహాప్రభువులు, గొప్పదాతలు, శ్రీరామచంద్రులు, సుఖ శాంతులతో జీవించాలి. పిల్లాపాపలతో 'సల్లంగా' ఉండాలి, భోగభాగ్యాలు కలగాలి అని దీవనలతో బాటు పొగిడేవారు. ఈ పొగడ్తలను, దీవనలను పల్లెప్రజలు గొప్పవిగా భావించేవారు. ఈ విధంగా గ్రామాలలో ఈ కళాకారులకు ఎంతో గౌరవ మర్యాదలు ఇవ్వబడుతూ ఉండేవి. ఈ కళా ప్రదర్శన దృశ్యాన్ని చూస్తున్నటువంటి ప్రేక్షకులు తమకు తోచినంత డబ్బులను కానుకలను ఇచ్చి వారి చేత పొగిడించుకునేటట్లుగా ఆశీర్వచనాలు పొందేవారు.

జానపద కళాకారులు తాము నేర్చుకున్నటువంటి కళారూపాన్ని తండ్రుల నుంచి తాతల నుంచి వంశపారపర్యంగా పొందుతారు. ఈ విధంగా నేర్చుకున్న కళారూపాన్ని ప్రదర్శనలు చేపట్టడం చేస్తారు. ఉదాహరణకు తప్పెటగుళ్ళు. గంగిరెద్దులాట మొదలైనవి చెప్పుకోవచ్చు . ఈ విధంగా నేర్చుకున్నటువంటి కళా ప్రదర్శనను పండుగలు గ్రామ దేవత ఉత్సవాలు పంట పండించిన తర్వాత ఉర్పిడి సమయాల్లో ప్రదర్శనలు చేస్తూ యాచన చేసుకుంటూ జీవిస్తుంటారు. వృత్తిగా స్వీకరించిన వాళ్ళు ఒక రకమయితే రెండో రకానికి చెందిన కళాకారులు ప్రజల మెప్పు కోసం ప్రదర్శనలు చేస్తారు. ఉదా॥ కోలాటం, వీధినాటకాలు మొదలైన కళారూపాలను గ్రామాల్లోని యువకులు ఒక బృందంగా ఏర్పడి కళారూపాన్ని ఎన్నుకొని ఆ కళారూపంలో పేరొందిన వ్యక్తిని తమ గ్రామానికి రప్పించుకొంటారు. అతనికి వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. తగిన శిక్షణ పొందిన కళాకారులు కళను ప్రదర్శిస్తారు.

ఈ విధంగా తరతరాలుగా వస్తున్నటువంటి ఈ ఉత్తరాంధ్ర కళారూపాలు అయిన పగటివేషాలు, కోలాటం, తప్పెటగుళ్ళు, జముకుల కథ మొదలైనవి కొనసాగుతూ ఉండడం గమనార్హం. విధంగా జానపద కళారాధన క్రమంగా వికాసం చెందింది. ప్రారంభంలో కొంత జంకు కలిగినా క్రమక్రమంగా జంకు పోయి చక్కగా కళారూపాన్ని తమ గ్రామాల్లోనే కాకుండా ఇతర గ్రామాల్లో కూడా ప్రదర్శించే నైపుణ్యం సంపాదించుకొన్నారు. జానపద విజ్ఞానాన్ని మానసిక ఆనందాన్ని వినోదాన్ని కలిగించి శ్రమను మర్చిపోవడానికి జానపద కళలు ఎంతగానో ప్రభావం చూపుతాయి. అందువల్ల గ్రామాల్లో ఈ కళారూపాలు మరువలేని స్థానాన్ని ప్రజాదరణను కలిగి వైభవంగా వెళ్తాయి. ఈ ప్రదర్శన చూడడానికి ప్రజలు కొన్ని కిలోమీటర్ల దూరం నుంచి కాలిబాటన మరికొందరు అప్పట్లో సౌకర్యంగా ఉన్న ఎడ్లబళ్ళల్లో ప్రయాణం చేసి వీక్షించేవారు.

## 5.3. ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు – నేడు:

ఆధునిక కాలంలో ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు ఎన్నో కనుమరుగుతున్నాయి. కాలంలో వచ్చినటువంటి మార్పులు సామాజిక అవసరాలు అభివృద్ధి ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతిక విజ్ఞాన అభివృద్ధి చెందడం ద్వారా అనేకమైన కొత్త రంగాలు వాటిలో ఉపాధి అవకాశాలు కోసం ప్రజలు సాంప్రదాయంగా వచ్చే కళారూపాల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారు. ఒకప్పుడు జానపద కళలే ప్రాణంగా భావించారు పల్లెవాసులు. కానీ ఈనాడు ఆదరణ తగ్గినట్లు కనిపిస్తున్నది. తరతరాల నుండి వంశపారంపర్యంగా కళలు ప్రదర్శించి జీవనం గడుపుతున్న జానపద కళాకారులు నేడు దయనీయ పరిస్థితులమధ్య తమ ఉనికిని కొనసాగిస్తున్నారు. ఈనాడు ఆధునిక ప్రసారమాధ్యమాలైన దూరదర్శన్, రేడియో, వీడియో, సినిమా మొదలైనవాటి ప్రభావాలు పల్లెలకు విస్తరించాయి. క్రమంగా జానపదకళల స్థానాన్ని అవి ఆక్రమించి జానపద కళలపై ఆసక్తిని తగ్గించడానికి కారణమైనాయి. ఆధునిక సామాజిక జీవన విధానంలో మార్పులు వస్తున్నాయి. అదే విధంగా ప్రజల కాలక్షేపంలోనూ విపరీతమైన మార్పులు కలిగాయి. ప్రపంచీకరణవల్ల కులవృత్తులు నశించాయి. ధన సంపాదనే ధ్యేయంగా ప్రజలు వృత్తులు చేపట్టడం ప్రారంభించారు. కళల ప్రదర్శన తమ వారసత్వంగా భావించే కళాకారులు కొంతమంది ఈనాటికీ వాటిని కొనసాగిస్తున్నారు. విద్యావకాశాలు మెరుగుపడడం వల్ల, ప్రజల ఆదరణ తగ్గడం వల్ల కళాకారుల కుటుంబాలు తమ జీవిత గమనాన్ని మార్చుకొంటున్నాయి. ఈ నేపథ్యంలో జానపద కళలనే జీవనాధారంగా కలిగి ఉన్న జానపద కళాకారుల కుటుంబాలు పలు ఇబ్బందులకు గురవుతున్నాయి. ఉపాధి అవకాశాలు లేక చాలామంది కళాకారులు పట్టణాలకు వలస వెళ్ళిపోయి తమ వృత్తులను కళారూపాలను విడిచిపెడుతున్నారు.

కళాకారులు తమ చేసే వృత్తిని కాపాడుకోవడంలో సరైనటువంటి ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడం ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. ఒకప్పుడు కళాకారులను గౌరవించే పట్టణాలు నేడు కళలను ప్రదర్శించడానికి వెళ్ళినపుడు భిక్షగాళ్ళను చూసినట్లు చూస్తున్నారని హేళనగా మాట్లాడుతున్నారు. బస్సు నిలయాలు, గ్రామాల కూడలి ప్రదేశంలో దొమ్మరాటలు నిర్వహించేటపుడు జనాలు విపరీతంగా గుమి కూడేవారని ఈనాడు వందల మంది దారిన పోతూ ఉన్నా కేవలం పది మంది కళను చూస్తున్నారు. డబ్బులు దానం చేసేవారు తగ్గినట్లు దొమ్మరాట, తప్పెటగుళ్ళు పగటి వేషాలు వేసే కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు .

సమాజంలో వచ్చినటువంటి విపరీతమైన మార్పులు అవసరాలు కోరికలు ఈ కళారూపాల స్థితిగతులను అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఈ కళారూపాలపై ఆధారపడి ఎంతోమంది కళాకారులు రోడ్డును పడ్డారు. సరైనటువంటి ఉపాధి అవకాశాలు లేకుండా పోయినాయి. ఎప్పుడు కళా ప్రదర్శన ఉంటుందో తెలియని అయోమయ పరిస్థితిలోకి కళాకారులు ఒకపక్క ప్రదర్శనను వదులుకోలేక మరోపక్క కొత్త

రంగాలలో ఉద్యోగం లభించక దయనీయమైనస్థితిలో ఉన్నారు. ఈనాడు దూరదర్శన్, సెల్ఫోన్, టెలివిజన్లలో వచ్చే రకరకాల కార్యక్రమాలు చూస్తూ గ్రామాల్లోకి వచ్చే జానపద కళాకారులను పట్టించుకొని ఆదరించడం లేదు. తద్వారా కళాకారుల తీరుతెన్నులలోనూ మార్పులు, ఆలోచనలలో మార్పులు కలుగుతున్నాయి. జానపద కళల వల్ల ప్రజలు భారత, రామాయణ విషయాలను నేర్చుకొని, నీతి, నియమాలు, సత్యం, ధర్మం వంటి విలువల్ని పాటించడానికి అవకాశం ఉంది. తద్వారా సమాజంలో ప్రశాంతత, మంచితనం, నైతిక విలువలు వృద్ధి చెందడానికి అవకాశం ఉంది. ఇవి క్రమంగా తగ్గడం వల్ల సమాజంలో వైషమ్యాలు పెరిగి వివేచనాశక్తి కోల్పోయి, అశాంతి, అవినీతి, అధర్మం పెరిగిపోతున్నాయి. ప్రజలు మనశ్శాంతి కోల్పోవడానికి కారణమవుతున్నది.

ఒకప్పుడు జానపద కళలు ఎంతో వైభవాన్ని కలిగినటువంటివి నేడు అగమ్యగోచరంగా మారాయి. సరైనటువంటి గుర్తింపు లేక సరైన ఆదరణ లేక ఎన్నో కళారూపాలు అడుగంటిపోతున్నాయి. ఇవి వ్యక్తి మూర్తిమత్వ వికాసానికి సమాజాభివృద్ధికి ఎంతో మార్గదర్శకాలుగా ఉండేవి. జానపద కళలు వ్యక్తిని మంచి మార్గంలో పయనించే విధంగా తీర్చిదిద్దుతాయి. జాగృతి కలిగిస్తాయి. కానీ ఈనాడు వీటిపై ఆదరణ క్రమంగా తగ్గి నేటి ఆధునికపు అలవాట్లు దూరదర్శన్, సినిమా సెల్ఫోన్ ప్రభావం వల్ల అశ్లీలత ద్వంద్వార్థాల మాటల వల్ల ప్రజల్లో మానసిక బలహీనతలు రెచ్చిపోతున్నాయి. అతి హేలమైన శృంగారభావనలు పెరుగుతున్నాయి. వావివరుసలు సామాజిక నియమాలు మరిచిపోతున్నారు. నిత్యం కొట్లాటలు, జూదం, పేకాట, వంటి అసాంఘిక కార్యక్రమాలు పల్లెల్లో జోరందుకున్నాయి. ఒకనాడు వినోదంతోబాటు నీతి బోధనలు కూడా చేస్తూ సమసమాజ వ్యాప్తికి, సామాజిక వికాసానికి కారణమైన కళాకారూపాలు నేడు క్రమంగా క్షీణిస్తున్నాయి. వాటిపైన ప్రభుత్వం వారు తగిన శ్రద్ధ చూపి ఆదుకోవలసిన అవసరం ఉంది. సరైనటువంటి విధంగా ప్రభుత్వాలు స్పందించి తరతరాలుగా వస్తున్నటువంటి ఈ కళా సంపదను సంస్కృతిని మన జాతి ఔన్నత్యాన్ని కాపాడుకోవాలి. కళారూపాలు వాటి అస్తిత్వాన్ని కాపాడేందుకు భావితరాలకు అందించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి. ఈ విధంగా చేయడం ద్వారా ఈ కళలను కేవలం పురావస్తు ఆధారాలుగా కాకుండా జానపద జీవన విధానాన్ని, విజ్ఞానాన్ని వినోదాన్ని అందించేందుకు సహాయపడవచ్చు. జానపద కళల అభివృద్ధికి ఎంతో సేవ చేయడంతో పాటు మన సంస్కృతిక పునర్వైభవాన్ని తీసుకురావచ్చు.

## 5.4. సాంకేతిక రంగం అభివృద్ధి:

ఆధునిక కాలంలో వస్తున్నటువంటి విప్లవాత్మకమైన శాస్త్రసాంకేతిక రంగాలలో నూతనమైన ప్రయోగాలు పద్ధతులు అనుసరించడం ప్రతి ఒక రంగంలోనూ శాస్త్ర సాంకేతిక అంశాలను జోడించుకుంటూ భవిష్యత్తు అభ్యుదయం కోసం నేటి యువత పోటీ పడుతూ ఉంది. తద్వారా ప్రాచీన సంస్కృతి సంప్రదాయాల పట్ల చూపిస్తున్నటువంటి నిర్లక్ష్య వైఖరి అనేది కళారూపాల విషయంలో కూడా

జరుగుతుంది. ఈ కళారూపాలను ఆదరించడం యువత తగినంతగా ప్రోత్సాహాన్ని అందించడం లేదు. అదేవిధంగా ఉపాధి కల్పన విషయంలో జానపద కళారూపాలు ఏవిధంగా కూడా సహాయకారిగా లేకపోవడం వల్ల ఈ కళారూపాల పట్ల నిర్లక్ష వైఖరి కనబడుతుంది. ప్రాచీన కాలంలో వినోదం కోసం ఏర్పాటు చేయబడినటువంటి ఈ కళారూపాలు నేటి కాలంతో పాటుగా ఎన్నో మార్పులకు నవ్యతకు లోనవుతూ కళారూప పూర్వ స్థితిగతులను మార్పులు చేసుకుంటూ నూతన పద్ధతులను నిర్వహిస్తుంది.

కంప్యూటర్ యుగంలో వచ్చినటువంటి సమాచార సాంకేతిక విప్లవం ప్రాచీన కళారూపాల పట్ల కోలుకోలేనటువంటి దెబ్బతీసింది. వినోదాన్ని అందించే ఈ కళారూపం స్థానంలో రేడియోలు టీవీలు కంప్యూటర్లు సినిమా థియేటర్లు ఆక్రమించాయి. ఈ సినిమాలు థియేటర్ల ద్వారా వినోదాన్ని ప్రజలకు అందిస్తున్నాయి. ఇవి ఒకే కాలంలో ఆడియో వీడియోల ద్వారా సాంకేతికమైన అభివృద్ధిని కలిగి ఉండి ప్రజలకు ఆనందాన్ని కలిగిస్తాయి. ఒకే సమయంలో ఏర్పాటు చేయబడినటువంటి ఈ వీడియోల ద్వారా అనేకసార్లు ప్రేక్షకులు వీక్షించేటటువంటి సౌలభ్యం ఉండడం ఈ సాంకేతికకు తార్కాణం. ఇటువంటి జానపద కళారూపాలు సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో వెనుకంజలో ఉన్నాయి. కళాకారులు సాంప్రదాయబద్ధమైన పద్ధతులను వినియోగించడం వల్ల సాంకేతికమైనటువంటి సాధనాలను జానపద విజ్ఞానంలో అనువర్తింపజేయలేకపోవడం వల్ల మెరుగైన ప్రగతి ఈ కళారంగం లో సాధించలేకపోతున్నారు.

## 5.5. ఆధునిక జీవనం వైపు మొగ్గు చూపుతున్న యువత:

సమాజంలో వస్తున్నటువంటి విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా నేటి యువత తగిన ఉపాధి కల్పన నెరవేర్చుకోవడానికి మరియు దాన్ని సాధించే క్రమంలో తగిన కోర్సులను అభ్యసించడం యువత ముందంజలో ఉంది. కానీ ప్రాచీన కళారూపాల పట్ల సరైన అవగాహన అనేది లేకపోవడం మన సంస్కృతి సంప్రదాయాల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు అవుతుంది. ప్రాచీన జానపద కళారూపాలు వాటిని ఆచరించేటటువంటి కళాకారులు రాను రాను కనుమరుగవుతుండటం అనేది కాలంలో వచ్చినటువంటి మార్పులు సరళీకరణ ప్రపంచీకరణకు దోహదం చేస్తుంది. నూతనంగా వచ్చినటువంటి కొత్త కొత్త ఆలోచనలు ఆవిష్కరణలు కొత్త సమాజం వైపు అడుగులు వేసేలా కొత్త జీవన విధానాన్ని అనుసరించేలా దానికి తగిన విధంగా పద్ధతులను పాటించేలా చేస్తున్నాయి. వినోదం కోసం దియేటర్లు టీవీ రేడియోలు కంప్యూటర్లు యూట్యూబ్ ఫేస్బుక్ ట్విట్టర్ సెల్ఫోన్ మరియు ఇతర సాధనాలను వినియోగించడం చేస్తున్నారు. ప్రాచీన సంప్రదాయబద్ధమైనటువంటి ఈ కళారూపాలను ఆదరించడంలోనూ యువత మొగ్గు చూపడం లేదు. అదేవిధంగా ప్రాచీన కళారూపాలను ఆదరించడం వల్ల తగిన ఉపాధి కోల్పోవడం జరుగుతుంది. ఆర్థికముగా ఇబ్బందులు పడినటువంటి తల్లిదండ్రులు తమ కొడుకులను ఉన్నత విద్య

కొరకు మరియు విద్యకు తగినటువంటి ఉపాధి కల్పన సాధించే క్రమంలో పట్టణాలకు వలస వెళ్లి తగిన ఉపాధిని సాధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చినటువంటి యువత తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకోవడంలో సరికొత్త మార్గాలను పద్ధతులను అన్వేషిస్తున్నారు.

## 5.6. కనుమరుగవుతున్న జానపద కళారూపాలు:

జానపద కళాకారులు రానురాను అడుగంటి పోతున్నారు. దీనికి అనేక మైనటువంటి కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రజలు ఈ కళారూపాల పట్ల చూపిస్తున్నటువంటి వైఖరి తగిన విధంగా లేకపోవడం వల్ల ఈ కళాకారులు తమ వృత్తిని నిర్వహించడంలో తగిన ప్రోత్సాహం పొందలేకపోతున్నారు. అదేవిధంగా తమ జీవనానికి ఆధారమైనటువంటి ఈ కళారూపాలు తగిన ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి అనుకూలంగా లేకపోవడం వల్ల ఈ వృత్తి పట్ల నూతన సమాజం మొగ్గు చూపడం లేదు. తత్ఫలితంగా ఈ జానపద కళారూపాలు కాలానుగుణంగా చరిత్రలో కలిసిపోతున్నాయి. వీటిని ఆదరించే నాథుడు లేకపోవడం సరైనటువంటి నూతన కళాప్రదర్శన విధానాలను అమలు పరచడంలో క్రియాశీలకమైన పాత్ర పోషించలేకపోతున్నారు.

ముఖ్యంగా విద్యా వ్యవస్థలో వచ్చినటువంటి విప్లవాత్మకమైన మార్పులు సామాజిక అవసరాలు ప్రజలను నూతన సమాజం వైపు మొగ్గు చూపేలా సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకునేలా చేస్తున్నాయి. తద్వారా ఆర్థిక పరమైన సుస్థిరతను సంపాదించడంలో ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ప్రజల ఆలోచనా విధానంలో వచ్చినటువంటి మార్పులు సామాజిక అవసరాల పట్ల చేయవలసినటువంటి బాధ్యతలు నూతన సమాజం వైపు అడుగులు తీసేలా చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకునేందుకు సరికొత్త విధానాలను అమలు పరుస్తున్నాయి వాటికనుగుణంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకునేందుకు వివిధ రంగాలలో నైపుణ్యాలను సాధించడంలో సరికొత్త పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఈ కారణంగా వచ్చేటువంటి విప్లవాత్మకమైన మార్పులు ప్రాచీన కళారూపాల పట్ల ప్రజల వైఖరి నిరంతరం మార్పులకు లోనవుతూ సరికొత్త విధానాన్ని ఏర్పరచుకున్నాయి.

తోలుబొమ్మలాట, బుట్ట బొమ్మ లాట, తప్పెటగుళ్ళు, కర్రసాము, కత్తి సాము, గంగిరెద్దుల వేషం ఇతర కళా రూపాలు కాలానుగుణంగా కనుమరుగవుతున్నాయి దీనికి సరైనటువంటి ఆదరణ ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం లేకపోవడం వల్ల ఈ వృత్తిని ఇలాంటి కళాకారులు తగిన ఆర్థిక స్థిరత్వాన్ని పొందలేక పోవడం వల్ల పట్టణాలకు వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నారు. తద్వారా ఈ కళారూపాన్ని ఆదరించే కుటుంబాలు పట్టణాలకు పరిమితమవుతున్నాయి. ఈ కళారూపాలను ఆదరించే కుటుంబాలు కనుమరుగైపోతున్నాయి. ప్రజలు ఈ కళారూపాలను ఆదరించడం లేదు. ఈ విధంగా ప్రభుత్వం కూడా తగిన ప్రోత్సాహకాలను అందించడం లేదు. కాలానుగుణంగా వచ్చినటువంటి మార్పులు

ఈ కళారూపాలు పట్ల కోలుకోలేనటువంటి దెబ్బతీశాయి. పల్లెటూర్లో గంగిరెద్దుల వాళ్లు లేకుండాపోయారు అదేవిధంగా కళనే నమ్ముకున్నటువంటి కళాకారులు తమ జీవనం అభివృద్ధి చేసుకునేందుకు సరికొత్త పద్ధతులను వృత్తులను అనుసరిస్తున్నారు.

## 5.7. క్రమంగా అంతరిస్తున్న ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు:

నా క్షేత్ర పర్యటనలో ఈ ఉత్తరాంధ్ర జిల్లాలోని జానపద కళారూపాలను దానిని ప్రదర్శించే కళాకారులను పరిశీలించినపుడు ఎన్నో అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కళలను ప్రదర్శించే కళాకారులైన తప్పెటగుళ్లు ప్రదర్శించేవాళ్ళు తోలుబొమ్మలవాళ్ళు, గంగిరెద్దుల ఆటవాళ్ళ జీవితాలు ఆర్థికంగా దుర్భర దారిద్ర్యానికి గురికావడం గమనించాను, ఉత్తరాంధ్రలో పలురకాల కళలు క్షీణించిపోవడానికి గల కారణాలను ఈ క్రింది విధంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

- మారుతున్న సమాజంలో వస్తున్నటువంటి మార్పులను బట్టి ప్రజల అభిరుచుల్లో మార్పులు రావడం. దాని తగిన విధంగా సంసిద్ధులు కావడం. ఒకరకంగా ప్రత్యేకమైనటువంటి అవసరాలు ఆర్థిక అభివృద్ధి కేంద్రంగా చేసుకొని ఉన్నతమైన మార్గాలను అన్వేషిస్తున్నారు.
- సాంకేతిక పరిజ్ఞానం ప్రభావంతో వచ్చినటువంటి విప్లవాత్మక మార్పులు ఎంతగానో ప్రభావాన్ని చూపుతాయి. ముఖ్యంగా టీవీ సెల్ఫోన్ అంతర్జాలము సినిమా మొదలైనవి ఆధునిక ప్రజలను విపరీతంగా ఆకర్షించగలిగే మాధ్యమశక్తి ప్రభావం కలిగి ఉండడం.
- పురాతన కాలంలో ఎటువంటి మాధ్యమాలు లేని కాలంలో పల్లె ప్రజలు ఎక్కువ ఆదరణ చూపేవారు. కానీ ఆధునిక యువత మాధ్యమాల ప్రభావం వల్ల ఈ జానపద కళలపై ఆసక్తి ఉన్నప్పటికీ తగిన విధంగా సమయాన్ని వెచ్చించలేకపోతున్నారు. తద్వారా ఈ కళారూపాలపై ఆసక్తి తగ్గుతుంది.
- జానపద కళారూపాలు వారసత్వంగా కొనసాగిస్తున్నప్పటికీ తగిన విధంగా అందరికీ ఆదాయ మార్గంగా లేకపోవడం వల్ల అందరికీ జీవనోపాధి కలగకపోవడం వల్ల ఈ కళలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.
- ఈ ప్రచార మాధ్యమాలు పల్లెలను పట్టణాలను ఏకీకృతం చేస్తూ ప్రపంచం మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకుంటుంది. కాబట్టి పల్లె వాతావరణం చిన్న భిన్నమై కళారూపాలపై ఎంతో ప్రభావాన్ని చూపుతుంది.
- కళ అనేది ఎంతో సంతోషాన్ని విజ్ఞానాన్ని అవసరాలను తీర్చేదిగా ఉంటుంది. ఆధునికంగా వస్తున్నటువంటి ప్రసార సాధనాల్లో సినిమా సెల్ఫోన్ రేడియో మొదలైన వాటిలో వచ్చే కార్యక్రమాలు ఎంతో వైవిధ్యభరితమైన ప్రత్యేకతను కలిగి ఉంటూ జానపద కళారూపాల కంటే ఎక్కువగా రంజింప చేసే విధంగా ఉండడం.

- కళాకారులు ప్రాచీన కాలం నుంచి వస్తున్నటువంటి సాంప్రదాయబద్ధమైన పరికరాలను వాడడం వల్ల సాంకేతికమైన ప్రగతిని సాగించలేకపోవడం కళారూపాల్లో వైవిధ్యభరితమైన మార్పులు తీసుకురాలేకపోవడం.
- మన ప్రాచీన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబంపజేసే కళారూపాలను ప్రభుత్వం తగిన విధంగా గుర్తించలేకపోవడం. అభివృద్ధికై చేయూతనివ్వలేకపోవడం.
- అంతరించిపోతున్న కళారూపాలపై తగిన విధంగా స్పందించి ఆర్థికంగా వెసులుబాటును కల్పించలేకపోవడం. ప్రాచీన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించే విధంగా ప్రభుత్వాలు ముందుకు రాలేకపోవడం.
- ఈ కళారూపాలపై ఆధారపడిన కళాకారులు ఈ కళాప్రదర్శనలో నైపుణ్యము సాధించినప్పటికీ వారికి తగిన విధంగా ఉన్నతమైన స్థానాలు కల్పించలేకపోవడం లేదా ప్రత్యామ్నాయమార్గాలు అన్వేషించలేకపోవడం.
- వివిధ స్వచ్ఛంద సంస్థలు కళారూపాల అభివృద్ధి కోసం తగిన విధంగా సహాయ సహకారాలు అందించకపోవడం.
- ఈ కళలపై జీవనం కొనసాగిస్తున్న కళాకారులు వేరే వృత్తుల్లోకి వెళ్లిపోవడం వల్ల వారికి అక్కడ తగిన ప్రాధాన్యత లభించడం.
- ఈ కళారూపాలపై ఆధారపడిన వ్యక్తులకు తగిన విధంగా వైద్య సదుపాయాలు గాని బీమా ఇన్సూరెన్స్ (బీమా) మొదలైన సదుపాయాలు లేకపోవడం.
- కళారూప ప్రదర్శన ఎప్పుడు జరుగుతుందో అప్పటివరకు వేచి చూడవలసిన పరిస్థితి ఏర్పడడం అన్ని రోజులు ప్రదర్శన లేకపోవడం.
- సమయానికి తగిన విధంగా కళాకారుల సభ్యులందరూ కళారూప ప్రదర్శనకు సంసిద్ధులను చేయలేకపోవడం. తద్వారా కళారూప ప్రదర్శనలో ఒక వెలితి ఏర్పడడం.
- కళాకారులు కళా ప్రదర్శన నిర్ణయించుకున్న సమయానికి సాంప్రదాయబద్ధమైన వ్యవసాయం మరియు కులవృత్తికి సంబంధమైన పనుల్లోనూ నిమగ్నమవడం.
- ఆర్థిక సంక్షోభం కరువు సంభవించడం ద్వారా పట్టణాలకు విదేశాలకు వలస వెళ్లిపోవడం.

## 5.8. పరిష్కార మార్గాలు:

- జానపద కళాకారులు గ్రామాలలో ఈ కళాప్రదర్శనకు సంబంధించిన సమావేశాలు కార్యక్రమాలు నిర్వహించి కళావైభవానికి కృషి చేయాలి.
- సాంకేతికంగా వస్తున్నటువంటి వివిధ పరికరాలను ఆధునిక పరిజ్ఞానాన్ని మేళవించుకుంటూ తగిన విధంగా ఈ కళారూపాలకు అన్వయించుకుంటూ సద్వినియోగపరచుకోవడం.

- సినిమాలు దూరదర్శన్ అంతర్జాలం మొదలైన వాటిలో జానపద సంబంధమైన కార్యక్రమాలను ప్రవేశపెట్టి కళాకారులకు తగిన విధంగా అవకాశాలు కల్పించడం.
- ప్రాచీన కాలంలో ఒక వెలుగు వెలిగినటువంటి జానపద కళారూపాలు నేడు అంతరించే స్థితిలో ఉన్నాయి. దానికి కారణాలను వెతికి తగిన విధంగా ప్రభుత్వం స్పందించి పరిష్కార మార్గాలను అన్వేషించడం.
- కళాకారులకు తగిన గుర్తింపు కార్డులు ఇవ్వాలి. ప్రత్యేకమైనటువంటి ఆరోగ్య వసతులు హెల్త్ కార్డులను భీమా వసతిని ప్రత్యేక పెన్సన్ సదుపాయాలను ఏర్పాటు చేయాలి.
- ప్రముఖ కళాకారుల వివరాలను సేకరించి సన్మాన సభలు ఏర్పాటు చేయాలి. కళాకారులకు తగినటువంటి ప్రాధాన్యతనిచ్చి గౌరవించి సన్మాన కార్యక్రమాలు చేపట్టాలి.
- ప్రభుత్వం ప్రకటించే కొత్త పథకాలను ప్రకటనలను, జాగృతి విషయాలను జానపద కళాకారుల ప్రదర్శనల ద్వారా వ్యాప్తికి తేవాలి. తద్వారా వారికి తగిన జీవనోపాధి కల్పించాలి.
- జానపద కళాకారులకు ఉచిత నివాస గృహాలు నిర్మించాలి. సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలి.
- ఈ కళాకారులను ప్రోత్సహించడానికి జానపద పరిశోధన విభాగాన్ని ఏర్పరిచి జానపద సాధనాలను సమకూర్చాలి. ఈ విభాగంలో తగినంత ప్రోత్సాహం కళాకారులకు ఇవ్వడం ద్వారా కళలు వికాసం చెందడానికి తగిన చర్యలు చేపట్టాలి.
- అంతరించిపోతున్న కళలను రక్షించేందుకు తగినటువంటి ప్రణాళికలను తయారుచేసి వాటి అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలి.
- ఈ కళలలో నైపుణ్యం సాధించినటువంటి కళాకారులందరికి శిక్షణా శిబిరాలను మంజూరు చేయాలి.
- సాంకేతికమైన విజ్ఞానాన్ని సాధనాలను ఈ కళారూపాయలకు అన్వయింపజేస్తూ నూతనత్వాన్ని తీసుకురావాలి.
- ఈ కళారూపాలు సంబంధించిన కళాకారులకు వివిధ సినిమాల్లోనూ పత్రికారంగాలలోనూ వివిధ రకాల మాధ్యమాల్లోనూ అవకాశాలు కల్పించి, కళారూప వైభవాన్ని తీసుకురావాలి.
- జానపద కళారూపాలకు సంబంధించినంత వరకు ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి అందులో సభ్యులకు తగిన ప్రాధాన్యతనిచ్చి కళాకారులను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

## 5.9. సింహావలోకనం:

పురాతన కాలం నుంచి జానపద కళలెన్నో ప్రజలను సంతోషాన్ని విజ్ఞానాన్ని కల్పించాయి. ప్రజలు కళారూపాలను తరతరాల నుంచి వీక్షిస్తూ రాత్రి తెల్లవారల్లో కూర్చుని పౌరాణిక సంబంధమైన సాంఘిక సంఘటన సంబంధించిన అంశాలపై సరైనటువంటి పాత్రలను వాటి విశిష్టతను గ్రహించారు. ఆనాటి

కాలంలో ఎందరో మహానుభావులు ఈ జానపద సంబంధమైన కథలను నాటకాలను నిర్మాణం చేపట్టి వాటికి తగిన పాత్రలను నిర్మించారు. ఎంతోమంది ఈ కళా రంగంలో ఎనలేని కవిత్వాలను, గేయాలను రచించారు. కొందరు జానపద కళల ప్రదర్శనకు తమ జీవితాలను అంకితం చేశారు. జాతి సంస్కృతిక మూలాలు జానపద కళల్లో నిక్షిప్తమై ఉన్నాయి. ఆ కళలనే ఆదరించడం ద్వారా మాత్రమే కళాకారుల బ్రతుకుదారిని మెరుగుపరచగలం. వారసత్వ సంపదగా వస్తున్న జానపద కళానైపుణ్యాలను కాపాడుకోవడం ద్వారా జాతీయ సాంస్కృతిక చరిత్రని నిర్మించుకోగలం. తద్వారా జానపదుల అనుభూతుల్ని నిలుపుకొని తర్వాతి తరాలకు అందించవచ్చు.

ఉత్తరాంధ్రలో ఒక నాడు జానపద కళారూపాలు తెలుగు జాతినంతా ఉర్రూతలూగించాయి. విజ్ఞానాన్ని అందిచాయి. కథ, నాటకం పాత్రలు సన్నివేశాలు ఎంతో వైభవంగా ఆసక్తి కలిగించే సంఘటనలు ప్రజలను రక్తికట్టించేవి. కాలక్రమంలో రాజ్యాలు పోయాయి. రాజులు లేరు. పరిపాలకుల భాష, సంస్కృతి కూడా విస్తరించింది. ఆ విధంగా రాజులు పోయినా, రాజ్యాలు మారినా, జానపద కళలు మాత్రం ప్రజా హృదయాల్లో అలాగే నిలిచి ఉన్నాయి. ప్రజలకు ఎంత కష్టనష్టాలు వచ్చినా వారు వాటిని పోషించారు. కళలను కళాకారులను కన్నబిడ్డలుగా చూసుకున్నారు. తెలుగు జాతి గర్వింపదగిన కళారూపాలుగా వికాసం చెందాయి. ఆ విధంగా చారిత్రిక నేపథ్యం కలిగి ప్రజలకు తరతరాలుగా మానసిక ఆనందాన్ని, విజ్ఞానాన్ని అందించాయి. సమాజానికి హితబోధ చేసాయి. జాతి, కుల, మత భేదాలు లేని సమాజ అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడ్డాయి. సమాజంలో నైతిక విలువలు, భక్తి భావాన్ని పెంపొందించాయి. రామాయణ మహాభారత పురాణాలలో ఉన్నటువంటి మహానుభావుల పాత్రలు వారి విశిష్టతలు వారి పరాక్రమాలు ధైర్య సాహసాలు ఎన్నో మూర్తిమత్వ వికాసానికి మార్గదర్శకత్వము చూపాయి.

ఆధునిక కాలంలో ఈ కళారూపాలు వైభవాన్ని కోల్పోతున్నాయి. సరైనటువంటి ఆదరణ లేకపోవడం వీటిపై ఆధారపడిన కళాకారులకు ఎప్పుడు ప్రదర్శన ఉంటుందో ఎక్కడ ఉంటుందో ఏ సమయానికి ఉంటుందో తెలియదు. ఎప్పుడు ఉపాధి దొరుకుతుందో తెలియక కొందరి కళాకారుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. నేడు జానపద కళారూపాలను పోషించేవారు తగ్గిపోయారు. కళాకారులు కడుపుకోసం ఆ కళనే పట్టుకొని దేశ సంచారులుగా తిరుగుతున్నారు. కళాప్రదర్శనలు చేస్తూ కొంతమంది చాలిచలని ఆదాయాలతో కడుపునింపుకుంటూ జీవిస్తున్నారు. కొన్ని కళలను నేటికినీ విశేషంగా ఆదరిస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఎందరో నిష్ణాతులైన కళాకారులు కీర్తిశేషులు అయినారు. ఎన్నో కళారూపాలు కాలగర్భంలో కలిసిపోయి వాటి స్వరూపస్వభావాలు శిదిలమయిపోయాయి. మరికొన్ని ప్రజల ఆదరణ, పరిపాలకుల ఆదరణ కోల్పోయి శిథిలావస్థలో ఉన్నాయి. ఈనాడు ఎన్నో సమష్టి బృందాల ప్రదర్శనలు నాశనమై, వ్యక్తిగత పాత్రలుగా, చిల్లర వేషాలుగా మిగిలిపోతున్నాయి. పౌరాణిక పాత్రలకు

తగినటువంటి ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నారు. అధిక వ్యయంతో కూడినటువంటి ఈ కళాకారుల సాధనాలు తయారు చేసేవారు లేక అంతరించిపోతున్నాయి. ఆ విధంగా కొందరు కళాకారులు ఈనాడు రైళ్ళలో, గ్రామాల్లోను, బస్టాండులోను, కూడలి ప్రదేశాల్లోను భిక్షమెత్తుకుంటూ జీవిస్తున్నారు. పది రూపాల కోసం పట్టెడన్నం కోసం అలమటిస్తూ జీవిస్తున్న కళాకారులు ఎందరో ఉన్నారు. వారికి సరైనటువంటి ఆదరణ గాని కనీసమైన అవసరాలుగాని పొందలేకపోతున్నారు. కాలంలో వచ్చిన మార్పుల వల్ల ఎన్నో కళారూపాలు ఇప్పటికే కనుమరుగుతూ వస్తున్నాయి. సరైనటువంటి ఉపాధి అవకాశాలు దొరకక ఈ కళారూపాలపై ఆధారపడిన వ్యక్తుల పరిస్థితులు దయనీయంగా మారాయి.

ఇటువంటి కళాకారుల కళా ప్రదర్శనకు సంబంధించిన సమాచారం సేకరించడం ద్వారా కళా స్వరూప స్వభావాలను వేషధారణ నృత్య భంగిమలను మరియు  సంఘటనలకు సంబంధించిన ఇతివృత్తాలను పాత్రలలోని వైవిధ్యాన్ని గ్రహించవచ్చు. అదేవిధంగా అంతరించిపోతున్న కళారూపాలను వెలుగులోకి తీసుకురావడానికి భవిష్యత్ తరాల వారికి అందించడానికి వీలుంటుంది. అంతరించిపోతున్న కళాకారుల సాధనాలు పునర్నిర్మాణం చేపట్టడానికి తగిన సహాయ సహకారాలు ప్రభుత్వాలు అందించడం ద్వారా పూర్వకళా వైభవాన్ని భవిష్యత్ తరాల వారికి అందించి జానపద విజ్ఞానాభివృద్ధికి సహాయపడవచ్చు.

# ముగింపు

# ముగింపు

జానపద కళారూపాలు ప్రాచీన చారిత్రక సంస్కృతి సంప్రదాయాలను జానపదుల జీవితాలను ప్రేరేపించే ప్రతిబింబించే విధంగా కళా ప్రదర్శన ఎంతో విశిష్టత కలిగి ఉంటుంది. ఈ కళా ప్రదర్శన ద్వారా కళాకారులు తాము నేర్చుకున్నటువంటి కళా ప్రదర్శన అద్భుతంగా ప్రేక్షకుల ముందు వ్యక్తపరుస్తారు. జానపదులకు ఎంతో విజ్ఞానాన్ని సంతోషాన్ని ఆహ్లాదాన్ని కలిగించడమే కాకుండా మానసికోల్లాసాన్ని కలిగించడం ద్వారా ఆనాడు ఈ కళారూపాలు ఎక్కువ ప్రాధాన్యత కలిగి ఉండేవి. పురాతన కాలంలో జానపద కళాకారులు తమకు నచ్చిన జానపద నృత్యాలను చేయడం ద్వారా ప్రజలను రంజింపజేసి వారి మనసులను గెలుచుకుని తమ జీవనాన్ని కొనసాగించేవారు. ఇది ఒక రకంగా వినోదభరితమైనటువంటిదిగా అశేష ప్రజానీకం వీటిని కనులారా వీక్షించేందుకు వచ్చేవారు. ముఖ్యంగా పౌరాణిక సంబంధించిన నాటకాలను కథలను ప్రత్యక్షంగా జానపదుల ముంగిట ప్రదర్శించడం ద్వారా ఈ కళారూపాలు ఎంతో శక్తివంతమైన ప్రభావాన్ని చూపుతాయి. మానవుడు తనలో తానే సృష్టించుకున్న సాహిత్యం జానపద సాహిత్యం అయితే తను ఆవిష్కరించుకున్న కళా ప్రదర్శనే జానపద కళారూపం ఈ జానపద కళలు ఒక దేశ సంస్కృతి జీవనంలో ఆహ్లాదకరమైన పరిమళాలను వెదజల్లే సహజమైన కళా ప్రదర్శనకు ప్రతిబింబం ఈ జానపద కళలు. ఈ జానపద కళారూపాలు ఒకరి నుంచి ఒకరికి వంశపారపర్యంగా అభ్యసిస్తూ కళా ప్రదర్శన నైపుణ్యాలను అభ్యసించడం ద్వారా కళాకారులు తమ జీవితాలను సుఖమయం చేసుకుంటున్నారు.

జానపద కళారూపాలు ఎన్నో ఉత్తరాంధ్రలో ఉన్నాయి. జానపద సంస్కృతిలో భాగంగా ఈ కళారూపాలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లే క్రమంలో కొంత మార్పు లోనవుతాయి. నవ్యతను కలిగి ఉంటాయి. ఉత్తరాంధ్రలో విశిష్టమైనటువంటి కళాప్రదర్శన చేసే కళాకారులు ఈ ప్రాంత ఔన్నత్యాన్ని సంస్కృతి సంప్రదాయం గిరిజన సంస్కృతిని తెలియజేస్తారు. భిన్నమైనటువంటి వాతావరణం కాలాలలో జానపదలు కాలానికి తగిన పండగలను ఉత్సవాలను జరుపుకునేటప్పుడు ఈ కళా ప్రదర్శన ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఉత్తరాంధ్ర సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడంలో జానపదులది అందవేసిన చేయి. కాలంలో వస్తున్నటువంటి మార్పులు ప్రజా కళారూపాలు నామరూపాలు లేకుండా ఆధునిక సాంకేతిక అవసరాలు ప్రజలను ప్రతిబింబిస్తున్నాయి. టీవీ, వీడియో, కంప్యూటర్, సినిమా, సెల్ఫోన్ మొదలైన ఆధునిక సాధనాలు ఎన్నో ఈ ప్రజాకళారూపాల పట్ల విపరీతమైనటువంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ కళారూపాలను పరిరక్షించే ప్రభుత్వం ఏమాత్రం ఆర్థిక వెసులుబాటును కల్పించలేకపోన్నాయి. స్వచ్ఛంద సంస్థలు సైతం ఈ కళారూపాల పరిరక్షణలో తమదైన పాత్రను పోషించలేకపోతున్నాయి. కేవలం పండగలు గ్రామ దేవత ఉత్సవాలు కాలంలో మాత్రమే ప్రదర్శనకు

నోచుకోవడం బాధాకరమైన విషయం. ప్రజల అవసరాలు వినోదాలు అభిరుచులు మారుతున్న కాలంలో ఈ కళారూపాల మనుగడ అగమ్యగోచరంగా మారింది. ఉత్తరాంధ్ర జానపద కళారూపాలలో ఎన్నో వృత్తి సంబంధించినవి దైవ సంబంధమైన కులాల సంబంధమైనది ఉన్నాయి. ఇవి కళా ప్రదర్శన చేసే సందర్భంలో ఆయా కులాలకు సంబంధించిన మతానికి సంబంధించిన వృత్తికి సంబంధించిన అంశాలను వాటిలో ఉన్న ప్రాధాన్యాన్ని వైశిష్ట్యాన్ని వ్యక్తపరుస్తాయి. తద్వారా జానపద విజ్ఞానాన్ని పెంపొందించే ఈ కళారూపాలు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంస్కృతిక జీవనాన్ని ముందు తరాలకు అందిస్తాయి. ఇంతటి ప్రాధాన్యం కలిగినటువంటివి కళారూపాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది.

ఈనాడు కొన్ని వాద్యాలు అడుగంటిపోయాయి. తయారు చేసే వారు లేక వాటిని ఉపయోగించేవారు లేక పోవటం వల్ల అడుగంటాయి. కొన్ని కాలానుగుణంగా మార్పులు చేసుకొని కనిపిస్తున్నాయి. సంప్రదాయ బద్దంగా వాడేవారు కూడా లేరు. అన్ని కులాలవారు జానపద వాద్యాల్ని ఉపయోగిస్తున్నారు. బొమ్మలాటలు, తోలుబొమ్మలాటలు, కొయ్యబొమ్మ లాటలు, ఊచ బొమ్మలాటలు, తాడు బొమ్మలాటలు, చెక్కబొమ్మ లాటలు, గుడ్డబొమ్మలాటలు, ముసుగు బొమ్మలాటలు, తొడుగు బొమ్మలాటలుగా కన్పిస్తున్న వాటిలో కొన్ని మతప్రబోధాల ప్రచారాలకు మొదలు పెట్టి భారత, భాగవత, రామాయణ, ఇతర అద్భుత కథలు, అష్టాదశపురాణాలు, సాంఘిక కథలు, పంచతంత్ర కథలు చివరకు ప్రభుత్వ అభివృద్ధిపథకాల, ప్రణాళికల ప్రచారాలకు వాహికలుగా వాడబడుతున్నాయి. కొన్ని కులపురాణాలు మతాల మూలలుగా ప్రచార వాహికలుగా పుట్టి అట్లాగే నడుస్తున్నాయి. ఈ కళారూపాలను ప్రదర్శించే కళాకారులను ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహకాలు ఆర్థిక వెసులుబాటును కలిగించడం అవసరం. తద్వారా ఈ జానపద కళారూపాల సంస్కృతిని, సాహిత్యాన్ని, విజ్ఞానం అన్ని రాబోయే తరాల అందించడం సులభమవుతుంది.

ఉత్తరాంధ్రలో కనుమరుగవుతూ ఆదరణ లేక అడుగంటిపోతున్న కళారూపాలు గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ని ఉన్నాయో తెలియదు. బ్రతుకుదెరువు భారమైనా కళ మీద అభిమానంతో కళాకారులు కళను తరతరాలకు అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఇంతటి మహోన్నతమైన కళలు సాహిత్యం సంస్కృతి కాపాడవలసిన బాధ్యత మనది. దీనిని కొనసాగింపుగా కొత్తగా వారసులను తయారు చేయవలసిన అవసరం ప్రస్తుత మన సమాజానిది. సినిమా, టి.వి, సెల్ఫోన్ల ప్రభావానికి గురై అంతరించిపోతున్న కళలను సాహిత్యాన్ని ప్రస్తుత తరానికి పరిచయం చేయాలి. తద్వారా కళారూపాల పరిరక్షణకు పూనుకోవాలి.

# ఉపయుక్త గ్రంథ సూచిక

# ఉపయుక్త గ్రంథ సూచిక


1. ఆచార్య సి.హెచ్. ***ఉత్తరాంధ్ర స్వాతంత్రోద్యమ చరిత్ర***. హైదరాబాద్: స్వాతంత్రోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ. 2005.
2. కూర్మారావు, బద్రి. ***కళింగాంధ్ర జానపద గేయాలు.*** విజయనగరం: ప్రింట్ పాయింట్ మల్టీ కలర్ ఆఫ్సెట్ ప్రింటర్స్ విజయనగరం. 2015.
3. కూర్మారావు, బద్రి. ***కళింగాంధ్ర జానపద కళారూపాలు - మౌఖిక సాహిత్యం.*** హైదరాబాద్: (నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రత్యేక సంచిక ) వ్యాసం. 2012.
4. కూర్మారావు, బద్రి. ***ఉత్తరాంధ్ర జానపద కళలు.*** విజయనగరం: ప్రింట్ పాయింట్ మల్టీ కలర్ ఆఫ్సెట్ ప్రింటర్స్ విజయనగరం. 2005.
5. కృష్ణకుమారి, నాయిని. ***తెలుగు జానపదవిజ్ఞానం-సమాజం, సంస్కృతి - సాహిత్యం*** హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. 2000.
6. కృష్ణకుమారి, నాయిని. ***జానపద గేయ గాథలు.*** హైదరాబాద్: తెలుగు అకాడమీ.1990.
7. కృష్ణారెడ్డి చిగిచెర్ల. ***జానపద నృత్య కళ***. అనంతపురం : జానపద యువ కళాకారుల సంఘం.1989.
8. జయప్రకాష్, ఎస్. ***పరిశోధన విధానం.*** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.2003.
9. దోణప్ప, తూమాటి. ***జానపద కళాసంపద.*** విశాఖపట్నం: ఆంధ్ర విశ్వకళాపరిషత్.1987.
10. నరసింహులు, గుత్తి. ***శ్రీకాకుళ మండలం రామాయణ జానపద గేయ సమాలోచనం*** రాజాం: సాయి - చిన్ని పబ్లికేషన్స్ రాజాం. 1994.
11. నాగయ్య, జి. ***దక్షిణ్య జానపద దృశ్య కళారూపాలు.*** తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు. 1991.
12. నిత్యానందరావు, వెల్దండ. ***విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధనలు.*** హైదరాబాద్: శ్రీమతి. వి. గీతారాణి పబ్లికేషన్స్. 2013.
13. ప్రసాదరావు, పి. వి. కె. ***ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర.*** హైదరాబాద్: ఎమెస్కో బుక్స్ హైదరాబాద్.1999.
14. భాస్కరరావు, గొడవర్తి. ***మనప్రాచీన కళలు పుట్టుపూర్వోత్తరాలు.*** విజయవాడ: ఆదర్శ ప్రచురణ విజయవాడ. 1960.
15. మాలతి, జి. ఎన్. ***జానపద కథలు - మూలాంశాలు.*** కుప్పం: సెంటర్ ఫర్ పబ్లికేషన్స్ & ఎక్స్టెన్షన్ సర్వీసెస్. ద్రావిడ విశ్వవిద్యాలం. 2016.
16. ముత్యం. కె. ***శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం***. హైదరాబాద్: దృష్టి ప్రచురణ. 1993.

17. మోహన్ జి.ఎస్. ***జానపద విజ్ఞాన అధ్యయనం.*** కుప్పం: ప్రసారాంగ, ద్రావిడ విశ్వవిద్యాలయం. 2010.
18. మోహన్ బాబు, జి. ***కోస్తా ఆంధ్ర జానపద కళారూపాలు.*** హైదరాబాద్: ( నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రత్యేక సంచిక ) వ్యాసం. 2012.
19. రఘుమా రెడ్డి యెల్దండ. ***పల్లె పదాలలో ప్రజాజీవనం***. మహబూబ్ నగర్: గురుకుల విద్యాపీఠ ప్రచురణలు. 1979.
20. రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని.. ***తెలుగు వారి జానపద కళారూపాలు.*** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. 1992.
21. రామరాజు. బి. & కృష్ణకుమారి. నాయిని (సం.పా) ***జానపద గేయాలు- సాంఘిక చరిత్ర.*** హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి. 1974.
22. రామరాజు, బిరుదురాజు. ***జానపద గేయ సాహిత్యం.*** హైదరాబాద్: జానపద విజ్ఞాన ప్రచురణలు. 1990.
23. రామరాజు బిరుదురాజు, (అనువాదం) కృష్ణకుమారి. నాయిని. ***ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్యము సంస్కృతి.*** నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా న్యూఢిల్లీ. 2001.
24. వసుంధర రెడ్డి, చింతపల్లి. ***తెలుగు జానపద సాహిత్యం***. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్. 2015.
25. వెంకటస్వామి, బి. ***ధింసా నృత్యం - సమగ్ర విశ్లేషణ***. ఇంటర్నేషనల్ జర్నల్ అఫ్ అకాడమిక్ రీసెర్చ్. IISN 2348-7666 VOL3 ISSUE 7(1). 2016.
26. వెంకటేశం ఎన్.ఆర్. ***బుడిగె జంగాలు***. హైదరాబాద్: దివ్య దీప్తి ప్రచురణలు.1995.
27. వెంకటేశ్వర్లు, బిట్టు. ***కోస్తా, ఆంధ్ర జిల్లాలలో జానపద కళారూపాలు.*** హైదరాబాద్:*( పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రత్యేక సంచిక )* వ్యాసం. 2001.
28. వేణుగోపాల్, డి. ***నాట్య శాస్త్ర దర్పణం***. చెన్నై: హిందీ ప్రచార్ ప్రెస్. టి నగర్ చెన్నై . 2002.
29. శారద.సి & సుందరి వి.బి.టి. ***కళింగాంధ్ర చరిత్ర - సంస్కృతి***. విశాఖపట్నం: సత్యం అఫ్సెట్ ఇంప్రింట్స్. 2018.
30. సుందరం, ఆర్.వి.యస్. ***ఆంధ్రుల జానపద విజ్ఞానం.*** హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. 1992.
31. సుబ్బారావు, తంగిరాల. ***జానపద సాహిత్యం - వీరగాథలు.*** హైదరాబాద్: నాట్యకళ ప్రెస్ హైదరాబాద్. 1975.
32. హనుమంతరావు, ముప్పాళ్ళ. ***నవ్య ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర సంస్కృతి.*** హైదరాబాద్: కౌటిల్య పబ్లికేషన్స్ హైదరాబాద్. 2016.

# అనుబంధం

# అనుబంధం

## ఉత్తరాంధ్ర తప్పెటగుళ్ళు కళాకారుడు పేకేటి అప్పారావు గారితో ముఖాముఖి

**1. ఉత్తరాంధ్రలో ఇంతటి ప్రాచుర్యం కలిగినటువంటి తప్పెటగుళ్ళు కళారూపం ఎందుకు అంతరించే స్థితిలోకి వెళ్తున్నది?.**

**జ.** కళ అనేది ఎప్పుడు కూడా కొన్ని పరిస్థితులకు లోనవుతూ ఉండటం అనేది సహజం. ఈ తప్పెటగుళ్ళు అనేది ప్రదర్శనకు సంబంధించినంత వరకు ప్రజల ఆసక్తి తగ్గిపోవడం అదేవిధంగా తప్పెటగుళ్ళేకదా అని నీరసంగా చూడడం ఇలాగా ప్రదర్శన చేసేటప్పుడు గుండెపై పెట్టుకుని దరువు వాయించడం వల్ల ఏమొస్తుంది అనేటటువంటి చిన్న చూపు చూడడం ఈ కళారూపంపై ఎంతగానో ప్రభావం చూపుతుంది. ఆధునిక మాధ్యమాలు విస్తృతంగా రావడం వల్ల ఏదో ఒక స్థలంలో ప్రోగ్రాం నడిపిస్తున్నప్పుడు ఏముందిలే గుండెపై పెట్టుకుని డప్పును మోగించడమే కదా అనేటటువంటి చిన్న చూపు ఈ కళారూపం పట్ల ఆదరణ కరువైపోతున్నది. కానీ ఈ కళారూపాన్ని మా తరతరాల నుంచి వారసత్వంగా వస్తున్నటువంటి సంపద కాబట్టి మేము ఏమిటంటే ఎప్పటికీ అంతరించిపోకుండా ఈ కళారూపాన్ని పై స్థాయి వరకు తీసుకెళ్లేందుకు అంతరించిపోకుండా ఉండేందుకు మేము సాయశక్తులా కృషి చేస్తాము.

**2. ప్రతి కళాప్రదర్శనలలో అమ్మాయిల పాత్ర అనేది తప్పనిసరిగా ఉంటుంది అయితే ఈ తప్పెటగుళ్ళు ప్రదర్శన అనేది అమ్మాయిలు ఎందుకు చేయరు?.**

**జ.** తప్పెటగుళ్ళు ప్రదర్శన అనేది ఎంతో సాహసంతో కూడినటువంటి విద్య కాబట్టి ఈ కష్టసాధ్యమైనటువంటి ఈ కళా ప్రదర్శన చేయడము అమ్మాయిలకు అంత సులువుగా ఉండదు. దానితో పాటుగా నూటికో కోటికో నేర్చుకున్నటువంటి అమ్మాయిలు కొంతమందే ఈ కళా ప్రదర్శన నేర్చుకోవడానికి ఇష్టపడతారు. అయినప్పటికీ కళాప్రదర్శన సమయంలో ఎక్కడైనా ప్రోగ్రాం నిర్వహించే సమయంలో తగిన విధంగా అందుబాటులో ఉండరు. కాబట్టి వారు ఈ కళా ప్రదర్శన చేయడానికి ఇష్టపడరు. అదేవిధంగా నేర్చుకున్న విద్యను ప్రదర్శించడానికి సరైన సమయాన్ని కేటాయించలేరు. అందువల్ల మేము ఈ కళా ప్రదర్శన నిర్వహణలో వారికి తగినటువంటి ప్రాధాన్యత అనేది మేము ఇవ్వలేము. కేవలం మగవారికి మాత్రమే ఈ ప్రదర్శన నేర్పించడం వల్ల గురువు మీద అభిమానంతో ఎప్పుడు ఏ సమయంలోనైనా వచ్చి కళా ప్రదర్శన ఉందని చెప్తే వాళ్లు తమకు పని ఉన్నప్పటికీ కూడా కళా ప్రదర్శన నిర్వహణలో గురువు చెప్పిన దానికి కట్టుబడి వెంటనే రావడానికి ఇష్టపడతారు. అందువల్ల కేవలం మగవారికి మాత్రమే ఈ కళారూప ప్రదర్శనలో శిక్షణ ఇవ్వడం వల్ల తగిన ప్రాధాన్యత మాకు ఇవ్వడం జరుగుతుంది. కాబట్టి ఈ కళా ప్రదర్శన మగవారికి మాత్రమే అనుకూలంగానూ ఉంటుంది. అదేవిధంగా భావితరాలకు ఈ కళా ప్రదర్శన అందించేందుకు కుర్రోళ్ళకు

శిక్షణ ఇవ్వడం ద్వారా మాత్రమే ఈ సాహసంతో కూడిన  కళా ప్రదర్శన చేయగలుగుతారు. ఈ కళారూపాన్ని పరిరక్షించగలుగుతారు.

**3. మీ తప్పెటగుళ్ళు కళాప్రదర్శన జట్టులో ఎంతమంది ఉంటారు. వాళ్లు ఏ వయసుకు చెందినవాళ్ళు ఉంటారు?.**

**జ.** మా తప్పెటగుళ్ళు కళాప్రదర్శన టీమ్ లో సుమారుగా గా 25 నుంచి 40 మంది ఉంటారు. వీళ్లలో 12-13 ఏళ్ల వయస్సుగల యువకుల నుంచి 50-55 ఏళ్ల వయసు ఉన్నటువంటి మధ్యవయస్కులు దాకా అందరూ ఈ కళా ప్రదర్శన నిర్వహిస్తారు. వారికి తగిన విధంగా  శిక్షణ మేము ఇచ్చి నేర్పిస్తాము. కళా ప్రదర్శనలో జట్టులో ఉన్నటువంటి వ్యక్తులందరూ కూడా ఒకే సమయానికి తగిన విధంగా పాట, నృత్యం, దరువు చేసే విధంగా తగిన శిక్షణ ముందుగానే ఇస్తాము. ఇది ఎంతో వైవిధ్యభరితమైన ఆశక్తిని కలిగించేటటువంటి విధంగా కళా ప్రదర్శన నిర్వహిస్తాము.  ఇందులో అందరి యొక్క టైమింగ్ ఒకే విధంగా ఉండాలి. అందరి యొక్క దరువు ఒకే టైంకి కొట్టాలి. అప్పుడే ఈ కళారూపం చూడడానికి ప్రజలకు ఆసక్తి కలుగుతుంది. చిన్న వయస్సు నుంచి పెద్ద వయసు వరకు ఉన్నా కళాకారులు చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఒకటే కుటుంబంగా ఈ కళా ప్రదర్శన నిర్వహిస్తాము.

**4. తప్పెటగుళ్ళు కేవలం ఉత్తరాంధ్రకు మాత్రమే పరిమితం. అయితే ఈ కళారూపాన్ని పండగలప్పుడు గ్రామ దేవత ఉత్సవాలలో నిర్వహిస్తారు. మిగతా సమయాల్లో ఏం చేస్తారు. మీకు మిగతా సమయంలో ఏమైనా ఉపాధి దొరుకుతుందా?.**

**జ.** తప్పెటగుళ్ళు ప్రదర్శన అనేది మా ఈ ఉత్తరాంధ్రకు మాత్రమే సొంతం. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం జిల్లాలలో ఎక్కువగా ఈ కళా ప్రదర్శన ఉంటుంది. అయితే ముఖ్యంగా గ్రామదేవతల ఉత్సవాలు దేవీ నవరాత్రులు గణపతి పండుగలు మరియు ఇతర పండుగలో మాత్రమే ఎక్కువగా ఈ ప్రదర్శన అనేది ఉంటుంది. మిగతా సమయంలో వ్యవసాయం కూలినాలి చేసుకుంటుంటాము. ఎవరి పని వాళ్లు చేసుకుంటాము. మాకంటూ కొత్తగా ఏమీ గుర్తింపు అనేది లేదు. ఉత్తరాంధ్రలో కళా ప్రదర్శన నిర్వహించే కళాకారులు ఎంతోమంది ఉన్నప్పటికీ కూడా తగినటువంటి ఆదరణ ప్రభుత్వం నుంచి ఏమాత్రమూ లేదు. ఎన్నోసార్లు రాజకీయ నాయకుల్ని అధికారుల్ని కలిసి మా ఈ కళారూపాన్ని పరిరక్షించాలి మమ్మల్ని ఆదుకోవాలని ఎన్నిసార్లు అభ్యర్థించినప్పటికీ సరైనటువంటి ప్రతిస్పందన గాని సహాయ సహకారాలు గాని అందడం లేదు. కేవలం 60 సంవత్సరాలు వయసు ఉన్న వృద్ధులకు మాత్రమే పెన్షన్ ఇవ్వడం ఈ కళా ప్రదర్శనకు సంబంధించిన కళాకారులని ఆర్థికంగా సహాయం చేయడం ప్రభుత్వం ఎప్పుడు పట్టించుకోలేదు. పండుగలు ఉత్సవాలలో మాత్రమే ఈ ప్రదర్శన ఎక్కువగా ఉంటుంది మిగతా సమయాల్లో మేము మా సొంత పని గాని కూలి పని గాని కష్టపడడం చేస్తాము.

**5. ఇప్పుడు ఈ తరంలో కొత్తగా తప్పెటగుళ్ళు నేర్చుకుందామని సరదాగా వచ్చిన వారు ఎవరైనా ఉన్నారా?.**

**జ.** ఉన్నారు. ఆధునికంగా కొందరు యువకులు ఈ తప్పెటగుళ్ళు ప్రదర్శనను చూసి ఆసక్తితో తాము కూడా ఈ కళా ప్రదర్శన నేర్చుకోవాలి ప్రదర్శించాలి అనే ఉత్సాహం కొంతమంది యువకుల్లో ఉంది. అలాంటప్పుడు మేము వారికి తగిన శిక్షణను ఇచ్చి నేర్పిస్తాము. తప్పెటగుళ్ళు కళాప్రదర్శన అప్పటి కాలంలో చాలా మంది వచ్చి శిక్షణ పొందేవారు కానీ కొంత కాలంగా ఈ కళారూపాన్ని ప్రదర్శన ఆదరణ లేకుండా పోయింది. కరోనా సమయంలో ఎన్నో కష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. మళ్లీ ఇప్పుడిప్పుడే 15 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసు ఉన్న యువకులు ఈ కళా ప్రదర్శన నేర్చుకోవడానికి ఉత్సాహాన్ని చూపిస్తున్నారు.

**6. తప్పెటగుళ్ళు కళా ప్రదర్శన చేసేటప్పుడు మీరు ఏ కథలు చెప్తుంటారు?.**

**జ.** తప్పెటగుళ్ళు ప్రదర్శన చేసేటప్పుడు ఎన్నో రకాల కథలు పాటలు పడతాము. అందులో సారంగదరియా కథ, రామాయణం యుద్ధకాండ, లక్ష్మణ మూర్ఛ, అరణ్యకాండ, శశిరేఖ పరిణయము, సాంబవుడి పెళ్ళి, రెక్కల రంభ కథ, కురుక్షేత్ర యుద్ధం, అలియా దేవి కథ, రేణుక ఎల్లమ్మ పుట్టుక కథ, పాడతాము. ఇంకా చాలా కథలు ఉన్నాయి. పండుగలు ఉత్సవాలు సందర్భాలలో శ్రీకృష్ణుని యొక్క కథలు పాటలు పాడుతాము. అదేవిధంగా గ్రామ దేవత ఉత్సవాల్లో గ్రామ దేవత సంబంధించిన పాటలు పాడుతాము. ఈ విధంగా వివిధ రకాలైనటువంటి పాటలు పాడుతూ సందర్భానుసారంగా తగిన విధంగా నృత్యాలను చేస్తూ ప్రజలను సంతోషపెట్టేందుకు మొగ్గలు (తలక్రిందులుగా పల్టీలు) వేయడం వివిధ రకాల సాహసమైన విన్యాసాలను చేయడం చేస్తాము.

**7. తప్పెటగుళ్ళు ప్రదర్శనలో ఎందుకు అంత ప్రాధాన్యతతో సాహసకృత్యాలు చేస్తారు?.**

**జ.** సాధారణంగా తప్పెటగుళ్ళు ప్రదర్శన లో వివిధ రకాల సాహస కృత్యాలను భంగిమలను చేయడానికి ప్రధాన కారణం ప్రజలను ఆకర్షింపజేయడానికి జనాలను ఆకట్టుకోవడానికి ప్రజలు మెప్పు పొందడానికి తగినటువంటి పోటీతో కూడినటువంటి నృత్యాలను తగిన దరువు శబ్దాలతో ఉధృతంగా చేస్తాము. వివిధ రకాలైనటువంటి సర్కస్ ఫీట్లను చేస్తాము. దీన్ని చూసి ప్రజలు సంతోషించి ఆనందిస్తారు. దరువుకు తగినటువంటి నాట్య ప్రదర్శన పాటలు పాడడం ఆట, పాట ఉదృత స్థాయికి పెరిగినప్పుడు గట్టిగా తప్పెటను కొడుతూ ఒక లయబద్దంగా అడుగులు వేస్తూ మువ్వల గజ్జల శబ్దాలు వినసొంపుగాను ఉంటుంది. కళా ప్రదర్శన చేసే యువకులకు ముందుగానే తగిన శిక్షణ ఇస్తూ ప్రజలను ఆకట్టుకునే విధంగా తగిన విన్యాసాలను చేయడానికి శిక్షణ ఇస్తాము. ఇది కొంచెం కష్టమైనటువంటి విన్యాసంతో కూడినది. కుర్రోళ్ళు ఈ సాహస కృత్యం చేయడానికి ముందుకు వస్తారు. కాబట్టి వారికి ఈ శిక్షణలో తగిన సూచనలను సలహాలను ఇస్తూ అడుగుల నృత్యాలను తప్పెట దెబ్బలకు అనుగుణంగా ప్రదర్శనలు నేర్పిస్తాము.

**8. ఈ తప్పెటగుళ్ళు అనే రేకు డబ్బాలను ఉపయోగిస్తున్నారు కదా..!. అయితే మొదటి నుండి వీటిని ఉపయోగిస్తున్నారా లేదా వీటి నిర్మాణంలో గాని తయారు చేయడంలో గాని కొత్తగా ఏమైనా మార్పులకు లోనయిందా?.**

**జ.** నాకు తెలిసినంతవరకు పురాతన కాలంలో ఈ రేకు తప్పెటగుళ్ళుకు ముందు మట్టితో తయారు చేసిన కుండ తప్పెటగుళ్ళు ఉపయోగించేవారు అంటే మట్టిగుళ్ళు తయారుచేసి వాటిపై దరువులు వాయించేవారు. కాలక్రమేనా వచ్చిన మార్పులకు అనుగుణంగా మట్టి తప్పెటగుళ్ళు స్థానంలో రేకుతో తయారుచేసిన తప్పెటగుళ్ళు వాడుతున్నాము. ఇది ఎంతో సౌకర్యవంతంగానో తేలికగా ఉంటుంది. ఎక్కువ శబ్దాన్ని ఇచ్చే విధంగా ఉంటుంది. దీనిపై దరువుని మోగించడం వల్ల ఎక్కువ దూరం వరకు శబ్దాన్ని లయబద్ధంగా గజ్జల శబ్దాలతో వినసొంపుగా ఉంటుంది. పాతకాలంలో మట్టితో తయారుచేసిన తప్పెటగుళ్ళు ప్రదర్శన సమయంలో బుడ్డీలను తయారు చేసుకొని ఆ బుడ్డీల వెలుగులో అక్కడక్కడ వీధులలోను నాలుగు రోడ్ల కూడలిలోను ప్రదర్శించేవారు. ఈ రకంగా కాలంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా కళారూప సంబంధిత పరికరాలు తప్పెటగుళ్ళు మార్పు చెందుతూ వచ్చాయి. మేము వీటిని కాపాడుకుంటూ భావితరాలకు ఈ ప్రదర్శన అందించాలని ఎల్లప్పుడూ ప్రయత్నిస్తున్నాము.

**9. తప్పెటగుళ్ళు కళా ప్రదర్శన ఎవరు చేస్తారు?.**

**జ.** ఈ తప్పెటగుళ్ళు కళా ప్రదర్శనను ఉత్తరాంధ్రకు చెందినటువంటి యాదవులు ఈ కళా ప్రదర్శన నిర్వహిస్తారు. అయితే ఇతర కులస్తులు కూడా ఈ కళను నేర్చుకోవాలనే ఆసక్తి కూడా ఉంటుంది. కాబట్టి వారు కూడా ఈ ప్రదర్శన విద్యను నేర్చుకుంటారు. వారిలో సాకలోళ్ళు ఇతర కులస్తులు కూడా ఉన్నారు. అయితే ముఖ్యంగా జానపద కళా ప్రదర్శనలు ప్రత్యేక సమయాలలో అంటే గ్రామ దేవతల ఉత్సవాలలోను గణపతి ఉత్సవాలలోను ప్రత్యేకంగా యాదవులు మాత్రమే ఈ కళా ప్రదర్శన చేస్తుంటారు. అయితే మిగతా కులస్తులు ఈ విద్యను నేర్చుకున్నప్పటికీ బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శన చేయడానికి అంతగా ఇష్టపడరు. ఇది కేవలం ఉత్తరాంధ్ర యాదవులకు సంబంధించిన కళారూపం. యాదవులు మాత్రమే ఈ తప్పెటగుళ్ళ కళారూపాన్ని తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్నారు. మేము ముఖ్యంగా పగటి వేళలో మేకలను గొర్రెలను మేపడానికి అడవికి కొండల మీదకు గుట్టల మీదకు తీసుకుపోయి సాయంత్రం వేళల్లో ఈ గొర్రెలను మేకలను సాలలలో కాపలా కాస్తూ ఉంటాము. తీరిక సమయాల్లో కొంతమంది కుర్రోళ్ళు కలిసి తప్పెటగుళ్ళు ప్రదర్శన చేపడుతాము. ఇది మాకు ఎంతో ఆనందాన్ని ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఈ విధంగా మా ఆనందాలను ఆటలలోనూ పాటల్లోనూ దరువులోను నృత్యాలలోను కలగలిసినటువంటి తప్పెటగుళ్ళు కళారూపం అంతరించిపోకుండా కాపాడుకుంటూ వస్తున్నాము.

**10. తప్పెటగుళ్ళు ప్రదర్శనకు మూలం ఎవరు?. ఈ ప్రదర్శన ఎప్పుడు పుట్టింది?.**

**జ.** ఇది ఎప్పుడు పుట్టింది అంటే మా గురువులు చెప్పిన దాని ప్రకారం ఈ తప్పెటగుళ్ళు కళా ప్రదర్శనకు మూలము శివుడు. కైలాసంలో శివుడు శివతాండవం నృత్యం చేస్తుండగా నాట్యంలో కాళ్లకు కట్టిన గజ్జి ఆ అంజి జారి త– ది– తోం– మ్, అని నాలుగు అక్షరాలు పలికిందట. ఆ నాలుగు అక్షరాలతోనే అక్కడ ఉండే కవులు దాన్ని చూసి భరతశాస్త్రం అని రాయబడ్డారట. భ వల్ల పుట్టిన భావం, ర వల్ల పుట్టిన రాగం, త వల్ల పుట్టిన తాళం, ము వల్ల పుట్టిన ముక్తాయ అనే  భావ రాగ తాళ ముక్తయ తో కూడినదే భరతశాస్త్రం  పిలవబడును అని ఆనాటి కవులు రాసిపెట్టారట. అది మా గురువు గారు చెప్పినవి మేము మీకు చెప్తున్నాము. ఆ కాలంలో మట్టి తప్పెటగుళ్ళుతో తయారు చేసిన వాటితో కళాప్రదర్శన చేసే వాళ్లు ఇప్పుడు వాటిని రేకు డబ్బులతో తయారు తయారుచేస్తున్నారు.

**11. ఇప్పుడు మీ జట్టులో ఉన్నవాళ్ళు తరతరాల నుండి సాంప్రదాయంగా నేర్చుకుంటున్నారా? అంటే నాన్నగారు వాళ్ల కాలం నుండి అలా ఏమైనా ఉందా?. ఈ తప్పెటగుళ్ళు కొత్తగా శిక్షణ పొందడానికి ఎంత సమయం పడుతుంది. ఏ వయసు వారికి మీరు శిక్షణ ఇస్తారు?.**

**జ.** ఈ కళా ప్రదర్శనలో వంశపారపర్యంగా తాతల తండ్రుల నుంచి వచ్చినటువంటి కళా సంప్రదాయం నేటికీ ఇప్పుడు కొనసాగుతోంది. నేను మా నాన్నగారి దగ్గర ఈ కళా ప్రదర్శన నేర్చుకున్నాను.  అట్లాగే మా నాన్నగారు మా తాతగారి నుండి ఈ తప్పెటగుళ్ళు కళా ప్రదర్శన శిక్షణ తీసుకున్నారు. ఇలా సాంప్రదాయంగా ఈ కళా ప్రదర్శన నిర్వహిస్తూ వస్తున్నాము. మేము మా బిడ్డలకు అలాగే తప్పెటగుళ్ళు కళా ప్రదర్శన పై ఆసక్తిని కనపరిచే కుర్రాళ్లకు కూడా మేము శిక్షణ ఇస్తాము. ఈ శిక్షణ కాలం ఆరు నెలలు ఉంటుంది. ఈ కాలంలో తగిన విధంగా నృత్య భంగిమలను పాటలను డప్పు వాయించడం  సాహసంతో కూడిన సర్కస్ ఫీట్లను నేర్పించడం చేస్తాము.  అందుకు తగిన విధంగా కొంత మూల్యాన్ని తీసుకుంటాము. కొన్ని సందర్భాలలో ఈ ప్రోగ్రాం నిర్వహించే సమయంలో గురువుగారు మీద అభిమానంతో ఎక్కడ ప్రదర్శన ఉన్నప్పటికీ ఎన్ని పనులు ఉన్నప్పటికీ శిక్షణ పొందిన వారందరూ తగిన సమయానికి వచ్చి కళా ప్రదర్శన చేసి జయప్రదం చేస్తారు.

**12. మీ జట్టులో ఉన్న సభ్యులు అందరి యొక్క ప్రదర్శన సమయం (టైమింగ్) ఒకేలా ఉండాలా? అందరూ ఒకే రకంగా దరువు, నృత్యము, పాట, చేసేలా సమన్వయం ఎలా చేస్తారు?.**

**జ.** మేము ప్రదర్శన చేసే సమయంలో అందర్నీ సరైన విధంగా సమన్వయం చేస్తూ ప్రదర్శన చేసేలా చూస్తాము. అందుకుగాను ముందుగా మేము ఒక ఆరు నెలల కాల పరిమితిలో శిక్షణను ఇచ్చి కళా ప్రదర్శనలో నైపుణ్యం సాధించేలా చూస్తాము. కళా ప్రదర్శన చేసే సమయంలో అందర్నీ ఎప్పటికప్పుడు జాగృతం చేస్తూ పాట పతాక స్థాయికి చేరుకునేటప్పుడు దరువులను ఉదృతంగా కొడుతూ వివిధ నృత్య భంగిమలను చేస్తూ సాహసంతో కూడిన సర్కస్ ఫీట్లను చేస్తాము. ఇది చూడడానికి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రదర్శన చేసే సమయంలో అందరి తప్పెట దరువు దానికి లయబద్ధంగా చేసే నృత్యం అదే

సమయంలో పాడే పాట ఒకే విధంగా ఉండాలి. దీనికోసం మేము గ్రామంలో రాత్రి వేళలో ట్రైనింగ్ ఇస్తాము. ఎక్కడ ఎలా చేయాలి ఎప్పుడు ఏ దరువు కొట్టాలి తర్వాత అడుగు ఎలా వేయాలి సమయం పోకుండా దెబ్బ నృత్యం సౌండు ఒక లైన్ గా ఉండేటట్లు ప్రాక్టీస్ ఇస్తాము. ఈ విధంగా  అందరిని సమన్వయ పరిచి ముందుకు సాగుతాము.

**13. ఒకప్పుడు ఈ కళా రూపాన్ని చూడడానికి గ్రామం నుంచి ఆసక్తితో ప్రజలు వచ్చి గుమిగూడేవారు. ఇప్పుడు ఎందుకు ప్రజల ఆదరణ తగ్గుతుంది?.**

**జ.** పూర్వం టీవీలు సినిమాలు, రేడియోలు, సెల్ఫోన్లు లేని కాలంలో ప్రజలు ఎక్కువగా గ్రామం నుంచి వచ్చి ప్రోగ్రామ్ జరిగిన స్థలంలో గుమిగుడేవారు. ఆ రోజుల్లో తప్పెటగుళ్ళకు విశేషమైన ఆదరణ ఉండేది. తప్పెటగుళ్ళు ప్రదర్శన చూడడానికి ఎన్నో గ్రామాల నుంచి వచ్చి మరీ వీక్షించే వారు. కాలంలో వచ్చిన మార్పులు ఫలితంగా ఆధునిక సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేటి తరుణంలో ఇటువంటి జానపద కళారూపాలు ఎన్నెన్నో కాలగర్భంలో కలిసిపోతున్నాయి. మానవుల అవసరాలు అనుగుణంగా వివిధ ప్రసార సాధనాలు రావడంతో వీటిని చూడడానికి ప్రత్యేకంగా సమయాన్ని వెచ్చించలేక ప్రజలు ఈ కళారూపం పట్ల నిర్లక్ష్యవైఖరి చూపిస్తున్నారు. అయినప్పటికీ మిగతా కళారూపాలు అంతరించే స్థితిలో ఉన్నప్పటికీ మా ఈ తప్పెటగుళ్ళు ఇప్పటికీ ఉత్తరాంధ్రలో సజీవంగా ఉన్నాయి. ఈ కళాప్రదర్శన ఎంతో వైవిధ్యభరితమైన విలక్షణమైన ప్రత్యేకతను కలిగి ఉంటుంది. ఈ కళారూపాన్ని పరిరక్షించడంలో మేము ఎల్లవేళలా కృషి చేస్తూ ఆదరిస్తూ భావితరాలకు అందించే ప్రయత్నం చేస్తాము.

**14. ఉత్తరాంధ్రలో ఇంతటి ఆదరణ కలిగినటువంటి ఈ కళారూపాన్ని నేర్చుకోవడం ద్వారా మీకు ఎలా అనిపిస్తుంది. భవిష్యత్తులో తప్పెటగుళ్ళు పై ఆధారపడిన వారికి ఉపాధి అవకాశాలు ఏమైనా ఉంటాయా?.**

**జ.** తప్పెటగుళ్ళు కళారూపాన్ని నేర్చుకోవడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. అయితే ఈ కళారూపంపై ఆధారపడిన కళాకారుల జీవితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కేవలం ఈ కళారూపంపై మాత్రమే ఆధారపడడం కాకుండా గొర్రెలను మేకలను పశువులను మేపడం వ్యవసాయ పనులు చేయడం అదేవిధంగా ఇతర కూలీల పనులు చేస్తుంటాము. ఏదైనా పండగలు సమయాల్లో గ్రామ దేవతల ఉత్సవాలలోనూ ప్రత్యేక సమయాల్లోనూ మేము ఈ కళా ప్రదర్శన చేస్తుంటాము. ఇలా మేము చేసే వృత్తి కొనసాగిస్తూనే మిగతా సమయాన్ని ఈ కళారూప ప్రదర్శనకు కేటాయిస్తాము. ఈ రకంగా ఈ కళారూపం పై ఆధారపడిన వ్యక్తులకు సరైనటువంటి ప్రోత్సాహం ప్రభుత్వం నుంచి వచ్చినట్లయితే బాగుంటుందని మేము ఆశిస్తున్నాము.

**15. చివరగా ఈ తప్పెటగుళ్ళు కళారూపాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు ఈ కళారూపం పరిరక్షణకు మీరు తీసుకున్న జాగ్రత్తలు ఏమైనా ఉన్నాయా?.**

**జ.** తప్పెటగుళ్ళు కళారూపాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబట్టేందుకు మేము మా సాయశక్తులా కృషి చేస్తాము. ఉత్తరాంధ్రకు పరిమితమైన ఈ కళారూపాన్ని కాపాడడానికి అనేక మార్గాలను పద్ధతులను అనుసరిస్తాము. ఉత్తరాంధ్ర సంస్కృతి సాంప్రదాయాలను ఈ ప్రాంత వైశిష్యాన్ని కళారూపాలను భావితరాలకు అందించే విధంగా కృషి చేస్తాము. అదేవిధంగా ప్రభుత్వాలు కూడాను ఈ కళా ప్రదర్శన పట్ల సరైన విధంగా స్పందించేటట్లు ఈ కళారూపాల అభివృద్ధికి సహాయ సహకారాలు ఆర్థిక వెసులుబాటు కల్పించేటట్లు పరిరక్షణ చేపడతాము. ఇతర స్వచ్ఛంద సంస్థలు అధికారులు నాయకులు గుర్తించి ఈ కళారూపం అభివృద్ధి కోసం కృషి చేయాల్సివుంది. ఆధునికంగా వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కొన్ని ప్రసారసాధనాలలోనూ వార్తాపత్రికలలోనూ అంతర్జాలంలోనూ వీటి గురించి ప్రచారం చేసి ఈ కళారూప అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంది. మన సంస్కృతి సాంప్రదాయాలను జానపద కళారూపాలను మనమే కాపాడుకోవాలి. అట్లే భవిష్యత్తు తరాలకి అందించాల్సిన అవసరము మనందరిపైనా ఉంది.

**– ధన్యవాదాలు సార్**

ఉత్తరాంధ్ర తప్పెటగుళ్ళు కళాకారుడు పేకేటి అప్పారావు గారు మరియు అతని కళా బృందం



గంగిరెద్దుల వారి ప్రదర్శన



ధింసా నృత్యం ప్రదర్శన



జముకు కళాకారుడు కర్రి మల్లేష్



AS PER THE UNIVERSITY POLICY, ANTI-PLAGIARISM SCREENING IS NOT REQUIRED FOR THE REGIONAL LANGUAGES

Librarian
Indira Gandhi Memorial Library
UNIVERSITY OF HYDERABAD
Central University P.O.
HYDERABAD-500 046.